www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 14-5-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 28 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి తె. 4.20 తదుపరి అష్టమి; నక్షత్రం: పుష్యమి మ. 1.05 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: తె. 3.07-4.53; దుర్ముహూర్తం: ఉ. 8.20-9.12, రా. 10.15-10.58; అమృతఘడియలు: ఉ. 6.13-7.56; రాహుకాలం: మ. 3.00-4.30 వరకు; సూర్యోదయం: 5.47; సూర్యాస్తమయం: 6.35 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



చెళ్లుమన్న ఎమ్మెల్యే చెంప

తెనాలి పోలింగ్ బూత్‌లో వైసీపీ జులుంపై తిరగబడ్డ ఓటరు

వరుసలో రండి అన్నందుకు ఓటరుతో ఎమ్మెల్యే అన్నాబత్తుని అనుచరుల వాదులాట

ఇంతలో అక్కడికి వచ్చిన ఎమ్మెల్యే.. వస్తూనే ఓటరుపై దాడి

చెంపపై గట్టిగా కొట్టిన ఎమ్మెల్యే.. అంతే దీటుగా తిరిగికొట్టిన ఓటరు.. చితగ్గొట్టిన ఎమ్మెల్యే అనుచరులు

తనను కొట్టిన తెనాలి వైసీపీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను తిరిగి కొడుతున్న ఓటర్ సుధాకర్ 11



ఒంగోలు సెయింట్ జేవియర్స్ స్కూల్ పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు

ఓట్ల వెల్లువ

పోలింగ్ బూత్‌లను చుట్టేసిన జన సునామీ

పల్లెలు, పట్టణాలనే తేడా లేదు.. తొలిసారి ఓటర్లు, విద్యావంతుల్లో జోష్

- దేశ విదేశాల నుంచి సొంతూళ్లకు జనం
- నార్వే, మారిషస్ తదితర దేశాల నుంచీ రాక
- 'సంక్రాంతి' తరహాలో ఎన్నికల సందడి
- ఒకటి రెండు గంటలు దాటినా ఓపిగ్గా క్యూలో
- ఒక లక్ష్యం, కసితో మీట నొక్కిన వైనం
- గ్రామీణ ప్రాంతాల్లో ఎప్పట్లాగే ఓట్ల జోరు
- ఉదయం 6.30 నుంచే బూత్‌ల ముందు బారులు
- 3 వేలకుపైగా కేంద్రాల్లో రాత్రి పది దాకా పోలింగ్
- కొన్నిచోట్ల అర్ధరాత్రి వరకూ క్యూలో ఓటర్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



మళ్లీ సంక్రాంతి వచ్చినట్లు...
జాతరేదో జరుగుతున్నట్లు...
ఇంట్లో వేడుకకు విచ్చేసినట్లు...

'పదండి ఓటేద్దాం' అంటూ నవ్యాంధ్ర ఓటర్లు పోలింగ్ బూత్‌లకు పోటెత్తారు. సకుటుంబ సపరివార సమేతంగా ఓట్ల వేడుకలో పాల్గొన్నారు. అమ్మా, నాన్నలతో కలిసి కొత్తగా ఓటొచ్చిన టీనేజ్ అమ్మాయి... అవ్వా తాతలతో కలిసి వచ్చిన సాఫ్ట్‌వేర్ కుర్రాడు... స్కూటీపై కలిసొచ్చిన కొత్త దంపతులు... 'పదరా పోదాం' అంటూ

మిగతా 12వ పేజీలో...



విశాఖలోని కప్పరాడలో సోమవారం రాత్రి బారులుతీరి ఉన్న ఓటర్లు

రికార్డు పోలింగ్ దిశగా..

అర్ధరాత్రి సమయానికి 79.5% అంచనా

పలుచోట్ల కొనసాగుతున్న పోలింగ్

పార్లమెంటు స్థానాల వారీగా పోలింగ్ శాతం

(అర్ధరాత్రి సమయానికి అందిన సమాచారం మేరకు)

శ్రీకాకుళం	74.00
అరకు	57.00
విజయనగరం	77.98
విశాఖపట్నం	66.14
అనకాపల్లి	70.37
కాకినాడ	74.24
అమలాపురం	82.61
రాజమండ్రి	79.43
నరసాపురం	68.36
ఏలూరు	79.00
మచిలీపట్నం	77.59
విజయవాడ	80.00
గుంటూరు	70.34
నరసరావుపేట	78.00
బాపట్ల	72.07
ఒంగోలు	82.58
నంద్యాల	77.00
కర్నూలు	74.17
అనంతపురం	75.63
హిందూపురం	74.70
కడప	79.00
నెల్లూరు	69.95
తిరుపతి	76.51
రాజంపేట	76.25
చిత్తూరు	80.43

అరాచకపర్వం

పోలింగ్ కేంద్రాలపై పేట్రేగిన వైసీపీ గూండాలు

- ఎన్డీయే అభ్యర్థులు, ఏజెంట్లపై యథేచ్ఛగా హింసాకాండ.. 50 బైకులు, 10 కార్లతో మాచర్లలో వీరంగం
- టీడీపీ కార్యకర్తలను గుద్దించి, రాడ్లు, కర్రలు, రాళ్లతో దాడి.. బీభత్సం సృష్టించిన ఎమ్మెల్యే పిన్నెల్లి సోదరుడు
- పల్నాడులో తెగబడిన వైసీపీ మూకలు.. ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ కాన్వాయ్‌పై దాడి
- రెంటాలలో జూలకంటి, నరసరావుపేటలో అరవిందబాబుపై దాష్టీకం.. తాడిపత్రిలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి వీరంగం
- ఎస్పీ కారుపై రాళ్లవాన.. వాహనాల ధ్వంసం, రాళ్లు, కట్టెలతో దాడి.. పెద్దిరెడ్డి గ్రామంలో ఏజెంట్ల కిడ్నాప్
- చంద్రగిరిలో టీడీపీ ఏజెంట్లపై చెవిరెడ్డి మోహిత్ దౌర్జన్యం.. 'ఆంధ్రజ్యోతి' విలేకరిపై దాడికి యత్నం
- బాపట్లలో కోన బంధువు వెంకట్ దాష్టీకం.. అడ్డుకున్న దళితులు 11
- చీరాల టీడీపీ అభ్యర్థి కొండయ్యపై దౌర్జన్యం.. పెనమలూరులో జోగి రమేశ్ అనుచరుల వీరంగం

పలుచోట్ల గాలిలోకి కాల్పులు.. లాఠీచార్జి

ఎవరి ధీమా వారిదే

మాకే పట్టం.. టీడీపీ కూటమి ధీమా

- ప్రజల్లో తిరుగుబాటు.. అది చూశాకే వైసీపీ దాడులు: చంద్రబాబు
- కూటమిదే భారీ విజయం.. మార్పు కోసం తీర్పు ఇచ్చారు: పవన్
- మాకే ఓట్ల వెల్లువ.. అంతటా ప్రభుత్వ సానుకూలతే: సజ్జల 3

4వ దశలో 67% ఓటింగ్

- దేశవ్యాప్తంగా 96 స్థానాలకు పోలింగ్
- తెలంగాణలో 64.74 శాతం
- శ్రీనగర్‌లో 38%.. దశాబ్దాల్లో అత్యధికం
- బెంగాల్‌లో హింసాత్మక ఘటనలు
- ఇప్పటిదాకా 379 స్థానాల్లో ఎన్నికలు
- ప్రజల మద్దతు తమకేనన్న విషయం నాలుగు దశల పోలింగ్‌తో సుస్పష్టమైందన్న ప్రధాని నరేంద్ర మోదీ 2

10లో 93.6%, 12లో 87.9% ఉత్తీర్ణత

సీబీఎస్ఈ ఫలితాలు విడుదల.. జూలై 15 నుంచి సప్లిమెంటరీ 2

సుశీల్ మోదీ కన్నుమూత




- క్యాన్సర్‌కు చికిత్స తీసుకుంటూ తుదిశ్వాస విడిచిన బీజేపీ సీనియర్ నేత
- తీవ్ర సంతాపం తెలిపిన ప్రధాని మోదీ
- బిహార్ డిప్యూటీ సీఎంగా 11 ఏళ్లు పని చేసిన సుశీల్ మోదీ 2
- ఆ రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలలో కీలకం

వీవీప్యాట్‌లపై తీర్పును సమీక్షించండి

న్యూఢిల్లీ, మే 13: ఈవీఎంల్లో నమోదైన ఓట్లతో పాటుగా వీవీప్యాట్‌ల్లోని చీటీలన్నింటినీ లెక్కించాల్సిన అవసరం లేదంటూ ఇచ్చిన తీర్పును సమీక్షించాలని సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలైంది. అరుణ్‌కుమార్ అగర్వాల్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈవీఎంల్లో లోపాలున్నాయని, వీవీప్యాట్ స్లిప్పులన్నింటికీ లెక్కించాలని, అవసరమైతే పాత పద్ధతిలో బ్యాలెట్ విధానాన్ని అనుసరించాలని దాఖలైన పిటిషన్లను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు గత నెల 26న తీర్పునిచ్చింది.

లోకం తీరు





త్వరలోనే పెళ్లి చేసుకుంటా!

» మా కుటుంబం రాయబరేలి కోసం ఎంతో చేసింది: రాహుల్

రాయ్‌బరేలి, మే 13 : పెళ్లెప్పుడు...? కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి తరచూ ఎదురవుతోన్న ప్రశ్న ఇది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలిలోనూ సోమవారం ఇదే ప్రశ్న ఎదురవ్వడంతో ఆయన సమాధానం చెప్పక తప్పలేదు. త్వరలోనే(అబ్ జల్దీ కర్నీ పడేగీ) తాను పెళ్లి చేసుకోనున్నట్లు ఆయన చెప్పారు. రాయ్‌బరేలిలో సోమవారం ఒక బహిరంగ సభలో ప్రసంగించిన అనంతరం ఆయనకు ఈ ప్రశ్న ఎదురైంది. తన ప్రసంగం ముగిశాక రాహుల్ తన సోదరి ప్రియాంక గాంధీ వాద్రాను వేదికపైకి పిలిచి రాయ్‌బరేలిలో ప్రచారానికి ఆమె చేసిన కృషిని ప్రశంసించారు. ఈ సమయంలో జనంలోంచి ఒకరు... పెళ్లెప్పుడు? అని ప్రశ్న సంధించారు. దానికి సమాధానం చెప్పాలని ప్రియాంక సూచించారు. దీంతో "అబ్ జల్దీ కర్నీ పడేగీ" అని రాహుల్ సమాధానమిచ్చారు. ఆయనకు వచ్చే నెలతో 54 ఏళ్లు నిండనున్నాయి. అంతకు ముందు రాహుల్ తన ప్రసంగంలో... తన కుటుంబం ఎప్పుడూ రాయ్‌బరేలి ప్రజల కోసం పనిచేసిందని వివరించారు. ప్రధానీ మోదీలా... అదానీ, అంబానీల కోసం పనిచేయలేదన్నారు. తన కుటుంబానికి ఇక్కడి ప్రజలతో ఎంతో అనుబంధం ఉన్నందునే తాను ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నట్లు చెప్పారు. దేశంలో 22-25 మంది పెద్ద పారిశ్రామికవేత్తలకు రూ.16 లక్షల కోట్ల అప్పులను మోదీ ప్రభుత్వం రద్దు చేసిందని చెప్పారు. ఇండియా కూటమి అధికారంలో వస్తే... పేద కుటుంబాల జాబితా రూపొందించి ఆ కుటుంబంలోని ఒక మహిళ బ్యాంకు ఖాతాకు ఏటా లక్ష రూపాయలు లేదా నెలకు రూ.8,500 జమ చేస్తామని ప్రకటించారు. రాయ్‌బరేలిలో ఐదో విడతలో మే 20న ఎన్నికలు జరగనున్నాయి.

'మహాలక్ష్మి'తో మహిళల జీవితాల్లో వెలుగు

» గ్యారెంటీల అమలుతో తెలంగాణలో మార్పు: సోనియా



న్యూఢిల్లీ, మే 13(ఆంధ్రజ్యోతి): దేశంలోని మహిళలు ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో ఉన్నారని.. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న 'మహాలక్ష్మి పథకం' వారి జీవితాలను మార్చడానికి సహాయపడుతుందని ఆ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహాలక్ష్మి పథకం కింద పేద కుటుంబాల మహిళలకు ఏడాదికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. సోమవారం, లోక్‌సభ ఎన్నికల నాలుగో దశ జరుగుతున్నవేళ సోనియాగాంధీ ఈ మేరకు ఓ వీడియో ద్వారా తన సందేశాన్ని తెలిపారు. కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని కోరారు. కాంగ్రెస్ గ్యారెంటీల అమలుతో ఇప్పటికే కర్ణాటక, తెలంగాణలో కోట్లాది కుటుంబాల జీవితాలు మారిపోయాయని చెప్పారు. ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు, విద్యాహక్కు, ఆహార భద్రత వంటి పథకాల ద్వారా కాంగ్రెస్ పార్టీ లక్షల మంది భారతీయులకు సాధికారత కల్పించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తమ ఎక్స్ ఖాతాల్లో సోనియా వీడియోను షేర్ చేశారు. పేదకుటుంబాల మహిళల ఒక్కో ఓటు ఏడాదికి రూ.లక్షతో సమానమని గుర్తుపెట్టుకోవాలన్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం మధ్య కొట్టుమిట్టాడుతున్న మహిళలకు కాంగ్రెస్ 'మహాలక్ష్మి' పథకం చేయూతనిస్తుందని.. ప్రతి నెలా రూ.8,500 నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం ద్వారా మహిళలు తమ కుటుంబాల భవితవ్యాన్ని తామే రాసుకోగలరని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు.

కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం కూలనుంది: శిందే

బెంగళూరు, మే 13(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర తరహాలోనే కర్ణాటక కాంగ్రెస్‌ను కూల్చేందుకు 'ఆపరేషన్ నాథ్' సిద్ధమవుతోందని, కర్ణాటకలో కాంగ్రెస్ సర్కారు కూలడం ఖాయమని మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే ప్రస్తావించిన వీడియో రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం రేపుతోంది. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు పొరుగున ఉన్న మహారాష్ట్రలో వ్యూహం సిద్ధమౌతోందని ఏక్‌నాథ్ షిండే అందులో పేర్కొన్నారు. కర్ణాటక బీజేపీ నాయకులు అక్కడి ప్రభుత్వాన్ని కూల్చేందుకు తనను సాయం కోరినట్లు షిండే తెలిపారు. అయితే ఏక్‌నాథ్‌షిండే ఎప్పుడు ఈ వ్యాఖ్యలు చేసింది స్పష్టత లేదు. కానీ లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి పదిరోజుల క్రితం ఆయన రాష్ట్రానికి వచ్చారు. ఆ తర్వాతనే వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. కర్ణాటక శాసనసభలో 224 మంది సభ్యులకుగానూ 136 మంది కాంగ్రెస్‌వారు ఉన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు 66 మంది, జేడీఎస్‌కు 19 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ప్రస్తుతం రెండు పార్టీలు పొత్తులో ఉన్నాయి. రెండు పార్టీలు కలిపినా 85 మంది ఎమ్మెల్యేలే అవుతారు. ప్రభుత్వం ఏర్పాటుకు మేజిక్ నంబరు 113 అవసరం. ఈ వీడియోపై కర్ణాటక సీఎం సిద్దరామయ్య స్పందించారు. ఏక్‌నాథ్‌షిండే పగటికలలు కంటున్నారని, తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు ఫలించవని అన్నారు.

ఎమ్మెల్యే రేవణ్ణకు బెయిల్ మంజూరు

బెంగళూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): మహిళ కిడ్నాప్ కేసులో జైలుపాలైన ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణకు నిబంధనలతో కూడిన బెయిల్ మంజూరయింది. ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం సోమవారం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. రేవణ్ణ దాఖలు చేసుకున్న పిటిషన్‌పై గతవారంలోనే విచారణలు కొనసాగాయి. అయితే అభ్యంతరాల పిటిషన్ దాఖలుకు సోమవారం వరకు గడువు కావాలని సిట్ కోరిన మేరకు వాయిదా పడింది. విచారణ అనంతరం సాయంత్రం 6 గంటల తర్వాత బెయిల్ నిర్ణయాన్ని కోర్టు ప్రకటించడంతో రేవణ్ణ మంగళవారం ఉదయం విడుదల కానున్నారు. రూ.5లక్షల బాండు ఇవ్వాలని, సాక్ష్యాలను నాశనం చేసే ప్రయత్నాలు చేయరాదని, కేఆర్ నగర తాలూకాకు వెళ్లరాదని కోర్టు ఆదేశించింది.

బాలిక ఇష్టంతో శృంగారంలో పాల్గొన్నా అత్యాచారమే

చెన్నై, మే 13 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలిక ఇష్టంతో శృంగారంలో పాల్గొన్నా అది అత్యాచారం కిందకే వస్తుందని, అలాంటి లైంగిక సంబంధాన్ని తాము అంగీకరించేబోమని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. చెన్నైకి చెందిన సతీష్‌కుమార్ (25) అనే యువకుడు 2014లో పదిహేనేళ్ల బాలికను తిరుత్తణి ఆలయానికి తీసుకెళ్లి వివాహం చేసుకున్నాడు. అనంతరం ఆ జంట హొగెనేకల్ ప్రాంతంలో కాపురం చేసింది. అయితే ఆ బాలిక కనిపించడంలేదంటూ తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆ బాలికను తీసుకొచ్చి ఆమె కుటుంబీకులకు అప్పగించారు. అంతేగాక సతీష్‌కుమార్‌ను పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. ఈ కేసుపై విచారణ జరిపిన చెన్నై పోక్సో కోర్టు 2018లో సతీష్‌కుమార్‌కు పదేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ శిక్షను సవాల్ చేస్తూ సతీష్‌కుమార్ మద్రాస్ హైకోర్టులో అప్పీలు చేసుకున్నాడు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ హేమలత ఇటీవల విచారణ చేపట్టారు. సతీష్‌కుమార్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్, ఆ బాలిక ప్రేమించుకున్నారని, పరస్పర అంగీకారంతోనే శృంగారంలో పాల్గొన్నారని, అయితే పోలీసులు మాత్రం అతనిపై అత్యాచారం కేసు నమోదు చేశారన్నారు. ఆమె అంగీకారంతోనే శృంగారం నెరిపాడని, అందువల్ల కిందికోర్టు విధించిన జైలుశిక్షను రద్దు చేయాలని అభ్యర్థించారు.

దక్షిణాదిన బీజేపీకి భారీగా సీట్లు

నాలుగు రాష్ట్రాల్లో ఘన విజయం దిశగా పార్టీ.. ఎన్నికల ఫలితాలు వచ్చేలోగా షేర్లు కొనేయండి

» తర్వాత స్టాక్‌మార్కెట్ పుంజుకుంటుంది: అమిత్ షా
» పాక్ బాంబు అంటే ఇండియా కూటమికి బెదురు : మోదీ
» వారాణసీలో నేడు నామినేషన్


మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ, మే 13: ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ దక్షిణాదిన భారీ విజయం సాధిస్తుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా జోస్యం చెప్పారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఘన విజయం దిశగా అడుగులు వేస్తున్నామని సోమవారం ఓ జాతీయ చానెల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన స్పష్టం చేశారు. ఈ నాలుగు రాష్ట్రాల్లో కలిపి మొత్తం 109 లోక్‌సభ సీట్లు ఉండగా, గత ఎన్నికల్లో బీజేపీ 29 స్థానాలు (కర్ణాటక-25, తెలంగాణ-4) గెలుచుకుంది. ఏపీ, తెలంగాణల్లో ఆ పార్టీ ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. అలాగే 20 లోక్‌సభ స్థానాలున్న కేరళలో కూడా బీజేపీ బోణీ చేయలేదు. కాగా, స్టాక్ మార్కెట్ పతనాలను ఎన్నికలతో ముడిపెట్టకూడదని అమిత్ షా అన్నారు. జూన్ 4న లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత మార్కెట్లు మళ్లీ పుంజుకుంటాయని, ఈలోపే షేర్లు కొనుగోలు చేస్తే మంచి లాభాలు అందుకోవచ్చని ఇన్వెస్టర్లకు ఆయన సూచించారు. సెన్సెక్స్ లక్ష మార్కును దాటుతుందో, లేదో వ్యాఖ్యానించడానికి అమిత్ షా నిరాకరించారు. అయితే కేంద్రంలో స్థిరమైన ప్రభుత్వం ఉంటే స్టాక్ మార్కెట్ సహజంగానే మెరుగైన పనితీరు కనబరుస్తుందని వ్యాఖ్యానించారు. ఈసారి తాము 400 సీట్లు గెలుస్తున్నామని, కేంద్రంలో స్థిరమైన మోదీ ప్రభుత్వం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, ఓటు బ్యాంకును కోల్పోతామనే భయంతోనే కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అయోధ్య రామమందిరాన్ని సందర్శించలేదని అమిత్ షా ఆరోపించారు. మహారాష్ట్రలోని ధూలే జిల్లాలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడారు. జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దును బుజ్జగింపు రాజకీయాల కారణంగానే ఆయన వ్యతిరేకించారని, దీనిపై శివసేన(యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే రాహుల్ అభిప్రాయాన్ని తెలుసుకోవాలని అమిత్ షా సూచించారు.

కూటమి నేతలు పిరికిపందలు

పాకిస్థాన్ చేతిలోని ఆటంబాంబు అంటే ఇండియా కూటమి నేతలు భీతిల్లిపోతున్నారని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. పిరికిపందలు అంటూ కూటమి నేతలను విమర్శించారు. పాక్ వద్ద ఆటంబాంబు ఉన్నదనే విషయం గుర్తుపెట్టుకోవాలంటూ 'ఇండియా' కూటమిలోని కాంగ్రెస్ పార్టీ నేత మణిశంకర్ అయ్యర్, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా ఇటీవల వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఐదో విడత ఎన్నికలు జరిగే బిహార్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం జరిగిన ప్రచార సభల్లో దీనిపైనే మోదీ వ్యాఖ్యలు చేశారు. "పాకిస్థాన్ అంటేనే బెదిరిపోయే నేతలను ఇండియా కూటమి కలిగి ఉన్నట్టు కనిపిస్తోంది. పాక్ ఆటంబాంబు గురించి వారంతా పీడకలలు కంటున్నారు. ఈ నేతలు పాకిస్థాన్‌కు ఒకచేత్తో క్లీన్‌చిట్ ఇస్తారు. మరో చేత్తో, ఆ దేశంపై భారత్ జరిపిన సర్జికల్ స్ట్రయిక్స్‌పై అనుమానాలు వ్యక్తం చేస్తారు. ఆ కూటమిలోని లెఫ్ట్ మిత్రులు భారత్ వద్ద ఉన్న ఆటం బాంబులు నిర్వీర్యం కావాలని కోరుకుంటారు" అని దుయ్యబట్టారు. యూపీఏ పదేళ్ల పాలనలో ఈడీ స్కూలు బ్యాగులో దాచిన రూ.35 లక్షలను పట్టుకుంటే, ఎన్డీయే అధికారంలోకి వచ్చిన ఇన్నాళ్లలో ఏకంగా రూ.2200 కోట్లను ఈడీ స్వాధీనం చేసుకున్నదని, దానివల్లే ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలపై ప్రతిపక్షాలు విరుచుకుపడుతున్నాయన్నారు. తనకు వారసులు లేరని, సామాన్యుడే తన వారసుడు అని వ్యాఖ్యానించారు.

నెహ్రూ తప్పులకు బాధ్యత మోదీదా?

దేశ సరిహద్దుల్లో చైనా దురాక్రమణలు భారతదేశ తొలి ప్రధాని నెహ్రూ హయాంలోనే జరిగాయని, ఆయన చేసిన తప్పులకు మోదీ ఎందుకు బాధ్యత వహిస్తారని విదేశాంగమంత్రి జైశంకర్ మండిపడ్డారు. చైనా విషయంలో ప్రధాని నరేంద్రమోదీనే బాధ్యత వహించాలని కాంగ్రెస్ చేసిన వ్యాఖ్యలపై సోమవారం జైశంకర్ స్పందిచారు. 1958- 1962 మధ్య కాలంలోనే భారత భూభాగాన్ని డ్రాగన్ ఆక్రమించుకుందని, 1958కి ముందు కూడా కొంత భూమిని ఆక్రమించుకుందని ఆయన పేర్కొన్నారు.


సోమవారం గురుద్వారా పట్నా సాహిబ్‌లో రొట్టెలు చేస్తున్న ప్రధాని మోదీ

వారాణసీలో మోదీ భారీ రోడ్‌షో

వారాణసీ లోక్‌సభ అభ్యర్థిగా మరోసారి పోటీచేస్తున్న నరేంద్ర మోదీ సోమవారం ఆరు కిలోమీటర్ల మేర ఆ పట్టణంలో భారీ రోడ్‌షో నిర్వహించారు. విద్యా రంగ సంస్కర్త మదన్‌మోహన్ మాలవీయా విగ్రహానికి పూలమాల సమర్పించి తన యాత్రను ఆయన ప్రారంభించారు. రోడ్‌షోలో ఆయన వెంట యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఉన్నారు. ప్రధానమంత్రికి ఆహ్వానం పలుకుతూ, కనీసం వంద చోట్ల స్వాగత తోరణాలు ఏర్పాటుచేశారు. కాషాయ దుస్తులు ధరించిన మహిళలు రోడ్డుకు అటు ఇటు పెద్దఎత్తున గుమిగూడి రోడ్‌షోకు స్వాగతం పలికారు. నరేంద్రమోదీపై పూల వర్షం కురిపించారు. కాగా, మంగళవారం ఆయన తన నామినేషన్ పత్రాలను వారాణసీలో రిటర్నింగ్ అధికారికి సమర్పిస్తారు. ఎన్డీయే భాగస్వామ్య పార్టీ టీడీపీ అధినేత చంద్రబాబు సహా దాదాపుగా ఆ కూటమి నేతలంతా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

బీజేపీ సీనియర్ నేత సుశీల్‌మోదీ కన్నుమూత

క్యాన్సర్‌కు చికిత్స తీసుకుంటూ తుదిశ్వాస



పట్నా, మే 13: బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత సుశీల్ కుమార్ మోదీ కన్నుమూశారు. ఆయన వయస్సు 72 సంవత్సరాలు. సుశీల్ కుమార్ మోదీ ఏడు నెలలుగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని స్వయంగా ఆయనే గత నెలలో 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఆరోగ్యం సహకరించనందున ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలకు దూరంగా ఉంటున్నట్టు తెలిపారు. ఢిల్లీలోని ఎయిమ్స్‌లో సుశీల్‌మోదీ క్యాన్సర్‌కు చికిత్స తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి ఆయన ఎయిమ్స్‌లో తుదిశ్వాస విడిచారు. 1973లో విద్యార్థి నేతగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన సుశీల్ మోదీ.. 1990లో పట్నా సెంట్రల్ నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రిగా, డిప్యూటీ సీఎంగా, ఎంపీగా సేవలందించారు. 2005 నుంచి 2020 మధ్య రెండు దఫాలుగా 11 ఏళ్ల పాటు బిహార్ ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. సుశీల్ మోదీ కన్నుమూతపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతాపం వ్యక్తం చేశారు. రాజకీయ జీవితంలో ఆయన ఉన్నత ఆదర్శాలను పాటించారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ స్పందిస్తూ.. 'నా స్నేహితుడు, సహచరుడు సుశీల్‌మోదీ ఆకస్మిక మరణం తీవ్ర విచారం కలగజేసింది. బిహార్‌లో బీజేపీ విజయయాత్రలో ఆయనది అత్యంత కీలకపాత్ర. జీఎస్టీ అమలుకు సంబంధించి ఆయన సేవలు మర్చిపోలేం. ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం' అని పేర్కొన్నారు. బిహార్ సీఎం నితీశ్‌కుమార్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, పలు పార్టీల నేతలు సుశీల్‌మోదీ మృతికి సంతాపం తెలిపారు. మంగళవారం సుశీల్ మోదీ అంత్యక్రియలు జరగనున్నాయి.

కేజ్రీవాల్‌ను తొలగించే అధికారం లెఫ్టినెంట్ గవర్నర్‌దే

న్యూఢిల్లీ, మే 13: మనీలాండరింగ్ కేసులో అరెస్టయినందున కేజ్రీవాల్‌ను సీఎం పదవి నుంచి తొలగించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాన్ని సోమవారం సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. సీఎంను తొలగించాలని అడిగే చట్టపరమైన హక్కు పిటిషనర్‌కు లేదని తెలిపింది. అవసరం అనుకుంటే ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నరే దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. కేజ్రీవాల్‌ను తొలగించాలని కోరుతూ కాంత్ భాటీ అనే వ్యక్తి తొలుత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ పిటిషన్‌ను తిరస్కరించడంతో సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. ఈ అంశంపై అవసరమైతే లెఫ్టినెంట్ గవర్నర్‌కు వినతి పత్రాలు సమర్పించవచ్చని కోర్టు పిటిషనర్‌కు సూచించింది. ఇదిలా ఉండగా, యూట్యూబర్ ధ్రువ్ రాఠీ వీడియోను షేర్ చేసిన వ్యవహారంలో బీజేపీ ఐటీ సెల్ దాఖలు చేసిన పరువు నష్టం దావాలో రాజీపడేందుకు కేజ్రీవాల్‌కు సుప్రీం కోర్టు మరికొంత గడువు ఇచ్చింది. ఇందుకు వీలుగా కేసు విచారణపై స్టే పొడిగించింది.

కేజ్రీవాల్ నివాసంలో నాపై దాడి

» ఆప్ ఎంపీ స్వాతి మలివాల్ ఆరోపణ

న్యూఢిల్లీ, మే 13: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అధికారిక నివాసంలో సోమవారం తనపై దాడి జరిగిందని అదే పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీ, ఢిల్లీ మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ స్వాతి మలివాల్ ఆరోపించారు. సీఎం వ్యక్తిగత సిబ్బంది తనపై దాడి చేశారని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌కు కూడా వెళ్లిన స్వాతి మలివాల్.. ఫిర్యాదు మాత్రం ఇవ్వకుండా వెళ్లిపోయారు. ఈ ఘటనపై సీఎం నివాసం నుంచి గానీ, ఆప్ నుంచి గానీ ఎటువంటి ప్రకటన వెలువడలేదు. కాగా, కేజ్రీవాల్ ఆదేశాల మేరకు ఆయన పీఏ వైభవ్‌కుమార్ తనపై దాడి చేసినట్లు స్వాతి ఆరోపించారని కొన్ని వార్తా ఛానళ్లు వెల్లడించాయి. ఈ ఘటనపై 3 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఢిల్లీ పోలీసులను జాతీయ మహిళా కమిషన్ ఆదేశించింది.

నాలుగో దశలో 67% ఓటింగ్



శ్రీనగర్‌లో ఓటేసిన ఫరూక్, ఒమర్ అబ్దుల్లా

న్యూఢిల్లీ, మే 13 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సమరం నాలుగో దశలో 67.25 శాతం పోలింగ్ నమోదైంది. సోమవారం రాత్రి 11.45 గంటల వరకూ అందిన సమాచారం ప్రకారం.. 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 96 స్థానాల్లో ఈ మేరకు పోలింగ్ నమోదైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. ఏపీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈసీ వెల్లడించిన వివరాలను బట్టి.. ఆ సమయానికి ఆంధ్రప్రదేశ్‌లో నమోదైన లోక్‌సభ ఎన్నికల పోలింగ్ 76.5 శాతంగా, తెలంగాణలో 64.74 శాతంగా ఉంది. ఏపీ (25), తెలంగాణ(17)లోని మొత్తం ఎంపీ స్థానాలతో పాటు యూపీ (13), మహారాష్ట్ర (11), పశ్చిమబెంగాల్ (8), మధ్యప్రదేశ్ (8), బిహార్ (5), ఝార్ఖండ్ (4), ఒడిశా (4), జమ్ముకశ్మీర్ (1)లోని పార్లమెంటు స్థానాలకు సోమవారం ఎన్నికలు జరిగాయి. సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి ఈ 96 స్థానాల్లో.. ఈవీఎంల మొరాయింపు, ఏజెంట్ల అడ్డగింత వంటి 1700 ఫిర్యాదులు నమోదయ్యాయి. పశ్చిమబెంగాల్‌లో 8 స్థానాల్లో టీఎంసీ, కాంగ్రెస్, బీజేపీ శ్రేణుల మధ్య చెలరేగిన ఘర్షణల నేపథ్యంలో మూడు పార్టీలూ పరస్పరం వందలాది ఫిర్యాదులు చేసుకున్నాయి. మొత్తం ఏడు దశల్లో ఈసీ ఈ ఎన్నికలను నిర్వహిస్తుండగా.. తాజాగా పూర్తయిన నాలుగో దశతో దేశవ్యాప్తంగా 23 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 379 స్థానాల్లో పోలింగ్ ముగిసినట్లయింది. అలాగే.. ఏపీ, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్‌లో అసెంబ్లీ స్థానాలన్నింటికీ, ఒడిశాలో 28 అసెంబ్లీ సీట్లకు ఎన్నికలు ముగిశాయి. కడపటి వార్తలు అందే సమయానికి వీటిలో పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా 78.37 శాతం పోలింగ్ నమోదు కాగా.. శ్రీనగర్ నియోజకవర్గంలో అతి తక్కువగా 37.98 శాతం ఓటింగ్ నమోదైంది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్ముకశ్మీర్‌లో జరుగుతున్న ఈ తొలి ఎన్నికల్లో 38 శాతం అంటే మనకు తక్కువ అనిపించవచ్చుగానీ.. గత కొన్ని దశాబ్దాల్లో ఇదే అక్కడ అత్యధికం అని ఈసీ ప్రకటించడం గమనార్హం. నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూఖ్ అబ్దుల్లా, ఆయన కుమారుడు, పార్టీ ఉపాధ్యక్షుడు ఓమర్ అబ్దుల్లా.. ఆయన కుమారులు జమీర్, జహీర్ అబ్దుల్లా.. ఇలా అబ్దుల్లా కుటుంబానికి చెందిన మూడు తరాల వారు తమ ఓటు హక్కును శ్రీనగర్‌లో వినియోగించుకున్నారు. ఇక.. బిహార్‌లో 57.06%, ఝార్ఖండ్‌లో 65.2%, మధ్యప్రదేశ్‌లో 70.98%, మహారాష్ట్రలో 59.64%, ఒడిశాలో 73.97%, ఉత్తరప్రదేశ్‌లో 58.05% ఓటింగ్ నమోదైంది. సార్వత్రిక ఎన్నికల మొదటి మూడు దశల్లో వరుసగా 66.14%, 66.71%, 65.68% ఓటింగ్ నమోదైన సంగతి తెలిసిందే. కాగా.. ఇప్పటిదాకా జరిగిన నాలుగు దశల ఎన్నికలతో ప్రజల తీర్పు ఎన్డీయే కూటమికే అనుకూలంగా ఉన్నదన్న విషయం స్పష్టమైందని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. దేశం నలుమూలలా ఎన్డీయే అభ్యర్థులకు మంచి మద్దతు లభిస్తోంది. ఇండియా కూటమి అసలు ప్రజల చర్చల్లోనే ఉండట్లేదని ఎద్దేవా చేశారు. శ్రీనగర్‌లో ప్రజలు ధైర్యంగా వచ్చి ఓటేశారంటూ మోదీ కొనియాడారు.

చాబహార్ పోర్టుపై ఇరాన్‌తో ఒప్పందం

న్యూఢిల్లీ, మే 13: సుదీర్ఘ చర్చల తర్వాత చాబహార్ పోర్టు అభివృద్ధి, నిర్వహణకు సంబంధించి భారత్-ఇరాన్ మధ్య ఒప్పందం కుదిరింది. దీంతో దేశ వాణిజ్య సంబంధాలు మెరుగవడంతో పాటు మరిన్ని పెట్టుబడులు కూడా రానున్నాయి. ఆగ్నేయ ఇరాన్‌లోని ఈ వ్యూహాత్మక ఓడరేవును పూర్తిగా వినియోగించుకునే విషయమై ఆ దేశంతో ఒప్పందం చేసుకునేందుకు కేంద్ర నౌకాయాన శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం అక్కడికి వెళ్లింది. ఈ సందర్భంగా ఇండియా పోర్ట్స్ గ్లోబల్ లిమిటెడ్ (ఐపీజీఎల్), ఇరాన్‌కు చెందిన పోర్ట్, మారిటైమ్ ఆపరేషన్ (పీఎంవో)తో దీర్ఘకాలిక ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు పదేళ్ల పాటు చాబహార్ పోర్టులోని షాహిద్ బెహెష్తీ టెర్మినల్‌ను భారత్ నిర్వహించడానికి వీలు కల్పిస్తుంది. విదేశాల్లో ఓ పోర్టు నిర్వహణను చేపట్టడం భారత్‌కిదే తొలిసారి. ఈ ఒప్పందం ద్వారా దాయాది దేశమైన పాకిస్థాన్‌పై ఆధారపడకుండా భారత్ నుంచి మధ్య ఆసియా దేశాలకు ఎగుమతులు, సరుకు రవాణా కూడా సులభతరం కానుంది.

మాల్దీవులకు భారత ఆపన్న హస్తం

50 మిలియన్ డాలర్ల సాయం కొనసాగింపు

మాలె, మే 13: మాల్దీవుల ప్రభుత్వ ప్రత్యేక వినతి మేరకు 50 మిలియన్ యూఎస్ డాలర్ల సాయాన్ని మరో ఏడాది పొడిగిస్తూ భారత్ సోమవారం నిర్ణయం తీసుకుంది. ఆరు నెలల క్రితం మాల్దీవుల అధ్యక్షుడిగా మహ్మద్ ముయిజ్జు బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు క్షీణించినా భారత ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో మాల్దీవుల ప్రభుత్వం భారత్ సహకారానికి ధన్యవాదాలు తెలిపింది. "మాల్దీవులకు కీలకమైన బడ్జెటరీ సాయం అందించినందుకు భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్, భారత ప్రభుత్వానికి ధన్యవాదాలు... రెండు దేశాల మధ్య ఉన్న దీర్ఘకాల స్నేహానికి ఇది చిహ్నం." అని మాల్దీవుల విదేశాంగ శాఖ మంత్రి మూసా జమీర్ 'ఎక్స్'లో ప్రకటించారు.

10లో 93.6%, 12లో 87.9% ఉత్తీర్ణత

» సీబీఎస్‌ఈ ఫలితాలు విడుదల.. గత ఏడాది కంటే పెరుగుదల
» కొనసాగిన బాలికల హవా.. జూలై 15 నుంచి సప్లిమెంటరీ



న్యూఢిల్లీ, మే 13: సీబీఎస్‌ఈ 10వ తరగతిలో 93.60 శాతం, 12వ తరగతిలో 87.98 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ ఫలితాలను సీబీఎస్‌ఈ సోమవారం విడుదల చేసింది. 10, 12లో ఉత్తీర్ణత గత ఏడాది కంటే స్వల్పంగా పెరగ్గా... ఈ ఏడాది కూడా బాలికల హవా కొనసాగింది. 90, 95 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్య కూడా పెరిగింది. 10వ తరగతిలో 2.12 లక్షల మంది 90 శాతం కంటే, 47 వేల మంది 95 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారు. 12వ తరగతిలో 1.16 లక్షల మందికి 90 శాతం కంటే, 24,068 మందికి 95 శాతం కంటే ఎక్కువ మార్కులు వచ్చాయి. వీరిలో 305 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన (సీఎస్‌డబ్ల్యూఎన్ క్యాటగిరీ) విద్యార్థులు ఉన్నారు. 'అనారోగ్యకర పోటీ'ని నివారించడానికి మెరిట్ జాబితా ప్రచురించకూడదని, ప్రథమ, ద్వితీయ, తృతీయ డివిజన్లు కూడా కేటాయించకూడదని సీబీఎస్‌ఈ నిర్ణయించింది. అయితే వివిధ సబ్జెక్టుల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందించనుంది. అత్యధికంగా 10లో గణితంలో 11,253 మంది, 12లో పెయింటింగ్‌లో 10,402 మంది నూటికి నూరు మార్కులు సాధించారు. ఈ సబ్జెక్టుల తర్వాత సంస్కృతం, కృత్రిమ మేధ (ఏఐ), రసాయన శాస్త్రం, మనస్తత్వ శాస్త్రంలో కూడా 2 వేల నుంచి 7 వేల మందికి పూర్తి మార్కులు లభించాయి. తిరువనంతపురం రీజియన్ అత్యధిక ఉత్తీర్ణత (10లో 99.91 శాతం, 12లో 99.75 శాతం) సాధించింది. 10లో గువాహటి రీజియన్ (77.94 శాతం), 12లో ప్రయాగ్‌రాజ్ రీజియన్ (78.25 శాతం) అతి తక్కువ ఉత్తీర్ణత సాధించాయి. జవహర్ నవోదయ విద్యాలయాల్లో 99.09 శాతం ఉత్తీర్ణత నమోదైంది. జూలై 15 నుంచి 10, 12 తరగతుల సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 10లో రెండు సబ్జెక్టులు, 12లో ఒక సబ్జెక్టు మిగిలిపోయిన విద్యార్థులు సప్లిమెంటరీ రాయవచ్చు. ఈ క్యాటగిరీలోకి వచ్చేవారు 10లో 1.32 లక్షల మంది, 12లో 1.22 లక్షల మంది ఉన్నారు. 10లో రెండు సబ్జెక్టుల్లో, 12లో ఒక సబ్జెక్టులో మార్కులు పెంచుకోవాలనుకునే విద్యార్థులు కూడా సప్లిమెంటరీకి అర్హులు.

గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్.. ముగ్గురు మావోయిస్టుల మృతి

చర్ల, మే 13: మహారాష్ట్రలోని గడ్చిరోలిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. ఎస్పీ నీలోత్పల్ కథనం ప్రకారం.. భమ్రాగడ్ తాలూకా కాత్రంగట్ట గ్రామం సమీపంలోని అడవుల్లో పెరమిలి దళం మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందుకున్న సీ-60 యూనిట్‌కు చెందిన కమాండో బలగాలు సోమవారం ఉదయం నుంచి కూంబింగ్ ప్రారంభించాయి. బలగాలను చూసిన నక్సల్స్ కాల్పులు జరిపారని, కమాండోలు జరిపిన ఎదురుకాల్పుల్లో ఓ మహిళా నక్సల్ సహా.. ముగ్గురు మావోయిస్టులు మృతిచెందినట్లు ఎస్పీ తెలిపారు. వీరిలో పెరమిలి దళం కమాండర్ వాసు ఉన్నట్లు పేర్కొన్నారు. ఘటనాస్థలి నుంచి ఒక ఏకే-47, మరొక కార్బైన్, ఒక ఇన్సాస్ రైఫిల్, మావోయిస్టు సాహిత్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. మరోవైపు.. ఇటీవల ఎన్‌కౌంటర్ జరిగిన ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పీడియా అడవుల్లో 14 మంది మావోయిస్టులను అరెస్టు చేసినట్లు ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్ వెల్లడించారు. అడవుల నుంచి వస్తున్న మావోయిస్టుల వద్ద టిఫిన్ బాంబులు, ఇతర పేలుడు పదార్థాలున్నట్లు వివరించారు. అరెస్టయిన వారిలో రేణు కోవాలసి, అవలం మంగ్లి ఉయికా బిచెయ్‌పై రూ.24 లక్షల రివార్డు, కుర్సం షర్మిల, తాటి లక్ష్మి, హేమ్లాపై రూ.15 లక్షల రివార్డు ఉన్నట్లు వివరించారు. కాగా.. బీజాపూర్ జిల్లా బోడ్గా గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. పేలకుండా ఉన్న ఓ బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్(బీజీఎల్)ను ఇద్దరు చిన్నారులు గుర్తించారు. వారిద్దరూ దాన్ని ఆటవస్తువుగా భావించారు. ఈ క్రమంలో బీజీఎల్ పేలడంతో వారిద్దరూ చనిపోయారు.



రంపచోడవరం, మే 13: అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మన్యం నియోజకవర్గంలో పోలీసు నీడన సోమవారం నాటి సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మధ్నాహ్నం 4 గంటలకే పోలింగ్‌ను ముగించేశారు. ఎక్కడా ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు కానీ, అవాంఛనీయ ఘటనలు కానీ చోటు చేసుకోలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్, రంపచోడవరం అదనపు ఎస్పీ జగదీష్ అడహళ్లి స్పష్టం చేశారు.

ఉత్సాహంగా ఓటేయడం శుభపరిణామం: బాబు

అమరావతి, మే 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కోసం, రాష్ట్ర భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ ఓటేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు కోరారు. సోమవారం ఉండవల్లిలోని పోలింగ్ కేంద్రంలోని సతీమణి భువనేశ్వరితో కలసి, ఓటేసిన చంద్రబాబు చేతి వేలికి వేసిన సిరాను చూపుతూ ఎక్స్‌లో ఫొటో పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా... 'అన్ని వర్గాల ప్రజలు వేల సంఖ్యలో ఉత్సాహంగా ఓటు వేయడం శుభపరిణామం.' అని అన్నారు.

రాష్ట్ర ప్రజల తెగువకు పాదాభివందనం : లోకేశ్

అమరావతి, మే 13(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర ప్రజల తెగువకు పాదాభివందనం..!' అంటూ టీడీపీ యువనేత లోకేశ్ సోమవారం ఎక్స్‌లో స్పందించారు. 'రాష్ట్రంలో ప్రజా తీర్పును తారుమారు చేసేందుకు అధికార పార్టీ చేసిన అన్ని ప్రయత్నాలను తిప్పి కొడుతూ, పోలింగ్ కేంద్రాల వద్ద ఓట్లతో తిరుగుబాటు చేసిన రాష్ట్ర ప్రజానీకానికి నా అభినందనలు.' అని లోకేశ్ పేర్కొన్నారు.

వైసీపీ బరితెగించింది: కూటమి నేతలు

అమరావతి, మే 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేయడానికి వైసీపీ ప్రయత్నం చేసిందని ఎన్డీయే కూటమి నేతలు ధ్వజమెత్తారు. సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ మాట్లాడుతూ... 'పోలింగ్ సరళి చూసి, వైసీపీ నేతల్లో వణుకు పుట్టింది. టీడీపీ అభ్యర్థులు, ఏజెంట్లు, కార్యకర్తలపై దాడులకు దిగారు. మీడియాపైనా దాడులకు తెగబడ్డారు. ఓటమి భయంతో అధికారాన్ని నిలుపుకోవటానికి దాడులకు పాల్పడిన వైసీపీ నేతలపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి' అని విజ్ఞప్తి చేశారు. బీజేపీ అధికార ప్రతినిధి లంకా దినకర్ మాట్లాడుతూ... వైసీపీ బరితెగించి, కూటమి అభ్యర్థులపై దాడులకు తెగబడిందన్నారు. జనసేన నేత కేకే శరత్ మాట్లాడుతూ... 'జగన్ అరాచకాలపై విసిగిపోయిన జనం పోలింగ్ బూత్‌ల వద్ద బారులుతీరి, కూటమి అభ్యర్థులను ఆదరిస్తున్నారు' అని అన్నారు.

ఇక జగన్ దుకాణం బంద్: వర్ల


అమరావతి, మే 13(ఆంధ్రజ్యోతి): ఇక ఈ ఎన్నికలతో జగన్ దుకాణం బంద్ అవుతుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. ఎన్డీయే కూటమి అభ్యర్థులు, కార్యకర్తలకు దెబ్బలు తగిలినా.. ప్రజలు వైసీపీకి పెద్ద దెబ్బకొడతారని స్పష్టం చేశారు. ప్రజలు కొట్టే దెబ్బకు జగన్‌కు దిమ్మ తిరుగుతుందని అన్నారు. సోమవారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కూటమి నేతలు కలసి, పోలింగ్ సందర్భంగా సాయంత్రం 4 నుంచి 6 మధ్య వైసీపీ పోలింగ్‌లో అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందని ఫిర్యాదు చేశారు. అనంతరం వర్ల రామయ్య మీడియాతో మాట్లాడుతూ... తాము ఊహించినట్లే వైసీపీ ఫ్రస్టేషన్‌తో పోలింగ్‌లో అక్రమాలకు దిగిందన్నారు. ఈసీని కలిసినవారిలో మాజీ మంత్రి దేవినేని ఉమా, టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, బీజేపీ నేత పాతూరి నాగభూషణం, జనసేన ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

మాకే పట్టం!

టీడీపీ కూటమి పార్టీల్లో పెరిగిన ధీమా

ఓటింగ్ సరళిపై నేతల్లో సంతృప్తి

అమరావతి, మే 13 (ఆంధ్రజ్యోతి): తాము అధికారంలోకి రావడం ఖాయమేనని టీడీపీ కూటమి ధీమా వ్యక్తం చేస్తోంది. సోమవారం జరిగిన పోలింగ్ రాష్ట్ర వ్యాప్తంగా తమకు పూర్తి అనుకూలంగా జరిగిందని, ఫలితాలు తమ కూటమికే ఏకపక్షంగా ఉండబోతున్నాయని టీడీపీ, జనసేన, బీజేపీ అభిప్రాయపడుతున్నాయి. పోలింగ్ ముగిసిన తర్వాత అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ జరిగిన తీరు, ప్రజలు స్పందించిన తీరు తదితర అంశాలపై ఈ పార్టీలు సమాచారం సేకరించాయి. దీంతోపాటు తమ నేతలు, ఇతరత్రా మార్గాల నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా వివిధ నియోజకవర్గాల్లో రాజకీయ పరిస్థితిని ఈ పార్టీల నాయకత్వాలు విశ్లేషించుకున్నాయి. వచ్చిన సమాచారంపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. టీడీపీ అధినేత చంద్రబాబు సోమవారం రోజంతా తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన వార్ రూమ్‌లోనే ఉండి పోలింగ్ సరళిని పరిశీలించారు. అన్ని జిల్లాల నేతలతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ తాజా పరిస్థితి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో ఓటర్ల మనోగతం తెలుసుకోవడానికి టీడీపీ నాయకత్వం కొన్ని బృందాలను నియోగించింది. వారి నుంచి వస్తున్న సమాచారాన్ని కూడా చంద్రబాబు ఎప్పటికప్పుడు విశ్లేషించి జిల్లాల నేతలను అప్రమత్తం చేశారు. 'పోలింగ్ సరళి మాకు పూర్తి సంతృప్తి కలిగించింది. మేం చరిత్రాత్మక విజయాన్ని నమోదు చేయబోతున్నాం. కూటమి అధికారంలోకి రాబోతోంది' అని ఆ పార్టీ ముఖ్యుడొకరు వ్యాఖ్యానించారు. జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో తాము ఊహించినదానికన్నా బలంగా వ్యతిరేకత ఉందని, అందుకే ఓటింగ్‌కు ప్రజలు వెల్లువలా వచ్చారని అభిప్రాయపడ్డారు. 'ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమవుతుండగా.. దానికి ముందే అనేక పోలింగ్ కేంద్రాల్లో వందల సంఖ్యలో ఓటర్లు వచ్చి బారులు తీరారు. గతంలో ఈ దృశ్యం చాలా అరుదుగా కనిపించేది. ఇప్పుడు ప్రజల్లో ఉన్న కసిని ఇది ప్రతిబింబించింది. ఎండను, రద్దీని లెక్కచేయకుండా మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి ప్రజలు వచ్చి ఓటింగ్‌లో పాల్గొన్నారు. నగరాలు, పట్టణాల్లో చదువుకున్నవారు ఓటింగ్‌కు రారన్న ప్రచారం నిజం కాదని ఇక్కడ తేలిపోయింది. ప్రత్యేకించి యువత ప్రతి పోలింగ్ కేంద్రంలో పెద్ద ఎత్తున కనిపించారు. ఎక్కడెక్కడో చదువుకుంటున్నవారు, ఉద్యోగాలు చేసుకుంటున్నవారు ఈసారి ఓట్లు వేసి తీరాలన్న పట్టుదలను ప్రదర్శించారు. ఇవన్నీ ప్రభుత్వ వ్యతిరేక వాతావరణాన్ని ప్రతిబింబించాయి' అని ఆ పార్టీ జిల్లా సమన్వయకర్త ఒకరు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాల్లో రాజంపేట, నంద్యాల తప్ప మిగిలిన 23 సీట్లలో తాము ఆధిక్యం సాధించే అవకాశం ఉందని పోలింగ్ తర్వాత టీడీపీ నేతలు జరిపిన అంతర్గత విశ్లేషణ సూచించినట్లు చెబుతున్నారు. అరకు (ఎస్టీ) లోక్‌సభ స్థానం పరిధిలోని ఒక ఎస్సీ, ఆరు ఎస్టీ అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. వీటిపై టీడీపీ నాయకత్వం నిన్నటి వరకు పెద్దగా ఆశలు పెట్టుకోలేదు. కానీ సోమవారం పోలింగ్ చూశాక తర్వాత ఈ ఏడింటిలో మెజారిటీ సీట్లు సాధించగలమని నమ్మకం ఏర్పడిందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. 'వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉపాధి దెబ్బ తిన్న భవన నిర్మాణ కార్మికులు వంటి వర్గాలు, ఆదాయ మార్గాలు దెబ్బ తిన్న చిన్న వ్యాపారులు, చేతివృత్తుల వారు, స్వయం ఉపాధిపై ఆధారపడిన వారు, ఉద్యోగాలు రావడం లేదని నిరాశలో ఉన్న యువత, వారి తల్లిదండ్రులు, రాష్ట్రంలో అభివృద్ధి లేకుండా పోయిందని బాధపడుతున్నవారు, కరెంటు బిల్లులు, పన్నుల భారాలతో కుంగిపోయిన వర్గాలు, వైసీపీ అరాచక పాలనకు భంగపడినవారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. పథకాల లబ్ధిదారులు తమ వెంటే ఉన్నారన్న జగన్ అండ్ కో నమ్మకం కూడా క్షేత్ర స్థాయిలో నిలబడలేదు. కూటమి మేనిఫెస్టో ఆకర్షణీయంగా ఉండడం తదితర కారణాలతో వారిలో కూడా చీలిక వచ్చింది. బీజేపీతో పొత్తు కారణంగా ముస్లింలు టీడీపీకి దూరమై పూర్తిగా వైసీపీకి మద్దతుగా నిలుస్తాయన్న వాదన కూడా నిలవలేదు. వారు అత్యధికంగా టీడీపీ అభ్యర్థులకే ఓట్లేశారు' అని ఇంకో టీడీపీ ముఖ్యుడొకరు విశ్లేషించారు. కూటమి పార్టీల మధ్య ఓట్ల బదిలీ జరగదన్న వైసీపీ ఆశలు కూడా అడుగంటాయని, పూర్తి స్థాయిలో ఓట్ల బదిలీ జరిగిందని తెలిపారు.



నేడు వారాణసీకి వెళ్తున్న బాబు

చంద్రబాబు మంగళవారం ఉదయం ఉత్తర ప్రదేశ్‌లోని వారాణసీకి ప్రత్యేక విమానంలో వెళ్తున్నారు. అక్కడ ప్రధాని మోదీ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి రావాలని ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలకు బీజేపీ కేంద్ర నాయకత్వం ఆహ్వానం పంపడంతో ఆయన వెళ్తున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. రాత్రికి తిరుగుపయనమవుతారు.

రాష్ట్రాన్ని కాపాడుకోవాలన్న కసి..

రాష్ట్రాన్ని కాపాడుకోవాలన్న కసి ప్రతి చోటా ఓటర్లలో కనిపించిందని చంద్రబాబు తెలిపారు. 'హింసను ప్రేరేపించి శాంతియుత వాతావరణాన్ని భగ్నం చేసి ఓటర్లు ఓటింగ్‌కు రాకుండా అడ్డుకోవాలని వైసీపీ నాయకత్వం ప్రయత్నించింది. సోమవారం తెల్లవారుజామునే పుంగనూరు నియోజకవర్గంలో టీడీపీ ఏజెంట్ల కిడ్నాపుతో మొదలు పెట్టారు. ఆ తర్వాత మాచర్ల, తాడిపత్రి, నరసరావుపేట, గురజాల, పెనమలూరు తదితర చోట్ల తమ కార్యకర్తలతో దాడులు చేయించారు. కానీ వారి ప్రయత్నాలు ఫలించలేదు. టీడీపీ కార్యకర్తలు వమ్ము చేశారు. వైసీపీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా బలంగా నిలబడ్డారు. ఓటమి భయంతోనే వైసీపీ నాయకత్వం హింసకు ఒడిగట్టింది" అని అన్నారు.

కొత్త చరిత్రకు శ్రీకారం

ఆశ్చర్యకర ఫలితాలు వస్తాయి

» కుట్రలను కూటమి అడ్డుకుంది: చంద్రబాబు

అమరావతి, మే 13 (ఆంధ్రజ్యోతి): ఈసారి ఎన్నికల్లో ఆశ్చర్యకర ఫలితాలను అందరూ చూస్తారని టీడీపీ అధినేత చంద్రబాబు వ్యాఖ్యానించారు. సోమవారం రాత్రి తమ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి తిరిగి వెళ్లే సమయంలో అక్కడ ఉన్న మీడియా ప్రతినిధులతో కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం ఓ ప్రకటన కూడా విడుదల చేశారు. వరుసగా 'ఎక్స్'లో ట్వీట్లు కూడా చేశారు. 'రాష్ట్ర ఎన్నికల చరిత్రలో సోమవారం ప్రత్యేకమైన రోజు. ఓటు వేయడానికి ప్రజలు చూపించిన ఉత్సాహం, వారిలో చైతన్యం చూశాక కొత్త చరిత్రకు ఇది శ్రీకారం అనిపించింది. అరాచకానికి ముగింపు పలికి, ప్రజాస్వామ్య పాలనను సాధించుకోవాలనే కసి, పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చిన ప్రతి ఓటరులోనూ కనిపించింది. మహాసంకల్పంతో ఓటేయడానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చి, ఎండవేడి, ప్రయాణ బడలికను ఓర్చుకుని, పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా బారులు తీరి ఓటేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఓటమి భయంతో భయోత్పాతం సృష్టించి పోలింగ్ శాతం తగ్గించడానికి వైసీపీ నేతలు హింసకు పాల్పడినా ఎక్కడా వెనక్కి తగ్గని ఓటరు ధైర్యానికి వందనం. రాష్ట్రానికి ఇకపై అన్నీ మంచిరోజులే' అని పేర్కొన్నారు. జగన్ అరాచక పాలనకు గుడ్‌బై చెప్పడానికి ప్రజలు ఎంతగా ఎదురు చూస్తున్నారో తెల్లవారుజాము నుంచే పో లింగ్ స్టేషన్ల ముందు ఏర్పడిన క్యూ లైన్లు ప్రపంచానికి చాటాయని వ్యాఖ్యానించారు. ఓటమి కళ్లకు కనిపిస్తుండడంతో వైసీపీ నేతలు దాడులకు తెగబడ్డార న్నారు. ఆ దాడుల్ని కూటమి అడ్డుకుందన్నారు..

కూటమిదే భారీ విజయం

» మార్పు కోసం స్పష్టమైన తీర్పు ఇచ్చారు
» వారాణసీలో మీడియాతో పవన్
» నేడు మోదీ నామినేషన్‌కు హాజరు

అమరావతి, మే 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించడం తథ్యమని జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. వారాణసీ లోక్‌సభ నియోజవర్గం నుంచి పోటీకి దిగుతున్న ప్రధాని మోదీ మంగళవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా ప్రధానికి శుభాకాంక్షలు తెలిపేందుకు సతీ సమేతంగా వారాణసీ చేరుకున్న పవన్ విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడారు. 'భారీ మెజార్టీతో ఎన్డీయే కూటమి ఏపీలో గెలవబోతోంది. ఓటర్లు మార్పు దిశగా స్పష్టమైన తీర్పును ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సుపరిపాలన అందించేలా పాలన ఉండబోతోంది. దేశ ప్రధాని మోదీపై అపార గౌరవం. ఆయన ముచ్చటగా మూడోసారి ప్రధాని కావాలనే సంకల్పంతో మద్దతు తెలియజేసేందుకు వచ్చాను. మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో దూసుకువెళ్తోంది. ఈ కీలక సమయంలో దేశ ప్రజలంతా తోడుగా ఉంటారని భావిస్తున్నా. ఏపీలోనూ ఎన్డీయే కూటమి రాష్ట్ర పురోగమనానికి తగిన విధంగా పని చేస్తుంది. ప్రజాపాలనతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో విజేతగా నిలుపుతాం' అని పవన్ పేర్కొన్నారు.

మాకే ఓట్ల వెల్లువ

» అంతటా ప్రభుత్వ సానుకూలతే
» రెచ్చిపోయి టీడీపీ గూండాల దాడులు
» మేం సంయమనంతో ఉన్నాం: సజ్జల

అమరావతి, మే 13(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ ప్రభుత్వంపై సానుకూలత ఉప్పెనలా ఓటెత్తిందని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ముందుగానే ప్రజలు స్పష్టమైన నిర్ణయానికి వచ్చారు. ప్రజలు మరోసారి జగన్ ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు సిద్ధమయ్యారు. ఓట్లు వేసేందుకు వెల్లువెత్తారు. ఎప్పుడూ లేని విధంగా సానుకూల ఓటుతో క్యూ కట్టారు. ఇంకా పోలింగ్ బూత్‌ల వద్ద క్యూలైన్లలో ఓటర్లు ఉండటమే సానుకూలతకు నిదర్శనం. చిత్తూరు జిల్లాలో ఉదయం కత్తిపోట్లతో టీడీపీ నేతలు హింసను ప్రారంభించారు. టీడీపీ కార్యకర్తలు, గూండాలు రెచ్చిపోయి దాడులు చేశారు. అద్దంకి, పీలేరు, సత్తెనపల్లిలో హింసాకాండకు పాల్పడ్డారు. టీడీపీ మూకలు రిగ్గింగ్‌కు పాల్పడ్డాయి. వైసీపీ నేతలు, కార్యకర్తలు సంయమనంతో వ్యవహరించారు. పేద ప్రజల అభివృద్ధే రాష్ట్రాభివృద్ధికి దారితీస్తుంది. కేంద్రం అండతో పోలింగ్ రోజు వరకూ టీడీపీ నాటకాలు, దాడులూ అన్నీ చూశాం. ల్యాండ్ టైట్లింగ్ యాక్టుపై కూడా ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేశారు. టీడీపీ అరాచకాలపై ఈసీకి ఫిర్యాదు చేశాం' అని సజ్జల అన్నారు.

ఈసీ మమ్మల్ని లోకువగా చూసింది

'ఈసీ గత రెండు రోజులుగా సినిమా చూపించింది. వారు ఇష్టం వచ్చినట్లుగా ఉద్యోగులను బదిలీ చేస్తూ వచ్చారు. ఎక్కడికక్కడ బదిలీలు చేయడంలోనే ఎన్నికల కమిషన్ ఎలా వ్యవహించిందో తెలుస్తుంది. చర్యలను బట్టి ఎంత ప్రో యాక్టివ్‌గా ఈసీ వ్యవహరించిందో తెలుస్తుంది. మావైపు నుంచి ఎలాంటి తప్పులు లేకపోయినా, రచ్చగాని లేకపోయినా, సంయమనం పాటించినా... మాకు వ్యతిరేకంగా నిర్ణయాలు వచ్చాయి. మమ్మల్ని ఈసీ లోకువగా చూసింది. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయగలిగితేనే మేం ఊహించిన ఫలితం వస్తుందని భావించాం' అని సజ్జల అన్నారు.



యాదాద్రి భువనగిరి జిల్లా పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ

వాహనాలన్నీ హైదరాబాద్ వైపే!

» ఊళ్ల నుంచి తిరిగి వస్తున్న ఓటర్లు

చౌటుప్పల్ రూరల్/టౌన్, మే 13: తెలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నవారు హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. దీంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద అర కిలోమీటరు మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. టోల్ గేటు దాటడానికి 15 నిమిషాల సమయం పట్టింది. సాధారణ రోజుల్లో నిత్యం 30 నుంచి 35 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సోమవారం 45 వేల వాహనాలు హైదరాబాద్ వైపు వెళ్లినట్లు టోల్‌గేట్ సిబ్బంది తెలిపారు. అర్ధరాత్రి వరకు వాహనాల రద్దీ కొనసాగింది.

సీబీఎస్ఈ ఫలితాల్లో భాష్యం బ్లూమ్స్ విజయభేరి

గుంటూరు(విద్య), మే 13: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) ఫలితాల్లో భాష్యం బ్లూమ్స్ విద్యార్థులు సంచలన ఫలితాలు నమోదు చేశారని విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. సోమవారం విడుదలైన సీబీఎస్ఈ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. భాష్యం బ్లూమ్స్ విద్యార్థి ఎస్.హైందవ చంద్రకాంత్ 500 మార్కులకుగానూ 484 మార్కులు, ఎం.హితేష్ 483, ఎం.హాసిని 483, కె.హ్రితికారెడ్డి 483, ఎల్.అక్షిత్ 482, బి.తనూష్‌రెడ్డి 482, కె.తనీష్ సాయి 482, అవని బిస్ట్ 481, పి.అనంత రాఘవేంద్ర 481, టి.కావ్యశ్రీ, కె.కార్తికేయన్, డి.వి.ఎల్.సుస్మిత 480 మార్కులు సాధించారని తెలిపారు. తమ విద్యార్థుల్లో 21 మంది 475 పైగా మార్కులు, 101 మంది 450కి పైగా మార్కులు సాధించారని వెల్లడించారు. చైర్మన్ భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ భాష్యం హనుమంతరావు తదితరులు విద్యార్థులను అభినందించారు.

'జనచైతన్య' డైరెక్టర్ మాదల శకుంతల కన్నుమూత



గుంటూరు, మే 13: జనచైతన్య గ్రూపు సంస్థల డైరక్టర్, వ్యవస్థాపకురాలు మాదల శకుంతల (86) గుంటూరు రాజేంద్రనగర్‌లోని నివాసంలో సోమవారం కన్నుమూశారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. జనచైతన్య గ్రూపు సంస్థలను స్థాపించి, అభివృద్ధి చేయడంలో ఆమె కీలకభూమిక పోషించారు. శకుంతల భౌతిక కాయాన్ని పలువురు రాజకీయ ప్రముఖులు, పుర ప్రముఖులు సందర్శించి ఘన నివాళులర్పించారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు గుంటూరు స్తంభాలగరువులోని మహాప్రస్థానంలో ఆమె అంత్యక్రియలు జరుపనున్నట్టు కుమారులు తెలిపారు.

130 సీట్లతో కూటమి ప్రభుత్వం: జోగయ్య

పాలకొల్లు, మే 13: కాపు బలిజ సంక్షేమ సేన రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సర్వే ప్రకారం 130 సీట్లతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని మాజీ ఎంపీ, రాష్ట్ర కాపు బలిజ సంక్షేమ సేన అధ్యక్షుడు చేగొండి హరిరామ జోగయ్య సోమవారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. టీడీపీ 107, జనసేన 18, బీజేపీ 5 మొత్తం 130 సీట్లు దక్కించుకునే అవకాశం ఎక్కువగా ఉందని తెలిపారు.

శిల్పా రవి నా మిత్రుడు.. అందుకే కలిశా!: అల్లు అర్జున్

హైదరాబాద్, మే 13(ఆంధ్రజ్యోతి): తన నంద్యాల పర్యటనపై సినీ హీరో అల్లు అర్జున్ వివరణ ఇచ్చారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న ఆయన... మీడియాతో మాట్లాడారు. 'నాకు ఏ రాజకీయ పార్టీతో అనుబంధం లేదు. నాకు అన్ని పార్టీలు ఒకటే. నా అనే వారికి ఎప్పుడూ మద్దతు ఇస్తా. మావయ్య పవన్ విషయంలోనైనా, మిత్రుడు శిల్పా రవిరెడ్డి విషయంలో అయినా. భవిష్యత్తులోనూ నా అనే వారికి ఇలానే మద్దతిస్తా. శిల్పా రవి నాకు 15ఏళ్లుగా మిత్రుడు. ఆయన రాజకీయాల్లోకి వస్తే సపోర్ట్ చేస్తానని మాటిచ్చా. 2019లో శిల్పా రవి రాజకీయాల్లోకి వచ్చినా.. కలవలేకపోయాను. అందుకే ఈసారి వెళ్లి కలిశా. నాకు రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదు' అని అన్నారు. కాగా, శనివారం అల్లు అర్జున్ తన సతీమణి స్నేహారెడ్డితో కలసి నంద్యాలలో పర్యటించారు. పట్టణంలో 30 పోలీసు యాక్టు, 114 సెక్షన్ అమలులో ఉన్నప్పుడు ఆయన పర్యటించడంతో.. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందుకుగాను అల్లు అర్జున్, శిల్పా రవిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

లోలోన భయం.. పైకి గాంభీర్యం!

» జనం ఓటెత్తడంతో వైసీపీ ఉక్కిరిబిక్కిరి
» అయినా గెలుస్తున్నామంటూ ప్రకటనలు
» సంక్షేమం గెలిపిస్తుందంటూనే ఈసీపై దాడి
» 130కి తగ్గవంటున్న తాడేపల్లి శిబిరం

అమరావతి, మే 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలింగ్ సరళి పాలక పక్షం వైసీపీని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఓటర్లు భారీగా పోటెత్తడం.. అర్ధరాత్రి దాటినా వెయ్యికిపైగా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ కొనసాగడం తమకు అనుకూలమో కాదో ఆ పార్టీ నేతలకు అంతుపట్టడం లేదు. విజయం తమదేనని పైకి వారు గంభీరంగా చెబుతున్నా.. మనసులో మాత్రం ఓటమి భయం వెంటాడుతోంది. వారి మాటల్లో కాస్త నైరాశ్యం కనిపిస్తోందని ప్రత్యర్థులు అంటున్నారు. పోలింగ్ ముగిశాక పలువురు అభ్యర్థులను పలకరిస్తే ఫలితం ఎలా ఉంటుందో ఆత్మవిశ్వాసంతో చెప్పలేకపోయారు. మహిళలు పెద్దఎత్తున ఓటింగ్‌లో పాల్గొనడం తమకే లాభమని.. సంక్షేమ పథకాల అమలు వల్లే వారు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారని కొందరు అభ్యర్థులు తెలిపారు. మొత్తంగా 97 నుంచి 100 అసెంబ్లీ స్థానాలు దక్కించుకుంటామని.. రెండోసారి అధికారంలోకి వస్తామని ఓ ఉత్తరాంధ్ర ఎమ్మెల్యే అన్నారు. అయితే తాడేపల్లి ప్యాలెస్ మాత్రం 130 సీట్లకు తగ్గవని లెక్కలు వేస్తోంది. మహిళలు, యువత భారీ సంఖ్యలో తమకే ఓట్లేశారని అంటోంది. క్షేత్రస్థాయిలో మాత్రం వైసీపీ నేతల అంచనాలు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఓటింగ్‌లో పాల్గొన్నవారు ఈసారి ఎవరి వైపు మొగ్గు చూపారో తెలియడం లేదని చెబుతున్నారు. నిశ్శబ్ద విప్లవం కనిపించిందని కోస్తా జిల్లాలకు చెందిన ఒక సీనియర్ మంత్రి వ్యాఖ్యానించారు. అయితే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు, టీడీపీ కూటమి సూపర్‌సిక్స్ హామీల ప్రభావం ఎంతుందో తెలియడం లేదని కొందరు అభ్యర్థులు చెబుతున్నారు. ఓటర్లలో వెల్లివిరిసిన చైతన్యం.. క్షేత్రస్థాయిలో ఎదురైన అనుభవాలతో వారిలో అంతర్గతంగా భయం నెలకొన్నట్లు వారి మాటలతో తెలిసిపోతోందని.. బయటకు మాత్రం మళ్లీ తమదే ప్రభుత్వమంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని రాజకీయ వర్గాలు అంటున్నాయి. ఏడాది కిందట 175 అసెంబ్లీ - 25 లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకుంటామని సీఎం జగన్ ఆర్భాటంగా ప్రకటించారు. వైసీపీ నేతలు, శ్రేణుల్లో అయితే సోమవారం పోలింగ్ ముగిశాక.. నైరాశ్యం కనిపించింది. కానీ అది కనబడకుండా భారీ విజయం తథ్యమని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. పనిలోపనిగా ఎన్నికల కమిషన్ (ఈసీ)పై అక్కసు వెళ్లగక్కుతున్నారు. అది నిష్పాక్షికంగా వ్యవహరించలేదని.. ఆరోపిస్తున్నారు.

వలంటీర్లు.. పథకాలు

పోలింగ్‌కు 15 రోజుల ముందు.. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు అంశాన్ని టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ వ్యూహాత్మకంగా తెరపైకి తెచ్చారు. ఇందులోని లోపాలకు విస్తృత ప్రచారం కల్పించారు. తమ విజయావకాశాలను ఇది ప్రభావితం చేస్తోందని సీఎం జగన్ కూడా ఆందోళన చెందారు. అలాగే పట్టాదార్ పాస్‌పుస్తకాలపై ఆయన బొమ్మ ముద్రించడంపైనా పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ రెండు అంశాలూ ప్రజలను ఆందోళనకు గురిచేసిన మాట వాస్తవమని.. ఓటింగ్‌ను ఇది కూడా ప్రభావితం చేసి ఉంటుందని కొందరు వైసీపీ అభ్యర్థులు అభిప్రాయపడ్డారు. అయితే టీడీపీ కూటమి వస్తే పథకాలు ఆగిపోతాయంటూ వలంటీర్లు చేసిన ప్రచారంతోనే జనం పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారని.. వైసీపీకే ఓట్లేశారని తాడేపల్లి ప్యాలెస్ చెబుతోందని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

టీడీపీపై ఈసీకి ఫిర్యాదులు..

మరోవైపు.. పోలింగ్ సందర్భంగా తాడిపత్రి, పల్నాడుల్లో వైసీపీ శ్రేణులు దౌర్జన్యాలు, హింసాకాండకు పాల్పడిన సంగతి తెలిసిందే. దీన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రత్యర్థులపై ఎదురుదాడికి దిగారు. టీడీపీ నేతలపై ఈసీకి తెగ ఫిర్యాదులు చేశారు. ఈ బాధ్యతను ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు అప్పగించింది. ఆయన టీడీపీ అక్రమాలకు పాల్పడిందంటూ ఏకంగా 68 ఫిర్యాదులు చేశారు.

ఈ అరాచకాలు.. కనీవినీ ఎరుగం!

ఎన్నికల సంఘానికి చంద్రబాబు ఫిర్యాదు

న్యూఢిల్లీ, మే 13 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా అధికార వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా అక్రమాలకు పాల్పడిందని టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు ఆరోపించారు. ఇలాంటి అరాచకాలను ఇంతకు ముందు ఎన్నిడూ చూడలేదన్నారు. ఎన్నికల అధికారులు, పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడంతో వైసీపీ కార్యకర్తలు ఇష్టారీతిన వ్యవహరించి తమ వాళ్లపై దాడులు చేశారని తెలిపారు. పోలింగ్ వేళ హింస జరిగిందంటూ కేంద్ర ఎన్నికల సంఘాని(ఈసీ)కి చంద్రబాబు ఫిర్యాదు చేశారు. టీడీపీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ ఢిల్లీలో కమిషన్‌కు దీనిని అందజేశారు. సోమవారం రాష్ట్రంలో 121 చోట్ల వైసీపీ పలు రకాల అక్రమాలకు పాల్పడినట్లు తమ దృష్టికి వచ్చిందంటూ వాటి వివరాలను ఈసీ దృష్టికి చంద్రబాబు తీసుకెళ్లారు.

ఇవీ అక్రమాలు..

- పల్నాడు జిల్లాలో పోలింగ్ కేంద్రాల ముందు పోలీసుల సమక్షంలోనే వైసీపీ గూండాలు దాడులకు పాల్పడ్డారు. మాచర్ల నియోజకవర్గానికి చెందిన ఓ సీనియర్ నేత హత్యకు గురయ్యారు. ఆయన మృతదేహం శివారులో లభ్యమైంది.
- నరసరావుపేట పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలిపై పోలీసుల సమక్షంలోనే దాడిచేసి ఆయన 3 వాహనాలను వైసీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు.
- సున్నిత ప్రాంతంగా ఈసీ గుర్తించిన పుంగనూరులో టీడీపీ పోలింగ్ ఏజెంట్లను ఉదయమే కిడ్నాప్ చేశారు.
- తాడిపత్రిలో సిటింగ్ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఆయన కుమారుడు హర్షవర్ధన్ రెడ్డి ప్రతి పోలింగ్ స్టేషన్‌కు వెళ్లి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారు.
- స్పీకర్ తమ్మినేని సీతారాం భార్య వాణిశ్రీ ఆమదాలవలస నియోజకవర్గంలోని రెండు బూత్‌లు(పీఎస్ నెం.158, 159) కబ్జా చేసినా పోలీసులు పట్టించుకోలేదు.
- తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తన అనుచరులతో కలిసి క్యూలో ఉన్న ఓటర్లపై దాడులకు పాల్పడ్డారు. పోలీసులు కనీసం కేసు కూడా నమోదు చేయలేదు.
- పోలింగ్‌లో వైసీపీ హింస వల్ల పోలీసులకు కూడా రక్షణ లేకుండా పోయిందని చంద్రబాబు అన్నారు. పోలింగ్ సంఘటనలపై ఆయన 'ఎక్స్'లో వరుస పోస్టులు పెట్టారు.

వైసీపీ అరాచకాలకు పాల్పడింది: టీడీపీ

అమరావతి, న్యూఢిల్లీ, మే 13(ఆంధ్రజ్యోతి): పోలింగ్ సందర్భంగా సోమవారం రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల్లో అధికార పార్టీ అరాచకాలకు పాల్పడింది. పుంగనూరు, మాచర్ల, రైల్వే కోడూరు, పుట్టపర్తి, నరసరావుపేట, విజయవాడ, పాయకరావుపేట, ఆముదాలవలస, దర్శి, పత్తికొండ, శ్రీకాకుళం, యర్రగొండపాలెం, తెనాలి, నరసన్నపేట తదితర నియోజకవర్గాల్లో వైసీపీ అరాచకాలపై తెలుగుదేశం పార్టీ ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లింది. ఈ మేరకు టీడీపీ మాజీ మంత్రి దేవినేని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వేర్వేరు లేఖలు రాశారు. అదే సమయంలో కేంద్ర ఎన్నికల సంఘానికి ఢిల్లీలో మాజీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ ఎనిమిది ఫిర్యాదులు చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కీలక దశ

తెలుగు రాష్ట్రాల్లో సోమవారం జరిగిన ఎన్నికలు అత్యంత కీలకమైనవి. తెలంగాణలో 17లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరిగితే, ఆంధ్రప్రదేశ్ ప్రజలు పాతికమంది ఎంపీలతో పాటు, 175మంది ఎమ్మెల్యేలను కూడా ఎన్నుకొని రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాన్ని నిర్ణయించుకోబోతున్నారు. దేశంలోని పదిరాష్ట్రాల్లో 96లోక్‌సభస్థానాలకు ఈ నాలుగోదశలో జరిగిన పోలింగ్‌లో దాదాపు సగం సీట్లు తెలుగురాష్ట్రాల్లోనే ఉన్నాయి. సీట్ల సంఖ్య రీత్యా మొత్తం ఏడుదశల్లోనూ ఈ దశ రెండవ అతిపెద్దది. కేంద్రంలో ఏర్పడబోయే ప్రభుత్వ బలాబలాలను నిర్ణయించగలిగే యూపీ, బెంగాల్, మహారాష్ట్ర వంటి కీలకమైన రాష్ట్రాలు కూడా ఈ దశలో ఉన్నాయి.

తెలంగాణలో పదిహేడుస్థానాల్లో తేలిన ఫలితం రాబోయే కాలంలో రాష్ట్రప్రభుత్వ పనితీరును ప్రభావితం చేస్తుంది. అర్నెల్ల క్రితమే అధికారంలోకి వచ్చినప్పటికీ, రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు, ఇచ్చిన హామీలు ఓటరును ఏ మేరకు ప్రభావితం చేశాయన్నది ఈ ఎన్నికలు కొంతమేరకు చెప్పగలుగుతాయి. ఎక్కువ సీట్లు తెచ్చుకొని తమ విధానాలకు, ఆలోచనలకు ప్రజల ఆశీస్సులు, అండదండలు అధికంగా ఉన్నాయని నిరూపించుకొనేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) మనుగడ ఏ విధంగా ఉండబోతున్నదీ కూడా ఈ ఎన్నికలు చెబుతాయి. ఎన్ని స్థానాలను గెలుచుకోగలదన్న విషయాన్ని అటుంచితే, సాధ్యమైనన్ని ఎక్కువ నియోజకవర్గాల్లో రెండోస్థానంలో ఉంటూ తన ఉనికిని కాపాడుకొనేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తున్నది. రాష్ట్రంలో వేగంగా విస్తరించిన భారతీయ జనతాపార్టీ (బీజేపీ), బీఆర్ఎస్ బలాన్ని కూడా కొంతమేరకు తన ఖాతాలో వేసుకుంటూ గతంలో లభించిన స్థానాలతో పాటు, మరిన్ని అధికంగా గెలుచుకొనేందుకు ప్రయత్నిస్తున్నది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షపార్టీగా ఎదగాలన్న దాని ప్రయత్నానికి ఈ ఎన్నికలు ఓ ఊతం. వేర్వేరు కారణాలు, అవసరాల రీత్యా ఈ పార్లమెంట్ ఎన్నికలు మూడుపార్టీలకూ ఓ పరీక్ష. ఇక, ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు కొత్త ప్రభుత్వాన్ని నిర్ణయించబోతున్నాయి. వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్ఆర్‌సీపీ ఐదేళ్ళ పాలన మీద ప్రజలు ఇచ్చిన తీర్పు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లలో నిక్షిప్తమై ఉంది. ఎండావానలను సైతం లెక్కచేయకుండా ఓటర్లు చైతన్యంతో వ్యవహరించడం, పోలింగ్‌శాతం అధికంగా ఉండటం ప్రశంసనీయం. ఓటింగ్ హెచ్చినప్పటికీ, పలుచోట్ల ఉద్రిక్తతలు చోటుచేసుకోవడం, హింసాత్మకమైన ఘటనలు జరగడం దురదృష్టకరం. ప్రజలు హింసకు వెరవకుండా మార్పుకోసం నిలబడ్డారని, అధిక పోలింగ్ తమకు ప్రయోజనకరమని టీడీపీ భావిస్తుంటే, శాసనసభలో తన ప్రవేశానికి ఈ ఫలితాలు మార్గం సుగమం చేస్తాయని టీడీపీ–జనసేనతో జతకట్టిన బీజేపీ నమ్ముతోంది.

సార్వత్రిక ఎన్నికల నాలుగోదశలో ఓటింగ్ మొత్తంగా 65శాతం వరకూ ఉంది. పశ్చిమబెంగాల్‌లో అత్యధికపోలింగ్ జరిగితే, 370 అధికరణ రద్దు తరువాత తొలిసారిగా జమ్మూకశ్మీర్‌లో, శ్రీనగర్ పార్లమెంటరీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో అతి తక్కువ శాతం నమోదైంది. దాదాపు 18కోట్లమంది ఓటుచేసిన ఈ నాలుగో దశతో 23 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 379 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ పూర్తయింది. మే 20, 25, జూన్ 1న మిగతా మూడుదశల పోలింగ్‌తో మొత్తం ప్రక్రియ ముగుస్తుంది. సౌత్‌మే సాఫ్, నార్త్, వెస్ట్ ఔర్ ఈస్ట్ మే హాఫ్ అంటూ ఈ దశతో మోదీ పతనం మరింత ఖాయమైందని కాంగ్రెస్ అంటోంది. వివిధ దశల్లో మోదీ ప్రసంగాల్లోనూ, విమర్శల్లోనూ వచ్చిన మార్పును అది ఎత్తిచూపుతోంది. పాకిస్థాన్ విషయంలో ఫరూక్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యను అన్యాపదేశంగా గుర్తుచేస్తూ, ఇండియా కూటమి నాయకులను మోదీ సోమవారం బిహార్ ఎన్నికల సభలో పిరికిపందలుగా అభివర్ణించారు. అంతటితో సరిపెట్టకుండా, పాకిస్థాన్–గాజులు ప్రస్తావనలను మరో మెట్టు ఎక్కించారు. తమ విజయం ప్రభంజనం లాగా ఉండబోతున్న విషయం ఈ నాలుగో దశతో ఖాయమైందని, ఎన్డీఏ 400 సీట్లు దాటి తీరుతుందని మోదీ ప్రకటించిన నేపథ్యంలో, జూన్ నాలుగువరకూ ఓటర్లు సస్పెన్స్ అనుభవించక తప్పదు.

మోదీ సర్కార్ మూడో రాకడ ఖాయం

భారతీయ జనతా పార్టీ 2019 సార్వత్రిక ఎన్నికలలో చాలా రాష్ట్రాల్లో అత్యధిక స్థానాలు సంపాదించింది. 2024లో ఆ ఫలితాలు పునరావృతం కావని ప్రతిపక్ష శిబిరంలో ఉన్నవారు, కుహనా మేధావులు వాదిస్తున్నారు. వారి వాదనలో పసలేదు. ఎందుకంటే 2014 నుంచీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలోని భారతీయ జనతా పార్టీకి జనాదరణ పెరుగుతుండే కాని తగ్గడం లేదు. బీజేపీ దిన దిన ప్రవర్ధమానమవుతున్న పార్టీయే కాని కాంగ్రెస్‌లా రోజురోజుకూ వెలుగు తగ్గిపోతున్న పార్టీ కాదు. మోదీ పట్ల ప్రజల విశ్వాసం రోజు రోజుకూ పెరుగుతోందని, ఆయనను అభిమానించే వారి సంఖ్య కోట్లలో ఉంటుందని చాలా మందికి ఇంకా అర్థం కావడం లేదు.



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

ఇవాళ ఉత్తరప్రదేశ్‌నే చూస్తే అక్కడ డబుల్ ఇంజన్ సర్కార్ అత్యంత పటిష్ఠంగా పనిచేస్తోంది. రాష్ట్రంలో ఒకప్పుడు మహిళలు ఒంటరిగా తిరిగేందుకు భయపడేవారు. ఎక్కడ చూసినా మాఫియా, గూండాగిరీ రాజ్యమేలేది. అభివృద్ధి అనేది ఏ కోశానా కనపడేది కాదు. ఇప్పుడు మోదీ–యోగీ సారథ్యంలో ఉత్తరప్రదేశ్‌లో వేల కోట్ల విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు అమలవుతున్నాయి. వేల కోట్ల మేరకు సంక్షేమ కార్యక్రమాల నిధులు జనానికి నేరుగా చేరుతున్నాయి. శాంతి భద్రతల పరిస్థితి నూటికి నూరు శాతం మెరుగుపడింది. ప్రజలు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటున్నారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం, కాశీ కారిడార్ నిర్మాణం తదితర చర్యల వల్ల కోట్లాది భారతీయుల ఆధ్యాత్మిక, ధార్మిక మనోభావాల పరిరక్షణ జరిగింది. ఈ పరిస్థితుల్లో కులాల పేరుతో, మైనారిటీల పేరుతో కొన్ని దుష్టశక్తులు ఏకం అయినంత మాత్రాన ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ మెజారిటీ తగ్గుతుందా? గతంలో కంటే అత్యధిక సంఖ్యలో యూపీలో బీజేపీ సీట్లు సాధించడం ఖాయం.

యూపీ మాత్రమే కాదు, డబుల్ ఇంజన్ సర్కార్ అమలులో ఉన్న మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, అస్సాం, ఉత్తరాఖండ్, హర్యానా, గుజరాత్‌తో పాటు అనేక రాష్ట్రాల్లో బీజేపీ ప్రభంజనం మళ్లీ వీయనుందనడంలో సందేహం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా మోదీతో చంద్రబాబు–పవన్ కల్యాణ్ చేతులు కలపడంతో ప్రజల్లో సమధికోత్సాహం నెలకొంది. తెలంగాణలో నిశ్శబ్ద విప్లవం జరుగుతున్న దాఖలాలు కనిపిస్తున్నాయి. ఈ ఎన్నికల తర్వాత తెలంగాణలో కూడా అనతి కాలంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడడం ఖాయమని ప్రజలు విశ్వసిస్తున్నారు.

బీజేపీ గెలుపునకు ఎన్నో కారణాలు చెప్పవచ్చు. మోదీ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీని ప్రజలు తమ జీవితాలకు, ఆలోచనలకు సన్నిహితంగా ఉన్న పార్టీగా భావిస్తున్నారు. మోదీకి తప్ప మరెవరికి ఓటు వేస్తాం? అన్న ప్రశ్న ప్రతి సామాన్యుడి మనసులో మెదులుతోంది. మోదీ గత పదేళ్లలో దేశాన్ని అత్యంత పటిష్ఠంగా బలోపేతంగా మారిందని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అద్భుతంగా జరుగుతోందని ఇవాళ ఎవరైనా చెప్పగలరు. మోదీ నిర్భయంగా, ప్రత్యర్థులను చీల్చిచెండాడం, అంతర్జాతీయంగా దేశం ప్రతిష్ఠను ఆకాశానికి పెంచడం కూడా అందరూ గమనించారు. అందుకే బీజేపీ ఉద్దేశ పూర్వకంగా మోదీ చుట్టూ ప్రచారాన్ని రూపొందించింది. మోదీ వాగ్దానాలు నెరవేరుస్తారని, ఆయన అనర్గళ ప్రసంగాలు ప్రజలను హత్తుకుంటాయని, ఆయనను మించిన వక్త కానీ, నాయకుడు కాని దేశంలో మరెవరూ లేరని ఇవాళ అందరికీ తెలుసు. ఏదైనా మోదీ ముఖానే కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడడం ప్రజలకు నచ్చుతున్న విషయం ప్రతిపక్షాలు గమనించడం లేదు. వ్యక్తిగతంగా ఆయన అవినీతిపరుడు కాకపోవడం, ఏదైనా జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే చేస్తాడని ప్రజలు నమ్మడం వల్ల ఇవాళ ఆయన నాయకత్వానికి తిరుగులేకుండా పోతోంది. నిత్యం కశ్మీర్‌లో చొరబాటుదారులను ప్రేరేపించే పాకిస్తాన్ ఇవాళ ఎందుకు ఆత్మరక్షణలో పడిపోయింది?



రాహుల్ గాంధీ అమేథీ నుంచి పలాయనం చిత్తగించి, తల్లి నియోజకవర్గమైన రాయబరేలీ నుంచి పోటీ చేస్తున్నారు. మిత్రపక్షాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఇచ్చిన సీట్లకు కాంగ్రెస్ పోటీ చేస్తోంది. తృణమూల్ కాంగ్రెస్ తిరస్కరించినా ఆ పార్టీని ఇండియా కూటమిలో కొనసాగిస్తున్నారు. ఇవన్నీ కాంగ్రెస్ బలహీనతకు నిదర్శనాలు. కాంగ్రెస్‌కి ఈసారి 50 సీట్లు కూడా రావని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన ప్రకటన ఏ మాత్రం వాస్తవ దూరం కాదని జూన్ 4న తప్పక నిర్ధారణ అవుతుంది.

గతంలో లాగా సంక్షేమ కార్యక్రమాల అమలులో అవినీతి కనపడకపోవడం కూడా మోదీ ప్రభుత్వం పట్ల విశ్వాసం పెంచుతోంది. శౌచాలయాలు, గ్యాస్ కనెక్షన్లు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ఆహార ధాన్యాల పంపిణీ, రైతులకు ఆర్థిక సహాయం, ముద్రా రుణాలు, ఆరోగ్య బీమా ఇవన్నీ ఆచరణలో ఫలితాలను అందిస్తున్నాయి. అందుకే బీజేపీ ఆత్మవిశ్వాసంతో నేరుగా లబ్ధిదారులను చేరుకోగలుగుతోంది. మైనారిటీలంతా సంఘటితమయ్యారని అందువల్ల బీజేపీ ఓడిపోతోందని ప్రతిపక్షాలు చేస్తున్న వాదన కూడా తప్పు. 2019లో కూడా ఇదే వాదన వినిపించినప్పటికీ బీజేపీ అఖండ విజయం సాధించిన విషయం గ్రహించాలి. యూపీలో మైనారిటీలే కనుక బీజేపీని వ్యతిరేకిస్తే మెజారిటీ సీట్లు ఎలా సాధించగలుగుతుంది? అసలు ప్రతిపక్షాలను ప్రజలు ఎందుకు నమ్మాలి? ఈ ప్రశ్నలు ప్రతిపక్షాలు వేసుకుని ఉంటే వాటి పరిస్థితి ఎంతో కొంత మెరుగుపడేది. ప్రతిపక్షాల ఆరున్నర దశాబ్దాల పాలనను, మోదీ పది సంవత్సరాల పాలనను ప్రజలు గమనించరని వారు అనుకోవడం పొరపాటు. ప్రతిపక్షాల హయాంలో జరిగిన విచ్చలవిడి అవినీతి ఆశ్రిత పక్షపాతం, పెచ్చరిల్లిన ఉగ్రవాదం, కశ్మీర్, పంజాబ్, ఈశాన్య రాష్ట్రాల్లో జరిగిన దారుణాలు, మతకల్లోలాలు, ఆర్థిక సంక్షోభంతో పాటు రాజ్యాంగ సంస్థలను ధ్వంసం చేసిన తీరు, ముఖ్యమంత్రులను పదే పదే మార్చిన తీరు ఇవన్నీ ప్రజలు మరిచిపోలేదు. ఇవాళ కులాల పేరుతో, సామాజిక న్యాయం పేరుతో రాహుల్‌గాంధీ చిలుకపలుకులు పలికినంత మాత్రాన ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. మీ జమానాలో సామాజిక న్యాయం ఏమైంది? గత ఎన్నికల్లో రాహుల్‌గాంధీ కనీస ఆదాయ గ్యారంటీ పేరుతో ప్రచారం చేశారు కాని ఓటర్లలో ఒక్కరు కూడా ఈ హామీని విశ్వసించలేదు. ఇప్పుడు సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ అంటూ మాట్లాడినంత మాత్రాన ప్రజలు విశ్వసిస్తారా?

మోదీ పట్ల ప్రజలకు బలమైన నమ్మకం ఎందుకు ఏర్పడింది? కాంగ్రెస్ పాలన కంటే మోదీ పాలన అన్ని విధాల మెరుగ్గా ఉండడమే. దేశంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే మోదీ పాలనకు గీటురాయి. ఉగ్రవాదం, వేర్పాటువాదం, నక్సలిజం వంటివి తోకముడిచాయి. మైనారిటీ వాదానికి కాలం చెల్లింది. వీటన్నిటికి తోడు బీజేపీ అత్యంత బలోపేతమైన పార్టీగా నలుమూలలా విస్తరించింది. ప్రతిపక్షాల పట్ల జనం విశ్వాసం కోల్పోవడం వల్లనే ఇవాళ బీజేపీ తిరుగులేని పార్టీగా మారింది.

అందుకే ప్రధానమంత్రి నరేంద్రమోదీ అత్యంత ఆత్మవిశ్వాసంతో ఎన్డీఏ 400 సీట్లు దాటి తీరుతుందని నాలుగో దశ ఎన్నికల తర్వాత మరోసారి ప్రకటించారు. రాహుల్‌గాంధీ అమేథీ నుంచి పలాయనం చిత్తగించి, తల్లి నియోజకవర్గమైన రాయబరేలీ నుంచి పోటీ చేయడం, సమాజ్‌వాది పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్, ఎన్సీపీ, శివసేన వంటి పార్టీల దయదాక్షిణ్యాలపై ఆధారపడి ఇచ్చిన సీట్లకు కాంగ్రెస్ పోటీ చేయడం, తృణమూల్ కాంగ్రెస్ తిరస్కరించినా ఆ పార్టీని ఇండియా కూటమిలో కొనసాగించడం ఇవన్నీ కాంగ్రెస్ బలహీనతకు నిదర్శనాలు. కాంగ్రెస్‌కి ఈసారి 50 సీట్లు కూడా రావని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన ప్రకటన ఏ మాత్రం వాస్తవదూరం కాదని జూన్ 4న తప్పక నిర్ధారణ అవుతుంది.

(బీజేపీ జాతీయ కార్యదర్శి)

ఇజ్రాయెల్ డొల్లతనాన్ని బైటపెట్టే యూదు ప్రతిఘటన

గత కొన్ని వారాలుగా పాలస్తీనాపై ఇజ్రాయెల్ జరుపుతున్న నరమేధం ఆపాలని భిన్న జాతుల, మతాల, దేశాల విద్యార్థులు, భారతీయ సంతతి విద్యార్థులతో సహా, అమెరికన్ విశ్వవిద్యాలయాలలో తీవ్ర నిరసనలు జరుపుతున్నారు. దాదాపు 120కి పైగా విశ్వవిద్యాలయాల్లో టెంట్లు వేసుకుని తమ విశ్వవిద్యాలయాల పాలక మండళ్లు ఇజ్రాయెల్‌కి చెందిన లేక సంబంధమున్న కంపెనీలలో పెట్టిన పెట్టుబడులు ఉపసంహరించుకోవాలని, ఆయా లాభాలని వాడుకోవటం అది జరుపుతున్న నరమేధంలో పాలు పంచుకున్నట్లేనని వారు వాదిస్తున్నారు. ఇవే నిరసనలు ఇంగ్లాండు, ఫ్రాన్స్‌లలో కూడా ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకూ అమెరికా, ఐరోపా, ఆసియా దేశాల వీధుల్లో కొన్ని నెలలుగా జరుగుతున్న నిరసనలకు ఇవి కొనసాగింపు. ఈ నిరసనల్లో ప్రధాన అంశం – ఇజ్రాయెల్‌కు, జియోనిజానికి (అంటే యూదు మత రాజ్య భావనకు) వ్యతిరేకంగా పెద్ద ఎత్తున యూదులు పోషిస్తున్న కీలక పాత్ర.

అక్టోబర్ 7న హమాస్ దాడుల తర్వాత, ప్రపంచ వ్యాప్తంగా జియోనిస్టులు, అమెరికన్ మితవాదులు, మన దేశంలో హిందుత్వ వాదులు ఇస్లామోఫోబియా (ముస్లిం ద్వేషం) అనే మౌలిక భూమికపైన ఏకమై పాలస్తీనా ప్రజల స్వతంత్ర ఆకాంక్షకు, వారి ప్రతిఘటనకు వ్యతిరేకంగా ఉధృతమైన ప్రచారం ప్రారంభించారు. దీని సారాంశం వందేళ్ళ పాలస్తీనా స్వతంత్ర పోరాటాన్ని హమాస్‌కు, హమాస్‌ని అక్టోబర్ 7 ఘటనకు, ఆ ఘటనని ఒక టెర్రరిస్టు చర్యకు కుదించటం; అలాగే 75ఏళ్ల ఇజ్రాయెల్ చేస్తూ వచ్చిన దురాక్రమణని, దౌర్జన్యాన్ని, క్రూర హింసని 'హిట్లర్ నరమేధానికి గురయిన యూదుల ఆత్మరక్షణ చర్యలు'గా అర్థం చేసుకోవాలని అందరికీ చెప్పటం. ఈ ప్రచారంలో పాలస్తీనా అరబ్బుల ప్రతిఘటన ఇస్లామిక్ టెర్రరిజంగానూ, అన్ని అంతర్జాతీయ మానవతా చట్టాలనూ ఉల్లంఘిస్తూ వచ్చిన ఇజ్రాయెల్ 'బాధిత' సమాజంగానూ కనిపిస్తారు. అక్టోబర్ 7 తర్వాత ఇజ్రాయెల్ గాజాపై కనీ వినీ ఎరుగని రీతిలో జరిపిన నరమేధాన్ని సరయిన 'ప్రతి చర్య'గా సమర్థించటమే ఈ ఊదరగొట్టే ప్రచార ఉద్దేశం.

ఇలా చెయ్యటం ఇజ్రాయెల్ పాలకులకు, దాని అమెరికన్, యూరోపియన్ సమర్థకులకు కొత్త కాదు. 1950ల నుండే వాళ్ళు ప్రచార ఆయుధాల్ని సమకూర్చుకుని, ఎప్పటికప్పుడు పదును పెట్టుకుంటూ వాడుకుంటున్నారు. దానికి కావాల్సినంత డబ్బు తమ సంస్థలు, లాబీలు, ట్రస్టుల ద్వారా వాళ్ళు ఖర్చుపెట్టి తమక్కావాల్సింది చేయించుకుంటారని 'ది ఇజ్రాయెలీ లాబీ' అనే పుస్తకం రాసిన అమెరికన్ యూదు విదేశాంగ విధాన నిపుణులు 2006లోనే బయటపెట్టారు. ఇజ్రాయెల్ తన దేశంలోనే కాక ఇతర దేశాల్లో కూడా పిల్లలకి స్కూళ్లు స్థాపించి వాటిల్లోనూ, ప్రపంచ వ్యాప్తంగా యూదు యువతకి తన సైన్యంలోకి ఆహ్వానించి ట్రైనింగ్‌లో భాగంగా ఈ ప్రాపంచిక దృక్పథాన్ని బాగా నూరిపోస్తూ ఉంటుంది. ప్రపంచంలో యూదులు తప్ప ఇంకెవరూ నరమేధానికి గురి కాలేదని, కాబట్టి పురాణాల్లో వున్న విధంగా పాలస్తీనాపై యూదులకి తప్ప అరబ్బులకి ఏ మాత్రం హక్కులుండకూడదని, వారు వెళ్లిపోకుండా అక్కడుండటం తన అస్తిత్వానికే ముప్పని, ప్రపంచం ఎట్లాగొట్లా వారిని ఇజ్రాయెల్ నుండి వెళ్లిపోయేలా తనకి సహకరించాలని నెతన్యాహూతో సహా అనేక మంది యూదు రాజ్య భావనని మోసే యూదులు నమ్ముతారు. అసలు నరమేధం అనే మాట ఇంకెవరికీ వాడకూడదని కూడా ఈ జియోనిస్టు యూదులు వాదిస్తుంటారు. ఆఫ్రికాలో, అమెరికాలో ఐరోపా వలస రాజ్యాలు నల్ల జాతీయులు, స్థానికులు, భారతీయులపై జరిపిన అనేక మారణకాండలు, ఇంకా ఆటోమాన్ సామ్రాజ్యం రొమేనియన్లపై జరిపిన నరమేధం, రువాండాలో హుతీలు, టూట్సీలపై, అలాగే కోసోవోలో ముస్లింలపై జరిపిన మారణకాండల కంటే తమదే తీవ్రమైందని తెల్లజాతికి చెందిన ఈ జియోనిస్టు యూదులు బలంగా నమ్ముతారు. అది పునరావృతం కాకుండా ఉండాలంటే ఎంతకయినా తెగించాలి అని బలంగా నమ్మే వీళ్ళు 1948లో పాలస్తీనా నుండి స్థానిక 8 లక్షల అరబ్బులని వెళ్లగొట్టి ఆ తర్వాత వారి వ్యవసాయ భూములని స్వాధీనం చేసుకుని, వారి ప్రాంతాలని ఆక్రమించి పైగా వారి పట్ల దయ చూపకుండా జాతి వివక్ష, జాత్యహంకారంతో రెండవ శ్రేణి పౌరులుగా చూస్తూ, దాన్ని 'ఆత్మరక్షణ' పేరుతో, 'అరబ్బుల/ముస్లింల అనాగరికత, హింసాత్మకత' పేరుతో గత 75 ఏళ్లుగా సమర్థించుకుంటూ వచ్చారు.



పాలస్తీనా కోసం జరుగుతున్న నిరసనల్లో యూదులు ముందున్నారనే పరిజ్ఞానం జయోనిస్టుల కథనాన్ని నిర్వీర్యం చేస్తుంది. పాలస్తీనా కోసం నిరసనలు 'యూదు వ్యతిరేకమైనవే' అన్న నిందకి విశ్వసనీయత లేకుండా చేస్తుంది. పాలస్తీనాలో జరుగుతోంది ముస్లిములకూ యూదులకూ జరిగే మతపరమైన యుద్ధం కాదని, కేవలం పాలస్తీనా వనరులపై మనుషులపై ఆధిపత్యం కోసం ఇజ్రాయెల్‌ని జాత్యహంకార రాజ్యంగా జయోనిస్టులు తయారు చేశారన్నది బయటికి తెస్తుంది.

పాలస్తీనా ప్రజలు తమపై రుద్దబడిన ఈ వలస, జాత్యహంకార పాలనకి వ్యతిరేకంగా జరుపుతూ వచ్చిన పోరాటానికి వలస పాలన నుండి బయట పడిన అనేక మూడవ ప్రపంచ దేశాలు, భారతదేశంతో సహా, ఈ మధ్య వరకూ సహానుభూతి ప్రకటిస్తూనే వచ్చాయి. అమెరికాలో కూడా ఇజ్రాయెల్ సైన్యంలో పనిచేసింతర్వాత జయోనిస్టు దృక్పథం మార్చుకున్న వాళ్ళు ఒక రకమైతే, ఆఫ్రికన్ అమెరికన్ నిరసనల్లో 'బ్లాక్ లైవ్స్ మ్యాటర్'లో పాల్గొన్న క్రమంలో పాలస్తీనా గురించి అర్థం చేసుకున్న యువత రెండవ రకం. వీళ్ళందరూ 'ఇఫ్ నాట్ నౌ' అనే సంస్థ స్థాపించి గత దశాబ్దం కాలంగా జయోనిజానికి వ్యతిరేకంగా నిరసన చేస్తున్నారు. వీళ్ళు కాకుండా యూదు మత స్ఫూర్తితో పనిచేసే సనాతన యూదులతో సహా, నరమేధం తమకే కాదు ఎవరిపైనా జరక్కూడదు అనే రాజకీయ స్పృహ వున్న యూదులతో కూడుకున్న 'జూస్ ఫర్ పీస్' అనే సంస్థ చాలా చోట్ల వ్యాపించి, అధికారంలో వుండే జయోనిస్టు యూదుల ప్రభావాన్ని తగ్గించటానికి శాయశక్తులా ప్రయత్నిస్తోంది. ఐరోపాలో కూడా నవమోడ్ (ఇంగ్లాండ్) జ్యూయిష్ వాయిస్ (జెర్మనీ), ఇటువంటి సంస్థలు వచ్చాయి. అక్టోబర్ నుండి ఇజ్రాయెల్ చేస్తున్న నరమేధం వీరిని మరింత బలోపేతం చేసి రోడ్ల మీదకి తెచ్చాయి. యూదు మతం గాని, యూదుల చరిత్ర గాని ఇతరులని అణిచివేసి, వారిని చంపేవి కాదని, ఇజ్రాయెల్ రాజ్యం చేస్తోంది ఈ రెండింటి స్ఫూర్తికి పూర్తి వ్యతిరేకమని వీళ్ళు నొక్కి చెప్తున్నారు.

న్యాయం, శాంతి, ప్రజాస్వామ్యం, జాతి వివక్ష నిర్మూలన, వలస వాద ప్రభావం, సామ్రాజ్యవాదం గురించి తరగతి గదుల్లో నేర్చుకునే యూనివర్సిటీ విద్యార్థులు వాటి కోసం పోరాటానికి దిగటం పెద్ద వింతేమీ కాదు. ఇవి బోధించే అధ్యాపకులు కూడా వీరికి మద్దతు నివ్వటం సహజమే. క్యాంపస్‌లలో యూదు విద్యార్థులు పాలస్తీనా, అరబ్బు విద్యార్థులతోనే కాక, ఆఫ్రికన్ అమెరికన్ విద్యార్థులతో కూడా కలిసి పని చేస్తున్నారు. ఆఫ్రికన్ అమెరికన్ ఉద్యమకారులు పాలస్తీనా విముక్తి కోసం జరుగుతున్న ఉద్యమంతో సంఘీభావం తెలపటం 1960ల్లోనే ప్రారంభమయినప్పటికీ, జార్జ్ ఫ్లాయిడ్ హత్య సమయంలో పాలస్తీనా ఉద్యమకారులు పోలీసులతో ఎట్లా నెగ్గుకురావాలో సోషల్ మీడియాలో సలహాలివ్వటం తర్వాత పెరిగిందని ప్రముఖ నల్లజాతి రచయిత తా నెహసి కోయెటీస్ చెప్తారు. ఆయన, మరికొంత మంది నల్లజాతి మేధావులు, ఉద్యమకారులు వెస్ట్ బ్యాంకుకి వెళ్లటంతో అక్కడ ఇజ్రాయెల్ పాటిస్తున్న జాతి వివక్ష, సెగ్రిగేషన్ ఈ తరం వాళ్లందరికీ అర్థమై ఈ సంఘీభావానికి దారి ఏర్పడిందని ఆయన అంటారు. విద్యార్థుల నిరసన శిబిరానికి వచ్చిన ఏంజెలా డేవిస్ '1960ల నుండి నేను ఇటువంటి నిరసనల కోసం ఎదురుచూస్తున్నాను. మీరు చేస్తున్న నిరసనలు చరిత్రాత్మకమైనవి' అని చెప్పటం ఈ సంఘీభావలోతుని తెలుపుతుంది.

పాలస్తీనా కోసం జరుగుతున్న నిరసనల్లో యూదులు ముందున్నారనే పరిజ్ఞానం జయోనిస్టుల కథనాన్ని నిర్వీర్యం చేస్తుంది. పాలస్తీనా కోసం నిరసనలు 'యూదు వ్యతిరేకమైనవే' అన్న నిందకి విశ్వసనీయత లేకుండా చేస్తుంది. పాలస్తీనాలో జరుగుతోంది ముస్లిములకూ యూదులకూ జరిగే మతపరమైన యుద్ధం కాదని, యూదులూ అరబ్బుల మధ్య ఏ జన్మ వైరుధ్యం లేదని, కేవలం పాలస్తీనా వనరులపై మనుషులపై ఆధిపత్యం కోసం ఇజ్రాయెల్‌ని జాత్యహంకార రాజ్యంగా జయోనిస్టులు తయారు చేశారని బయటికి తెస్తుంది. జరుగుతున్న నరమేధానికి ఇజ్రాయెల్ కూడగట్టాలని చూస్తున్న నైతిక, ఆర్థిక బలాన్ని దెబ్బతీస్తుంది. అందువల్లే కాబోలు పద్ధతి ప్రకారం, నిర్దిష్టమైన డిమాండ్లతో, శాంతియుతంగా, యూనివర్సిటీ కేటాయించిన చోటులో జరుగుతున్న విద్యార్థి నిరసనలని అణచటానికి వారి పైకి యుద్ధానికెళ్ళే సైనికుల మాదిరి గన్నులు, బుల్‌డోజర్లతో పోలీసులని పంపించి దౌర్జన్యానికి పాల్పడుతున్నాయి ప్రభుత్వాలు. ఈ చర్యలు ఆయా దేశాల్లో రాజకీయాలకి, పెట్టుబడిదారులకి, ఇజ్రాయెల్‌తో వున్న గాఢమైన సంబంధాన్నే గాక, జరుగుతున్న నిరసనలు యథాస్థితి వాదాన్ని ఎంత భయపెడుతున్నాయో కూడా సూచిస్తున్నాయి.

■ ఎ. సునీత

ఈ రాజ్యానుకూల వాదనలు ఎక్కడ్నించి?

'ఈ దేశం నాకేమిచ్చింది అని కాకుండా నేను ఈ దేశానికి ఏమి ఇచ్చాను' అని ప్రతి పౌరుడు భావించాలి అంటూ సత్యానంతరవాదులు కుహనా జాతీయవాదంతో ఆకట్టుకునే నినాదాలు చేస్తారు. 'హక్కుల గురించి కాదు బాధ్యతల గురించి మాట్లాడాలి' అని మరో వాదన ఈ మధ్యకాలంలో మరింత ఎక్కువగా వినిపిస్తోంది. ఈ రెండు వాదనలు రాజ్యం తన విధుల నుండి తప్పించుకోవడానికి రక్షణ కవచంగా నిలుస్తాయి. భావోద్వేగంతో పౌరులు రాజ్యాన్ని ప్రశ్నించకుండా తమ హక్కులను తామే భూస్థాపితం చేసుకునేలా చేస్తాయి. అధికారాన్ని చేపట్టిన సిద్ధాంతరహిత రాజకీయ నాయకులైనా లేదా అధికారాన్ని చెలాయించే బూర్జువా సిద్ధాంతాల అధికారులైనా పై వాదనలతో ఏకీభవిస్తారు. సరిగ్గా అలాంటి కోవలోకే లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ ఆంధ్రజ్యోతిలో ఏప్రిల్ 21 నాడు రాసిన వ్యాసం వస్తుంది.

కేంద్ర ప్రభుత్వం మోకాలు అడ్డుపెట్టడం వలన తాము రాజ్యాంగ బద్ధమైన ఆర్టికల్ 293 ప్రకారం రుణాలను పొందలేకపోతున్నా'మని కేరళ రాష్ట్రం సుప్రీంకోర్టులో వేసిన వ్యాజ్యాన్ని ఉటంకిస్తూ జయప్రకాశ్ నారాయణ ఈ వ్యాసాన్ని రాశారు. ఒక రాష్ట్రం తమ జీడీపి (స్థూల జాతీయోత్పత్తి)లో 40శాతం వరకు రుణాలను పొందవచ్చు అన్న నిబంధనను అనుసరించి కేరళ రాష్ట్రం ఇప్పటికే 36.5శాతం రుణాలను పొందినట్టుగా, అది దేశంలో అన్ని రాష్ట్రాల వారీగా అప్పులను చూసినప్పుడు 11వ స్థానంలో ఉన్నట్టుగా, మొదటి స్థానంలో అరుణాచల్ ప్రదేశ్ స్థూల జాతీయోత్పత్తిలో 53శాతం రుణాలు పొంది ఉన్నట్టుగా పి.ఆర్.ఎస్ లెజిస్ట్రేషన్ రీసెర్చ్ వారు సమర్పించిన నివేదిక అనుసరించి ఫోర్బ్స్ ఇండియా రిపోర్టు 2023–24 ఈ మధ్య కాలంలోనే వెలువరించింది. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వానికి రాజ్యాంగం ద్వారా సంక్రమించిన నిర్ణయాధికారంతో కచ్చితంగా రాష్ట్రాలను నిలువరించవచ్చు. రాష్ట్రాలు తమ న్యాయబద్ధమైన అంశాన్ని కోర్టుల ద్వారా పరిష్కరించుకోవచ్చును కూడా.



రాజ్యాన్ని ప్రశ్నించకుండా అది అమల్లోపెట్టే భావోద్వేగపు అంశాలకు ప్రభావితమైనప్పుడు దాన్ని స్తుతించడంలో భాగంగా ఆర్థిక మూలాలపై సైతం ప్రతిస్పందించడంలో వైఫల్యాలు జరుగుతాయి. అలాంటి వైఫల్యం డాక్టర్ జయప్రకాశ్ నారాయణ వ్యాసంలో కనిపించింది.

కేంద్ర రాష్ట్రాల విధివిధానాలకు మాత్రమే పరిమితం కాకుండా జయప్రకాష్ నారాయణ ప్రస్తావించిన ఇతర అంశాలే ఈ సందర్భంగా మరింత కలవరపెడుతున్నాయి. ఎవరి ఖర్చులైనా రోజువారి స్థిర ఆదాయంలోపే ఉండాలి అని చెప్పే వారి మొదటి వాదనను ఒకసారి స్వతంత్ర భారత పునర్నిర్మాణానికి వేసిన తొలి కమిటీ 'బాంబే ప్లాన్'ను ఉటంకిస్తూ పునః పరిశీలించుకుని చూసుకుంటే మంచిది. 'మీ దగ్గర మౌలిక వసతులు లేవు, పారిశ్రామికీకరణ జరగలేదు, ప్రభుత్వానికి ఆదాయం లేదు... ఇన్ని సమస్యలతో స్వతంత్ర దేశాన్ని ఎలా నిర్మించుకుంటారు' అని ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం వేసిన ప్రశ్నకి సమాధానం చెప్పడం కోసమే 'బాంబే ప్లాన్' అనే ఎనిమిది మంది సభ్యుల కమిటీని స్వతంత్రం రాకముందే నాటి పెద్దలు వేశారు. ఆ కమిటీ మూడు ప్రతిపాదనలు చేసింది: ఒకటి– చిన్న మొత్తాల పొదుపులను సేకరించి మౌలిక వసతులను పెంచుకోవడానికి ఉపయోగించుకోవడం; రెండు– డెఫిసిట్ ఫైనాన్సింగ్ విధానాన్ని పాటించడం (రుణాలు సేకరించడం); మూడు– పన్నుల వసూలు. ఇందులో భాగంగానే రష్యా సహకారంతో భిలాయ్ ఇనుము ఉక్కు కర్మాగారాన్ని, జర్మనీ సహకారంతో రూర్కెలా ఇనుము ఉక్కు కర్మాగారాన్ని, బ్రిటన్ సహాయంతో దుర్గాపూర్ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తూ 1950వ దశకంలో పారిశ్రామికీకరణకు పెద్దపీట వేశారు. దానితో పాటుగా బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ రంగాలను జాతీయాకరిస్తూ సేకరించబడిన చిన్న మొత్తాల ద్వారా అనేకానేక ప్రాంతాలలో పారిశ్రామిక వాడలు వెలిసి ఖనిజ సంపదకు సంబంధించి, చమురు ఉత్పత్తికి సంబంధించి వివిధ సంస్థలు ఏర్పాటై ఆర్థిక పటిష్ఠతకు మూలాలు పడ్డాయి. అదే సందర్భంలో భారీ బహుళార్థ సాధక ప్రాజెక్టులను నిర్మించి వ్యవసాయ రంగానికి, మౌలిక వసతుల కల్పనకు చేయూతనిచ్చారు. అప్పులు సేకరించడమే పాపం అయితే ఈ మాత్రం పునాది పడేదే కాదు.

అప్పులు చేయనిదే ఈ రోజుల్లో ఇల్లు నిర్మించడం దాదాపు అసాధ్యమైన ఒక చిన్న వాస్తవాన్ని రచయిత విస్మరించారు. చేసిన అప్పులు తీర్చడానికి వ్యక్తులకైతే స్థిరమైన ఉపాధి, ప్రభుత్వాలకైతే ఎగవేయబడని న్యాయబద్ధమైన పన్నుల విధానం ప్రధానం. చాలా బాధాకరమైన విషయం ఏమంటే అమాయక మధ్యతరగతి ప్రజల ఆ మాత్రం పొదుపులను కూడా వారికి మిగల్చకుండా స్టాక్ మార్కెట్ అనే మాయా జూదంలోకి లాగి బడా కార్పొరేట్లు నొక్కేస్తూ ఉండే విధానానికి అందరూ వంతపాడతారు. ఎందుకంటే పెట్టుబడి పెట్టిన వారికి నష్టం వస్తే ఆ పెట్టుబడి స్వీకరించిన కంపెనీకి బాధ్యత వహించే అవసరం లేదు కాబట్టి.

కాళేశ్వరం ప్రాజెక్టును ఊటంకిస్తూ అప్పుల్ని పెట్టుబడులకి ఉపయోగిస్తే సరిపోదు ఆస్తుల్ని పెంచడంపై చేసే వ్యయం సద్వినియోగం కావాలి అంటూ మరో అంశంగా జయప్రకాష్ నారాయణ ప్రస్తావించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఒక రాజకీయ వివాదం అయిన మాట వాస్తవమే. దానిపై ఏకాభిప్రాయ సేకరణ జరగకుండా ఆనాటి ప్రభుత్వం దుందుడుకుగా సాగిన మాట అప్పట్లో చర్చనీయాంశం అయింది. ప్రాజెక్టు నాణ్యత, దానికి అయిన వ్యయం ఖచ్చితంగా చర్చనీయాంశాలే. అయితే భారీ ప్రాజెక్టుల నిర్మాణం, అందులోనూ నీటి నిల్వకు సంబంధించిన ప్రాజెక్టుల నిర్మాణం కచ్చితంగా భవిష్యత్తులో ఫలితాలను ఇవ్వగలదు. ఎందుకంటే ఇంకిపోతున్న భూగర్భ జలాలను పరిరక్షించుకునే అవకాశాలు తక్కువగా ఉన్నచోట నీటి నిలువల ప్రాజెక్టులు అత్యంత అవసరం. వేల కొలది చెరువులు, కుంటలు అన్యాక్రాంతం అయిపోతున్నప్పుడు నీటి నిల్వల సామర్థ్యాన్ని పెంచుకోవడం నేటి ఆవశ్యకత. జూరాల, రామన్‌పాడు ప్రాజెక్టులు; శ్రీశైలం, నాగార్జునసాగర్ డ్యాంలు లేకపోతే నేటి హైదరాబాదు నీటికి కటకట లాడాల్సిందే.


ఇక పరిమితికి మించిన అప్పులు చేయరాదు అంటూ ముక్తాయించారు వ్యాసకర్త. ఇది సరైనదే. కానీ కేరళ ప్రభుత్వ అంశంలో గణాంకాలు భిన్నంగా ఉన్నవి. ఎఫ్ఆర్‌బిఎం (ఫిజికల్ రెస్పాన్సిబిలిటీ బడ్జెట్ మేనేజ్‌మెంట్) నిబంధనలకు లోబడి అప్పులు చేసినట్టుగా పైన పేర్కొన్న నివేదికలు బహిర్గతపరిచాయి. అయినప్పటికీ రాష్ట్రాలపై అజమాయిషీ కేంద్రానికి ఉన్నది. కానీ సమాఖ్య విధానాలను సరిగా అమలుపరచడం లేదన్న వాదన మాత్రమే కాకుండా గత సంవత్సరం దక్షిణాది 4 రాష్ట్రాలన్నీ డిల్లీలో తమకు రావాల్సిన పన్నుల వాటా గురించి ఉమ్మడిగా ధర్నా చేయవలసిన దుస్థితి ఏర్పడింది. జీఎస్టీ అమల్లోకి తెచ్చిన తర్వాత సర్‌చార్జి లేదా సెస్సులు విధించే అంశాల సంఖ్య తగ్గినప్పటికీ వసూలు చేసే మొత్తం భారీగా పెరిగింది. ఈ ఒక్క ఏడాదిలోనే సర్‌చార్జి, సెస్‌ల రూపంలో రూ.5.5లక్షల కోట్లు వసూలు చేయబోతున్నట్టుగా కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావించడం జరిగింది. ఇలా వసూలు చేయబడిన సర్‌చార్జీ, సెస్సులలో రాష్ట్రాలకు ఎలాంటి వాటా ఉండకపోవడం ఒక దమన నీతియే! ఆదాయాల ప్రాతిపదిక కాకుండా జనాభా ప్రాతిపదికన ఆశ్రిత పక్షపాతంతో కొన్ని రాష్ట్రాలకు ప్రత్యేక నిధులు కేటాయించినప్పుడు మిగతా రాష్ట్రాల అభివృద్ధి కనీసం ఇతర మార్గాల ద్వారానైనా జరగాలిగా. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ అప్పుల ఊబిలో కూరుకుపోలేదని చెప్పడానికి వీల్లేదు. 2011–12లో రూ.45.17లక్షల కోట్ల అప్పు ఉంటే, 2018–19లో అది రూ.90.84లక్షల కోట్లకు చేరింది. అది కాస్త 2024–25 సంవత్సరానికి గాను 183.67 లక్షల కోట్లుగా ఉన్నది. పరిమితి ఉందో లేదో చూసుకోవాల్సినది కేంద్రం బాధ్యతనే. కానీ లోపభూయిష్టమైన పన్నుల విధానం వల్ల, ముఖ్యంగా పరోక్ష పన్నులను 60 శాతానికి మించి వసూలు చేస్తున్న ఏకైక దేశంగా ఉండడం వల్ల, ధనిక స్వాములు పన్ను రాయితీ పొందడం వల్ల దేశానికి ఈ రుణ భారం తడిసి మోపెడు అవుతుందన్న వాస్తవాన్ని మర్చిపోరాదు.

రాజ్యాన్ని ప్రశ్నించకుండా అది అమల్లోపెట్టే భావోద్వేగపు అంశాలకు ప్రభావితమైనప్పుడు దాన్ని స్తుతించడంలో భాగంగా ఆర్థిక మూలాలపై సైతం ప్రతిస్పందించడంలో వైఫల్యాలు జరుగుతాయి. అలాంటి వైఫల్యం డాక్టర్ జయప్రకాశ్ నారాయణ గారి వ్యాసంలో కనిపించింది. కచ్చితంగా వారు పునరాలోచిస్తారని భావించాలి.

● జి. తిరుపతయ్య

బహు ప్రక్రియల్లో బలమైన ముద్ర

తెలుగు సాహిత్యంలో నవలలు, కథలు, కవితలు, నాటకాలు, ప్రబంధాలు, గద్యాలు, పద్యాలు... ఇలా ఎన్నో రకాల సాహితీ ప్రక్రియల్లో రచనలు చేసిన కలం యోధుడు, కవి దిగ్గజుడు చందాల కేశవదాసు (1876–1956). తన రచనలలో భక్తి, నీతి తత్వాలను చక్కగా ప్రతిబింబించాడు. ఆయన సినీ గీత రచయిత, నటుడు, గాయకుడు, హరికథా కళాకారుడు, అష్టావధాని, శతావధానిగా కూడా ప్రసిద్ధుడు. కేశవదాసు 15 నాటకాలను రచించారు. వీటిలో 'కనకతార'ను (1906) తెలుగులో మొదటి నాటకంగా పరిగణిస్తారు. ఈ నాటకం భారతీయ నాటక సంప్రదాయాలను అనుసరిస్తూనే, సామాజిక సందేశాన్ని కూడా అందించింది. ఆయన రచించిన ఇతర ప్రముఖ నాటకాల్లో 'సత్యహరిశ్చంద్ర', 'విక్రమార్క విజయం' వంటివి ఉన్నాయి. కేశవదాస్‌కు తెలంగాణ హరికథ పితామహుడిగా కూడా పేరున్నది. తెలుగు సినిమాకు మొదటి పాటల రచయితగా కూడా ఆయన్ను పేర్కొంటారు. 1931లో విడుదలైన తొలి తెలుగు టాకీ చిత్రం 'భక్త ప్రహ్లాద'కు చందాల కేశవదాస్ రాసిన పాటలు చాలా ప్రాచుర్యం పొందాయి. వీటిలో 'భలే మంచి చౌక బేరము' అనే పాట ఎంతో ప్రసిద్ధి పొందింది. ఆ తరువాత 'సత్యహరిశ్చంద్ర' (1932) చిత్రానికి కూడా పాటలు రాశారు. 1933–1935 సంవత్సరాలలో తిరువూరు ప్రాంతంలో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని దేశభక్తి పాటలను రచించి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు. 1947–48 మధ్య జరిగిన హైదరాబాద్ స్వతంత్ర పోరాట ఉద్యమంలోనూ కీలక పాత్ర వహించారు. నాడు ఆయన ఇంటిపై రజాకార్లు దాడి చేసి ఆస్తి మొత్తాన్ని ధ్వంసం చేశారు, రచనలు సైతం కాల్చివేశారు. చందాల కేశవదాస్ రచనలలో భక్తి, నీతి, సామాజిక సందేశాలు ఎక్కువగా కనిపిస్తాయి. కేశవ దాస్ తర్వాత వచ్చిన ఎన్నో తరాలు రచయితలకు, నటులకు స్ఫూర్తిగా నిలిచారు. తెలుగు సాహిత్యంలో ఆయన ఒక యుగ పురుషుడు.




– పూసపాటి వేదాద్రి

(నేడు చందాల కేశవదాసు వర్ధంతి)

కేకేఆర్ స్మారక ప్రసంగం

ప్రముఖ సాహితీవేత్త, విమర్శకుడు ఆచార్య కె.కె. రంగనాథాచార్యుల (కేకేఆర్) తృతీయ వర్ధంతి సమావేశం రేపు సాయంత్రం ఆరు గంటలకు హైదరాబాద్ అబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరుగనున్నది. కేకేఆర్ స్మారకంగా 'ఆధునికత–ఆధునికానంతరత' అంశంపై తత్వశాస్త్ర ఆచార్యులు అడ్లూరి రఘురామరాజు ప్రసంగిస్తారు. అనంతరం 'కేకేఆర్ సాహితీ వ్యక్తిత్వం' (ప్రసంగ వ్యాసాలు) పుస్తకావిష్కరణ జరుగుతుంది.

– కుటుంబసభ్యులు, మిత్రులు







ఓటు వేసిన కలెక్టర్ దిల్లీరావు దంపతులు

ఓటర్లు చైతన్యవంతులై కదిలారు. చెరగని ఆత్మవిశ్వాసంతో ముందుకు నడిచారు. ఎండను సైతం లెక్కచేయక గంటల తరబడి క్యూల్లోనే నిలబడి ఓటు వేశారు. జిల్లావ్యాప్తంగా సోమవారం జరిగిన ఎన్నికల ప్రక్రియ ఓట్ల జాతరను తలపించింది. ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ రాత్రి వరకూ కొనసాగింది. ముదుసలుల నుంచి నవయువ ఓటర్ల వరకూ ప్రతి ఒక్కరి నుంచీ విశేష స్పందన లభించింది. దివ్యాంగులు సైతం మొక్కవోని దీక్షతో తరలివచ్చారు. ఎండ తాకిడికి చాలాచోట్ల ఇబ్బందులు ఎదురయ్యాయి. అయినా ఓటరన్న వెనుదిరగక పట్టుదలతో ఓటేసి ఐదేళ్ల భవితకు పునాది వేసుకుని, తుది తీర్పును ఈవీఎంలలో భద్రపరిచాడు.



కృష్ణలంకలోని పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు (ఇన్‌సెట్‌లో) వన్‌టౌన్‌లోని అన్నపూర్ణాదేవి స్కూల్ కేంద్రం వద్ద రద్దీ

ఓట్ల జాతర

జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- చెదురుమదురు ఘటనలు మినహా సజావుగానే..
- పోలింగ్ కేంద్రాలకు పోటెత్తిన ఓటర్లు
- జిల్లాలో 80 శాతం పైబడి పోలింగ్ నమోదు
- ఉదయం 7 గంటల నుంచి మొదలైన రద్దీ
- రాత్రి 6 గంటలకు క్యూలో ఉన్నవారికీ అనుమతి
- ఎండను సైతం లెక్క చేయకుండా పడిగాపులు
- ఓటరు తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తం
- భారీ భద్రతా ఏర్పాట్ల నడుమ స్ట్రాంగ్‌రూమ్‌లకు..





మొక్కవోని సంకల్పంతో..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జిల్లావ్యాప్తంగా సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. రాత్రి 10.30 గంటల వరకూ జిల్లాలో సుమారు 80 శాతం పోలింగ్ నమోదైందని సమాచారం. జిల్లావ్యాప్తంగా 17,04,077 మంది ఓటర్లు ఉండగా, రాత్రి 10.30 గంటల వరకు 13,50,000 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇక అత్యధికంగా జగ్గయ్యపేట నియోజకవర్గంలో 90 శాతం పోలింగ్ నమోదైందని ప్రాథమికంగా తేలగా, అత్యల్పంగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో 68.15 శాతం నమోదైందని తెలిసింది.

ఉదయం నుంచే రద్దీ

జిల్లావ్యాప్తంగా 1,874 కేంద్రాల్లో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా, ఓటర్లు పోటెత్తారు. పోలింగ్ కేంద్రాలు ఉదయం నుంచే కిటకిటలాడాయి. మధ్యాహ్నం ఒంటిగంట వరకు, తిరిగి సాయంత్రం 6 గంటల వరకూ రద్దీ కనిపించింది. అప్పటికి క్యూల్లో ఉన్న ఓటర్లందరికీ అవకాశం కల్పించారు. సాయంత్రం 5, 6 గంటల మధ్యలో ఓటర్లు అనుహ్యంగా పెరగడంతో పోలింగ్ ప్రక్రియ అర్ధరాత్రి దాటాక కూడా కొనసాగింది. కాగా, ఉదయం 5.30 గంటలకు పోలింగ్ స్టేషన్లలో మాక్ పోలింగ్ జరిగింది. చాలాచోట్ల ఈ ప్రక్రియ ఆలస్యమైంది. ఆ ప్రభావం పోలింగ్‌పై పడింది.

ఎండలో క్యూల్లోనే పడిగాపులు

ప్రవాసీయులు, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నుంచి తరలివచ్చిన ఐటీ, ఇతర టెకీ ఉద్యోగులతో పాటు పెద్ద ఎత్తున యువత కూడా పోలింగ్‌కు తరలివచ్చింది. ఇక ఉదయం సమయంలో వృద్ధులు భారీగా కదలివచ్చారు. ఎండను సైతం లెక్కచేయకుండా క్యూల్లో గంటల తరబడి వేచి ఉన్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని పటమట జడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో అత్తలూరి బాలసత్యనారాయణ అనే వందేళ్ల వయసు కలిగిన వృద్ధుడు ఉత్సాహంగా లైన్లో నిలబడి ఓటు వేసి ఆదర్శంగా నిలిచారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న 68 ఏళ్ల వయసు కలిగిన గోవాడ వెంకటేశ్వరరావు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని లోటస్ ల్యాండ్ మార్క్‌లోని పోలింగ్ స్టేషన్ 131లో తన ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇక ఈ ఎన్నికల్లో లంబాడీ మహిళలు పెద్ద సంఖ్యలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఈవీఎంలు మొరాయించాయన్న ఫిర్యాదులు ఎక్కడా రాలేదు. జిల్లా ఎన్నికల అధికారి దిల్లీరావు.. కంట్రోల్ రూమ్ నుంచి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా 878 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించగా, ఆయా కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ నిర్వహణతో పాటు వీడియోగ్రఫీ చేయించటం వల్ల ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాలేదు.

ఓటేసిన కలెక్టర్ కుటుంబం


జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దిల్లీరావు ఆయన సతీమణి, మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఈ.ప్రశాంతి, కలెక్టర్ మాతృమూర్తి సోమవారం ఓటుహక్కు వినియోగించుకున్నారు. సెంట్రల్ నియోజకవర్గంలోని రైల్వే ఫంక్షన్ హాల్లో వీరు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు.

అర్ధరాత్రి వరకు పోలింగ్

జిల్లావ్యాప్తంగా సోమవారం అర్ధరాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. తిరువూరు, జగ్గయ్యపేట, విజయవాడ తూర్పు, నందిగామ, మైలవరం నియోజకవర్గాల్లో చాలాచోట్ల ఈ పరిస్థితి కనిపించింది. 1,200 ఓట్లు కలిగిన పోలింగ్ కేంద్రంలో ఈ పరిస్థితి ఏర్పడింది. ఎండల కారణంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటర్లు పెద్దగా రాలేదు. సాయంత్రం వందలాది సంఖ్యలో రావడంతో రద్దీ ఒక్కసారిగా పెరిగింది. అర్ధరాత్రి వరకూ కొనసాగింది. ఇక సోమవారం సాయంత్రం 6 గంటల వరకూ తిరువూరులో 79.28, విజయవాడ పశ్చిమలో 68.30, విజయవాడ సెంట్రల్‌లో 68.15, విజయవాడ తూర్పులో 69.11, మైలవరంలో 78.00, నందిగామ 72.72, జగ్గయ్యపేట 78.20 శాతం పోలింగ్ నమోదైంది.



ఐసీయూ నుంచి నేరుగా పోలింగ్ కేంద్రానికి..



ఓటు వేసిన శతాధిక వృద్ధుడు



పటమటలోని ఫిష్ మార్కెట్ సెంటర్ వద్ద బారులు తీరిన ఓటర్లు

వైసీపీ వీరంగం

ప్రశాంతమైన పోలింగ్‌కు విఘాతం

- పెనమలూరులో జోగి రమేశ్ కుమారుల బీభత్సం
- టీడీపీ కార్యకర్తలపై దాడి.. ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఓటమి భయంతో గన్నవరంలో వంశీ పిల్ల చేష్టలు
- యార్లగడ్డ కారుకు అడ్డు.. దాడికి విఫలయత్నం

ప్రశాంతంగా జరగాల్సిన పోలింగ్‌ను రణరంగంలా మార్చారు. కయ్యానికి కాలు దువ్వి ఒకరినొకరు కొట్టుకునేలా చేశారు. అటు పోరంకిలో వైసీపీ అభ్యర్థి జోగి రమేశ్ కుమారులు సృష్టించిన బీభత్సం.. ఇటు గన్నవరంలో వైసీపీ అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ కవ్వింపు చర్యల కారణంగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



ముస్తాబాద-సూరంపల్లి రహదారిలో టీడీపీ-వైసీపీ నేతల గొడవ





ఉప్పులూరులో జోగి అనుచరుల హడావిడి (ఇన్‌సెట్‌లో) గాయపడిన కార్యకర్తకు బోడె ప్రసాద్ పరామర్శ

పోరంకిలో జోగి కుమారుల తెగింపు

పోరంకి ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద సోమవారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. మంత్రి జోగి రమేశ్, ఆయన కుమారులు.. మైలవరం, పెడన నియోజకవర్గాల నుంచి తీసుకొచ్చిన వారితో పోలింగ్ కేంద్రం వద్ద వీరవిహారం చేశారు. టీడీపీ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ సోదరుడు సురేశ్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బోడె మనోజ్‌పై దాడి చేశారు. దాడిలో టీడీపీ కార్యకర్తలు వీర్ల రాజేశ్, షరీఫ్ తీవ్రంగా గాయపడ్డారు. వీర్ల రాజేశ్‌కు తలపై బలమైన గాయాలయ్యాయి. ఈ వివాదం సద్దుమణిగిన కొద్దిసేపటికే జోగి రమేశ్ పెద్ద ఎత్తున తన అనుచరులతో పోలింగ్ కేంద్రంలోకి చొరబడ్డారు. కమ్మ కార్పొరేషన్ చైర్మన్ చక్రవర్తితో కలిసి దొంగ ఓట్లు వేయించే ప్రయత్నం చేయడంతో టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో ఘర్షణ పెరిగి పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. అదే సమయంలో జోగి తనయుడు రాజీవ్ పోలింగ్ సమయం ముగిసిందంటూ కుర్చీలు ఎత్తేసి హడావిడి చేయడంతో అతన్ని టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. తాడిగడప పోలింగ్ కేంద్రం వద్ద కూడా టీడీపీ, వైసీపీ నాయకుల నడుమ ఘర్షణ చోటుచేసుకుంది. ఉప్పులూరు పోలింగ్ స్టేషన్‌లోకి రాజీవ్ తన అనుచరులతో వెళ్లి హడావిడి చేయడంతో టీడీపీ నాయకులు వారిని అడ్డుకున్నారు.

గన్నవరంలో వంశీ కవ్వింపు

గన్నవరం నియోజకవర్గంలోనూ పలుచోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓటమి భయంతో వైసీపీ అభ్యర్థి వంశీ అసహనంతో ఊగిపోయారు. అనుచరులను రెచ్చగొట్టి ప్రత్యర్థులపైకి ఉసిగొల్పారు. పలుచోట్ల పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారు. విజయవాడ రూరల్ మండలం నున్న హైస్కూల్, గ్రామ సచివాలయాల వద్ద యార్లగడ్డ వెంకట్రావుపై వంశీ అనుచరులు దాడికి విఫలయత్నం చేశారు. వైసీపీకి చెందిన బొంతు సాంబిరెడ్డి ఏజెంట్‌గా వెళ్లి పోలింగ్ బూత్‌లోనే ఫ్యాన్‌కు ఓటు వేయాలని ప్రచారం చేస్తుండటంతో టీడీపీ ఏజెంట్లు యార్లగడ్డ దృష్టికి తీసుకెళ్లారు. యార్లగడ్డ అక్కడికి చేరుకుని పోలింగ్ బూత్‌లో ఉండి ప్రచారం చేయటం సరికాదని హెచ్చరించారు. దీంతో వైసీపీ శ్రేణులు ఒక్కసారిగా యార్లగడ్డపైకి వచ్చారు. అదే పోలింగ్ కేంద్రం వద్ద బయట కారులో ఉన్న వంశీ తన అనుచరులను రెచ్చగొట్టేలా డైరెక్షన్ ఇచ్చారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో సమాచారం అందుకున్న సీపీ రామకృష్ణ అక్కడికి చేరుకుని వంశీ, యార్లగడ్డను పంపేశారు. అక్కడి నుంచి బయటకు వచ్చిన వంశీ.. యార్లగడ్డను కవ్విస్తూ ఘర్షణ వాతావరణం సృష్టించేందుకు ప్రయత్నించారు. యార్లగడ్డ ముస్తాబాద-సూరంపల్లి గ్రామాల మధ్యకు రాగానే వంశీ తన కాన్వాయ్‌ను ఆయన కారుకు అడ్డం పెట్టారు. అప్పటికే అక్కడికి వైసీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకున్నారు. వంశీ కారులోనే ఉండి వారిని రెచ్చగొట్టారు. పోలీసులను సైతం లెక్క చేయలేదు. యార్లగడ్డ వెంకట్రావును, టీడీపీ శ్రేణులను బూతులు తిడుతూ.. 'రండి చూసుకుందాం' అంటూ రెచ్చిపోయారు. టీడీపీ నాయకులపైకి చెప్పులు, రాళ్లు విసిరారు.

- గన్నవరం మండలం కేసరపల్లి ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు ఇంటి వద్ద కూడా వంశీ హడావిడి చేశారు. ఆయన ఇంటి ముందుకు వెళ్లి కారు ఆపి, హారన్ కొట్టి భయపెట్టే ప్రయత్నం చేశారు. గ్రంథాలయం వద్ద ఉన్న పోలింగ్ కేంద్రానికి వచ్చిన వంశీ.. అక్కడ బసవరావును చూడగానే కారును రివర్స్‌లో స్పీడ్‌తో పోనిచ్చారు. నేరుగా బసవరావు ఇంటి ముందుకెళ్లి హారన్ మోగించారు. అక్కడికి వైసీపీ శ్రేణులు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు కూడా రావటంతో వంశీ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఓటమి భయంతోనే తన మీదకు దాడి చేసేందుకు వంశీ వచ్చారని పొట్లూరి బసవరావు తెలిపారు.
- ఉంగుటూరు మండలం తేలప్రోలులో యార్లగడ్డ వెంకట్రావు కారుపై వైసీపీ కార్యకర్తలు రాళ్ల దాడికి తెగబడ్డారు. తేలప్రోలు హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద యార్లగడ్డ కారుకు అడ్డంగా నిలబడి వంశీ కవ్వింపు చర్యలకు దిగారు. యార్లగడ్డ కారు అద్దాలను ధ్వంసం చేశారు. ఆయన వర్గీయులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసుల జోక్యంతో ఘర్షణ సద్దుమణిగింది.

చెదురుమదురు ఘటనలు

- తిరువూరు రూరల్ మండలం కోకిలంపాడులో వైసీపీ సర్పంచ్ భర్త గంగధారి కోటేశ్వరరావు టీడీపీ సానుభూతిపరుడిపై దాడి చేశారు. టీడీపీ కార్యకర్తలు ఆయన్ను వెంబడించారు.
- మైలవరంలో పలు పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ టోపీలు పెట్టుకుని కొందరు ప్రచారం చేశారు. వలంటీర్లు పోలింగ్ కేంద్రాల సమీపానికి చేరుకుని మరీ ప్రచారం చేయడం గమనార్హం.
- భవానీపురం 23 నుంచి 33 పోలింగ్ స్టేషన్ల వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. వైసీపీ, టీడీపీ నాయకులు ఘర్షణకు దిగారు.

ఓటర్లను తరలించండి

- వలంటీర్లకు వైసీపీ నేతల వాట్సాప్ సందేశాలు

విజయవాడ, మే 13 (ఆంధ్రజ్యోతి) : 'డియర్ వలంటీర్స్.. ఇప్పటి వరకు చాలా కష్టపడ్డారు. మరికొన్ని గంటలు కష్టపడండి. ఓటర్లను దగ్గరుండి తీసుకొచ్చి ఓట్లు వేయించండి. ఈ ఒక్కరోజే మనం కష్టపడితే మరోసారి మన ప్రభుత్వాన్ని కాపాడుకుంటాం.' ఇది సోమవారం వాట్సాప్‌ల్లో హల్‌చల్ చేసిన సందేశం. వైసీపీ నేతలు వలంటీర్లకు ఈ సందేశాలను పంపారు. జిల్లాలో వలంటీర్లతో వైసీపీ నేతలు రాజీనామాలు చేయించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత వారిని పార్టీ కార్యక్రమాల కోసం వినియోగించుకుంటున్నారు. ఇప్పుడు ఏకంగా ఎన్నికల్లో పోలింగ్ ఏజెంట్లుగా నియమించారు. ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు క్యూ కట్టారు. మధ్యాహ్న భోజన విరామం సమయంలో రద్దీ తగ్గింది. ఈ సమయంలోనే ఓట్లు వేయించాలని వైసీపీ నేతలు వలంటీర్లకు సందేశాలు పంపారు. ఈ సందేశాలను శిరసావహించిన వలంటీర్లు ఆటోల్లో ఓటర్లను తీసుకొచ్చి ఓట్లు వేయించారు. ఓటర్లకు సహాయకులుగా వచ్చినట్టుగా వ్యవహరించిన వలంటీర్లు పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో వెళ్లే వరకు ఫ్యాన్‌కు ఓటు వేయాలని బ్రెయిన్ వాష్ చేశారు.

'బంద్'రు రోడ్డు



నిత్యం ప్రయాణికులు, వాహనాలతో రద్దీగా కనిపించే నగరంలోని బందరురోడ్డు సోమవారం మధ్యాహ్నం ఇలా వెలవెలబోయింది. నగరవాసులంతా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరడంతో ప్రధాన రహదారులు జనం లేక బోసిపోయాయి.




గుడివాడలో ఓటు హక్కు వినిగియోగించుకున్న వెనిగండ్ల, కుటుంబసభ్యులు



ఐతవరంలో కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేసిన వసంత కృష్ణ ప్రసాద్



కుటుంబ సమేతంగా ఓటు వేసిన బొండా ఉమామహేశ్వరరావు



గొల్లపూడిలో ఓటు వేసిన మాజీ మంత్రి దేవినేని ఉమా



పోరంకి హైస్కూల్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన బోడె ప్రసాద్



ఓటు వేసిన కేశినేని శివనాథ్



మచిలీపట్నంలో ఓటువేసిన కొల్లు రవీంద్ర, కుటుంబసభ్యులు



పెడనలో ఓటు హక్కు వినియోగించుకున్న కాగిత కృష్ణప్రసాద్, కుటుంబ సభ్యులు



పొన్నవరంలో ఓటుహక్కు వినియోగించుకున్న సుజనా చౌదరి

అభ్యర్థులకు పరీక్షా కాలం


నిన్నటి వరకు ఎన్నికల ప్రచారంలో తలమునకలైన అభ్యర్థులు సోమవారం కుటుంబసభ్యులతో కలిసి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మండుటెండను సైతం లెక్కచేయక.. కొండలు, గుట్టలు ఎక్కి శ్రమతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. ప్రజా సేవ చేసుకునేందుకు తమకు అవకాశం కల్పించాలని రోడ్లపైకి వచ్చి ప్రజలతో మమేకమై అన్ని పనులూ చేశారు. ఓటరు తీర్పు కోసం మరిన్ని రోజులు వేచి వుండక తప్పదు.. అప్పటి వరకు కాస్త విశ్రాంతి లభించటంతో అభ్యర్థులు కుటుంబ సభ్యులతో గడిపేందుకు ఆసక్తి చూపుతున్నారు. మున్ముందు ఉత్కంఠ పరీక్షలో విజయం సాధించాలని కోరుకుంటున్నారు. - విజయవాడ



ఓటుహక్కు వినియోగించుకున్న వర్ల రామయ్య, కుటుంబసభ్యులు



ఓటు వేసేందుకు వెళుతున్న వల్లభనేని బాలశౌరి



జగ్గయ్యపేటలో ఓటు వేసిన పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం



అవనిగడ్డలో ఓటువేసిన మండలి బుద్ధప్రసాద్ దంపతులు



నందిగామలో ఓటుహక్కు వినియోగించుకున్న తంగిరాల సౌమ్య, కుటుంబసభ్యులు



జగ్గయ్యపేటలో 12వ వార్డు సచివాలయంలో ఓటు వేసి వస్తున్న తాతయ్య



మహాత్మాగాంధీ రోడ్డులో టీ తాగుతూ రిలాక్స్ అయిన తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, పక్కన మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న

ఎన్నికల టెన్షన్ నుంచి రిలాక్స్ అవుతూ..

గుణదల : ఎడతెరిపిలేని ఎన్నికల ప్రచారం.. పోలింగ్.. టెన్షన్ టెన్షన్.. వాతావరణం అనంతరం అభ్యర్థులు కాస్త రిలాక్స్ అయ్యారు. మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నతో కలిసి టీడీపీ తూర్పు అభ్యర్థి గద్దె రామ్మోహనరావు టీ తాగుతూ రిలాక్స్ అయ్యారు. సోమవారం సాయంత్రం గుణదల పెద్ద బోర్డింగ్ స్కూల్‌లో పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించి న అనంతరం మహాత్మాగాంధీ రోడ్డులో టీ తాగుతూ రిలాక్స్ అయ్యారు. పోలింగ్ సరళిపై బుద్దా వెంకన్నతో ముచ్చట్లు చెబుతూ కాస్త రిలాక్స్ అయ్యారు. ప్రజల్లో వైసీపీ ప్రభుత్వం పట్ల ఎంత వ్యతిరేకత ఉందనేది ఓటర్లు పోలింగ్ బూత్‌లకు తరలిరావడం చూస్తుంటేనే అర్థం అయిపోతుందన్నారు. పోలింగ్ బూత్‌లకు తరలిరావడం ఒక ఎత్తయితే క్యూలైన్లో గంటలతరబడి వేచి ఉండి ఓట్లు వేయడం మరో విశేషం అన్నారు.

ఓటు వినియోగించుకున్న ఎన్నారైలు, వృద్ధులు



హనుమాన్‌జంక్షన్‌రూరల్ : సార్వత్రిక ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాలతో పాటు విదేశాల్లోని ప్రవాసాంధ్రులు, యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. హైదరాబాద్‌లో కుమారుడి వద్ద ఉంటున్న ఓగిరాలకు చెందిన 95 సంవత్సరాలు మహిళ వేమూరి శకుంతల తన ఓటును వినియోగించుకనేందుకు వచ్చారు. కానుమోలు, బాపులపాడు, కొత్తపల్లి గ్రామాల్లోని ఎన్నారైలు, యువత తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ప్రజలు మార్పు కోరుతున్నారు

వసంత కృష్ణప్రసాద్



మైలవరంలో తొలి ఓటును కూటమికి వేసినట్టు సిరా చూపుతున్న యువతులు

ప్రజలు స్పష్టమైన మార్పు కోరుకుంటున్నారు.. ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దింపే సంకేతాలు కనిపిస్తున్నాయి.. గ్రామ గ్రామాన ఓటింగ్‌కు వస్తున్న స్పందనే అందుకు నిదర్శనం. ఓటింగ్ రోజు ప్రకృతి సహకరించడం శుభ పరిణామం. ఓటమి భయంతో వైసీపీ శ్రేణులు రెచ్చగొట్టినా సంయమనం పాటించి అప్రమత్తంగా ఉండాలి. - మైలవరం

పోలింగ్ సరళిని సమీక్షించిన నెట్టెం రఘురామ్

విద్యాధరపురం, మే 13 : ఎన్టీఆర్ జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళిపై విజయవాడ ఆటోనగర్‌లోని జిల్లా టీడీపీ కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ సమీక్షించారు. లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్, వాసం మునియ్య, పామర్తి కిషోర్ తదితరులతో కలిసి ఎప్పటికప్పుడు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో పోలింగ్‌ను స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్నారు. టీడీపీ నాయకులను సమన్వయం చేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని ఎక్కడా ఆవేశ, కావేశాలకు లోను కావొద్దని సూచనలు చేశారు.

టీడీపీ ఏజెంట్లపై వైసీపీ నేతల దాడి

వత్సవాయి, మే 13 : మండలంలోని డబ్బాగుపల్లి గ్రామంలో 138 నంబరు పోలింగ్‌లో ఇద్దరు టీడీపీ ఏజెంట్లపై వైసీపీ నాయకులు దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచారు. టీడీపీ ఏజెంట్లు కొత్తపల్లి నవీన్, పెంట్యాల శ్రీనివాసరావులు పోలింగ్ అనంతరం పిచ్చాపాటిగా మాట్లాడుతుంగా వైసీపీ నాయకులు, మాజీ సర్పంచ్ పండగ శ్రీనివాసరావు, కొలగాని కనకరావులు వైసీపీకి మెజార్టీ తగ్గుతుందనే నెపంతో గ్రామంలో మీ పెత్తనం ఏంటని విచక్షణారహితంగా దాడి చేశారు. సకాలంలో పోలీసులు స్పందించడంతో టీడీపీ ఏజెంట్లు ప్రాణాలతో భయపడ్డారు. సమగ్ర దర్యాప్తు చేసి దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధిత టీడీపీ ఏజెంట్లు డిమాండ్ చేశారు. గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

వైసీపీ మూకల కవ్వింపు చర్యలు

- వైసీపీ అభ్యర్థి వంశీ దుందుడుకుతో గన్నవరంలో ఉద్రిక్తత వాతావరణం
- టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావుపై దాడికి యత్నం
- చెప్పులు విసిరిన వైసీపీ శ్రేణులు.. పోలీసుల ప్రేక్షక పాత్ర

గన్నవరం, మే 13 : సాధారణ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా గన్నవరం నియోజకవర్గంలో పలు చోట్ల ఉద్రిక్తత నెలకొంది. వైసీపీ మూకలు ప్రతిపక్ష టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావుపై దాడికి యత్నించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీ డైరెక్షన్‌లో ఈ ఘటనలు చోటు చేసుకోగా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారన్న విమర్శలు వచ్చాయి. విజయవాడ రూరల్ మండలం నున్న హైస్కూల్, గ్రామ సచివాలయాల వద్ద వైసీపీకి చెందిన బొంతు సాంబిరెడ్డి ఏజెంట్‌గా వెళ్లి పోలింగ్ బూత్‌లోనే ఫ్యాన్‌కు ఓటు వేయాలని ప్రచారం చేయడాన్ని యార్లగడ్డ దృష్టికి టీడీపీ నాయకులు తీసుకువెళ్లారు. పోలింగ్ బూత్‌లో ప్రచారం చేయటం సరికాదని హెచ్చరించడంతో వైసీపీ శ్రేణులు రెచ్చిపోయారు. ఒక్కసారిగా యార్లగడ్డ మీదకు వచ్చారు. వంశీ బయట కారులో ఉండే డైరెక్షన్ చేయడంతో సీపీ పీహెచ్‌డి రామకృష్ణ వచ్చి వంశీని రామవరప్పాడు వైపునకు, యార్లగడ్డను సూరంపల్లి వైపునకు పంపించేశారు. అక్కడ నుంచి యార్లగడ్డను కవ్విస్తూ ఘర్షణ వాతావరణం సృష్టించేందుకు వంశీ ముస్తాబాద-సూరంపల్లి గ్రామాల మధ్యలో జాతీయ రహదారి ఫ్లైఓవర్ వద్దకు రాగానే ఆయన కారుకు వంశీ కాన్వాయ్ అడ్డు పెట్టారు. నున్న, ముస్తాబాద, సూరంపల్లి, కొండపావులూరు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వైసీపీ శ్రేణులు అక్కడకు చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వంశీ కారులోనే ఉండి వైసీపీ శ్రేణులు రెచ్చగొట్టడంతో పోలీసులను సైతం లెక్క చేయకుండా టీడీపీ శ్రేణులపైకి దూసుకువచ్చారు. యార్లగడ్డ వెంకట్రావును, టీడీపీ శ్రేణులను బూతులు తిడుతూ రండి చూసుకుందాం అంటూ రెచ్చిపోయారు. భయభ్రాంతులకు గురిచేశారు.

టీడీపీ శ్రేణులపై చెప్పులు, ఫాగ్‌లు..

టీడీపీ శ్రేణులపై వైసీపీ మూకలు దాడికి తెగబడుతూ చెప్పులు, ఫాగ్‌లను విసిరారు. అవి కొంత మంది పోలీసులకు కూడా తగిలాయి. దాంతో పోలీసులు పక్కకి తప్పుకున్నారు. టీడీపీ శ్రేణులు సంయనం పాటించటంతో ఘర్షణ వాతావరణం తగ్గింది.

● పోలీసులు అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారని, వైసీపీ నేతలు చెప్పినట్టుగా నడుచుకుంటున్నారని తీవ్ర విమర్శలు వచ్చాయి. వందలమంది వైసీపీ మూకలు ముందస్తు ప్రణాళికతో వెంకట్రావుపై దాడి చేసేందుకు వస్తే పోలీసులు అడ్డుకోలేకపోయారు. సీఐలు ప్రసాద్, పెద్దిరాజు సిబ్బందితో వచ్చినా వైసీపీ శ్రేణులను నిలవరించకుండా టీడీపీ వారిని వెళ్లిపోవాలని హెచ్చరించారు. చెప్పులు విసిరినా కనీసం నియంత్రించలేదు. రెండు వర్గాలు ఎటువాళ్లు అటు వెళ్లిపోయాక సంఘటన స్థలానికి డీఎస్పీ జయసూర్య పోలీసు బలగాలు రావటం గమనార్హం.



ముస్తాబాద-సూరంపల్లి గ్రామాల మధ్య జాతీయ రహదారి ఫ్లైఓవర్ వద్ద ఉద్రిక్త వాతావరణం

●గన్నవరం మండలం కేసరపల్లి ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు ఇంటి ముందుకు వెళ్లి కారు హారన్ కొట్టి భయభ్రాంతులకు గురిచేశారు. గ్రంథాలయం వద్ద ఉన్న పోలింగ్ కేంద్రానికి వచ్చిన వంశీ బసవరావును చూడగానే కారును రివర్స్‌గా స్పీడ్‌తో పోనిచ్చారు. వీరబాబుకు తృటిలో ప్రమాదం తప్పింది. ఓటమి భయంతోనే తన మీదకు దాడి చేసేందుకు వచ్చాడని పొట్లూరి బసవరావు తెలిపారు. ముస్తాబాదలో కూడా వైసీపీ శ్రేణులు రెచ్చిపోయి టీడీపీ షామియానాలు పడేశారు.

టీడీపీ-వైసీపీ కార్యకర్తల ఘర్షణ

- లాఠీఛార్జి.. పలువురికి గాయాలు

గంపలగూడెం : దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునే విషయంలో తహసీల్దార్ అభ్యంతరం తెలపడంతో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ తలెత్తింది. పోలీసులు లాఠీచార్జి చేయడంతో ఐదుగురు టీడీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. మండలంలోని సొబ్బాల పోలింగ్ కేంద్రంలో దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చారు. వారికి సంబంధించిన వారు పోలింగ్ కేంద్రంలోని వెళ్లేందుకు వీలు లేదని వైసీపీ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. తహసీల్దార్ కూడా అభ్యంతరం తెలపడంతో ఆమెకు టీడీపీ నాయకులు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. వైసీపీ వర్గీయులు టీడీపీ వర్గీయులతో ఘర్షణకు దిగడంతో పోలీసులు లాఠీ చార్జ్ చేశారు. ఐదుగురు టీడీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. అనంతరం తహసీల్దార్ వ్యవహార శైలిపై రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయగా ఆర్వో ఆదేశాల మేరకు వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న తహసీల్దార్‌ను బయటకు పంపేశారు.

గోడలు దూకి ఓటేసిన వైసీపీ సానుభూతిపరులు!

జి.కొండూరు: పోలింగ్ సమయం ముగియడంతో అధికారులు వెలగలేరు ఎంపీపీ పాఠశాలలోని పోలింగ్ బూత్ నంబరు 149కి చెందిన గేట్లు మూసేశారు. వైసీపీ సానుభూతిపరులు 10 మంది ప్రహరీ దూకి లోనికి ప్రవేశించి అధికారుల అండతో ఓట్లు వేశారు. కాని టీడీపీ సానుభూతిపరుల్ని మాత్రం పోలీసులు, అధికారులు వివక్షతో పోలింగ్ కేంద్రంలోకి అనుమతించలేదు. దీంతో ఈవిషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా వైసీపీ సానుభూతిపరుల్ని బయటకు తీసుకురాలేదు. వైసీపీ సానుభూతిపరులతో ఓట్లు వేయించిన అధికారులు టీడీపీ సానుభూతిపరుల్ని మాత్రం లోనికి అనుమంతిచలేదని టీడీపీ నాయకులు ఆందోళన చేశారు. అక్కడ స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు, అధికారులు అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపించారు.

పెనమలూరు నియోజకవర్గంలో..

- టీడీపీ వర్గీయులపై వైసీపీ గూండాల దాడి
- ఇద్దరికి గాయాలు, ఆసుపత్రికి తరలింపు
- పరస్పరం రాళ్లు రువ్వుకున్న ఇరు వర్గాలు
- జోగి అనుచరుల వీరంగం.. కింద పడిన సీఐ
- ఎస్పీ రాకతో సద్దుమణిగిన వివాదం



పోరంకిలో పోలింగ్ కేంద్రం వద్ద గుమికూడిన వైసీపీ మూకలు

పెనమలూరు, మే 13 : పెనమలూరు నియోజకవర్గం పోరంకి ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద సోమవారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మంత్రి జోగి రమేశ్, అతడి కుమారులు, మైలవరం, పెడన గూండాలు పోలింగ్ కేంద్రం వద్ద వీరవిహారం చేశాయి. టీడీపీ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ సోదరుడు బోడె సురేష్, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి బోడె మనోజ్‌లపై దాడికి పాల్పడ్డారు. టీడీపీ కార్యకర్తలు వీర్ల రాజేష్, షరీఫ్‌లకు గాయాలయ్యాయి. వారిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అనంతరం బోడె అనుచరులతో పోలింగ్ కేంద్రం సమీపంలో బైఠాయించగా.. జోగి రమేశ్ అనుచరులతో పోలింగ్ కేంద్రంలోకి చొరబడ్డారు. విషయం తెలుసుకొన్న టీడీపీ వర్గాలు పోలింగ్ కేంద్రంలోకి దూసుకెళ్లగా.. ఇరు వర్గాల మధ్య ఘర్షణతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సీఐ రామారావు ఉన్నతాధికారులకు పరిస్థితులను నివేదించడంతో ప్రత్యేక డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు బృందం పోలింగ్ కేంద్రానికి చేరుకుని పరిస్థితులను చక్కబెట్టే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకొన్న కృష్ణా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ పోలింగ్ కేంద్రానికి చేరుకొని అక్కడ ఉన్న వైసీపీ గూండాలను చెదరగొట్టారు. బోడె ప్రసాద్‌తో ఎస్పీ సంయమనం పాటించాలని సూచించారు. విచారణ జరిపి తగుచర్యలు తీసుకొంటామని ఎస్పీ తెలిపారు. ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొంటామని పేర్కొన్నారు. ఘటనను చిత్రీకరిస్తున్న విలేకరి వద్ద వైసీపీ కార్యకర్త సెల్‌ఫోన్ లాక్కొని అతడిపై దాడి చేశాడు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	150, 159, 170
చికెన్ విత్ స్కిన్	290
చికెన్ స్కిన్‌లెస్	300

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.40

పెరిగిన పోలింగ్ శాతం

సత్యనారాయణపురం, మే 13: ఓటు వేసేందుకు సోమవారం ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఏకేటీపీఎం పాఠశాల, ప్రశాంతి పాఠశాల, గొట్టుముక్కల రఘురామరాజు పాఠశాల, రైల్వేట్రాక్షన్ ఇన్‌స్టిట్యూట్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఓటు వేసేందుకు ఎండను సైతం లెక్క చేయకుండా ఓటర్లు వచ్చారు. ముఖ్యంగా మహిళలు తరలి వచ్చారు. గంటల తరబడి నిలబడి ఓటు వేశారు. దీంతో పోలింగ్ శాతం కూడా పెరిగింది. ఇది టీడీపీకి లాభం చేకుతుందని నాయకులు చెబుతున్నారు.



ఏకేటీపీఎం స్కూల్‌లో



ఓటింగ్ సరళి గురించి చర్చించుకుంటున్న వంగవీటి రాధ, యలమంచిలి రవి, పటమటలంక గర్ల్స్ హైస్కూల్‌లో బారులు తీరిన ఓటర్లు , వీల్‌చైర్‌లో వృద్ధులను తీసుకువస్తున్న కుటుంబసభ్యులు



ఉదయం 6.30కు పటమట నిర్మలా కాన్వెంట్‌లో బారులు తీరిన ఓటర్లు, మొగల్రాజపురం బోయపాటి శివరామ కృష్ణయ్య పాఠశాలలో కిక్కిరిసిన ఓటర్లు

ఉత్సాహంగా..

● తూర్పులో పోటెత్తిన ఓటర్లు
● 6.30 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు
● కేంద్రాల వద్ద సౌకర్యాల కల్పనలో అధికారుల విఫలం

పటమట, మే 13 : తూర్పు నియోజకవర్గంలో సోమవారం జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ బూత్‌ల వద్ద పోటెత్తారు. ముఖ్యంగా పెద్ద ఎత్తున యువ ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. కొత్త ఓటర్లు తమ ఓటు హక్కును ఉత్సాహంగా వినియోగించుకున్నారు. వయోభేదంగా లేకుండా వృద్ధులు, పురుషులు, మహిళలు రెండుగంటల సేపు క్యూలైన్లలో నిలబడి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. బీజేపీ, జనసేన కూటమి బలపర్చిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్ కుటుంబ సభ్యులతో కలిసి అశోక్‌నగర్‌లోని చైతన్య పాఠశాలలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. వైసీపీ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటి తీర్పు ఇవ్వడానికి ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని, అందుకు నిదర్శనమే ఉదయం 7 గంటలకు పోలింగ్ స్టేషన్ల వద్ద బారులు తీరిన జనమేనని గద్దె రామ్మోహన్ తెలిపారు. ప్రజలందరూ సహనంతో, సంయమనంతో ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

పటమట ఎస్ఎస్ఎం స్కూల్ వద్ద టీడీపీ స్టార్ క్యాంపెయినర్ వంగవీటి రాధ, మాజీ ఎమ్మెల్యే యలమంచిలి రవితో కలిసి ఓటింగ్ సరళిని పరిశీలించారు. తోట పుల్లమ్మ(87)ను వీల్‌చైర్‌లో ఆమె మనవళ్లు, మనవరాళ్లు ఓటు వేయడానికి ఎస్ఎస్ఎం స్కూల్‌కు తీసుకువెళ్లారు. పటమటలంక కొమ్మారెడ్డి సీతారామయ్య జడ్పీ హైస్కూల్‌లో వైసీపీ నాయకులు వల్లూరి ఈశ్వర్‌ప్రసాద్, టీడీపీ నాయకుడు కొమ్మా పూర్ణచంద్రరావు పరస్పరం దూషించుకోవడంతో ఇరువురిని పటమట పోలీసులు స్టేషన్‌కు తరలించారు. పటమటలంక బాలికల హైస్కూల్‌లో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నా ఓటు వేయాలని కుతూహలంతో ఓటు వేయడానికి పాగోలు సుగుణమ్మ(87) కుటుంబ సభ్యుల సహాయంతో వీల్‌చైర్‌లో వచ్చారు. సాయంత్రం 6 గంటల సమయానికి తూర్పులో మొత్తం మీద పోలింగ్ శాతం 70 శాతం దాటి ఉంటుందని పరిశీలకులు అభిప్రాయ పడుతున్నారు.



గోగుల రమేష్‌ను ఇంట్లోనే ఉంచిన పోలీసులు, ఓటరుకు కేంద్రాల వివరాలు చెబుతున్న పోలీసులు, లబ్బీపేటలో చంటి బిడ్డతో ఓటు వేసేందుకు వచ్చిన మహిళ

రాణిగారితోట, లబ్బీపేట, రామలింగేశ్వరనగర్: తూర్పు నియోజకవర్గ పరిధిలోని 15, 16, 17, 18, 19 డివిజన్లలో ప్రశాంతగా ఎన్నికలు జరిగాయి. ఎక్కడ ఎటువంటి వివాదాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల జరగడంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఉదయం 6.30గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ముఖ్యంగా బిడ్డ తల్లులు కూడా తమ చంటి బిడ్డలను ఎత్తుకుని వచ్చి మరీ ఓటు వేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు సౌకర్యాలు కల్పించడంలో మాత్రం అధికారులు సరైన చర్యలు తీసుకోలేదనే విమర్శలు వినిపించాయి. ఎండాకాలం కావడంతో కనీసం చల్లటి మంచినీరు ఏర్పాటు చేయలేదని ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. వృద్ధులు, వికలాంగుల కోసం కొన్ని పోలింగ్ బూత్‌ల వద్ద వీల్‌చైర్‌లు అవసరమైనన్ని ఏర్పాటు చేయకపోవడంపై కూడా విమర్శలు వినిపించాయి. రాణిగారితోటలోని ఆర్‌సీఎం స్కూల్ వద్ద టీడీపీ నాయకులు ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వల్ప ఆందోళనకు దిగారు. ఇక్కడ వైసీపీకి చెందిన వారు ఓటర్లను ప్రభావితం చేసే విధంగా కార్యక్రమాలు చేస్తున్నారని, వారికి పోలీసులు అండగా ఉంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే కేంద్రం వద్ద ఒక మహిళా ఓటరు తనకు ఓటర్ స్లిప్ వచ్చినా ఓటు లేకపోవడంతో చాలెంజింగ్ ఓటు వేసేందుకు అక్కడి పోలింగ్ సిబ్బందిని అడిగినా అందుకు సంబంధించిన పత్రాలు తమ వద్ద లేవని చెప్పడంతో ఆ మహిళ ఓటు వేయకుండానే వెళ్లిపోయింది. కొన్ని చోట్ల ఓటర్లు తాము ఓటు వేసే పోలింగ్ కేంద్రం ఎక్కడో తెలియక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాణిగారితోటలోని పలు కేంద్రాల వద్ద పోలీసులు వారికి సహాయం అందించారు. టీడీపీ నాయకుడు గోగుల రమేష్‌ను పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. ఈ ప్రాంతంలోని పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితిని తెలుసుకునేందుకు వచ్చిన ఆయనను పోలీసులు అడ్డుకుని అక్కడ ఒక ఇంట్లో ఉంచి కానిస్టేబుల్‌ను ఉంచారు. చివరకు పోలీసుల ఒత్తిడి భరించలేక రమేష్ ఇంటికి వెళ్లిపోయారు. పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ పోలీసులు తమను అనేక ఇబ్బందులు పెట్టారని, వైసీపీ వారికి అనుకూలంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు.

సాయంత్రం ఆరున్నర తరవాత కూడా క్యూలు

మొగల్రాజపురం: ఓటర్లు ఉదయం ఆరుగంటల నుంచే పోలింగ్ కేంద్రాలకు భారీగా చేరుకున్నారు. పటమట నిర్మలా కాన్వెంట్‌లో ఉదయం ఆరుగంటలకు భారీగా ఓటర్లు వచ్చారు. పోలింగ్ బూత్ నెంబరు 257లో ఈవీఎంలు మొరాయించడంతో గంట ఆలస్యంగా ఓటింగ్ ప్రారంభమైంది. పీబీ సిద్ధార్థ కళాశాల బూత్‌లలో జనాలు బారులు తీరారు. మొగల్రాజపురం జమ్మిచెట్టు వద్ద ఉన్న బోయపాటి పాఠశాలలో ఉదయం ఆరున్నకే ఇసుకేస్తే రాలనంత మందితో నిండిపోయింది. రావిచెట్టు సెంటర్‌లో కూడా ఇదే పరిస్థితి. పీబీ సిద్ధార్థలో 114 బూత్‌లో ఒక మహిళ తన ఓటు కార్డుతో ఓటేయడానికి వస్తే అక్కడ అధికారి ఓటు లేదని చెప్పారు. కార్పొరేషన్ ఓట్ల సమయంలో ఓటేసిన చోటకు వెళ్లమంటే అక్కడికి వెళ్లి మరల వచ్చింది. సదరు అధికారి ఆ మహిళతో దురుసుగా ప్రవర్తించి బయటకు గెంటినంత పని చేశారు. ఆ మహిళ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎలక్షన్ కమిషన్ ఏర్పాటు చేసిన వీడియో గ్రాఫర్ ఆమె ఆగ్రహం తీరును మొత్తం వీడియో తీశాడు. బోయపాటి శివరామ కృష్ణయ్య పాఠశాలలో టీడీపీ, వైసీపీ నాయకుల హడావుడి కనిపించింది. సాయంత్రం ఆరుగంటలకు గేటు మూసేసే సమయంలో వైసీపీ ఏజంటు భార్య ఆధార్ కార్డు కోసం బయటకు వెళ్లి లోపలికి వచ్చే సమయంలో గేటు మూసేయడంతో కాసేపు వాగ్వివాదం చోటు చేసుకుంది. ఆరవ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ వియ్యపు అమర్‌నాథ్ వచ్చి మాట్లాడినా బూత్ అధికారి, ఎస్ఐ అంగీకరించలేదు. ఐదు గంటలు దాటిన తరువాత ఖాళీ అయిన బూత్‌లలో దొంగ ఓట్లు వేస్తున్నారని పలు చోట్ల నాయకులకు ఫోన్‌లు రావడంతో వారు హుటాహుటిన పోలింగ్ కేంద్రాలకు వచ్చి తనిఖీలు చేశారు.

ఉప్పెనలా తరలిన ఓటర్లు

● యువ ఓటర్లలో చైతన్యం, ఉత్సాహం
● మధ్యాహ్నం నుంచి మందకొడిగా సాగిన పోలింగ్

గవర్నర్‌పేట, మే 13: పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీకి ఏకకాలంలో జరిగిన ఎన్నికలు సెంట్రల్ నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం నుంచి ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్దకు భారీగా తరలివచ్చారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఉదయం పోలింగ్ సమయం ప్రారంభం కాకముందే ఓటర్లు తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకున్నారు. 12 గంటల వరకు ఓటర్లు ఉప్పెనలా ఓట్లు వేసేందుకు తరలివచ్చారు. అక్కడ నుంచి పోలింగ్ మందకొడిగా సాగిందనే చెప్పాలి. సెంట్రల్ పరిధిలోని 23, 24, 25 డివిజన్లలో ఓట్లు వేసేందుకు స్థానికులు పెద్దఎత్తున తరలివచ్చారు. 23వ డివిజన్ పరిధిలో సీవీఆర్ మున్సిపల్ స్కూల్, కర్నాటి రామమోహనరావు మున్సిపల్ స్కూల్, సప్తగిరి కళాశాల, 24వ డివిజన్‌లోని బిషప్ అజరయ్య ఉన్నత పాఠశాల, 25వ డివిజన్‌లోని అబ్దుల్ కలాం ఉర్దూ మీడియం మున్సిపల్ పాఠశాల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐక్య భవన్, వాణీ ఇంగ్లీషు మీడియం, కాజ వెంకటేశ్వరరావు మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలల్లో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. పటిష్ఠమైన భద్రత మధ్య అధికారులు పోలింగ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉదయం భారీగా సాగిన పోలింగ్ మధ్యాహ్నం నుంచి మందకొడిగా సాగింది. ఉదయం 7 గంటల నుంచి 7.30 గంటల వరకు శ్రీ కర్నాటి రామమోహనరావు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఈవీఎంలు మోరాయించడంతో పోలింగ్ ఆలస్యమైంది. విషయం తెలుసుకున్న టీడీపీ కూటమి అభ్యర్థి బొండా ఉమామహేశ్వర రావు పాఠశాలకు చేరుకుని ఈవీఎంలు లైన్‌లోకి వచ్చేవరకు ఉండి వెళ్లారు. పటిష్ఠమైన బందోబస్తును అధికారులు ఏర్పాటు చేయడంతో పోలింగ్ సజావుగా సాగింది. 23వ డివిజన్‌లో మధ్యాహ్నం 1 గంట సమయానికే 55 శాతం పైగా ఓట్లు పోల్ అయ్యాయి.



సీవీఆర్ స్కూల్ బూత్‌లో ఓటేసేందుకు వస్తున్న వృద్ధురాలు, సిబ్బంది బందోబస్తు



గుణదల పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు

మొరాయించిన ఈవీఎంలు

మాచవరం : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో గట్టి పోలీసు బందోబస్తు నడుమ సోమవారం జరిగాయి. తూర్పు నియోజకవర్గంలోని 2, 6వ డివిజన్ల పరిధిలో ఓటర్లు ఓటును వినియోగించుకోవడం జరిగింది. పోలింగ్ కేంద్రాల వద్ద నగర పోలీసులతో పాటు ప్రత్యేక దళాలను ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

ఉదయం 9.30 గంటలకు బెల్లం దుర్గారావు మున్సిపల్ హైస్కూల్‌లోని పోలింగ్ బూత్‌లో ఈవీఎంలు మొరాయించాయి. అలాగే గుణదలలోని పోలింగ్ కేంద్రంలో కూడా ఈవీఎంలు మొరాయించాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు ఈవీఎంలు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవడంతో ఓటర్లు గాలిపీల్చుకున్నారు.



పొట్టి శ్రీరాములు హైస్కూల్ ఆవరణలో ఉదయం 8 గంటలకు బారులు తీరిన ఓటర్లు

ఓటర్లలో చైతన్యం...కసిగా తరలివచ్చారు

కృష్ణలంక, మే 13 : సాధారణ ఎన్నికల్లో ఓటింగ్‌లో పాల్గొనేందుకు సోమవారం ఉదయం 8 గంటల నుంచే కృష్ణలంక పొట్టి శ్రీరాములు హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు బారులు తీరారు. గత ఎన్నికల సమయంలో వున్నటువంటి 'కసి' ఈసారి పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్లలో కనబడిందని చెప్పవచ్చు. వృద్ధులు, యువత, మహిళలు, పురుషులు అనే తేడా లేకుండా ఉదయం నుంచే పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు బారులు తీరారు. గత అసెంబ్లీ ఎన్నికలలో కూడా ఇదే విధమైన కసి ఓటర్లలో కనబడింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో పోలింగ్ అర్ధరాత్రి వరకు కొనసాగడం, ఆ సమయంలో కూడా మహిళలు, వృద్ధులు బారులు తీరడంతో అప్పుడు అధికారంలో వున్న ప్రభుత్వం డ్వాక్రా మహిళల రుణమాఫీ వంటి పథకాలు అందించడం వలన మహిళలు పెద్దసంఖ్యలో వచ్చి తమకే ఓటు వేస్తున్నారని అప్పట్లో టీడీపీ భావించింది. తీరా ఫలితాలు వచ్చాక మహిళలు అర్ధరాత్రి ప్రేమతో ఓటింగ్‌లో పాల్గొనలేదని, కసితో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారని ఫలితాలు వచ్చిన తర్వాత కానీ అధికార పార్టీకి అప్పట్లో అర్థంకాలేదు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి కనబడుతోంది. పథకాల వల్ల ఓటర్లు మనవైపే మొగ్గుచూపుతారని వైసీపీ భావిస్తున్నప్పటికీ, సోమవారం ఓటర్లలో కనబడిన 'కసి' వేరే విధంగా వున్నట్లు అర్థమవుతోంది. ఏదిఏమైనా జూన్ 4న వెలువడే ఫలితాల ద్వారా ఓటర్లు చూపిన 'కసి' ఎటువంటిదో అర్థమవుతుంది.



కార్లు, ఆటోల్లో తరలివస్తున్న ఓటర్లు

మొరాయించిన ఈవీఎంలు ..ఇబ్బందిపడ్డ ఓటర్లు



కొత్తపేట అన్నపూర్ణాదేవి స్కూల్ వద్ద బారులు తీరిన మహిళలు

చిట్టినగర్, మే 13: చిట్టినగర్, కొత్తపేట ప్రాంతాల్లో సార్వత్రిక ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. పోలింగ్ ఉదయం ఏడు గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా అరగంట ముందుగానే ఓటర్లు కొన్ని ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌ల వద్ద ఓటు వేసేందుకు బారులు తీరారు. కొన్ని ప్రాంతాల్లో పోలింగ్ ప్రారంభమైన వెంటనే ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వెంటనే అధికారులు ఈవీఎంలకు మరమ్మతులు చేయించారు. రాకేష్ పబ్లిక్ స్కూల్లో రెండు పోలింగ్ కేంద్రాల్లో, శారదా హైస్కూల్లో, మోటూరి హనుమంతురావు స్కూల్లో సుమారు అర గంట పోలింగ్ ఆలస్యంగా మొదలవటంతో ఓటర్లు నానా అవస్థలు పడ్డారు. మండుటెండలో సైతం ఓటర్లు అధిక శాతం ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు.

● పశ్చిమంలో ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లకు అక్కడ కనీసం మౌలిక సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలింగ్ కేంద్రాల వద్ద మంచినీటితోపాటు ఎండలకు టెంట్‌లు సక్రమంగా ఏర్పాటు చేయకపోవడంతో ఓటర్లు మండుటెండలో ఉక్కపోతతో పడరాని పాట్లు పడ్డారు. కొన్నిచోట్ల టెంట్‌లు ఏర్పాటు చేసినా అక్కడ ఉక్కపోతతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కనీసం టెంట్‌ల్లో ఒక్కచోట కూడా గాలికి ఫ్యాన్‌లు ఏర్పాటు చేయలేదు. వృద్ధులు, చిన్న పిల్లల తల్లులు గాలి లేక ఇబ్బందులు పడ్డారు. ఏ పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు సక్రమంగా లేదని ఓటర్లు మండిపడుతున్నారు.

ఊర్మిళానగర్, లేబర్ కాలనీల్లో

టెంట్లు లేక ఓటర్లు ఇక్కట్లు

భవానీపురం : ఊర్మిళానగర్‌లోని సిద్దం కృష్ణారెడ్డి ఎలిమెంటరీ స్కూల్లో 3 పోలింగ్ కేంద్రాలు, ఆర్టీసీ వర్క్‌షాపు ట్రైనింగ్ సెంటర్, లేబర్ కాలనీల్లోని 6 పోలింగ్‌కేంద్రాల వద్ద ఎండలో ఓటర్ల మగ్గిపోయారు. అరకొరగా పోలింగ్ కేంద్రాల వద్ద చిన్న టెంట్లు వేయడంతో ఓటర్లు అష్ట కష్టాలు పడ్డారు. దీనికి తోడు మంచినీరు టిన్‌లు కూడా పెద్దగా ఏర్పాటు లేకపోగా, తాగేందుకు ప్లాస్టిక్ గ్లాసుల్లేక దాహార్తితో ఓటర్లు అలమటించారు. సాయంత్రం 4 గంటల వరకు ఎండలో అష్టకష్టాలు పడుతూనే నిల్చొని ఓటేశారు. మాలెంపాటి భాస్కరరావు స్కూల్లో 39, 44 డివిజన్ల పోలింగ్ కేంద్రాల వద్ద మాక్ పోలింగ్ ఆలస్యం కావడంతో 7.20 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది.

వికలాంగులు, వృద్ధులకు అవకాశం

పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించిన వెంటనే వృద్ధులు, వికలాంగులకు ఓటు వేసే అవకాశం కల్పించారు. ఎన్‌సీసీ కేడెట్లు కూడా వృద్ధులకు, వికలాంగులకు సాయమందించారు. 44వ డివిజన్ కొండబడి వద్ద వికలాంగుడు రవి అనే వ్యక్తి ఓటేశాక 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ తనను ముందుగానే లోనికి అనుమతించారని, చాలా ప్రశాంతంగా ఓటేశానని ఆనందం వ్యక్తం చేశాడు.



ఊర్మిళానగర్‌లో సిద్దం కృష్ణారెడ్డి స్కూల్లో ఎండలోనే ఓటర్లు, కొండబడి వద్ద ఓటేసిన దివ్యాంగుడు రవి

కూటమి గెలుపు కోరుతూ

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



దుర్గమ్మవారికి పూజలు చేసిన తెలుగు మహిళా నాయకులు

వన్‌టౌన్, మే 13: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులు విజయం సాధించాలని కోరుతూ సోమవారం విజయవాడ పశ్చిమ నియోజవర్గం తెలుగు మహిళా నాయకురాలు సుకాశి సరిత ఆధ్వర్యంలో దుర్గగుడి టోల్‌గేట్ వద్ద ఉన్న కామధేను అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద 101 టెంకాయలను కొట్టారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తు, రాష్ట్రాభివృద్ధికై ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని), పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరిలు విజయం సాధించాలని దుర్గమ్మను వేడుకున్నట్లు తెలిపారు. తెలుగు మహిళా నాయకురాళ్లు షేక్ నసీమా, లంకా బుజ్జి, షకీలా, వరలక్ష్మి, అపర్ణ, పార్వతి, మరియమ్మ, మల్లి తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఎన్నికలు

పాతరాజరాజేశ్వరి పేట, మే 13 : నగరంలోని పలు డివిజన్లలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. స్థానిక 34, 35, 55, 56 డివిజన్లలో ఎన్నికలు ఎటువంటి గందరగోళ పరిస్థితులు, ఉద్రిక్తతలకు గురికాకుండా ప్రశాంతంగా ముగిశాయి. మహిళలు, యువత ఈ సారి ఎన్నికలకు ఉత్సాహం చూపి, అధిక సంఖ్యలో తమ ఓటును వినియోగించుకున్నారు. ఇక వృద్ధులు, వికలాంగులు సైతం వెనుకడుగు వేయకుండా తమ అమూల్యమైన ఓటును ఉపయోగించారు. పోలింగ్ కేంద్రాల వద్ద చిన్నపాటి సమస్యలు ఎదురైనా ఎన్నికలు మాత్రం ప్రశాంతంగా ముగిశాయి. ● సోమవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. 11 నుంచి 3 గంటల వరకు పోలింగ్ కేంద్రాలు ఖాళీగా దర్శనమిచ్చాయి. 4నుంచి ఓటర్లు తిరిగి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. 5 నుంచి 6 గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరారు.

లోపించిన వసతులు

ఎండ తీవ్రత దృష్ట్యా అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్‌ల సరిగా ఏర్పాటు చేయకపోవడంతో ఓటర్లు ఎండకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కంసాలిపేటలోని తమ్మిన పోతరాజు నగరపాలకసంస్థ స్కూలు వద్ద సరైన ప్రాంతంలో టెంట్‌ను ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. బాప్టిస్ట్‌పాలెం నగరపాలకసంస్థ స్కూలు వద్ద టెంట్ ఏర్పాటు చేయలేదు.

విజయవాడలో ఓటేసిన 'దేవర' సుధాకర్

గాంధీనగర్, మే 13: ప్రముఖ ఫిలిం డిస్ట్రిబ్యూటర్, ఎన్.టి.ఆర్, కొరటాల కాంబినేషన్‌లో యువ సుధా ఆర్ట్స్ పతాకంపై 'దేవర' చిత్రాన్ని నిర్మిస్తున్న మిక్కిలినేని సుధాకర్ సోమవారం విజయవాడ పీబీ సిద్ధార్థ కాలేజీ ఆవరణలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.



దిక్సూచి

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఏటా ప్రపంచవ్యాప్తంగా పది బిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలు వాతావరణంలోకి విడుదలవుతున్నాయని అంచనా. దానిలో 30 శాతం అంటే మూడు బిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలనే మహాసముద్రాలు శోషించుకుంటాయి. అందువల్ల సముద్ర పర్యావరణాన్ని అతిపెద్ద కార్బన్ సింక్‌గా చెప్పుకుంటాం. భూ వాతావరణాన్ని రక్షిస్తున్న సముద్ర పర్యావరణానికి చేపలవేట, సముద్రాంతర్గత ఖనిజోద్గ్రహణం వంటి మానవ కార్యకలాపాలు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయి.



మహా సముద్రాల్లో జీవవైవిధ్య పరిరక్షణ

హై సీస్ ప్రాంతం అంటే సముద్ర తీర దేశాల ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్ పరిధి(తీరం నుంచి 200 నాటికల్ మైళ్ల)ని దాటి విస్తరించిన 'జాతీయ పరిధుల వెలుపలి సముద్ర ప్రాంతం'. దీని సంరక్షణకు సరైన అంతర్జాతీయ చట్టాలు అమలులో లేవు. భూగోళంలో దాదాపు సగం విస్తీర్ణంలో ఉన్న హైసీస్(జాతీయ పరిధుల వెలుపలి సముద్రం ప్రాంతం)లో కేవలం 1.44% మాత్రమే పరిరక్షిస్తున్నారని యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ద లా ఆఫ్ సీస్(యూఎన్‌సీఎల్‌ఓఎస్) నివేదిక తెలుపుతోంది. అంటే 99 శాతం హైసీస్ ప్రాంతం ఎటువంటి పరిరక్షణకు నోచుకోవడం లేదు.

వాతావరణ మార్పులను సమర్థవంతంగా ఎదుర్కొని సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలంటే భూగోళంలో సగభాగంగా ఉన్న హైసీస్ ప్రాంతాన్ని, అక్కడి సముద్రాంతర్గత పర్యావరణాన్ని రక్షించాల్సిన ఆవశ్యకత ఉంది. అదీ కాక సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో 14వది అయిన 'లైఫ్ బిలో వాటర్' అనే ప్రత్యేక లక్ష్యం, సముద్రాంతర్గత పర్యావరణ రక్షణకు సంబంధించి ప్రత్యేకంగా తీర్మానించింది. కాబట్టి సముద్రాంతర్గత పర్యావరణ పరిరక్షణకు ఒక అంతర్జాతీయ ఒడంబడిక అవసరం ఏర్పడింది. ఈ దిశగా చర్యలు చేపట్టడానికి 2022 డిసెంబరులో కెనడాలోని మాంట్రియెల్ నగరంలో కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్(సీఓపీ)-15లో 'కున్‌మింగ్ - మాంట్రియెల్ గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేమ్ వర్క్'ను ఆమోదించారు. 2030 నాటికల్లా భూమి, సముద్ర పర్యావరణ ప్రాంతంలో 30 శాతాన్ని పరిరక్షించాలని ఈ ఫ్రేమ్‌వర్క్ నిర్దేశిస్తుంది. దీనినే '30x30 వ్యూహం'అని కూడా అంటారు. ఈ వ్యూహం అమలు కోసం అన్ని సముద్రతీర దేశాల మద్దతు కూడగట్టడానికి 'యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ద లా ఆఫ్ ద సీ' ప్రాధికారితన 'ట్రీటీ ఆఫ్ హైసీస్/బయోలాజికల్ డైవర్సిటీ ఇన్ ఏరియాస్ బియాండ్ నేషనల్ జ్యూరిస్‌డిక్షన్(బీబీఎన్‌జే) ట్రీటీని 2023 మార్చిలో ప్రవేశపెట్టారు. ఈ ఒప్పందంపై అంగీకార సంతకాలు చేయడానికి తీర దేశాలన్నింటికీ 2023 సెప్టెంబరు 20 నుంచి 2025 సెప్టెంబరు 20 వరకు గడువు నిర్దేశించారు. కనీసం 60 దేశాలు ఈ ఒప్పందంపై సంతకం చేసి, దానిని ర్యాటిఫై చేసినప్పుడే ఇది అమలులోకి వస్తుంది. అంటే సంతకాలు చేసిన దేశాలు, తమ దేశంలోని సంవిధానాలకు అనుగుణంగా ఆ ఒప్పందానికి చట్టపరమైన ధృవీకరణను ప్రకటించాల్సి ఉంటుంది.(ఉదాహరణకు పార్లమెంటు ఆమోదం). ఈవిధంగా 88 దేశాలు ఇంతవరకూ బీబీఎన్‌జే ఒప్పందంపై సంతకాలు చేశాయి. రెండు దేశాలు(చిలీ, పలావూ) మాత్రమే ర్యాటిఫై(చట్టపర ధృవీకరణ) చేశాయి. భారత్ సహా మిగతా 86 దేశాలు ర్యాటిఫై చేయాల్సి ఉంది. గడువు కాలం సమీపిస్తుండటంతో సంతకాలు చేసిన దేశాలను ర్యాటిఫై చేసే దిశగా ప్రోత్సహించడానికి 2024 మార్చి 7న బెల్జియంలో 'ద బ్లూ లీడర్స్ హై-లెవల్ ఈవెంట్ ఆన్ బయోడైవర్సిటీ బియాండ్ నేషనల్ జూరిస్‌డిక్షన్' సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీబీఎన్‌జే ఒప్పందాన్ని 2025లో జరగనున్న 'ద యునైటెడ్ నేషన్స్ ఓషన్ కాన్ఫరెన్స్' వేదికగా అమలులోకి తేవడానికి కృషిచేయాలని పిలుపునిచ్చింది.

బీబీఎన్‌జే ద్వారా ఆశిస్తున్న రంగాల వారీ ప్రయోజనాలు

1. ఆర్థిక ప్రయోజనాలు: దేశ తీరప్రాంతాల్లో మత్స్య సంపద వృద్ధి, సముద్ర ఆధారిత ఉద్యోగ, ఆదాయ కల్పన పెంపు, నిజమైన సుస్థిర నీలి ఆర్థికవ్యవస్థ సాధన.
2. సామాజిక ప్రయోజనాలు: భావితరాల సంక్షేమాన్ని పెంపొందించడం, అంతర్జాతీయ సముద్ర సమానత్వ సూత్రాలను ఆచరణలోకి తేవడం, సముద్ర వనరుల నుంచి అత్యధిక ప్రయోజనాలు పొందేవిధంగా అధ్యయన, నిర్వహణపరమైన కౌశలాల పెంపు.
3. దౌత్యపర ప్రయోజనాలు: దేశాల మధ్య బహుపాక్షిక సహకారం, పరిపాలనాపరమైన సహాయ సహకారాలను బలపర్చడం, అంతర్జాతీయ నిర్ణయాధికారాల పెంపొందింపు, సముద్ర వాతావరణ పునరుద్ధరణ.

బీబీఎన్‌జే ఒప్పందానికి ఎదురవుతున్న సమస్యలు

1. 30 శాతం ప్రపంచ సముద్ర ప్రాంతాన్ని 2030 వరకు పరిరక్షించాలన్న ధ్యేయం ప్రాతిపదికగా ఏర్పడిన ఈ ఒప్పందం అమలుకు నోచుకోవాలంటే కనీసం 60 దేశాలు ర్యాటిఫై చేయాల్సి ఉంది. కానీ ఇంతవరకూ రెండు దేశాలే ర్యాటిఫై చేశాయి. వచ్చే ఏడాది సెప్టెంబరు 20 నాటికల్లా మిగతా 58 దేశాలు ర్యాటిఫై చేయడం సందేహాస్పదమే. ఒకవేళ ర్యాటిఫై చేసినప్పటికీ మరో అయిదేళ్లలో 30 శాతం సముద్ర ప్రాంతాన్ని పరిరక్షించడానికి యుద్ధప్రాతిపదిక చర్యలు అవసరం. ఇంకా నిధుల వితరణ, వ్యవస్థల నిర్మాణం, చట్టం అమలు వ్యవస్థల పరంగా ఒక కొలిక్కిరాని నిర్ణయాలు ఏమేరకు లక్ష్యసాధనకు దారిచూపగలవన్నది సందేహాస్పదం.
2. పర్యావరణ ప్రభావ అంచనాలు హైసీస్ ప్రాంతాల్లో చేయడం సాంకేతికంగా చాలా క్లిష్టమైన అంశం. పలు టెక్నిక్స్ పరంగా కూడా ఇంకా శాస్త్రీయ, సాంకేతిక అధ్యయనాలు జరగాల్సి ఉంది. ఈ అధ్యయనాలకు భారీస్థాయిలో నిధుల కేటాయింపు కూడా అవసరం.
3. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సముద్ర జీవవనరుల పంపిణీని ఏవిధంగా చేయాలనే అంశం అత్యంత క్లిష్టమైనది, చాకచక్యంగా నిర్వహించాల్సిన అంశం.

ఇన్ని సవాళ్లు ఉన్న నేపథ్యంలో, మరో ఏడాదిన్నర కాలంలో బీబీఎన్‌జే ఒప్పందం పట్టాలెక్కడం కష్టసాధ్యమైనప్పటికీ, సుతారమూ సాధించి తీరాల్సిన ఆవశ్యకత ప్రపంచ తీర దేశాలకు ఉంది. ఎందుకంటే, వాతావరణ మార్పుల వల్ల తలెత్తే విపత్తులను ఎక్కువగా ఎదుర్కొనేవి ఆ దేశాలే కాబట్టి. తమ తీర ప్రాంతాలు మునిగిపోకూడదన్నా, తుపానులు రాకుండా ఉండాలన్నా, మత్స్యసంపద తరిగిపోకూడదన్నా భూమిపై అత్యధిక విస్తీర్ణంలో కార్బన్ సింక్ రూపంలో ఆవరించి ఉన్న సముద్ర పర్యావరణాన్ని పరిరక్షించుకోకతప్పదు. దీనికి బీబీఎన్‌జే ఒప్పందం ఒక చక్కని చుక్కానిగా ఉపయోగపడుతుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

బీబీఎన్‌జే ఒప్పందం-లక్ష్యాలు

1. మొత్తం సముద్ర భాగంలో మూడింట రెండువంతులుగా ఉన్న హైసీస్ ప్రాంతాన్ని, ప్రస్తుతం ఉన్న అత్యల్ప రక్షితస్థాయి(1.44 శాతం) నుంచి మరింత ఎక్కువ రక్షిత స్థాయికి పెంచడం. తద్వారా సముద్ర ఆవరణ వ్యవస్థను పరిరక్షించడం.
2. హైసీస్ ప్రాంతంలో ఉన్న మెరైన్ జెనెటిక్ రిసోర్సెస్(సముద్రాంతర్గత జీవ వనరులు - సముద్రపు జీవులు, నాచు, మొక్కలు మొదలైన వాటిని) అన్ని దేశాల మధ్య న్యాయబద్ధంగా, సమంగా పంపిణీ చేసి అన్ని దేశాలకు సమానంగా ఆర్థిక లబ్ది చేకూర్చడం.
3. సముద్రాంతర్గత ఖనిజోద్గ్రహణం(డీప్ సీ మైనింగ్) వంటి సముద్ర ఆవరణ వ్యవస్థలకు హాని కలిగించే మానవ చర్యలకు అనుమతించే ముందు వివిధ దేశాలు పర్యావరణ ప్రభావాలను సమర్థవంతంగా అంచనా వేసే మార్గదర్శకాలను రూపొందించడం.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

ఐఐఎఫ్‌టీ

ఆన్‌లైన్‌లో ఎంబీఏ(ఐబీ)



న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ) - ఎంబీఏ(ఇంటర్నేషనల్ బిజినెస్) ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి ఆన్‌లైన్ విధానంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: ఈ ప్రోగ్రామ్‌ను వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించారు. దీని వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి ఏడాది మేనేజ్‌మెంట్ స్ట్రాటజీ, ట్రేడ్ అండ్ ఫైనాన్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్సెస్ కోర్సులు చదవాల్సి ఉంటుంది. రెండో ఏడాది ఫైనాన్స్, ట్రేడ్, మార్కెటింగ్, స్ట్రాటజీ, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎకనామిక్స్ స్పెషలైజేషన్‌లలో ఒకదాన్ని ఎంచుకోవాలి. ప్రోగ్రామ్‌లో భాగంగా వర్చువల్ సెషన్స్ ఉంటాయి. పారిశ్రామిక నిపుణులు గెస్ట్ లెక్చర్స్ ఇస్తారు. కేస్ స్టడీస్, ప్రాబ్లం సాల్వింగ్ విధానాలపై బృంద చర్చలు ఉంటాయి. వారాంతాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఆన్‌లైన్ సెషన్స్ నిర్వహిస్తారు.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు. కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

ఐహెచ్‌ఎంలో డిప్లొమా

హాజిపూర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్‌ఎం)- డిప్లొమా ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అకడమిక్ మెరిట్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు వైవా, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాదిన్నర. దేశవ్యాప్తంగా ఉన్న స్టార్ హోటళ్లలో ఏడాది పాటు ఇంటెన్సివ్ ట్రెయినింగ్, ఆర్నెల్లపాటు ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఉంటాయి.

విభాగాలు-సీట్లు: ఫుడ్ ప్రొడక్షన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ విభాగాలు ఉన్నాయి. ఒక్కోదానిలో 56 సీట్లు ఉన్నాయి. ప్రతి విభాగంలో జనరల్ అభ్యర్థులకు 26, ఓబీసీలకు 15, ఎస్సీలకు 8, ఎస్టీలకు 4, ఈడబ్ల్యూఎస్ వర్గానికి 3 సీట్లు ప్రత్యేకించారు.



అర్హత: గుర్తింపు పొందిన బోర్డు(స్టేట్/సెంట్రల్) నుంచి ఏదేని గ్రూపుతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

వెబ్‌సైట్: ihmhajipur.net

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్‌ఎల్
https://ejyothy.com/PRJDZZDలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



క్యూలో నిల్చుని ఓటేసిన సినీ ప్రముఖులు


సోమవారం హైదరాబాద్‌లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో సినీ ప్రముఖులు తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. సాధారణ జనంతో పాటు ఉదయం ఏడు గంటలకే పోలింగ్ బూత్‌కు వెళ్లి క్యూ లైన్లలో నిలబడి, ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు. మెగాస్టార్ చిరంజీవి, మోహన్‌బాబు, జూనియర్ ఎన్టీఆర్, మహేశ్ బాబు, అల్లు అర్జున్, రామ్‌చరణ్, కల్యాణ్‌రామ్, డాక్టర్ రాజశేఖర్, నాని, నాగచైతన్య విజయ్ దేవరకొండ.. ఒకరనేమిటి అందరూ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 'మీరు కూడా ఓటు వేయండ'ంటూ పిలుపునిచ్చారు.











మాతృభాషలోనూ డబ్బింగ్

దక్షిణాది అభిమానులే కాక ఉత్తరాది ప్రేక్షకలోకం కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా 'కల్కి 2898 ఏ.డీ'. ఇందులో ప్రభాస్‌కు జోడీగా దీపికా పదుకొనే కథానాయికగా నటిస్తున్న సంగతి తెలిసిందే. జూన్ 27న ఈ చిత్రం విడుదల కానుండడంతో చిత్ర బృందం పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగవంతం చేసింది. ఇటీవలే ఈ మూవీలో తన పాత్ర కోసం దీపికా డబ్బింగ్ మొదలుపెట్టారు. ఆ పాత్ర డబ్బింగ్‌ను హిందీలోనే కాకుండా తన మాతృభాష అయిన కన్నడలోనూ దీపికానే స్వయంగా చెప్పుకోవడం విశేషం. తన మాతృభాషలో డబ్బింగ్‌కు దీపికానే వాయిస్ అందించడంతో ఇది మూవీకి మరింత ప్లస్ కానుంది అని సినీ వర్గాలు భావిస్తున్నాయి. కాగా, ఈ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌కు నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దిశా పటానీలతో కూడిన భారీ తారాగణం ఇందులో నటిస్తున్నారు. అశ్వినీదత్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.





కేన్స్ చిత్రోత్సవంలో టీజర్ లాంచ్

మంచు విష్ణు నటిస్తున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ 'కన్నప్ప'. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు తారస్థాయిలో ఉన్నాయి. ఇందుకు తగ్గట్లే ఈ సినిమాకు సంబంధించిన ప్రతీ విషయంలో చిత్ర బృందం పలు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 20న ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో విడుదల చేయబోతున్నారు. 'వరల్డ్ ఆఫ్ కన్నప్ప' పేరుతో రిలీజ్ కానున్న ఈ టీజర్ ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందిస్తుందని చిత్ర బృందం ధీమాగా ఉంది. కాగా, ఈ భారీ బడ్జెట్ ఫ్యాంటసీ డ్రామాను ముఖేశ్ కుమార్ సింగ్ తెరకెక్కిస్తున్నారు. మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్, మోహన్‌బాబు, శరత్‌కుమార్, శివ రాజ్‌కుమార్, అక్షయ్‌కుమార్, మోహన్ లాల్, ప్రభుదేవా వంటి స్టార్స్ కీలక పాత్రల్లో మెరవనున్నారు.

నటిస్తూ వేదికపై కుప్పకూలిన నటుడు



జీవితంలో చివరి క్షణం వరకూ నటిస్తూ ఉండాలని చాలా మంది చెబుతుంటారు. అది మరాఠి నటుడు సతీశ్ జోషి విషయంలో నిజమైంది. ఆదివారం ఆయన ముంబైలో రంగోత్సవ్ కార్యక్రమంలో ప్రదర్శన ఇస్తూ ఉన్నట్లుండి వేదికపై కుప్పకూలారు. 'ఉదయం నుంచి సతీశ్ అలసటతో కనిపించారు. వేదికపై కార్యక్రమం ప్రారంభమైన కొద్ది సేపటికే ఆయన కింద పడిపోయారు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది.' అని సతీశ్ సన్నిహిత మిత్రుడు, సహ నటుడు రాజేశ్ దేశ్‌పాండే చెప్పారు. మరాఠి నాటకాలు, టీవీ సీరియల్స్, సినిమాల ద్వారా సతీశ్ చిరపరిచితుడు. ఆయన మరణంతో ఓ ప్రతిభాశాలిని మరాఠి చిత్ర పరిశ్రమ కోల్పోయిందని చెప్పాలి.

ఆంధ్రజ్యోతి
నవ్య
డాక్టర్
మంగళవారం • 14 మే 2024



ఆధునిక యుగంలో జీవన శైలి వల్ల కలిగే ఒత్తిడి వల్లే అన్ని రకాల జబ్బులు వస్తున్నాయని అనేక పరిశోధనలు చెబుతున్నాయి. అయితే ఒత్తిడి మన జీవితాల్లో కలగజేస్తున్న సమస్యలను మనం ఇంకా సరిగ్గా గుర్తించటం లేదు. ఆధునిక సమాజంలో ఇది చాలా సామాన్యమైన విషయమని మనం భావిస్తున్నాం. జనాభా పెరుగుతోంది. ప్రజల కోరికలు పెరుగుతున్నాయి. పోటీతత్వం బాగా పెరుగుతోంది. తాము కోరుకుంటున్న విలాసవంతమైన జీవన విధానం కావాలంటే ఒత్తిడి తప్పనిసరి అనే భావన ఆలోచనలో చాలామంది ఉండిపోతున్నారు. ఒత్తిడి వల్ల మనకు కలిగే జబ్బుల గురించి ముంబాయికి చెందిన ప్రముఖ డయాబెటాలజిస్ట్, ఎంజీఎం మెడికల్ కాలేజీ **ప్రొఫెసర్ సందీప్ రాయ్** 'నవ్య'కు ఇంటర్వ్యూ ఇచ్చారు. దానిలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే...



ఒత్తిడి తినేస్తోంది!

"ఒకప్పుడు మానవుడికి ఒత్తిడి ఉండేది కాదా? ఎటువంటి సమస్యలు లేకుండా జీవించేవాడా? ఆధునిక జీవన శైలి వల్లే ఇవన్నీ వస్తున్నాయా? అనే ప్రశ్నలు మనకు మనం వేసుకుందాం. ఆహారాన్ని సంపాదించుకోవటం, క్రూరమృగాల బారిన పడకుండా తప్పించుకోవటం మాత్రమే ఒకప్పుడు మానవుడికి ఉన్న ఒత్తిడి అని చెప్పవచ్చు. ఉదాహరణకు వేటకు వెళ్లినప్పుడు ఒక పులి ఎదురయిందనుకుందాం. అప్పుడు మన మెదడు ఆదేశాల మేరకు శరీరంలో కొన్ని కెమికల్స్ ఉత్పత్తి అవుతాయి. వీటిని 'స్ట్రెస్ కెమికల్స్' అంటారు. ఈ కెమికల్స్ వల్ల మన శరీరంలో కొన్ని మార్పులు జరుగుతాయి. రక్తం కండరాలలోకి వేగంగా ప్రసరించడం మొదలవుతుంది. దూరంగా ఉన్న వస్తువులను స్పష్టంగా చూడగలుగుతాం. అప్రమత్తత పెరుగుతుంది. ఆలోచనల వేగం మూడు నాలుగింతలవుతుంది. ఇలా మన శరీరంలో వచ్చే మార్పులు- మనం పారిపోవటానికి లేదా పులిని ఎదుర్కొని పోరాడటానికి ఉపకరిస్తాయి. పరిణామక్రమంలో భూమిపై మనుగడ సాగించటం కోసం మానవ శరీరంలో వచ్చే మార్పులు ఇవి. కొన్ని కోట్ల సంవత్సరాల నుంచి ఒత్తిడి ఎదురయినప్పుడు మానవ శరీరంలో ఈ తరహా మార్పులు వస్తున్నాయి కాబట్టి అది ఒక సహజమైన ప్రక్రియగా మారిపోయింది. ఆధునిక జీవితంలో ప్రతి రోజూ ట్రాఫిక్ లైట్స్ దగ్గరో, పని దగ్గరో, నిర్ణయాలు తీసుకొనే సమయంలోనో ఒత్తిడి ఏర్పడినప్పుడు- మన శరీరం కెమికల్స్‌ను విడుదల చేయటం మొదలుపెడుతోంది. అంటే ఒకప్పుడు - వేటకు వెళ్లిన సమయంలో మాత్రమే విడుదలయ్యే కెమికల్స్... ప్రస్తుతం ప్రతిరోజు పదుల సార్లు విడుదలవుతున్నాయి. ఇలా విడుదలయిన కెమికల్స్ మన శరీరంలోని అవయవాలపై ప్రభావం చూపుతున్నాయి. వ్యాధులను కలగజేస్తున్నాయి. అలాంటి వాటిలో ప్రధానమైనవి- బ్లడ్‌ప్రెషర్, డయాబెటిస్.

> కొన్ని ఆహార పదార్థాలకు ఒత్తిడిని తగ్గించే లక్షణాలు ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు. అవేమిటో చూద్దాం...
>
> **అవకాడో:** అవకాడోలో రిబోఫ్లోవిన్, ఫోలేట్, బీ కాంప్లెక్ విటమిన్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి మానసిక ఒత్తిడిని గణనీయంగా తగ్గిస్తాయి.
>
> **బ్లూ బెర్రీస్:** బ్లూబెర్రీస్‌లో యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉంటాయి. యాంటీ ఆక్సిడెంట్స్ శరీర కణజాలల్లోని సమస్యలను ఎదుర్కోగలుగుతాయి.
>
> **గుడ్లు:** మన నాడీ వ్యవస్థలో సెరోటోనిన్, డోపోమైన్ వంటి హార్మోన్ల వల్ల ఒత్తిడి పెరుగుతుంది. ఈ ఒత్తిడిని తగ్గించటానికి కోడి గుడ్డులోని పచ్చసొనలో ఉండే విటమిన్ డి ఉపకరిస్తుందని అధ్యయనాల్లో తేలింది.
>
> **పాలకూర:** పాలకూరలో కాల్షియం అధికంగా ఉంటుంది. కాల్షియం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. పాలకూరతో పాటుగా పాలు, పెరుగులు కూడా ఒత్తిడిని తగ్గించటానికి ఉపకరిస్తాయి.
>
> **చేమంతి:** చేమంతి, బంతి పూల రేకులను ఎండబెట్టి కాచే హెర్బల్ టీలు కూడా ఒత్తిడిని తగ్గించటంలో ఉపకరిస్తాయి.

స్థూలకాయమే సూచి...

ఇలా విడుదలయ్యే వాటిలో ప్రధానమైన రసాయం... కార్టిసాల్. ఇది రక్తపు పోటుకు, మధుమేహానికి, స్థూలకాయానికి- ఇలా అనేక రకాల సమస్యలకు కారణమవుతుంది. ఒకప్పుడు ఒత్తిడి ఎక్కువగా ఉంటే సన్నంగా ఉంటారనుకొనేవారు. కానీ ఇప్పుడు ఒత్తిడి ఎక్కువగా ఉన్నవారిని చూడండి. స్థూలకాయులే ఎక్కువగా కనిపిస్తారు. ఈ రకంగా చూస్తే- ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న జీవన శైలి సమస్యలకు ఒత్తిడే కారణమని చెప్పవచ్చు. ఒత్తిడికి తోడు మన ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పులు కూడా సమస్యను మరింత ఎక్కువ చేస్తున్నాయి. అవసరమున్నా లేకపోయినా తినటం, పిజ్జా, చిప్స్ వంటి తినటం, కోలాలు తాగటం వల్ల రకరకాల అనర్థాలు కలుగుతున్నాయి. వ్యాయామం లేకపోవటం ఇంకో సమస్యగా మారింది. ఈ మూడింటిలోను- ఆహారపు అలవాట్లను మార్చవచ్చు. వ్యాయామం చేయమని సలహా ఇవ్వవచ్చు. కానీ 'ఎక్కువ ఒత్తిడి వద్దు' అని చెబితే సరిపోదు. దానిని అధిగవించటానికి అవసరమైన పద్ధతులు కూడా చెప్పాలి. మేము చేసిన అధ్యయనాలలో ఒత్తిడిని తగ్గించటంలో - యోగా, ధ్యానం బాగా పనిచేస్తాయని తేలింది. ధ్యానం వల్ల మన ఆలోచనలను నియంత్రించగలుగుతాము. మేము 'సహజయోగా'తో చేసిన పరిశోధనల్లో - ఈ తరహా ధ్యానం వల్ల ఒత్తిడి తగ్గుతుందని తేలింది.



అత్యంత ప్రమాదకారి

ఇక్కడ మనం ఒత్తిడి వల్ల వచ్చే ప్రధానమైన వ్యాధి మధుమేహం కాబట్టి దీని గురించి కూడా కొద్దిగా మాట్లాడుకుందాం. ఈ మధ్యకాలంలో చిన్నపిల్లలకు.. యుక్తవయస్సులో ఉన్నవారికి కూడా మధుమేహం రావటం చూస్తున్నాం. శాస్త్ర పరిశోధనల్లో 'థిన్ ఫ్యాట్ ఇండియన్స్' అనే ఒక సిద్ధాంతం ఉంది. దీని ప్రకారం చాలా మంది భారతీయులు- చూడటానికి సన్నగా ఉంటారు. కానీ వారి పొట్ట భాగంలో మాత్రం బాగా కొవ్వు పట్టి ఉంటుంది. ఈ విధంగా కొవ్వు పట్టడానికి కారణం జన్యువులే! దీనిని 'థ్రిఫ్టి జీన్' సిద్ధాంతం అంటారు. ఈ జన్యువు వెనక కూడా ఒక కథ ఉంది. కొన్ని వేల సంవత్సరాల క్రితం మన ఆసియా ప్రాంతంలో ప్రజలు స్థిరపడి పంటలు పండించటం ప్రారంభించారు. కొన్నిసార్లు కరువు కాటకాలు వచ్చి తినటానికి ఏమీ ఉండేది కాదు. దీని వల్ల కొన్ని లక్షల మంది మరణిస్తూ ఉండేవారు. ఇలా అనేకసార్లు జరిగిన తర్వాత మన జన్యువుల్లో కొన్ని మార్పులు జరిగాయి. ఈ మార్పులు వల్ల ఎప్పుడైనా అదనంగా ఆహారం దొరికినప్పుడు- మన శరీరం దానిని కొవ్వుగా మార్చి పొట్ట చుట్టుపక్కల దాచుకుంటుంది. ముఖ్యంగా మహిళల్లో ఎక్కువగా ఇది కనిపిస్తుంది. కరువు సమయాల్లో శరీరం దీన్ని వాడుకుంటుంది. దీని వల్ల ఎక్కువ కాలం బతకగలుగుతారు. అయితే గత 50 ఏళ్లలో మన ఆహార ఉత్పత్తి పెరిగింది. కరువులు కూడా తగ్గాయి. మరోవైపు యువతీయువకుల ఆదాయం పెరిగింది. దీని వల్ల' రెడీ టూ ఈట్' ఫుడ్‌కు ఆదరణ కూడా పెరిగింది. దీనివల్ల శరీరంలో కొవ్వు పెరగటానికి అవకాశాలు ఎక్కువయ్యాయి. అంటే ఒకవైపు మన శరీరంలో జన్యువుల్లో మార్పులు రాలేదు. అదనపు ఆహారాన్ని కొవ్వుగా మార్చాల్సిన అవసరం లేదనే విషయం వాటికి తెలియటం లేదు. బహుశా మరో వంద లేదా రెండు వందల ఏళ్లకు మన జన్యువులకు ఆ విషయం తెలిసే అవకాశం ఉంది. అప్పటి దాకా అదనంగా తిన్న ఆహారాన్ని అవి కొవ్వుగా మారుస్తూ ఉంటాయి. మరోవైపు అవసరమైన దాని కన్నా ఎక్కువ ఆహారాన్ని తినటం మొదలుపెడుతున్నారు. ఈ రెండిటి వల్ల మన దేశంలో మధుమేహ సమస్య రోజు రోజుకు పెరిగిపోతోంది."

> ### కొత్త తరం మందులు వచ్చాయి...
>
> 30 ఏళ్లు దాటి- కొద్దిగా పొట్ట ఉన్న వాళ్లందరూ మధుమేహ పరీక్షలు చేయించుకుంటే మంచిది. కడుపు చుట్టూ ఉన్న కొవ్వు శరీరంలోని అన్ని అవయవాలకు చేరుతుంది. మన దేశంలో 95 శాతం మందికి దీని వల్లే మధుమేహ సమస్య ఏర్పడుతోంది. వీరు తాము మధుమేహ బాధితులం కాబోతున్నామనే విషయాన్ని గమనించి... బరువు తగ్గించుకొని, వ్యాయామం చేస్తే- సమస్యను ఎదుర్కొవటానికి వీలవుతుంది. వీరికి మధుమేహం పూర్తిగా తగ్గుతుంది లేదా చిన్న డోస్‌తో మేనేజ్ చేయగలుగుతారు. అయితే చాలామంది యువతీయువకులు కంప్యూటర్ ముందు కూర్చుంటారు. ఆహారం తింటారు. కానీ తగిన వ్యాయామం చేయరు. దీనివల్ల సుగర్ స్థాయిలు పెరుగుతాయి. దీన్ని నియంత్రించటానికి శరీరం ఎక్కువ ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేస్తుంది. చేస్తూ పోతుంది. ప్యాంక్రియాస్ ఎక్కువగా పనిచేయటం మొదలుపెడతాయి. బీటా సెల్స్ మధుమేహాన్ని నియంత్రించటానికి ప్రయత్నిస్తాయి. కొద్ది కాలం తర్వాత బీటా సెల్స్ పనిచేయటం మానేస్తాయి. దీని వల్ల ఇన్సులిన్ విడుదల కాదు. కొత్త తరం మందులు- జీఎల్‌పీ1 మాలిక్యుల్ మందులు అందుబాటులోకి వచ్చాయి. దీని వల్ల బరువు తగ్గుతారు. ఆకలి తగ్గుతుంది. ఇన్సులిన్ విడుదల కూడా పెరుగుతుంది. రెండో రకం... ఎజీఎల్‌టీటూ ఇన్‌హిబెటర్స్. ఇవి గ్లూకోజ్ శరీరంలోకి చేరకుండా చేస్తాయి. సుగర్ స్థాయిలు 180 కన్నా పెరిగితే- వాటిని బయటకు పంపేస్తాయి. దీనివల్ల బరువు కూడా తగ్గుతారు. ఇవి కిడ్నీలపై ఎటువంటి దుష్పరిమాణాలు కలగజేయవు.

ఉదయం... రాత్రి కాల్షియం బెస్ట్!

చాలా మంది కాల్షియం ట్యాబ్‌లెట్స్ వాడుతూ ఉంటారు. అయితే ఈ టాబ్‌లెట్స్‌ను ఎప్పుడు వాడాలనే విషయంలో అనేక భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. బీఎంసీ మెడికల్ అనే మెడికల్ మ్యాగిజైన్‌లో తాజాగా ప్రచురించిన అధ్యయనం ప్రకారం- ఉదయం, రాత్రి ఒకే మోతాదులో కాల్షియం తీసుకుంటే మంచిదని తేలింది. "మన శరీరానికి కాల్షియం చాలా అవసరం. అయితే ఈ సమయంలో ఈ కాల్షియం తీసుకుంటున్నామనేది కూడా ముఖ్యమే. ఇప్పటి దాకా ఏ సమయంలో కాల్షియం తీసుకుంటే ఎక్కువ ప్రయోజనం ఉంటుందనే అంశంపై ఎక్కువ పరిశోధనలు జరగలేదు. మేము చేసిన అధ్యయనంలో ఉదయం, రాత్రి కాల్షియాన్ని తీసుకుంటే సమర్థంగా పనిచేస్తుందని తేలింది. కాల్షియం ఎంత త్వరగా పని చేస్తుందనే విషయం- దానితో పాటుగా తీసుకొనే ఇతర ఆహార పదార్థాలపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా బ్రేక్‌ఫాస్ట్ సమయంలోను, రాత్రి డిన్నర్ సమయంలో సమతౌల్య ఆహారం తీసుకుంటారు." అని అధ్యయనంలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ ఆర్.ఆర్. దత్తా వెల్లడించారు.



గుండె జబ్బులతో లింక్!

మన శరీరంలో రక్తపోటు సరిగ్గా ఉండాలంటే కాల్షియం అవసరం అవుతుంది. అదే విధంగా గుండెలో కండరాల ఆరోగ్యం సక్రమంగా ఉండాలన్నా కాల్షియం ఎంతో అవసరం. వీటితో పాటుగా రక్తనాళాలు పూడుకుపోకుండా చూడటంలో కాల్షియందే పెద్ద పాత్ర. అందువల్ల గుండె జబ్బులు రాకుండా ఉండాలంటే కాల్షియం మోతాదు సక్రమంగా ఉండాలి. "చాలా సార్లు కాల్షియం విలువలు తక్కువ ఉన్నాయని తెలిసిన తర్వాత మందులు వాడటం మొదలు పెడతారు. విలువలు పెరిగిన తర్వాత వాడటం మానేస్తారు. దీని వల్ల కలిగే ప్రయోజనాలు తాత్కాలికమే. అందువల్ల సమతౌల్య ఆహారాన్ని తీసుకుంటే ఈ సమస్య ఉండదు" అంటారు దత్తా. డాక్టర్ల సలహా లేకుండా కాల్షియం టాబ్‌లెట్స్‌ను వాడకూడదని కూడా ఆయన హెచ్చరిస్తున్నారు. "శరీరంలో కాల్షియం పెరిగిపోయినా అనేక సమస్యలు ఎదురవుతాయి. కాల్షియం ఎక్కువయితే కిడ్నీల్లో రాళ్లు వస్తాయి. అదే విధంగా రక్తనాళాలు గట్టిగా అయిపోతాయి. అందువల్ల డాక్టర్ల పర్యవేక్షణలో తప్ప కాల్షియం వాడకూడదు" అని పేర్కొంటున్నారు.

ఆరోగ్యం విషయంలో ఎన్నో అపోహలు ప్రచారంలో ఉంటాయి. ఇవి చాలామట్టుకు నిర్ధారరణ కాని పుకార్లే. వీటివల్ల భయం, గందరగోళం కలుగుతాయి. సోషల్ మీడియా పెరిగిన తరువాత ఇలాంటివి బాగా ప్రచారంలోకి వచ్చేస్తున్నాయి. వీటిలో కొన్ని హానికరంగా కనిపించకపోవచ్చు. కానీ అవి అనవసరమైన ఆందోళనకూ, సరైన చికిత్స తీసుకోకపోవడానికీ కారణమవుతాయి. అవగాహనతో నిర్ణయాలు తీసుకోవాలంటే ఏవి అపోహలు, ఏవి వాస్తవాలు అనేది తెలుసుకోవాలి. అలాంటివి కొన్ని:



అవి అపోహలు.. ఇవీ వాస్తవాలు

అపోహ: రోజుకు కనీసం ఎనిమిది గ్లాసుల నీరు తాగాలి...

వాస్తవం: ప్రతి ఒక్కరూ రోజుకు ఎనిమిది గ్లాసుల నీరు తాగాలనేది అపోహ. ఒక వ్యక్తి నీరు ఎంత తాగాలి? అనే విషయం... వాతావరణం, ఆ వ్యక్తి ఆరోగ్య పరిస్థితి, చెమట ఎంత ఎక్కువగా పడుతోంది, గర్భిణులా లేదా పాలిచ్చే తల్లులా?... ఇలా పలు అంశాలమీద ఆధారపడి ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రతలో నివసించే వ్యక్తి రోజూ రెండు నుంచి మూడు లీటర్ల నీరు తాగాలని 'యుఎస్ నేషనల్ అకడమిక్స్ ఆఫ్ సైన్స్, ఇంజనీరింగ్ అండ్ మెడిసిన్' సంస్థ సూచించింది. దీనితో పాటు మన శరీరం ప్రతిస్పందనలను కూడా గమనిస్తూ ఉండాలి. శరీరంలో హైడ్రేషన్ తగ్గుతున్నప్పుడు దాహంగా అనిపిస్తుంది. ఆ స్థితికి వచ్చేవరకూ ఆగకుండా... రోజంతా అప్పుడప్పుడు నీరు, ద్రవ పదార్థాలు తీసుకోవడం మంచిది.

అపోహ: రాత్రి ఆలస్యంగా తింటే బరువు పెరుగుతారు...

వాస్తవం: బరువు పెరగడం అనేది ఏ వేళలో ఆహారం తిన్నారనే దాని కన్నా... రోజు మొత్తం మీద తీసుకొనే క్యాలరీల పరిమాణం మీద ప్రాథమికంగా ఆధారపడి ఉంటుంది. అయితే నిద్ర పోవడానికి ముందు ఎక్కువగా తింటే... కలత నిద్ర, అజీర్తి లాంటి సమస్యలు తలెత్తవచ్చు. కాబట్టి, పడుకోవడానికి కనీసం రెండు గంటల ముందు భోజనం చెయ్యాలనేది ఆరోగ్య నిపుణుల సూచన. అప్పుడు... తిన్న ఆహారం జీర్ణం కావడానికి తగినంత సమయం ఉంటుంది.

అపోహ: మూడు పూటలూ కడుపు నిండా తినడం కన్నా... చిన్న చిన్న విరామాలిచ్చి కొద్ది కొద్దిగా తినడం మంచిది.

వాస్తవం: ఇది ఆ వ్యక్తి శరీర స్వభావం, ఆరోగ్యం, జీవనశైలి మీద ఆధారపడి ఉంటుంది. కొందరు చాలా తరచుగా కొంచెం కొంచెం తిని, ఆకలి తగ్గించుకొని, ఎనర్జీ స్థాయిని పెంచుకోవడం సౌకర్యంగా భావిస్తారు. మరికొందరు మూడుసార్లు ఎక్కువగా తింటే హాయిగా ఉంటుందనుకుంటారు. దీనికన్నా మీరు తినే ఆహారంలో పోషకాలు ఉండలా చూసుకోవడం ముఖ్యమన్నది పోషకాహార నిపుణుల సూచన. పోషకాలు పుష్కలంగా ఉన్న సమతుల ఆహారాన్ని తీసుకోవడం ఆరోగ్యకరం. ఎన్నిసార్లు అనేది మీ వెసులుబాటును బట్టి నిర్ణయించుకోండి.

అపోహ: డీటాక్స్ డైట్ శరీరం నుంచి విషపదార్థాలను తొలగిస్తుంది...

వాస్తవం: మనిషి శరీరానికి డీటాక్సిఫికేషన్ చేసుకోగలిగే సామర్థ్యం స్వతహాగానే ఉంటుంది. శరీరం నుంచి విష పదార్థాలను సహజసిద్ధంగా తొలగించడంలో కాలేయం, మూత్రపిండాలు, జీర్ణ వ్యవస్థ, చర్మం, ఊపిరితిత్తులు కీలకపాత్ర పోషిస్తాయి. ఉదాహరణకు, విషపదార్థాలను కాలేయం రసాయనికంగా తటస్థీకరిస్తుంది. అలాగే విషపదార్థాలను మూత్రం ద్వారా మూత్రపిండాలు వడపోస్తాయి, చెమట ద్వారా చర్మం అలాంటి పదార్థాలను బయటకు పంపుతుంది. శరీరంలోని కొన్ని నిర్దిష్టమైన చెడు పదార్థాలను తొలగించుకోవడానికి డీటాక్స్ డైట్‌ను కొందరు అనుసరిస్తూ ఉంటారు. అయితే వారు కోరుకున్న విష పదార్థాలు దానిద్వారా తొలగిపోవడం చాలా అరుదని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే, ఈ డైట్ వల్ల ప్రయోజనాలూ ఉన్నాయంటున్నారు. ఈ డైట్ అనుసరించేవారు ప్రాసెస్డ్ ఫుడ్స్ లాంటి వాటికీ, మద్యపానానికీ దూరంగా ఉంటారు. దీనివల్ల శరీరం ఉత్సాహంగా, శక్తిమంతంగా అనిపిస్తుంది. కాబట్టి ప్రత్యక్షంగా పెద్ద ప్రభావం లేకపోయినా... ఇటువంటి పరోక్ష ప్రభావాలకు డీటాక్స్ డైట్స్ దోహదం చేస్తాయి.

వెన్నెముక బలోపేతానికి

వెన్నెముకను బలోపేతం చేయడానికి యోగ నమస్కారం ఒక శక్తిమంతమైన ప్రక్రియ. ఇది వెన్ను చివరి భాగాన్ని ఉత్తేజపరిచి, వెన్నెముక కండరాలను బలపరచి, వయసు పెరిగే కొద్దీ పెరిగే వెన్ను వంగిపోయే సమస్యను ఆపుతుంది. ఒకవేళ ఇప్పటికే అలాంటి సమస్యలతో బాధపడుతుంటే... వెన్ను పునరుజ్జీవానికి యోగ నమస్కారం దోహదపడుతుంది.



యోగ నమస్కారం ఇలా...

- నిటారుగా నిల్చోండి. పాదాల మధ్య కనీసం అడుగు దూరం ఉండాలి. చేతులు, భుజాలు బిగించినట్టు కాకుండా, రిలాక్స్‌డ్‌గా వదిలేయండి. ఎదురుగా కనిపించే వస్తువుపై దృష్టి కేంద్రీకరించండి. ఒకసారి మీ దృష్టి స్థిరమైన తరువాత, అరచేతులను ఛాతీకి దగ్గరగా తీసుకువచ్చి నమస్కారం పెట్టండి. ఇది మొదటి స్థితి.
- శ్వాస తీసుకొంటూ రెండు చేతులనూ అలానే ఎత్తి, తల పైకి తీసుకురండి. శ్వాస వదులుతూ అరచేతుల కింది భాగం మెడ వెనుకకు వచ్చేలా చేతులను కిందికి తీసుకురండి. శ్వాస తీసుకొంటూ చేతులను అలానే పైకి ఎత్తండి. శ్వాస వదులుతూ అరచేతులను ఛాతీ దగ్గరకు తీసుకురండి. ఇలా మరో



రెండుసార్లు చేయండి.

- పైన చెప్పినట్టుగానే మళ్లీ చేతులను కదిలిస్తూ... గొంతు మూలల నుంచి శబ్దం చేయండి. ఇది రెండో అంచె. ఈ మొత్తం ప్రక్రియల్లో మీ చేతి వేళ్లన్నీ నిటారుగా పైకి చూస్తున్నట్టు ఉండాలి. అలానే తల కూడా వంగకుండా నిటారుగా ఉండాలి. మెడ వెనుక నుంచి చేతులు పైకి ఎత్తుతున్నప్పుడు శబ్దం చేస్తూ శ్వాస తీసుకోవాలి. కిందికి దించుతున్నప్పుడు శ్వాస వదలాలి. ఇలా మూడుసార్లు చేయాలి.
- ఇప్పుడు అరచేతులు ఛాతీకి దగ్గరగా తీసుకువచ్చి, మోకాళ్లు ఛాతీకి తగిలేలా కూర్చోండి. తరువాత శ్వాస తీసుకొంటూ చేతులను నిటారుగా పైకి లేపండి. శ్వాస వదులుతూ అరచేతులను మెడ వెనుక వైపునకు దించండి. మళ్లీ శ్వాస తీసుకొంటూ అరచేతులు పైకెత్తండి. శ్వాస వదులుతూ అరచేతులను ఛాతీ ముందుకు తీసుకురండి.
- తరువాత శ్వాస తీసుకొంటూ, వేళ్లను ముందుకు చూపుతూ, చేతులను పూర్తిగా సాగదీయండి. శ్వాస వదులుతూ, శబ్దం చేస్తూ, అరచేతులను వెనక్కు ఛాతీ దగ్గరకు తీసుకురండి. ఇలా మూడుసార్లు చేయండి.
- అదే భంగిమలో శ్వాస తీసుకొంటూ అరచేతులను పైకి ఎత్తండి. శ్వాస వదులుతూ అరచేతులను మెడ వెనుక వైపునకు దించండి. శ్వాస తీసుకొంటూ పైకి, శ్వాస తీసుకొంటూ ఛాతీ మీదకు, తరువాత శ్వాస తీసుకొంటూ వేళ్లను ముందుకు చూపుతూ చేతులు సాగదీయండి. ఇలానే మళ్లీ చేయండి.
- ఇప్పుడు అలాగే మోకాళ్లు ఛాతీకి తగిలేలా కూర్చొని, చేతి వేళ్లు ముందుకు చూపుతూ, చేతులు పూర్తిగా చాచి, మోకాళ్లు, నుదురు నేలకు ఆనించాలి. చేతులు ముందుకు తీసుకువచ్చి, అరచేతులు నేలకు ఆనించాలి. చేతుల బొటనవేలు, చూపుడు వేళ్లూ కలిపితే వాటి మధ్య త్రిభుజాకారం ఏర్పడుతుంది. మోచేతులను కొద్దిగా వంచండి. దీన్నే బాలాసనం అంటారు. కనీసం రెండు నిముషాలపాటు అలానే ఉండండి.
- తరువాత నెమ్మదిగా నిల్చొని, మొదటి స్థానానికి రండి. దీంతో ఒక యోగ నమస్కారం పూర్తయినట్టు. యోగ నమస్కారం చేయాలంటే... ఆహారం తీసుకున్నాక కనీసం గంటన్నర వ్యవధి ఉండాలి.



శ్రీనివాస్‌కు రజతం

ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్



భువనేశ్వర్: జాతీయ ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ రెండోరోజు పోటీల్లోనూ తెలుగు అథ్లెట్ సత్తా చాటాడు. ఏపీకి చెందిన నలుబోతు షన్ముగ శ్రీనివాస్ పురుషుల 200 మీటర్ల రేసులో రజత పతకం సాధించాడు. సోమవారం ఇక్కడ జరిగిన ఫైనల్ రేసును శ్రీనివాస్ 20.97 సెకన్లలో ముగించి రెండోస్థానంలో నిలిచాడు. అనిమేశ్ (ఒడిశా, 20.62 సె)కు స్వర్ణం, జైషా (మహారాష్ట్ర, 21.31 సె)కు కాంస్యం దక్కాయి. ఇక, మహారాష్ట్రకు చెందిన అభా ఖతువా షాట్‌పుట్‌లో రికార్డు ప్రదర్శనతో ఆకట్టుకుంది. అభా డిస్క్‌ను 18.41 మీటర్ల దూరం త్రో చేసి విజేతగా నిలిచింది. ఈ క్రమంలో మన్‌ప్రీత్ కౌర్‌తో కలిసి తాను గతంలో నెలకొల్పిన 18.05 మీటర్ల రికార్డును అభా తిరగరాసింది.

నీరజ్, కిశోర్ నేరుగా ఫైనల్స్‌కు: ఒలింపిక్ చాంపియన్ నీరజ్ చోప్రా, కిశోర్ జెనా జావెలిన్ త్రో ఈవెంట్‌లో నేరుగా ఫైనల్స్ ఆడనున్నారు. ఈ చాంపియన్‌షిప్ క్వాలిఫయింగ్ మార్క్ అయిన 75 మీటర్ల దూరాన్ని నీరజ్, కిశోర్‌లు తమ కెరీర్‌లో ఇప్పటికే పలుసార్లు అధిగమించారని, అందుకే ఈనెల 15న జరిగే ఫైనల్స్‌కు వారికి నేరుగా ఎంట్రీ కల్పించినట్టు నిర్వాహకులు వెల్లడించారు.

నిఖత్ శుభారంభం

అస్తానా (కజకిస్థాన్): స్టార్ బాక్సర్, తెలుగమ్మాయి నిఖత్ జరీన్ ఎలోర్డా బాక్సింగ్ టోర్నమెంట్‌లో శుభారంభం చేసింది. ప్రపంచ చాంపియన్ నిఖత్ 52 కిలోల విభాగంలో రెండోరౌండ్‌కు దూసుకెళ్లింది. సోమవారం ఇక్కడ జరిగిన తొలి రౌండ్లో నిఖత్ 5-0తో స్థానిక బాక్సర్ రఖిమ్‌బెర్డి జన్సాయాను చిత్తుచేసింది. నిఖత్‌తో పాటు మీనాక్షి (48 కిలోలు), అనామిక (50 కి) కూడా తమ ప్రత్యర్థులను ఓడించి రెండో రౌండ్లో అడుగుపెట్టారు. మిగతా భారత బాక్సర్లలో ఇష్మీత్ సింగ్ (75 కి), సోనియా (54 కి) మొదటి రౌండ్‌లోనే ఓడారు.

సాత్విక్ జోడీపైనే కళ్లన్నీ

నేటినుంచి థాయ్‌లాండ్ ఓపెన్



బ్యాంకాక్: ప్రతిష్ఠాత్మక థామస్ కప్ బ్యాడ్మింటన్ టోర్నీలో నిరాశ పరిచిన భారత స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్/చిరాగ్ మళ్లీ పూర్వపు ఫామ్ అందిపుచ్చుకోవాలని తలుస్తోంది. ఇందుకు..మంగళవారం ప్రారంభమయ్యే థాయ్‌లాండ్ సూపర్-500 టోర్నమెంట్ సరైన వేదికని భావిస్తోంది. తొలిరౌండ్‌లో మలేసియా ద్వయం నూర్ మహ్మద్/టాన్ తీ యోంగ్‌తో సాత్విక్/చిరాగ్ జోడీ తలపడనుంది. పారిస్ ఒలింపిక్స్ సిద్ధమయ్యే క్రమంలో.. సింగిల్స్ ఆటగాడు ప్రణయ్ కూడా ఈ టోర్నీని సవాలుగా తీసుకుంటున్నాడు. థామస్ కప్‌లో ఇండోనేసియా స్టార్ ఆంథోనీ గిన్‌టింగ్‌పై విజయం ప్రణయ్‌లో ఆత్మవిశ్వాసం పెంచింది. కిరణ్ జార్జ్, సతీష్ కూడా థాయ్‌లాండ్ బరిలో ఉన్నారు. కాగా..లక్ష్యసేన్, పీవీ సింధు ఈ టోర్నీలో పాల్గొనడంలేదు. మహిళల సింగిల్స్‌లో అష్మిత చలిహా, మాళవికా బన్సోడ్, ఆకర్షి కశ్యప్ తదితరులూ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. మహిళల డబుల్స్‌లో తనీషా క్రాస్టో/అశ్వినీ పొన్నప్ప ద్వయానికి తొలి రౌండ్‌లో బై లభించింది.

గ్రాండ్‌మాస్టర్‌గా శ్యామ్ నిఖిల్



దుబాయ్: తమిళనాడుకు చెందిన శ్యామ్ నిఖిల్ భారత 85వ గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచాడు. దుబాయ్ పోలీస్ మాస్టర్స్ ఫైనల్ రౌండ్‌లో జిన్షి బాయ్ (చైనా)తో జరిగిన గేమ్‌ను డ్రా చేసుకున్న నిఖిల్ తుది జీఎం నార్మ్‌ను సాధించాడు. 2011లో రెండు జీఎం నార్మ్‌లు పొందాక.. తర్వాతి ఏడాది ఫిడే రేటింగ్స్ జాబితాలో నిఖిల్ తొలిసారి 2502 ఎలో పాయింట్లు పొందాడు. అనంతరం 12 ఏళ్ల తర్వాత గ్రాండ్‌మాస్టర్ అయ్యాడు.

నార్వే చెస్‌కు హంపి, ప్రజ్ఞానంద, వైశాలి

ప్రతిష్ఠాత్మక నార్వే చెస్ టోర్నమెంట్‌లో భారత్ నుంచి కోనేరు హంపి, ప్రజ్ఞానంద, వైశాలి ప్రాతినిథ్యం వహిస్తారు. 'వింబుల్డన్ ఆఫ్ చెస్'గా భావించే ఈ టోర్నీ ఈనెల 27 నుంచి నార్వేలో జరగనుంది.

హార్దిక్‌ను రోహిత్ వద్దన్నా..?

బోర్డు ఒత్తిడితో ప్రపంచకప్ జట్టులో చోటు



న్యూఢిల్లీ: జట్టుకు ఏకంగా ఐదు ఐపీఎల్ టైటిళ్లు అందించిన కెప్టెన్ రోహిత్‌ను పక్కనబెట్టి గుజరాత్ నుంచి భారీ మొత్తానికి తెచ్చు కొని హార్దిక్ పాండ్యాకు ముంబై ఇండియన్స్ యాజమాన్యం సారథ్య బాధ్యతలు అప్పగించడం దేశ క్రికెట్‌లో ఓ సంచలనం. ఇక అప్పటినుంచి రోహిత్, హార్దిక్ మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయన్న వార్తలు వచ్చాయి. వాటికి బలం చేకూర్చే మరో సంఘటన ఇది. అదేంటంటే.. వరల్డ్ కప్ జట్టుకు హార్దిక్ పాండ్యాను ఎంపిక చేయకూడదని టీమిండియా కెప్టెన్ రోహిత్ గట్టిగా పట్టుబట్టాడని సమాచారం. సెలెక్షన్ కమిటీ ఛైర్మన్ అగార్కర్ కూడా రోహిత్‌కు మద్దతు పలికాడని తెలిసింది. కానీ భవిష్యత్ ప్రణాళికల్లో భాగంగా హార్దిక్‌ను టీ20 జట్టు కెప్టెన్‌గా చేయాలనుకొంటున్న బీసీసీఐ.. రోహిత్‌తో పాటు, అగార్కర్‌పై ఒత్తిడి తెచ్చి హార్దిక్‌ను జట్టులో చేర్పించిందట! అలా 15 మంది జట్టు సభ్యుల్లో పాండ్యాకు స్థానం దక్కడంతోపాటు వైస్ కెప్టెన్సీ లభించిందట.

స్వదేశానికి ఇంగ్లండ్ క్రికెటర్లు

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో ఆడుతున్న ఇంగ్లండ్ క్రికెటర్లు లీగ్‌ను వీడనున్నారు. ఈనెల 22 నుంచి పాకిస్థాన్‌తో ఆ జట్టు నాలుగు టీ20ల సిరీస్ ఆడాల్సి ఉంది. టీ20 ప్రపంచకప్‌నకు ముందు దీన్ని సన్నాహకంగా భావిస్తుండడంతో ఐపీఎల్‌లో ఆడే తమ క్రికెటర్లను ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు వెనక్కి రమ్మని ఆదేశించింది. దీంతో విల్ జాక్స్, టోప్లేతో పాటు రాజస్థాన్ ఓపెనర్ బట్లర్ ఇప్పటికే భారత్ వీడారు. వీరితో పాటు ఇదే వారంలో మొయిన్ అలీ, బెయిర్‌స్టో, కర్రాన్, ఫిల్ సాల్ట్ కూడా ఇంగ్లండ్ పయనమవుతారు. పంజాబ్ బ్యాటర్ లివింగ్‌స్టోన్ వెళ్లినా అతడు గాయంతో బాధపడుతున్నాడు. దీంతో పాక్‌తో సిరీస్‌కు అతడు దూరంగా ఉండే చాన్సుంది.

టీ కప్పులో తుఫాన్!

రాహుల్, గోయెంకా వివాదంపై క్లూసెనర్

న్యూఢిల్లీ: గత బుధవారం హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ జట్టు ఓడిన తర్వాత ఆ జట్టు యజమాని సంజీవ్ గోయెంకా మైదానంలోకి వచ్చి కెప్టెన్ కేఎల్ రాహుల్‌తో ఆగ్రహంగా మాట్లాడడం తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. అయితే ఆ వివాదం టీకప్పులో తుఫాన్ లాంటిదని లఖ్‌నవూ జట్టు సహాయ కోచ్ క్లూసెనర్ చెప్పుకొచ్చాడు. రాహుల్-గోయెంకా సంవాదంలో తాను ఎలాంటి తప్పునూ చూడడం లేదన్నాడు.

టైటాన్స్ ఆశలపై 'నీళ్లు'



నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం. వేదిక: ఢిల్లీ

ఢిల్లీ X లఖ్‌నవూ

ప్లేఆఫ్స్ నుంచి గుజరాత్ అవుట్

వరుణుడి ఆటంకం 1కోల్‌కతాతో మ్యాచ్ రద్దు

అహ్మదాబాద్: గుజరాత్ టైటాన్స్ ప్లేఆఫ్స్ ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. సోమవారం కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరగాల్సిన మ్యాచ్ కనీసం టాస్ కూడా పడకుండానే రద్దయ్యింది. దీంతో ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. ప్రస్తుతం 11 పాయింట్లతో ఉన్న టైటాన్స్ ముందుకెళ్లేందుకు ఎలాంటి అవకాశం లేకపోవడంతో అధికారికంగా రేసు నుంచి నిష్క్రమించింది. 2022లో టైటాన్స్ తమ ఆరంభ సీజన్‌లోనే చాంపియన్‌గా నిలిచి సంచలనం సృష్టించగా.. తర్వాతి ఏడాది కూడా ఫైనల్‌కు చేరగలిగింది. కానీ ఈసారి కొత్త కెప్టెన్ గిల్ ఆధ్వర్యంలో జట్టు లీగ్ దశలోనే ఇంటిముఖం పట్టి నిరాశపరిచింది. అటు కోల్‌కతా 19 పాయింట్లతో టాప్-2లో చోటు ఖాయం చేసుకుంది. టాస్ వేయడానికి ముందే ఉరుములు, మెరుపులతో ఆకాశం బీభత్సంగా మారింది. దీనికితోడు విరామం లేకుండా వర్షం కురవగా మైదానం చిత్తడిగా మారింది. అంపైర్లు పలు మార్లు పరీక్షించినా ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. ఐదు ఓవర్ల మ్యాచ్‌కు రా.10.56 కటాఫ్ సమయం ఉన్నప్పటికీ మైదానం సిద్ధం చేసే పరిస్థితి కనిపించలేదు. అందుకే అంతకన్నా 20 నిమిషాల ముందే మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు.

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు) 	బుమ్రా (ముంబై) 
661 (13 మ్యాచ్‌లు)	20 (13 మ్యాచ్‌లు)

రేసు రసవత్తరం..

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఈ ఐపీఎల్ సీజన్ అంచనాలకు భిన్నంగా సాగుతోంది. లీగ్ మ్యాచ్‌లు తుది దశకు చేరినప్పటికీ కోల్‌కతా నైట్‌రైడర్స్ మాత్రమే అధికారికంగా ప్లేఆఫ్స్‌లో ప్రవేశించింది. 16 పాయింట్లతో ఉన్న రాజస్థాన్ రాయల్స్ కూడా దాదాపుగా చేరినట్టే. కానీ మిగిలిన రెండు బెర్త్‌ల కోసం ఏకంగా నాలుగు జట్లు పోటీ పడుతున్నాయి. ముంబై ఇండియన్స్, పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ ఇప్పటికే రేసు నుంచి తప్పుకొన్నాయి. ఇక 14 పాయింట్లతో ఉన్న చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లతో పాటు 12 పాయింట్లతో ఉన్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ప్లేఆఫ్స్‌పై ఆశలు పెట్టుకున్నాయి. వీటి అవకాశాలను ఓసారి పరిశీలిస్తే..

రాజస్థాన్ అన్ని జట్ల కన్నా ఎంతో ముందే 16 పాయింట్లు సాధించిన ఈ జట్టు వరుసగా మూడు మ్యాచ్‌లు ఓడింది. ఇక పంజాబ్, కోల్‌కతాతో జరిగే మ్యాచ్‌ల్లో ఒక్కటి గెలిచినా ముందుకు వెళుతుంది. ఒకవేళ ఓడినా పెద్దగా ఇబ్బంది ఉండదు. మరో మూడు జట్లు 16 పాయింట్లు సాధించే అవకాశం ఉన్నా.. అప్పుడు నెట్ రన్‌రేట్ కీలకంగా మారుతుంది. ఇందులో చెన్నై, సన్‌రైజర్స్ ఆర్ఆర్ కన్నా ముందుంటుంది. కానీ లఖ్‌నవూ 16 పాయింట్లతో ఉన్నా ఆర్ఆర్ రన్‌రేట్‌ను అధిగమించడం అసాధ్యం. కాబట్టి ఈ జట్టుకు ఢోకాలేదు.

చెన్నై సీఎస్‌కే తమ చివరి మ్యాచ్‌లో బెంగళూరుపై గెలిస్తే చాలు 16 పాయింట్లతో ప్లేఆఫ్స్‌కు వెళుతుంది. ఒకవేళ ఆర్‌సీబీపై స్వల్ప తేడాతో ఓడినా తమ నెట్ రన్‌రేట్ పడిపోకుండా చూసుకోవాలి. అయితే 14 పాయింట్లతో ఉన్న సన్‌రైజర్స్ తమ రెండు మ్యాచ్‌ల్లో భారీ తేడాతో ఓడాల్సి ఉంటుంది. దీంతోపాటు లఖ్‌నవూ తమ రెండు మ్యాచ్‌ల్లో ఓడాలి. అప్పుడే ఈ మూడు జట్లలో నెట్ రన్‌రేట్ మెరుగ్గా ఉన్న చెన్నై ముందుకు వెళుతుంది.

హైదరాబాద్ 14 పాయింట్లతో నాలుగోస్థానంలోనున్న సన్‌రైజర్స్.. చివరి రెండు మ్యాచుల్లో గుజరాత్, పంజాబ్‌పై గెలిస్తే నేరుగా ప్లేఆఫ్స్ చేరుతుంది. ఇక, అద్భుత రన్‌రేట్ ఉండడంతో ఒక్క మ్యాచ్‌లో గెలిచినా చాలు. కానీ రెండూ ఓడితే చెన్నై, లఖ్‌నవూ తర్వాత స్థానంలో ఉండాల్సి వస్తుంది.

బెంగళూరు 12 పాయింట్లతో ఉన్న ఆర్‌సీబీ ప్లేఆఫ్స్ చేరాలంటే ముందుగా తమ ఆఖరి మ్యాచ్‌లో చెన్నైపై గెలవాలి. అలాగే వారి రన్‌రేట్‌ను అధిగమించాలంటే 201 లక్ష్యాన్ని 11 బంతులుండగానే గెలవాలి. అటు సన్‌రైజర్స్ ఒకటి లేదా రెండు మ్యాచ్‌లను ఓడాలి. అలాగే లఖ్‌నవూ కూడా కనీసం 14 పాయింట్ల దగ్గరే ఆగిపోవాలి. అప్పుడు నాలుగో జట్టుగా ఆర్‌సీబీ ముందుకెళుతుంది.

లఖ్‌నవూ 12 పాయింట్లతో ఉన్న లఖ్‌నవూ తమ చివరి రెండు మ్యాచ్‌ల్లో ఢిల్లీ, ముంబైతో గెలవాలి. కానీ అలా గెలిచినా నెట్ రన్‌రేట్ ప్రతికూలంగా మారనుంది. అతి భారీ తేడాతో ప్రత్యర్థులను చిత్తు చేయగలిగితేనే ఈ జట్టుకు చాన్స్ ఉంటుంది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.ర.రే
కోల్‌కతా	13	9	3	1	19	1.428
రాజస్థాన్	12	8	4	0	16	0.349
చెన్నై	13	7	6	0	14	0.528
హైదరాబాద్	12	7	5	0	14	0.406
బెంగళూరు	13	6	7	0	12	0.387
ఢిల్లీ	13	6	7	0	12	-0.482
లఖ్‌నవూ	12	6	6	0	12	-0.769
గుజరాత్	13	5	7	1	11	-1.063
ముంబై	13	4	9	0	8	-0.271
పంజాబ్	12	4	8	0	8	-0.423

బిజినెస్

గాయత్రీ ప్రాజెక్ట్స్‌పై లిక్విడేషన్ వద్దు

ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించిన ప్రమోటర్లు 1రూ.750 కోట్లతో సెటిల్‌మెంట్ ఆఫర్

హైదరాబాద్: గాయత్రీ ప్రాజెక్ట్స్ దివాలా ప్రక్రియ (లిక్విడేషన్) కొత్త మలుపు తిరిగింది. లిక్విడేషన్‌కు వ్యతిరేకంగా కంపెనీ ప్రమోటర్లయిన టీ సుబ్బరామి రెడ్డి కుటుంబం.. జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ), హైదరాబాద్ బెంచ్‌ని ఆశ్రయించింది. రుణదాతలకు చెల్లించాల్సిన రూ.9,115 కోట్లలో రూ.750 కోట్లు చెల్లించి వివాదాన్ని సెటిల్ చేసుకునేందుకు ముందుకొచ్చింది. దివాలా చట్టం నిబంధనల ప్రకారం ఈ ప్రతిపాదనకు కంపెనీకి రుణాలు ఇచ్చిన బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల్లో 90 శాతం మంది ఒప్పుకోవాల్సి ఉంటుంది.

ఒప్పుకోక తప్పదు: దివాలా ప్రక్రియలో ఉన్న గాయత్రీ ప్రాజెక్ట్స్‌ను కొనుగోలు చేసేందుకు మార్క్ ఏబీ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్స్ అనే ఒకే ఒక సంస్థ ముందుకొచ్చింది. అయితే ఇందుకోసం ఈ కంపెనీ రూ.650 కోట్లు మాత్రమే ఆఫర్ చేసింది. మళ్లీ ఇందులో రూ.50 కోట్లు నగదు రూపంలో, మిగతా మొత్తం గ్యారెంటీల రూపంలో చెల్లిస్తానని తెలిపింది. ఈ ఆఫర్‌తో పోలిస్తే కంపెనీ ప్రమోటర్లు ఆఫర్ చేసిన రూ.750 కోట్ల ఆఫర్ ఆకర్షణీయంగా ఉంది. దీంతో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ ఆఫర్‌కే మొగ్గు చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు.

అల్టిమెట్రిక్ కొనుగోలు బరిలో 4 పీఈ దిగ్గజాలు

60 శాతం వాటా రూ.7,500 కోట్లకు విక్రయించే అవకాశం

ముంబై: ఆంధ్ర సంతతికి చెందిన అమెరికన్ రాజ్ వట్టికూటి 2012లో స్థాపించిన డిజిటల్ సేవల కంపెనీ అల్టిమెట్రిక్‌లో మెజారిటీ వాటా కొనుగోలుకు అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) దిగ్గజాలైన జనరల్ అట్లాంటిక్, టీపీజీ క్యాపిటల్, వార్‌బర్గ్ పిన్‌కస్, ఒంటారియో టీచర్స్ పెన్షన్ ప్లాన్ పోటీపడుతున్నట్లు తెలిసింది. రాజ్ వట్టికూటి కంపెనీలో 60 శాతం వాటాను సుమారు 90 కోట్ల డాలర్లకు (రూ.7,500 కోట్లు) విక్రయించే ఆలోచనలో ఉన్నారని సమాచారం. ఈ లెక్కన అల్టిమెట్రిక్ మార్కెట్ విలువ 150 కోట్ల డాలర్ల (రూ.12,500 కోట్లు) స్థాయిలో ఉండనుంది. కంపెనీ కొనుగోలుకు తుది బిడ్డింగ్ జూన్ తొలి వారంలో జరిగే అవకాశం ఉంది. అల్టిమెట్రిక్‌కు అంతర్జాతీయంగా 22 కార్యాలయాలుండగా.. అందులో 6 భారత్ (హైదరాబాద్, పుణె, చెన్నై, బెంగళూరు, జైపూర్, గురుగ్రామ్)లో ఉన్నాయి. కంపెనీకి చెందిన 6,500 మంది సిబ్బందిలో 80 శాతం భారత కార్యాలయాల్లోనే పనిచేస్తున్నారు. బీఎఫ్ఎస్ఐ, ఫిన్‌టెక్, ఆటోమోటివ్, మాన్యుఫాక్చరింగ్, రిటైల్, ఫార్మా, లైఫ్‌సైన్సెస్‌కు రంగాలకు చెందిన పలు అంతర్జాతీయ సంస్థలకు అల్టిమెట్రిక్ సేవలందిస్తోంది. సిటీ గ్రూప్, మోర్గాన్ స్టాన్లీ, నోవార్టిస్, సోనీ, షిండ్లెర్, సామ్‌సంగ్ ఈ జాబితాలో ఉన్నాయి. రాజ్ వట్టికూటి 2007లోనూ కన్సల్టింగ్ అండ్ టెక్నాలజీ సర్వీసెస్ కంపెనీ కోవాన్సిస్‌ను కంప్యూటర్ సైన్స్ కార్పొరేషన్ (ప్రస్తుతం డీఎక్స్‌సీ టెక్నాలజీ)కు 130 కోట్ల డాలర్లకు విక్రయించారు.

వార్‌బర్గ్ పింకస్ చేతికి శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్

డీల్ విలువ రూ.4,630 కోట్లు

న్యూఢిల్లీ: ఆర్థిక సర్వీసుల రంగంలోని శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థ తమ గృహనిర్మాణ ఫైనాన్స్ విభాగాన్ని ప్రైవేట్ ఈక్విటీ సంస్థ వార్‌బర్గ్ పింకస్‌కు విక్రయించినట్టు ప్రకటించింది. ఈ డీల్ విలువ రూ.4,630 కోట్లు. వాహన రుణాలు, చిన్న వ్యాపారాలకు రుణాలందించడంపై దృష్టి సారించడం కోసం హౌసింగ్ ఫైనాన్స్‌ను విక్రయించినట్టు తెలిపింది. డీల్ ముగియగానే శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్‌లో (ఎస్‌హెచ్ఎఫ్) మరో రూ.1,000 కోట్లు పెట్టుబడి పెట్టడానికి వార్‌బర్గ్ సంసిద్ధత ప్రకటించింది. వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి డీల్ పూర్తి చేసుకునే ఆస్కారం ఉన్నదని శ్రీరామ్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఉమేశ్ రేవంకర్ తెలిపారు. ఎస్‌హెచ్ఎఫ్ ఏడాదికి 50% సమీకృత వృద్ధిని సాధించిందని ఆయన చెప్పారు. ఎస్‌హెచ్ఎఫ్‌లో పెట్టిన పెట్టుబడులపై శ్రీరామ్ ఫైనాన్స్ 22% రాబడి పొందుతున్నట్టు ఆయన తెలిపారు. ఎస్‌హెచ్ఎఫ్‌లో శ్రీరామ్ ఫైనాన్స్ 83.8% వాటా కలిగి ఉండగా 14.8% వాటా పీఈ కంపెనీ వాలియెంట్ చేతుల్లో ఉండగా మిగతా 1.4% వాటా ఉద్యోగుల చేతిలో ఉంది.

3,000 మంది ఉద్యోగులు: ఈ డీల్ ప్రకారం ఎస్‌హెచ్ఎఫ్‌లో వాటాల విక్రయానికి ఆసక్తి కనబరుస్తున్న వారందరి నుంచి వాటాలను తన అనుబంధ సంస్థ మ్యాంగో క్రెస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్ ద్వారా వార్‌బర్గ్ కొనుగోలు చేస్తుంది. ఈ డీల్‌కు నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బీ), కాంపిటీషన్ కమిషన్ సీసీఐ), ఆర్‌బీఐ అనుమతులు లభించాల్సి ఉంది. ఎస్‌హెచ్ఎఫ్‌లో 3,000 మంది ఉద్యోగులున్నారు. డీల్ ముగిసిన అనంతరం వాటాదారుల విలువను పెంచేందుకు ఎస్‌హెచ్ఎఫ్ స్టాండ్‌ఎలోన్ విభాగంగా చలామణిలో ఉంటుంది. "భారత అఫర్డబుల్ హౌసింగ్ విభాగంలో అవకాశాల పట్ల మాకు చాలా ఆనందంగా ఉంది. శ్రీరామ్‌కు గల బలమైన టీమ్, నిలకడగా ఆర్థిక పురోగతి, భౌగోళిక విస్తరణ, కస్టమర్ ప్రధాన వైఖరి, శక్తివంతమైన విధానాలు కంపెనీని ప్రత్యేకంగా నిలిపే అంశాలు" అని వార్‌బర్గ్ పింకస్‌లో ఇండియా పీఈ విభాగం అధిపతి నరేంద్ర ఓస్వాల్ అన్నారు.

కేవీబీ లాభంలో 35 శాతం వృద్ధి

చెన్నై: ప్రైవేట్ రంగంలోని కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ).. గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24) మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో రూ.456 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.338 కోట్లు)తో పోల్చితే లాభం 35 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.2,169 కోట్ల నుంచి రూ.2,813 కోట్లకు పెరిగింది. కాగా త్రైమాసిక కాలంలో బ్యాంక్ స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 2.27 శాతం నుంచి 1.40 శాతానికి, నికర ఎన్‌పీఏలు కూడా 0.74 శాతం నుంచి 0.40 శాతానికి తగ్గినట్లు తెలిపింది. మరోవైపు మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను రూ.9,863 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.1,6,05 కోట్ల నికర లాభాన్ని బ్యాంక్ నమోదు చేసింది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.1.20 డివిడెండ్‌ను బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

-798 నుంచి +111 పాయింట్లకు

దాదాపు 1,000 పాయింట్ల శ్రేణిలో ఊగిసలాడిన సెన్సెక్స్



ముంబై: సోమవారం ఆరంభ ట్రేడింగ్‌లో భారీ నష్టాలు చవిచూసిన ప్రామాణిక ఈక్విటీ సూచీలు.. చివర్లో కొనుగోళ్లతో మళ్లీ లాభాల్లోకి మళ్లాయి. సోమవారం నష్టాల్లో ప్రారంభమైన సెన్సెక్స్.. ఒక దశలో 798.46 పాయింట్లు క్షీణించి 71,866.01 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. మధ్యాహ్నం నుంచి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, టీసీఎస్ వంటి దిగ్గజ షేర్లలో కొనుగోళ్లు జరగడంతో సూచీలు కోలుకుని ఒక దశలో సూచీ దాదాపు 200 పాయింట్ల వరకు లాభపడి 72,863.56 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఇంట్రాడేలో దాదాపు 1,000 పాయింట్ల శ్రేణిలో కదలాడిన సెన్సెక్స్.. చివరికి 111.66 పాయింట్ల లాభంతో 72,776.13 వద్ద ముగిసింది. నిఫ్టీ 48.85 పాయింట్ల వృద్ధితో 22,104.05 వద్ద స్థిరపడింది.

సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 16 లాభపడ్డాయి. ఏషియన్ పెయింట్ షేరు 3.83 శాతం ఎగిసి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, సన్ ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు ఒక శాతానికి పైగా పెరిగాయి. కాగా, త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాలను మెప్పించలేకపోవడంతో టాటా మోటార్స్ షేరు 8.34 శాతం పతనమై సెన్సెక్స్ టాప్ లూజర్‌గా మిగిలింది. బీఎస్ఈలోని మిడ్ క్యాప్ సూచీ 0.36 శాతం పెరగగా.. స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.23 శాతం తగ్గింది. రంగాలవారీ సూచీల్లో సర్వీసెస్, రియల్టీ, హెల్త్‌కేర్, ఇండస్ట్రియల్స్ ఒక శాతానికి పైగా లాభపడ్డాయి. కన్స్యూమర్ డిస్క్రెషనరీ, టెలికాం, యుటిలిటీస్, ఆటో రంగ సూచీలు మాత్రం నేలచూపులు చూశాయి.

రుల్కా ఎలక్ట్రికల్స్ ఇష్యూ ధరల శ్రేణి రూ.223-235

ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రికల్ సర్వీసెస్ కంపెనీ రుల్కా ఎలక్ట్రికల్స్ ఐపీఓ ఈ నెల 16న ప్రారంభమై 21న ముగియనుంది. పబ్లిక్ ఇష్యూలో విక్రయించనున్న షేర్ల ధరల శ్రేణిని కంపెనీ రూ.223-235గా నిర్ణయించింది. తద్వారా రూ.26 కోట్ల వరకు సమీకరించాలనుకుంటోంది. ఐపీఓ అనంతరం కంపెనీ షేర్లను ఎన్ఎస్ఈ ఎస్ఎంఈ సెగ్మెంట్ ప్లాట్‌ఫామ్ 'ఎన్ఎస్ఈ ఎమర్జ్'లో లిస్ట్ చేయనుంది.

ఇండీజీన్ లిస్టింగ్ అదుర్స్

హెల్త్‌కేర్ టెక్నాలజీ కంపెనీ ఇండీజీన్ లిమిటెడ్ సోమవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.452తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 45.95 శాతం ప్రీమియంతో రూ.659.70 వద్ద లిస్టయింది. తొలి రోజు ట్రేడింగ్ ముగిసేసరికి 26.25 శాతం లాభంతో రూ.570.65 వద్ద స్థిరపడింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.13,614.40 కోట్లుగా నమోదైంది. గత వారంలో ముగిసిన ఇండీజీన్ ఐపీఓకు ఇష్యూ సైజుకు దాదాపు 70 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

'యారా'కు కాకినాడ నుంచి అమ్మోనియా

హైదరాబాద్: నార్వే కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న 'యారా క్లీన్ అమ్మోనియా' సంస్థ కాకినాడలోని గ్రీన్‌కో జీరోసీ కంపెనీ నుంచి పెద్ద మొత్తంలో అమ్మోనియాను కొనుగోలు చేయనుంది. దీనికి సంబంధించి రెండు కంపెనీల మధ్య ఒక దీర్ఘకాలిక ఒప్పందం కుదిరింది. గ్రీన్‌కో జీరోసీ సంస్థ.. హైదరాబాద్ కేంద్రంగా పని చేసే ఏఎం గ్రీన్ అనుబంధ సంస్థ. గ్రీన్‌కో జీరోసీ కంపెనీ కాకినాడలో 10 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ తొలి దశ నిర్మాణం 2027 నాటికి పూర్తి కానుంది. ఇందులో ఐదు లక్షల టన్నులు యారా క్లీన్ అమ్మోనియా కంపెనీ దిగుమతి చేసుకోనుంది. యారా క్లీన్ అమ్మోనియా పర్యావరణకు హాని చేయని ఈ గ్రీన్ అమ్మోనియాను యూరప్‌లోని ఎరువులు, విద్యుదుత్పత్తి, నౌకాయానం వంటి కంపెనీలకు సరఫరా చేయనుంది.

ఆధార్ ఆధారిత జీఎస్‌టీ రిజిస్ట్రేషన్లు

ఆసక్తి చూపిస్తున్న తెలంగాణ

న్యూఢిల్లీ: జీఎస్‌టీ పన్ను వసూళ్ల వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ధ్రువీకృత జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ల వ్యవస్థను ప్రవేశపెట్టనుంది. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణతో సహా ఐదు రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై ఇప్పటికే ఆసక్తి వ్యక్తం చేశాయి. ఈ నెల ప్రారంభంలో జరిగిన కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల జీఎస్‌టీ ఉన్నతాధికారుల సమావేశంలోనూ ఈ విషయాన్ని చర్చించారు. ఈ విధానం అమలుకు అయ్యే ఖర్చు, అవసరమైన మౌలిక సదుపాయాలు, మానవ వనరుల గురించి ఈ ఐదు రాష్ట్రాలు వివరాలు అడిగినట్టు అధికార వర్గాలు చెప్పాయి. ఆ రాష్ట్రాలు అడిగిన సమాచారాన్ని కేంద్ర ప్రభుత్వ జీఎస్‌టీ అధికార వర్గాలు, ఆయా రాష్ట్రాల జీఎస్‌టీ అధికారులకు అందించాయి. ప్రస్తుతం గుజరాత్, ఆంధ్రప్రదేశ్, కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి ప్రయోగాత్మకంగా దీన్ని అమలు చేస్తున్నాయి.


మరింత తగ్గిన ధరల కాటు

ఏప్రిల్‌లో ద్రవ్యోల్బణం 4.83 శాతం

న్యూఢిల్లీ: ఆహారంలో నిత్యం ఉపయోగించే వస్తువుల ధరలు తగ్గడంతో ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 11 నెలల కనిష్ఠ స్థాయి 4.83 శాతానికి దిగి వచ్చింది. మార్చి నెలలో ఇది 4.85 శాతం ఉండగా గత ఏడాది ఏప్రిల్‌లో 4.7 శాతం ఉంది. గతంలో నమోదైన ద్రవ్యోల్బణం కనిష్ఠ స్థాయి 4.31 శాతం. గత ఏడాది మే నెలలో ఇది నమోదైంది. ప్రస్తుతానికి వస్తే కొన్ని రకాల ఆహార వస్తువుల ధరలు తగ్గినప్పటికీ కొన్నింటి ధరలు పెరగడం వల్ల ఆ విభాగంలో ద్రవ్యోల్బణం మార్చి నెలతో పోల్చితే స్వల్పంగా అంటే 8.52 శాతం నుంచి 8.70 శాతానికి పెరిగింది. ఏప్రిల్ నెలలో గుడ్లు, మాంసం, సుగంధ ద్రవ్యాలు, తృణధాన్యాలు, అనుబంధ ఉత్పత్తుల ధరలు తగ్గినా పళ్లు, కూరగాయలు, పప్పుల ధరలు మాత్రం పెరిగాయి.

'దక్ష'లో కోరమాండల్‌కు మరింత వాటా

హైదరాబాద్: చెన్నై కేంద్రంగా పని చేసే దక్ష అన్‌మ్యాన్‌డ్ సిస్టమ్స్ (డీయూఎస్)లో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ మరింత వాటా కొనుగోలు చేసింది. రూ.150 కోట్లతో డీయూఎస్ ఈక్విటీలో మరో 7 శాతం వాటా కొనుగోలు చేసింది. దీంతో డీయూఎస్ ఈక్విటీలో కోరమాండల్ వాటా 51 శాతం నుంచి 58 శాతానికి చేరింది. కోరమాండల్ టెక్నాలజీ లిమిటెడ్ అనే అనుబంధ కంపెనీ ద్వారా ఈ కొనుగోలును చేపట్టింది. టెక్నాలజీ ద్వారా వివిధ రంగాల్లో టెక్నాలజీ ఆధారిత అప్లికేషన్లను ప్రోత్సహించాలనే యోచనతో దక్ష అన్‌మ్యాన్‌డ్ సిస్టమ్స్‌లో వాటా పెంచుకున్నట్టు కోరమాండల్ ఇంటర్నేషనల్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అరుణ్ అలగప్పన్ తెలిపారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,250 ▼	67,150 ▼	90,000 ▼
ముంబై	72,164 ▼	66,102 ▼	83,494 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

14వ తేదీ



హైదరాబాద్	540	విజయవాడ	540
వరంగల్	542	గోదావరి	540
చిత్తూరు	608	విశాఖపట్నం	550

డజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	135	గోదావరి	145
వరంగల్	135	విజయవాడ	145
కరీంనగర్	135	గుంటూరు	145
మహబూబ్‌నగర్	135	ఒంగోలు	145
కర్నూలు	135	చిత్తూరు	152
విశాఖపట్నం	137		



రోశయ్య కారును చుట్టుముట్టి ఆందోళన చేస్తున్న దళితులు

ఎస్సీ మహిళలపైకి వైసీపీ ఎంపీ అభ్యర్థి కారు

- పలువురికి స్వల్ప గాయాలు.. ఆగ్రహించిన దళితులు
- కారు అద్దాలు ధ్వంసం.. తప్పించుకున్న కిలారి రోశయ్య

పెదకాకాని, మే 13: దళిత మహిళల పట్ల గుంటూరు లోక్‌సభ వైసీపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య దురుసుగా ప్రవర్తించారు. సోమవారం గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. తక్కెళ్లపాడు గాంధీనగర్‌లో అత్యధికంగా ఎస్సీలు నివసిస్తున్నారు. ఎన్నికల పోలింగ్ సరళి పరిశీలనలో భాగంగా వైసీపీ ఎంపీ అభ్యర్థి రోశయ్య గాంధీనగర్ కొచ్చారు. అయితే, గ్రామంలో మెజార్టీ ఓటర్లు ఉన్న తమను కాదని కేవలం 41 ఓట్లు ఉన్న వేరే వర్గాన్ని మీరు దగ్గరకు తీసుకున్నారని, ఇది సబబు కాదని ఆక్రోశించారు. ఒకింత ఆగ్రహానికి గురైన రోశయ్య తన కార్యకర్తలను ఆ దళిత మహిళల పైకి ఉసిగొలిపారు. మహిళలకు సరైన సమాధానం చెప్పకుండా కారును ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో కారు టైర్లు ఆ మహిళల కాళ్లపైకి ఎక్కి వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఆగ్రహానికి గురైన దళిత మహిళలు, దళితులంతా రోశయ్య కారును చుట్టుముట్టి గొడవ చేశారు. దాడి చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. కారు అద్దాలను ధ్వంసం చేశారు. అయినప్పటికీ రోశయ్య కారు దిగకుండా చాకచక్యంగా అక్కడి నుంచి జారుకున్నారు. ఇంకొకసారి తమ గ్రామానికి వస్తే తగిన శాస్తి చెబుతామని హెచ్చరించారు.

నిడదవోలు ఎమ్మెల్యేకు ఓటర్ల సెగ

నిడదవోలు, మే 13: తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు వైసీపీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడుకు ఓటర్ల సెగ తగిలింది. సోమవారం పోలింగ్‌లో ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు పలు పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఇందులో భాగంగా కాటకూటేశ్వరంలోని 12, 13 పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లి వస్తూ... ఓటర్లకు అభివాదం చేస్తూ వారితో మాట్లాడుతుండగా.. పోలింగ్ కేంద్రాల్లో ప్రచారం ఎందుకు నిర్వహిస్తున్నారంటూ కొందరు గ్రామస్థులు ఆయన్ను నిలదీశారు. దీంతో ఆయన పోలీసులను పిలిపించి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారని స్థానికులు చెప్పారు. అలాగే, నిడదవోలు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏబీఎన్ చానల్ రిపోర్టర్ సెల్‌ఫోన్‌తో వీడియోలు చిత్రీకరిస్తుండగా.. ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ సెల్‌ఫోన్ లాక్కున్నారు. ఆపై ఆయన అనుచరులు.. సెల్‌ఫోన్‌లో ఉన్న వీడియో డేటా డిలీట్ చేసి సెల్‌ఫోన్ ఇచ్చేశారు.

రైలు ఆలస్యం.. ఓటు హక్కు దూరం!

- నాందేడ్ నుంచి వచ్చిన వారికి నిరాశ.. విశాఖ ఓటర్ల ఆవేదన

విశాఖపట్నం, మే 13(ఆంధ్రజ్యోతి): ఎంతో దూరం నుంచి ఓటు వేయడానికి బయలుదేరిన విశాఖవాసులకు చివరికి నిరాశే మిగిలింది. రైల్వే శాఖ తనదైన నిర్లక్ష్యంతో రైలును ఆలస్యంగా నడపడం వల్ల వారు సకాలంలో చేరుకోలేకపోయారు. విశాఖపట్నం జిల్లాకు చెందిన పలువురు ఉపాధి, ఉద్యోగ రీత్యా నాందేడ్‌లో ఉంటున్నారు. ఎన్నికల్లో ఓటేసేందుకు అక్కడి నుంచి నాందేడ్ నుంచి విశాఖపట్నం వచ్చే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరారు. అక్కడ సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరాల్సిన రైలు ఆరు గంటలు ఆలస్యమైంది. సోమవారం ఉదయం 5.50 గంటలకు సికింద్రాబాద్ చేరింది. షెడ్యూల్ ప్రకారం సోమవారం ఉదయం 9.10 గంటలకు విశాఖ చేరుకోవల్సి ఉండగా.. తొమ్మిది గంటలు ఆలస్యమయింది. అదే తీరుగా రైలు నడిస్తే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం లేదని గ్రహించిన ప్రయాణికులు అధికారులకు, రైల్వే స్టేషన్లలో మాస్టర్లకు ఫిర్యాదు చేశారు. వేగంగా తీసుకువెళ్లాల్సిందిగా కోరారు. కానీ ఎవరూ సాయం చేయలేదు. దాంతో వారు ఒక వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారు. తమకు ఎవరైనా సాయం చేయాలని కోరారు. ఎంత రాత్రయినా ఓటు హక్కు కల్పించేలా చూడాలని వేడుకున్నారు. అయితే ఈ రైలు 8.07 గంటలు ఆలస్యంగా సోమవారం సాయంత్రం 5.17 గంటలకు విశాఖపట్నం చేరుకుంది. రైలు దిగి స్టేషన్ నుంచి ఇంటికి వెళ్లి, ఓటరు కార్డు తీసుకొని కొందరు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేసరికి పుణ్యకాలం(సాయంత్రం 6గంటలు) దాటిపోయింది. పోలింగ్ కేంద్రాల గేట్లు వేసేశారు. సమయం అయిపోయిందని చెప్పేశారు. దూరం నుంచి వచ్చామన్నా వినలేదు.

ఓటేసి ఒకరు.. ఓటేయకుండా మరొకరు!

- పోలింగ్ కేంద్రాల వద్ద వృద్ధుల మృతి

రౌతులపూడి, కైకలూరు, మే 13: కాకినాడ జిల్లా రౌతులపూడి మండలంలోని ఎ.మల్లవరానికి చెందిన రొంగల సింహాచలం (70) సోమవారం ఓటు హక్కు వినియోగించుకుని మృతిచెందింది. ఓటు వేసిన ఆమె అస్వస్థతకు గురైంది. ఆసుపత్రికి తీసుకెళ్లేసరికే మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. అలాగే, ఏలూరు జిల్లా కైకలూరు మండలం వింజరంలో గోలి త్రిరత్న ప్రభాకరరావు(65) ఓటు వేసేందుకు వెళ్లారు. కొద్దిసేపు క్యూలైన్లో నిలబడి ఒక్కసారిగా కుప్పకూలి అపస్మారక స్థితికి చేరుకున్నారు. కూర్చున్న వ్యక్తి కూర్చున్న విధంగానే గుండెపోటుతో మృతి చెందారు.

పిఠాపురంలో చీకట్లో ఈవీఎంలు

పిఠాపురం, మే 13: పిఠాపురంలోని పలు పోలింగ్ కేంద్రాలవద్ద ఓటర్లు ఆందోళనకు దిగారు. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, పాతబస్టాండు మునిసిపల్ హైస్కూలు, ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల తదితర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో అసెంబ్లీకి సంబంధించిన ఈవీఎంలు ఉంచిన కంపార్ట్‌మెంట్లు చీకట్లో ఉండడంతో ఓటర్లకు గుర్తు కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో తమకు గుర్తులు కనిపించడం లేదంటూ వారు పోలింగ్ కేంద్రాల బయట ఆందోళనకు దిగారు.

రిగ్గింగ్‌కు వైసీపీ నేతల విఫలయత్నం

- ఓటు విషయంలో పోలింగ్ ఏజెంట్ల మధ్య ఘర్షణ

సంతమాగులూరు, మే 13: ప్రశాంతంగా సాగుతున్న ఎన్నికల పోలింగ్ కాస్త.. వైసీపీ నేతల తీరుతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గం సంతమాగులూరు మండలం వెల్లలచెరువులోని 5వ నెంబరు పోలింగ్ బూత్‌లో సోమవారం ఓ వృద్ధురాలు ఓటు విషయమై వైసీపీ, టీడీపీ పోలింగ్ ఏజెంట్ల మధ్య వాగ్వాదం జరిగి, ఘర్షణకు దారి తీసింది. దీంతో కొద్దిసేపు పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాణెం చిన్నహనిమిరెడ్డి పోలింగ్ బూత్ వద్దకు చేరుకొని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ శ్రేణులు పోలింగ్ నిలిపివేయించడంతోపాటు రిగ్గింగ్‌కు పాల్పడేందుకు ప్రయత్నం కూడా చేసినట్లు టీడీపీ వర్గీయులు ఆరోపిస్తున్నారు. దీంతో టీడీపీ శ్రేణులు హనిమిరెడ్డిని చుట్టుముట్టారు. పోలీస్‌లు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. పోలింగ్ బూత్‌లో ఉన్న హనిమిరెడ్డిని పోలీసులు బయటకు తీసుకువచ్చి, పోలింగ్ పునఃప్రారంభించి కొనసాగించారు. ఏఎస్పీ వెల్లలచెరువు వచ్చి పరిశీలించారు.

అరాచక పర్వం

పోలింగ్ కేంద్రాలపై పేట్రేగిన వైసీపీ గూండాలు



రెంటాలలో వైసీపీ మూకలు నిప్పుపెట్టడంతో దహనమవుతున్న మాచర్ల టీడీపీ అభ్యర్థి బ్రహ్మారెడ్డి కారు



మాచర్లలో వైసీపీ మూకల దాడిలో గాయపడిన టీడీపీ ఏజెంట్ చేర్రెడ్డి మంజుల



మాచర్ల ఎమ్మెల్యే సోదరుడు వెంకట్రామిరెడ్డి దాడిలో గాయపడిన టీడీపీ నేత

(ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్)

పోలింగ్ కేంద్రాలపై వైసీపీ గూండాలు పేట్రేగిపోయారు. పోలింగ్ పర్యవేక్షణ చేస్తున్న ఏజెంట్లు, అభ్యర్థుల నుంచి ఓటుహక్కు వినియోగించుకోవడానికి వచ్చిన పౌరులు, పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిస్తున్న పోలీసుల వరకు.. అందరిపైనా అరాచకంగా విరుచుకుపడ్డారు. తాడిపత్రి, మాచర్ల, నరసరావుపేట, గన్నవరం, పెనమలూరు, కాకినాడ... విజయనగరం.. ఇలా రాష్ట్రం ఆ మూల నుంచి ఈ మూల వరకు వైసీపీ మూకల హింసాకాండ యథేచ్ఛగా కొనసాగింది. వైసీపీ దాడులు, దౌర్జన్యాలు ఏ స్థాయికి చేరుకున్నాయంటే.. తాడిపత్రిలో పోలీసులు ఏకంగా ఇళ్లల్లోకి వెళ్లి తలుపులు వేసుకుని దాక్కున్నారు. ఏకంగా ఎస్పీ వాహనంపైనే వైసీపీ మూకలు రాళ్లు విసిరాయి. తాడిపత్రిలో వైసీపీ మూకల రాళ్లదాడులకు నిరసనగా బైకు ర్యాలీ నిర్వహించిన టీడీపీ శ్రేణులపై మరోసారి దాడి చేయడంతో, బాలింత అయిన భార్యను ఓటేసేందుకు తీసుకెళుతున్న వ్యక్తి తలపగిలింది. ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు గృహనిర్బంధం చేశారు. కడప జిల్లా కోడూరు నియోజకవర్గంలోని పుల్లంపేటలో టీడీపీ ఏజెంట్లపై వైసీపీ గూండాలు విచక్షణా రహితంగా దాడి చేశారు. సుభాశ్‌రెడ్డి అనే టీడీపీ నాయకుడిని దారుణంగా కొట్టి ఊరిబయట పడేశారు. రైల్వే కోడూరు, మైదుకూరు, రాయచోటి నియోజకవర్గాల్లో ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని వైసీపీ శ్రేణులు దాడులకు దిగాయి. టీడీపీకి చెందిన పలు ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశాయి. ఖాజీపేట మండలం పుల్లూరులో టీడీపీ కార్యకర్త చెన్నయ్యపై వైసీపీ నాయకుడు నాగేశ్వర రెడ్డి దాడి చేయడం ఉద్రిక్తతకు దారి తీసింది. డోన్ నియోజకవర్గంలోని బేతంచెర్లలో స్వతంత్ర అభ్యర్థి బాబుపై మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అనుచరులు దాడి చేశారు. మాచర్లలో వైసీపీ గూండాలు ఎక్కడికక్కడ దౌర్జన్యాలు చేశారు. ఈవీఎంల ధ్వంసం, టీడీపీ ఏజెంట్లపై దాడులు, దౌర్జన్యాలు చిత్రీకరిస్తున్న మీడియా ప్రతినిధులపైనా దాడులు చేశారు. సత్తెనపల్లిలో పలుచోట్ల పరస్పర దాడులతో వాహనాలు దెబ్బతిన్నాయి. విజయవాడలో ఎన్డీయే ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్నిని వైసీపీ గూండాలు, ఆయన వాహనాలను వెంబడించి దాడులు చేశారు. గన్నవరంలో ఎమ్మెల్యే అభ్యర్థులు వల్లభనేని వంశీ, యార్లగడ్డ వెంకట్రావ్ ఒకేసారి ముస్తాబాద ప్రాంతానికి వచ్చారు. ఇరు వర్గాలకు చెందిన కార్యకర్తలు చెప్పులు, రాళ్లతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు.

టీడీపీ అభ్యర్థి కొండయ్యపై దౌర్జన్యం

బాపట్ల జిల్లాలో వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. రేపల్లె టీడీపీ అభ్యర్థి అనగాని సత్యప్రసాద్, చీరాల టీడీపీ అభ్యర్థి ఎంఎం కొండయ్యపై దాడికి ప్రయత్నించారు. చీరాల మండలం గవిని వారిపాలెంలో వైసీపీ శ్రేణుల దాడిలో టీడీపీ కార్యకర్త గాయపడ్డారు. టీడీపీ అభ్యర్థి ఎంఎం కొండయ్య అక్కడకు చేరుకుని పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న సమయంలో వైసీపీ మూకలు ఆయన పైకి దూసుకొచ్చారు. దాడిలో ఆయన కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అనుచరుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ మార్పు గ్రెగోరీ సోమవారం రాత్రి రక్తగాయాలతో బాపట్ల జిల్లా చీరాలలోని ప్రైవేటు వైద్యశాలలో చేరారు. డీఎస్పీ బేతపూడి ప్రసాద్ గన్ వెనక్కు తిప్పి ఆయన ముఖంపై దాడి చేసినట్లు ఆమంచి అనుచరులు ఆరోపిస్తున్నారు. సినీ నిర్మాత, రచయిత కోన వెంకట్ బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం మండలంలోని పోలింగ్ బూత్ వద్ద హంగామా సృష్టించారు. చీఫ్ ఏజెంట్‌గా ఆయనకు ఒక్కడికి మాత్రమే లోపలికి వెళ్లడానికి అనుమతి ఉన్నప్పటికీ పదుల సంఖ్యలో అనుచరులను వెంటేసుకుని బూత్‌ల వద్ద ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారు.

జోగి అనుచరుల వీరంగం

పెనమలూరు నియోజకవర్గం పోరంకి ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద మంత్రి జోగి రమేశ్, ఆయన కుమారులు మైలవరం, పెడన నియోజకవర్గాల నుంచి తీసుకొచ్చిన వారితో దొంగ ఓట్లు వేయించేందుకు ప్రయత్నించారు. టీడీపీ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. గన్నవరం నియోజకవర్గం పరిధిలో నున్న హైస్కూల్, గ్రామ సచివాలయాల వద్దకు వచ్చిన ఎన్డీయే అభ్యర్థి యార్లగడ్డపై వైసీపీ అభ్యర్థి వంశీ అనుచరులు దాడికి ప్రయత్నించారు.

కానిస్టేబుల్ హల్‌చల్..

ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం ముటుకులలో వైసీపీ అభ్యర్థి చంద్రశేఖర్ పోలింగ్ బూత్‌లోకి దౌర్జన్యంగా వెళ్లి తలుపులు వేసుకున్నారు. టీడీపీ కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. డ్యూటీలో ఉన్న బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ రెండు రౌండ్లు నేలపై కాల్పులు జరిపారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు జడ్పీ బాలికోన్నత పాఠశాలవద్ద బూత్‌లో ఉద్రిక్తత నెలకొంది. జనసేన ఏజెంట్లు కండువాలు తీసేయాలని వైసీపీ ఏజెంట్లు గొడవకు దిగారు. అయితే పోలింగ్ కేంద్రాల్లో ఫ్యాన్లు తీసేయాలని జనసేన ఏజెంట్లు బదులిచ్చారు.

పెద్దిరెడ్డి సొంతూరులో..

చిత్తూరు జిల్లాలో వైసీపీ నాయకులు అరాచకాలు సృష్టించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత మండలం సదుంలోని బూరగమంద గ్రామంలో 14 మంది టీడీపీ ఏజెంట్లను వైసీపీ నాయకులు సోమవారం తెల్లవారుజామున 4.30 గంటలకే కిడ్నాప్ చేశారు. వారిని విచక్షణారహితంగా కొట్టారు. దీనిపై రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రాజు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో ఉదయం ఆరు గంటలకు వారిని పీలేరు పించానది బ్రిడ్జి సమీపంలో విడిచి పారిపోయారు. చిత్తూరులో పోలింగ్ కేంద్రాలను పరిశీలించేందుకు వెళ్లిన టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్‌కు.. షర్మన్ స్కూల్, మంగసముద్రం కేంద్రాల వద్ద వైసీపీ నేత, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి తన వాహనాన్ని అడ్డుపెట్టారు. ప్రశ్నించినందుకు టీడీపీ శ్రేణుల మీద వైసీపీ వాళ్లు దాడి చేశారు. యాదమరి మండలం 14 కండ్రిగ ముస్లింవాడ కేంద్రంలో దొంగ ఓట్లు వేస్తున్న వైసీపీ నాయకుల్ని టీడీపీ శ్రేణులు వీడియో తీశారు. దీంతో వారిపై 50 మంది వైసీపీ కార్యకర్తలు.. కత్తులతో, రాడ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.

కుప్పంలో తలుపులేసిన వైసీపీ

చంద్రబాబు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం మండలం సింగసముద్రంలో వైసీపీ అభ్యర్థి భరత్ పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి తలుపులు మూసేశారు. వెంటనే టీడీపీ నాయకులు తలుపులు తెరిచారు. దీంతో వైసీపీ శ్రేణులు వీరంగం సృష్టించి టీడీపీ నేతల మీద దాడి చేశారు. కడప జిల్లా మైదుకూరు నియోజకవర్గం చాపాడు మండలం చిన్నగురవలూరులో టీడీపీ ఏజెంట్లపై వైసీపీ శ్రేణులు బయటికి లాక్కొచ్చి దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పులివెందుల నియోజకవర్గంలోని వేముల మండలం మబ్బుచింతలలో వైసీపీ నేత పోలింగ్ బూత్ వద్ద ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నాలు చేయడంతో టీడీపీ నేతలు అడ్డుకున్నారు. దీంతో రెచ్చిపోయిన వైసీపీ నేతలు రాళ్లతో దాడి చేశారు. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం కూచువారిపల్లిలో సోమవారం రాత్రి వైసీపీ వర్గీయులు టీడీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డారు.

మాచర్లలో వైసీపీ వీరంగం

- బ్రహ్మారెడ్డి వాహనాలు ధ్వంసం

పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. రెంటచింతల మండలం రెంటాలలో టీడీపీ ఏజెంట్లు, సానుభూతిపరులపై కర్రలు, కొడవళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో టీడీపీ ఏజెంట్ చేర్రెడ్డి మంజుల, మరో ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మాచర్ల టీడీపీ అభ్యర్థి బ్రహ్మారెడ్డి అక్కడికి చేరుకుని గంటకుపైగా ఉన్నారు. ఆయన ఉన్నంత సేపు పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఆయన ఊరు దాటిన తర్వాత వైసీపీ గూండాలు టీడీపీ సానుభూతిపరులను ఓటింగ్‌కు రానివ్వలేదు. దీంతో బ్రహ్మారెడ్డి మళ్లీ రెంటాలకు వెళ్లారు. అక్కడ ఆయనపై హత్యాయత్నం జరిగింది. కళ్లలో కారం కొట్టి దాడులకు తెగబడ్డారు. ఆయన కారుతో సహా మూడు కార్లను ధ్వంసం చేశారు. ఒక కారును తగలబెట్టారు. ఆయన త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఈ ఘటనపై ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠికి, పల్నాడు ఎస్పీ బిందుమాధవ్‌కు బ్రహ్మారెడ్డి ఫిర్యాదు చేశారు. ఇదే నియోజకవర్గంలో పేటసన్నిగండ్ల, ఒప్పిచర్ల, పెదకొదమగుండ్ల, కారంపూడి, చింతపల్లిలో ఘర్షణలు జరిగాయి. ఒప్పిచర్లలో వైసీపీ మూకలు కర్రలతో రోడ్లపై వీరంగం వేస్తూ టీడీపీ నేతలపై రాళ్లు విసిరారు. గొట్టిపాళ్లలో టీడీపీ నేతల గృహాలపై రాళ్లు, సీసా బాటిళ్లు విసిరి భయభ్రాంతులకు గురిచేశారు. టీడీపీ కార్యకర్త రాజబోయిన శ్రీహరి గాయపడ్డారు. జనసేన కార్యకర్త మాదాసు నాగరాజుకు చెందిన బొలేరో వాహనానికి వైసీపీ మూకలు నిప్పంటించి దహనం చేశాయి. మాచర్ల ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డి మాచర్లలో బీభత్సం సృష్టించారు. పీడబ్ల్యూడీ కాలనీలోని పోలింగ్ బూత్ వద్ద ఉన్న టీడీపీ నేతల వాహనాలపై కార్లను ఎక్కించుకుంటూ పోయారు. టీడీపీ నేతలను డీకొట్టి తొక్కించుకుంటూ వెళ్లారు. ఈ ఘటనలో టీడీపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. టీడీపీ నేత యెనుముల కేశవరెడ్డి ఇంటిపై వైసీపీ శ్రేణులు దాడి చేసి కారు, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. టీడీపీ నేతల గృహాల్లోకి దూరి బీభత్సం సృష్టించారు.

అరవిందబాబుపై దాడి

నరసరావుపేటలో వైసీపీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి తన అనుచరులతో టీడీపీ అభ్యర్థి అరవిందబాబుపై దాడి చేయించారు. అరవిందబాబు కాన్వాయ్‌లోని పలు కార్లను ఎమ్మెల్యే గోపిరెడ్డి సమక్షంలో ఆయన అనుచరులు ధ్వంసం చేశారు. ఇందుకు ప్రతిచర్యగా గోపిరెడ్డి ఇంటి వద్ద ఉన్న కార్లను టీడీపీ శ్రేణులు ధ్వంసం చేశారు. నరసరావుపేట మండలం దొండపాడులో టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలుపై వైసీపీ శ్రేణులు దాడి చేశారు. ఆయన కాన్వాయ్‌లోని రెండు కార్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. సత్తెనపల్లి నియోజకవర్గంలోని చీమలమర్రి, కుంకలగుంట, రూపెనగుంట్ల, గుళ్లపల్లి గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ శ్రేణులు దాడులు చేశారు. ఇదే నియోజకవర్గంలో మాదల, రెంటపాళ్ల గ్రామాల్లో పలువురు టీడీపీ కార్యకర్తలను గాయపరిచారు. దాచేపల్లి మండలం తంగెడలో బాంబు దాడులకు వైసీపీ మూకలు పాల్పడ్డాయి. ఈ దాడిలో పలువురు టీడీపీ కార్యకర్తలు గాయపడ్డారు.

చెళ్లుమన్న ఎమ్మెల్యే చెంప

- తెనాలి పోలింగ్ బూత్‌లో వైసీపీ జులుంపై తిరగబడ్డ ఓటరు



సుధాకర్‌పై చేయిచేసుకుంటున్న తెనాలి వైసీపీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



ఎమ్మెల్యే, ఆయన అనుచరుల దాడిలో గాయపడిన సుధాకర్

తెనాలి, మే 13, (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. అధికార పార్టీ అరాచకాలకు పరాకాష్ఠగా తెనాలి పోలింగ్ బూత్‌లో ఏకంగా ఓటరుపైనే ప్రతాపం చూపించారు. ఓటు వేసేందుకు వరుసలో రావాలని, మంది మార్బలంతో లోపలికి వెళితే ఎట్లాగంటూ ఆ ఓటరు ప్రశ్నించడమే పాపమైంది. అంతే... వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే రెచ్చిపోయారు. ఆ ఓటరు ఏదో అంటుండగానే చెంపపై కొట్టగా, ఆయన కూడా ఊహించని విధంగా అంతే వేగంతో ఎమ్మెల్యేను చెంప చెళ్లుమనిపించారు. ఎమ్మెల్యేకు ఊహించని చేదు అనుభవం ఎదురుకావడంతో ఆయన అనుచరులు ఆ ఓటరుపై విచక్షణారహితంగా దాడిచేశారు. తీవ్ర గాయాలతో ఆయన ఆస్పత్రి పాలయ్యారు. వివరాల్లోకి వెళితే...గుంటూరు జిల్లా తెనాలిలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ఉదయం నుంచే ప్రారంభమయింది. ఇక్కడ వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పోటీలో ఉన్నారు. ఆయన కుటుంబానికి ఐతానగర్‌లోని మున్సిపల్ హైస్కూల్‌లో ఓటు ఉంది. సోమవారం ఉదయం వారంతా ఓటు వేసేందుకు అక్కడకు వెళ్లారు. అప్పటికే పోలింగ్ ఆలస్యం కావడం, రెండున్నర గంటల వరకు వరుసలో వేచిఉండటంతో ఓటర్లు విసుగుచెందారు. అదే వరుసలో గొట్టిముక్కల సుధాకర్ అనే ఎన్నారై ఉన్నారు. ఎమ్మెల్యే కుటుంబమే కాకుండా, ఆయన అనుచరులు పదిమందికిపైగా నేరుగా పోలింగ్ కేంద్రంలోకి వెళుతుండటాన్ని సుధాకర్ అభ్యంతరపెట్టారు. వరుసలో రావాలని కోరారు. ఆ విషయంపై సుధాకర్‌కు, ఎమ్మెల్యే అనుచరులకు మధ్య స్వల్ప వాదనలు సాగాయి. ఈలోపే ఎమ్మెల్యే శివకుమార్ వేగంగా అక్కడకు వచ్చి సుధాకర్ చెంపపై కొట్టడం, సుధాకర్ కూడా అంతే వేగంగా ఎమ్మెల్యే చెంపపై కొట్టడం కనురెప్పపాటులో జరిగిపోయాయి. ఆ వెంటనే శివకుమార్ అనుచరులు మూకుమ్మడిగా సుధాకర్‌పై దాడికి దిగారు. 'వెయ్యండిరా... నా కొ...ను.. తన్నండిరా' అంటూ పిడిగుద్దులు గుద్దుతూ విచక్షణా రహితంగా కొట్టారు. కంటిపై, ముఖంపై అనేకచోట్ల గాయాలయిన సుధాకర్ అక్కడున్న గదిలోకి వెళ్లి తలుపు వేసుకున్నారు. కొద్దిసేపటికి పోలీసులు దగ్గరుండి ఓటువేయించి స్టేషన్‌కు సుధాకర్‌ను తీసుకువెళుతుండగా, మరోసారి ఎమ్మెల్యే అనుచరులు విరుచుకుపడ్డారు. కిందపడేసి దారుణంగా కొట్టటంతో ఓటేసేందుకు వరుసలో నిలుచున్న మిగిలినఓటర్లు భయంతో పరుగులుతీశారు. ఆ తర్వాత సుధాకర్‌ను పోలీసులు స్టేషన్‌కు తరలించి.. అక్కడ రెండు గంటలకుపైగా ఉంచారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని, సుధాకర్‌ను వైద్యపరీక్షల కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. మద్యం మత్తులో తనను దుర్భాషలాడటం, కించపరచటం వల్లే చేయిచేసుకున్నానని ఎమ్మెల్యే శివకుమార్ వివరణ ఇచ్చారు. దీనిపై సుధాకర్ కూడా స్పందించారు. "నేను అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశాను. ప్రస్తుతం బెంగుళూరు, హైదరాబాద్‌ల్లో బిల్డర్‌గా కాంట్రాక్టులు చేస్తున్నాను. అమెరికాలో ఎంత ప్రముఖుడైనా వరుసలోనే వస్తారు. ఆ ఉద్దేశంతోనే వరుసలో రావాలని కోరాను. ఎమ్మెల్యే కుటుంబం వరకు వెళితే పట్టించుకునే వాడిని కాదు. కానీ, ఆయన వెంట పదుల సంఖ్యలో అనుచరులు బూత్‌లకు వెళ్లటంవల్లే, అందరినీ వరుసలో రావాలని కోరాను. దీనికి వారు దారుణంగా స్పందించారు. బాధ్యతగా ఉండాల్సిన ఎమ్మెల్యే తాను చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు నేను మద్యం మత్తులో ఉన్నానని, అసభ్యంగా మట్లాడానని నిందలు వేయటం సరికాదు. నేను ఆస్పత్రిలోనే ఉన్నాను. ఇక్కడ నా రక్తం తీసుకుని పరీక్షించుకోవాలి. మద్యం సేవించినట్టు నిర్ధారణ అయితే ఏ శిక్షకైనా సిద్ధమే" అని సుధాకర్ అన్నారు. కాగా, ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘం సీరియస్ అయింది. రోజంతా ఎమ్మెల్యే అన్నాబత్తునిని గృహ నిర్బంధంలో ఉంచాలని ఆదేశించింది. ఇద్దరిపైనా కేసులు నమోదుచేసే ఆలోచనలో అధికారులు ఉన్నట్టు తెలిసింది. ఎన్నికల సంఘం వివరాలు అడిగిందని, చట్ట పరిధిలోని నిబంధనలకు అనుగుణంగా చర్యలకు మాత్రం ఆదేశించిందని పోలీసులు చెబుతున్నారు.



అనంతపురం జిల్లా తాడిపత్రి వీధుల్లో ఇరువర్గాలు రువ్వుకున్న రాళ్లు

అనంతలో బీభత్సం...

అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వీరంగం సృష్టించారు. తాడిపత్రి ఓంశాంతి నగర్ పోలింగ్ కేంద్రం వద్ద పెద్దారెడ్డి కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారన్న సమాచారంతో జేసీ అశ్మిత్‌రెడ్డి తన అనుచరులతో వెళ్లారు. రెండు పార్టీల శ్రేణులు రాళ్లు రువ్వుకున్నాయి. పలువురు టీడీపీ కార్యకర్తలు, భద్రతా విధుల్లో ఉన్న బీఎస్ఎఫ్ కానిస్టేబుల్, ఓటు వేసేందుకు వచ్చిన నలుగురు వృద్ధులు గాయపడ్డారు. అశ్మిత్‌రెడ్డి కారు అద్దాలు ధ్వంసం చేశారు. డీఐజీ షేముషి బాజపాయి, అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. తాడిపత్రిలోని పాతకోట, వైఎస్ఆర్ కమ్యూనిటీ హాల్ పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ ఏజెంట్లు ఆసిఫ్, బాషాపై పెద్దారెడ్డి అనుచరులు దాడిచేశారు. రాప్తాడు వైసీపీ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి వదిన నయనతారెడ్డి తన అనుచరులతో సిండికేట్ నగర్‌లోని పోలింగ్ కేంద్రంలోకి వెళుతుండగా టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో రెచ్చిపోయిన ఎమ్మెల్యే అనుచరులు.. టీడీపీ నాయకులపై రాళ్లతో దాడి చేశారు.

ప్రకాశంలో బరితెగింపు

ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గం బొట్లపాలెంలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ శ్రేణులు చేసిన దాడుల్లో పలువురికి గాయాలయ్యాయి. ఈ విషయం తెలియడంతో టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి గ్రామానికి వెళ్లి ధర్నాకు దిగారు. పోలీసులు వచ్చి వైసీపీ శ్రేణులను తరిమివేయడంతో పోలింగ్ కొనసాగింది. అదే నియోజకవర్గం ఎర్రఓబన్నపల్లె, గిద్దలూరు నియోజకవర్గం చింతలపల్లిలో టీడీపీ ఏజెంట్లను బయటకు పంపించి ఏకపక్షంగా వైసీపీకి ఓట్లు వేసుకున్నారు. వైపాలెం నియోజకవర్గం శతకోడు, ముటుకుల గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకులు దాడికి దిగారు. ముటుకులలో వైసీపీ అభ్యర్థి చంద్రశేఖర్ బూత్‌లోకి వెళ్లి కూర్చోవడంతో టీడీపీ ఏజెంట్ అభ్యంతరం చెప్పారు. దీంతో ఇరు పార్టీల కార్యకర్తలు ఘర్షణకు దిగారు. పోలింగ్ కేంద్రం దగ్గర సెక్యూరిటీగా ఉన్న బీఎస్ఎఫ్ జవాన్ కాల్పులు జరపడంతో టీడీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి.

విజయనగరంలో పోలింగ్ అధికారిపై దాడి

విజయనగరం జిల్లా గజపతినగరం మండలం కొత్తశ్రీరంగరాజపురం గ్రామంలోని 100వ పోలింగ్ స్టేషన్లో ఓ వృద్ధురాలిని వైసీపీ నాయకులు ఓటింగ్‌కు తీసుకొచ్చారు. పీవో రాంబాబు ఆమెకు సహాయకుడిగా వెళ్లారు. ఆ తరువాత తాను ఓటు వేశాను కానీ తన వేలిని సైకిల్ గుర్తుపై పెట్టినట్లు ఉందని చెప్పటంతో.. వైసీపీ నాయకుల్లో కోపం కట్టలు తెంచుకుంది. వైసీపీకి బదులు టీడీపీకి ఓటు వేయిస్తావా అంటూ వైసీపీ ఏజెంట్లు, నాయకులు పీవోపై దాడి చేశారు. బాదుకుంటూ బయటకు ఈడ్చుకు వచ్చారు. పీవోపై ఆర్‌వోకు ఫిర్యాదు చేశారు. విజయనగరం కార్పొరేషన్‌లోని ఉల్లివీధి సమీపంలో వైసీపీ నాయకులు టీడీపీ కార్యకర్తను కొడుతుండడం గమనించిన అక్కడే ఉన్న 'ఆంధ్రజ్యోతి' విలేకరులు ఫొటోలు, వీడియో తీశారు. దీంతో వైసీపీ కార్యర్తలు వారిని చుట్టుముట్టారు. దుర్భాషలాడుతూ బలవంతంగా సెల్ లాక్కుని అందులోని ఫొటోలు డిలీట్ చేశారు.

కూటమి ఏజెంట్ల కిడ్నాప్

అన్నమయ్య జిల్లాలో అధికార పార్టీ నేతలు పలు చోట్ల టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏజెంట్లపై దాడులు, కిడ్నాప్ వంటి సంఘటనలకు పాల్పడ్డారు. రైల్వేకోడూరు నియోజకవర్గం పుల్లంపేటలో రెండు ఈవీఎంలను ధ్వంసం చేశారు. పలు చోట్ల ఇరువర్గాలు బాహాబాహీకి దిగాయి. పుల్లంపేట మండలం అనంతసముద్రం పంచాయతీలో పాపక్కగారిపల్లెలో జనసేన ఏజెంట్లను తీసుకెళ్తున్న టీడీపీ నాయకుడు ముద్దా సుభాష్‌రెడ్డిపై వైసీపీ నాయకులు ఇనుపరాడ్లతో దాడి చేశారు. ఇదే పోలింగ్ కేంద్రంలో జనసేన పోలింగ్ ఏజెంట్ మణిపై వైసీపీ నాయకులు దాడి చేయడంతో ఆయన కన్ను కోల్పోయారు. పుల్లంపేట మండలం దళవాయిపల్లె పోలింగ్ బూత్‌లో జనసేన ఏజెంట్ రాజారెడ్డిపైన వైసీపీ నాయకులు దాడి చేశారు.

టీడీపీ ఏజెంట్లపై చెవిరెడ్డి మోహిత్ దౌర్జన్యం

తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రాపురం మండలం బ్రాహ్మణ కాల్వ గ్రామంలో వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి భారీ ఎత్తున తన అనుచరులతో వచ్చి పోలింగ్ బూత్‌లోకి వెళ్లి టీడీపీ ఏజెంట్లపై దౌర్జన్యం చేశారు.

మొరాయించిన ఈవీఎంలు.. ఓటర్లకు పోలింగ్ పాట్లు!

- ఓటింగ్ ప్రక్రియలో తీవ్ర జాప్యం
- ఎండదెబ్బకు ఇంటిబాట పట్టిన వృద్ధులు
- అరకొర సౌకర్యాలతో ఓటర్ల అవస్థలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



భీమవరం రూరల్‌లో రాత్రి ఏడు గంటల సమయంలో ఓట్లు వేస్తున్న దృశ్యం

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పలు జిల్లాల్లో ఓటర్లకు చుక్కలు చూపించింది. మంచినీళ్లు కూడా అందుబాటు లేక మండుటెండలో విలవిల్లాడారు. కొన్నిచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా మొదలైంది. సాయంత్రం 6 గంటలకూ ఓటర్లు క్యూలో ఉండటంతో అర్ధరాత్రి వరకూ పోలింగ్ కొనసాగింది. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, భీమవరం, తణుకు పట్టణాల్లో ఓటింగ్ జాప్యంతో ఎండలకు తట్టుకోలేక వృద్ధులు ఇంటిముఖం పట్టారు. ఏలూరు జిల్లాలో దాదాపు 200 పోలింగ్ కేంద్రాలు, కృష్ణాజిల్లా బాపులపాడులో రాత్రి 9 గంటలకు పోలింగ్ జరిగింది. కర్నూలు జిల్లాలో చాలాచోట్ల రాత్రి 11 గంటల వరకు పోలింగ్ జరిగింది. తిరుపతి జిల్లా సత్యవేడు మండలం చెరివిలో రేకుల షెడ్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. పోలింగ్ జరుగుతుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి బూత్‌లోని వారంతా షాక్‌కు గురయ్యారు. విజయనగరం జిల్లాలో వర్షం, గాలుల కారణంగా ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. టెంట్లు ఎగిరిపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచిన కారణంగా సెల్‌ఫోన్ వెలుతురులో కొంతమంది ఓట్లు వేశారు. విశాఖ జిల్లాలో పోలింగ్ మందకొడిగా సాగింది.

విజయసాయి నిర్బంధం

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలం రేబాల పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని గ్రామస్థులు సుమారు గంటసేపు నిర్బంధించారు. క్యూలైన్లలో నిలబడి ఉన్న ఓటర్లకు విజయసాయి నీళ్ల బాటిళ్లు ఇవ్వాలని ప్రయత్నించారు. దీనిని టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. మాట మాట పెరిగి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడిపై విజయసాయి చేయి చేసుకున్నారు. దీంతో గ్రామస్థులు ఆయనపై తిరగబడ్డారు. పార్టీలకు అతీతంగా అంతా ఒక్కటై విజయసాయిని చుట్టుముట్టి పరుష పదజాలంతో దూషించారు.

ఎస్సైపై ఎమ్మెల్యే శిల్పా రవి చిందులు

నంద్యాల సిటింగ్ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పోలింగ్ బూత్‌లను పరిశీలించే క్రమంలో దేవనగర్ పాఠశాలకు వెళ్లారు. ఆయనతోపాటు వైసీపీ కార్యకర్తలు కూడా వెళ్లడంతో టీడీపీ నేతలు పోలీసులను ప్రశ్నించారు. బయటకు వెళ్లాలని పోలీసులు చెప్పగా, ఆగ్రహించిన ఎమ్మెల్యే రవి ఎస్ఐపై చిందులేశారు. .

రెండుచోట్ల పోలింగ్ బహిష్కరణ

తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం కమ్మవారిపాలెంలో గ్రామస్తులు పోలింగ్‌ను బహిష్కరించారు. కేవీబీపురం మండలం పాతపాలెం పంచాయతీ కేసీ కండ్రిగలో మౌలిక సదుపాయాలు లేవని పోలింగ్‌ను గ్రామస్తులు బహిష్కరించారు.


ఉండవల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో...


శ్రీకాకుళంలోని పోలింగ్ బూత్ వద్ద...


ఒంగోలులోని ఆగ్జిలియం స్కూల్‌లో...


ఏలూరులోని వీరమాచినేని ఎలిమెంటరీ స్కూల్ వద్ద



ఓటు వేసిన తరువాత గవర్నర్ దంపతులు, సీఎం జగన్, చంద్రబాబు, భువనేశ్వరి, పవన్ కల్యాణ్ దంపతులు

ఓటు జోష్..!

- మంగళగిరిలో ఓటేసిన చంద్రబాబు, పవన్, లోకేశ్
- రాజమహేంద్రవరంలో పురందేశ్వరి ఓటు

మంగళగిరి, రాజమహేంద్రవరం అర్బన్, మే 13: కూటమి నేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ మంగళగిరి నియోజకవర్గంలో సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన సతీమణి నారా భువనేశ్వరితో కలిసి గుంటూరు జిల్లా ఉండవల్లిలోని గాదె రామయ్య-సీతారావమ్మ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 16వ నంబరు పోలింగ్ బూత్‌లో ఉదయం 7.30గంటలకే ఓటుహక్కును వినియోగించుకున్నారు. మంగళగిరి టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న నారా లోకేశ్ తన సతీమణి బ్రాహ్మిణితో కలిసి ఇదే బూత్‌లో ఓటేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీ కార్యాలయానికి చేరువగా ఉన్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి కాలనీలోని గిరిజన సహకార సంస్థ కార్యాలయంలోని 197వ నంబరు పోలింగ్ బూత్‌లో ఓటుహక్కు వినియోగించుకున్నారు. పవన్ తన సతీమణి అన్నా లెజినీవాతో కలిసి పోలింగ్ కేంద్రానికి వచ్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. భర్త దగ్గుబాటి వెంకటేశ్వరరావుతో కలిసి వచ్చిన పురందేశ్వరి వీఎల్ పురం పోలింగ్ బూత్ 50/166లో తన ఓటు వేశారు.

విజయవాడలో ఓటేసిన గవర్నర్ దంపతులు

విజయవాడ(ఆంధ్రజ్యోతి), తాడేపల్లి, మే 13: గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆయన సతీమణితో కలిసి విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని రైల్వే ఫంక్షన్ హాల్ పోలింగ్ బూత్‌లో తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. గవర్నర్ సాధారణ పౌరుడిలానే ఓటు వేసేందుకు వచ్చారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనా కూడా ఇదే పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు కుటుంబ సభ్యులతో ఉండవల్లిలో ఓటేశారు. విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణ మూర్తి ఉండవల్లిలోనే తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.


ఓటు హక్కు వినియోగించుకున్న దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి, లోకేశ్, బ్రాహ్మణి, అనిల్, షర్మిల, సీఈఓ ఎంకే మీనా

గంట గంటకూ పైపైకి!

- అంచనాకు మించి ఓటెత్తారు
- యువత నుంచి భారీ స్పందన
- అర్ధరాత్రి వరకు 3,500 కేంద్రాల్లో సాగిన పోలింగ్ ప్రక్రియ
- ఎక్కడా రీపోలింగ్ అవసరం లేదు
- హింసాత్మక ఘటనలు జరిగాయి
- సాయంత్రం 5 వరకు 68% నమోదు
- అనంతపురం, తెనాలి, నర్సరావుపేట ఘటనల్లో అభ్యర్థుల హౌస్ అరెస్ట్
- 12 చోట్ల ఈవీఎంలు ధ్వంసం చేశారు
- సీఈవో ముఖేశ్ కుమార్ మీనా వెల్లడి


నెల్లూరులో ఓటు వేసేందుకు వచ్చిన యువ ఓటర్లు

అమరావతి, మే 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ఉదయం ప్రారంభమైన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో గంట గంటకూ ఓటింగ్ శాతం పెరిగిందని సీఈవో ముఖేశ్‌కుమార్ మీనా తెలిపారు. సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా 68.04 శాతం పోలింగ్ నమోదైందని వివరించారు. లైన్‌లలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించామన్నారు. మొత్తం 3,500 కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగిందని వివరించారు. పోలింగ్ శాతం పెరుగుతుందని ఆశిస్తున్నామన్నారు. ఎక్కడా రీ పోలింగ్‌కు అవసరంలేదని చెప్పారు. అయినప్పటికీ 17ఏ స్క్రూటినీ తర్వాత రీ పోలింగ్ విషయాన్ని నిర్ధారిస్తామన్నారు. రీపోలింగ్‌కు ఎవరి నుంచీ అభ్యర్థనలు రాలేదని తెలిపారు. తెనాలి, నరసరావుపేట ఎమ్మెల్యేలను హౌస్ అరెస్టు చేశామన్నారు. అనంతపురంలో కూడా ఇరు పార్టీల నేతలను హౌస్ అరెస్ట్ చేసినట్టు తెలిపారు. పలు చోట్ల హింసాత్మక ఘటనలు జరిగినా రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్టు చెప్పారు. కొన్నిచోట్ల ఈవీఎంలలో సాంకేతిక సమస్యలు వచ్చాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 275 బ్యాలెట్ యూనిట్లు, 217 కంట్రోల్ యూనిట్లు, 600 వీవీప్యాట్‌లలో సాంకేతిక సమస్య వచ్చినా పరిష్కరించామన్నారు. అనంతపురం, పల్నాడు, అన్నమయ్య జిల్లాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో హింసాత్మక ఘటనలు జరుగుతాయని నిఘా సమాచారం ముందుగానే అందినట్టు మీనా తెలిపారు. దీనికి అనుగుణంగానే భద్రత కల్పించామన్నారు. పీలేరులో ఏజెంట్ల కిడ్నాప్ ఘటనను వెంటనే పరిష్కరించినట్టు తెలిపారు. పల్నాడులో 12 ఘటనలకు సంబంధించి ఫిర్యాదులు వచ్చాయన్నారు. మాచర్ల పరిధిలో ఎనిమిది ఈవీఎంలను ధ్వంసం చేశారన్నారు. అయితే, వాటిలో అప్పటికే పోలైన ఓట్లకు సంబంధించిన డేటా పోలేదన్నారు. గంట గంటకు పోలింగ్ పెరిగిందని మీనా తెలిపారు. సగటున గంటకు 7 నుంచి 8 శాతం మేర పోలింగ్ పెరిగిందన్నారు. యువత పెద్ద ఎత్తున ఓట్లు వేశారన్నారు. పోలింగ్ ప్రక్రియను ప్రతి క్షణం మానిటరింగ్ చేసినట్టు తెలిపారు. 4.14 లక్షల మంది ఓటర్లలో సుమారు 3 కోట్ల మంది ఓటేశారని, అంచనాలకు మించి ఓటర్లు తమ హక్కు వినియోగించుకున్నారని మీనా చెప్పారు.

80 శాతానికి మించి పోలింగ్!

సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం అనూహ్యంగా పెరిగింది. సోమవారం రాత్రి 10గంటల తర్వాత కూడా 3,500 కేంద్రాల్లో పోలింగ్ కొనసాగింది. 2014 ఎన్నికల్లో 77.96శాతం పోలింగ్ నమోదు కాగా, 2019లో 79.8 శాతం నమోదైంది. అయితే, ఈసారి రికార్డు స్థాయిలో పోలింగ్ 80శాతం దాటనుంది. కడపటి సమాచారం మేరకు 79.5% పోలింగ్ నమోదైంది.

తేదీ మారింది... క్యూల్లో కొత్త కష్టాలు

- కొత్త ఈవీఎంలతో ఓటింగ్ మొదలెట్టాల్సి రావడమే కారణం
- మళ్లీ మాక్ పోలింగ్ నుంచి ప్రక్రియ ప్రారంభం
- దాదాపు 15 కేంద్రాల్లో తేదీ మారాకా పోలింగ్

అమరావతి, మచిలీపట్నం, మే 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోటెత్తిన ఓటరుతో పోలింగ్ సిబ్బందికి కొత్త చిక్కులు వచ్చిపడ్డాయి. అర్ధరాత్రి దాటిన తరువాత కూడా వివిధ నియోజకవర్గాల్లో సుమారుగా 15 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ కొనసాగింది. తేదీ మారటంతో అప్పటి వరకూ వాడుతున్న ఈవీఎంలు ఆటోమేటిక్‌గా ఓటింగ్‌ను తీసుకోవు. దీంతో కొత్త ఈవీఎంలను ఉపయోగించాల్సి ఉంటుంది. క్యూలో ఒక్క ఓటరు ఉన్నా మళ్లీ మాక్ పోలింగ్ నిర్వహించి, ఓటింగ్‌ను కొనసాగించాలి. ఈమేరకు సీఈవో దిశానిర్దేశం చేశారు. కాగా, పాయకరావుపేట, చింతలపూడి, కళ్యాణదుర్గం, సర్వేపల్లి, మచిలీపట్నం నియోజకవర్గాల్లోని ఐదు పోలింగ్ కేంద్రాల్లో కొత్త ఈవీఎంలపై ఓటింగ్ కొనసాగుతుందని ఈసీ వర్గాలు తెలిపాయి. అయితే ఈ సంఖ్య మరింతే పెరిగే అవకాశం ఉందని ఆ వర్గాలు పేర్కొన్నాయి.


నెల్లూరు నగరంలో వేద సంస్కృతి పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద పోటెత్తిన ముస్లిం ఓటర్లు

ఓట్ల వెల్లువ

(మొదటి పేజీ తరువాయి)

మిత్రబృందం! ఎటు చూసినా ఓట్ల సందడి! సోమవారం ఉదయం 6.30 గంటలకు బూత్‌ల తలుపులు తెరవకముందే బారులు తీరారు. 7గంటలకు ఈవీఎంలపై మొదలైన ఓటు మీట నవ్వడి... సాయంత్రం 6 దాకా కొనసాగింది. సాధారణంగా ఉదయం మందకొడిగా మొదలై, తర్వాత పుంజుకొని, సాయంత్రానికి పోలింగ్ జోరు తగ్గుతుంది. ఈసారి అలా లేదు. అత్యధిక బూత్‌ల వద్ద రోజంతా ఓటర్ల బారులు కనిపించాయి. 3వేలకు పైగా బూత్‌లలో రాత్రి 10దాకా... కొన్నిచోట్ల అర్ధరాత్రి దాకా పోలింగ్ కొనసాగడం గమనార్హం. 'వీళ్లకు ఓపిక తక్కువ. ఓట్లు వేసేందుకు రారు' అనే అభిప్రాయాన్ని పటాపంచలు చేస్తూ... విద్యావంతులు, ఉద్యోగులు, యువత, ఎగువ మధ్య తరగతి వారు కూడా పోలింగ్ బూత్‌లకు తరలివచ్చారు. క్యూలో ఓపిగ్గా నిలబడి గంటైనా, రెండు గంటలైనా వేచిచూసి ఓటేశారు. నార్వే, స్వీడన్, కెనడా, మారిషస్ వంటి దేశాల్లో స్థిరపడిన వారూ ఓటేసేందుకు సొంతూళ్లకు వచ్చారు. గ్రామాల్లో 'సంక్రాంతి'కి మాత్రమే కనిపించే సందడి.. ఇప్పుడు ఓట్ల పండక్కి కనిపించింది. ఏదో కసితో, ఒక లక్ష్యంతో ఓటు వేయాలన్న భావన వీరిలో కనిపించింది. 'ఈసారి ఓటేయకపోతే ఏదో కోల్పోతాం!' అనే ఆందోళనతోనే వీరంతా తరలి వచ్చినట్లు స్పష్టమైంది. రాష్ట్రంలో, సొంతూళ్లో సంగతులన్నీ తెలుసుకుని... మార్పు కోసమే ఓటు వేయక తప్పదనే బలమైన సంకల్పంతోనే బూత్‌ల ముందు బారులు తీరినట్లు అవగతమైంది. గ్రామీణులు, కార్మికులు, కర్షకులు ఎప్పట్లాగానే తమ ఓటును ఉపయోగించుకున్నారు. ఆదర్శంగా నిలిచారు. అన్ని వర్గాల ప్రజలు ఓటుకు పోటెత్తడంతో

హింసాత్మకమే... కానీ!

ఓటమి భయంమో... ఓటు చేజారుతోందని అర్థమైందో గానీ వైసీపీ వర్గాలు అనేకచోట్ల విచ్చలవిడిగా దాడులు, దౌర్జన్యాలకు దిగాయి. పల్నాడులో భారీగా దాడులు చేశారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఎస్పీ వాహనంపైనే దాడి చేశారు. పలుచోట్ల టీడీపీ ఏజెంట్లను కొట్టారు. ఆయా ఘటనలపై టీడీపీ నేతలు ఎప్పటికప్పుడు ఈసీకి ఫిర్యాదులు చేశారు. అయితే... గత ఎన్నికలతో పోల్చితే ఈసారి హింసాత్మక ఘటనలు తక్కువే అని పోలీసు అధికారులు చెబుతున్నారు. గతంతో పోల్చితే ఓట్ల గల్లంతుపైనా ఫిర్యాదులు తక్కువగానే వచ్చాయి. ఓట్ల తొలగింపుపై మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరగడంతో జనం ముందే అప్రమత్తమయ్యారు. తమ ఓట్లను కాపాడుకున్నారు. ఈవీఎంలు మొరాయించడంతో పలుచోట్ల పోలింగ్ ఆలస్యంగా మొదలైంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

పనిచేయని, ఈవీఎం.. నిరీక్షించిన చిన్ని

వన్‌టౌన్: లయోలా కాలేజీలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకోవడానికి కుటుంబ సమేతంగా వచ్చి కేశినేని శివనాథ్ కొంత సమయం పాటు వేచి ఉండాల్సి వచ్చింది. బూత్ నెంబరు 56లో ఈవీఎం మొరాయించడంతో నిర్ణీత సమయానికి పోలింగ్ ప్రారంభం కాలేదు. దీంతో ఓటర్లు దాదాపు ముప్పావు గంటకు పైగా వేచి చూడాల్సి వచ్చింది. దీంతో కేశినేని శివనాథ్ (చిన్ని) ఆయన కుటుంబ సభ్యులు, కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఆయన కుటుంబ సభ్యులు వేచి ఉండాల్సి వచ్చింది.

ఓటు హక్కు వినియోగించుకున్న బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్: ఎన్డీయే కూటమి సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని సెయింట్ ఆన్స్ స్కూల్‌లో బూత్ నెం.37కు వచ్చిన ఆయన భార్య సుజాత, ఇద్దరు కుమారులు, కోడలితో కలిసి ఓటు వేశారు.

ఓటు వేసిన బుద్దా వెంకన్న దంపతులు



బుద్దా వెంకన్న దంపతులు పశ్చిమ నియోజకవర్గంలోని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తన సతీమణి భూలక్ష్మీతో కలిసిఆయన పోలింగ్ బూత్‌కు వెళ్ళి ఓటు వేశారు.

చర్చనీయాంశమైన ఆసీఫ్ చర్యలు

భవానీపురం: పశ్చిమలో పోలిం గ్ సరళిని పరిశీలించడానికి వెళ్లిన వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసీఫ్ ఓటర్లను అభ్యర్థించడం చర్చనీయాంశమైంది. పోలింగ్ సరళిని చూసి, ఓ టర్ల ఏర్పాట్లపై ఆరా తీయడం మా త్రమే చేయాల్సి ఉండగా, లేబర్‌కాల నీ ఉప్పలపాటి రామచంద్రరాజు హై స్కూల్‌లో 6 పోలింగ్ బూత్‌ల వద్ద చెవిలో గుసగుసలాడి ఓట్లను వేయాలని కోరడం విమర్శలకు తావిచ్చింది. క్యూ లైన్ల మధ్యలోకి తన అనుచరులతో ఆయన కలియతిరిగారు.



ఓట్లు అభ్యర్థిస్తున్న ఆసీఫ్

సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో సిటీ టాపర్‌గా 'నలంద'

గవర్నర్‌పేట, మే 13: సీబీఎస్ఈ బోర్డు సోమవారం విడుదల చేసిన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో నలంద విద్యానికేతన్ విద్యార్థులు సిటీ టాపర్స్‌గా నిలిచారు. 500 మార్కులకు నలంద విద్యార్థులు తటవర్తి రిషబ్ 494 మార్కులు, ఎస్.రఘునందన్ 491 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారని నలంద విద్యానికేతన్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ తెలిపారు. నలంద విద్యానికేతన్ 100 శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు 9 మంది విద్యార్థులు 500 మార్కులకుగాను 480కిపైగా మార్కులు సాధించారన్నారు. ఎం.రోహిత వైష్ణవి 488 మార్కులు, ఎస్.హిమతన్య, సీహెచ్.లక్ష్మీ శరణ్య, కె.దేదీప్య 485 మార్కులు, ఎం.భావేష్, పి.పద్మపావని 484 మార్కులు, జి.సాయికార్తీకా సాత్విక 483 మార్కులు సాధించారన్నారు. టెన్త్ పరీక్షలకు 286 మంది హాజరు కాగా 35 మందికి 470పైగా మార్కులు, 52 మందికి 450కి పైగా మార్కులు, 149 మందికి 400పైగా మార్కులు వచ్చినట్టు వెల్లడించారు. సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో 4ఏళ్ల నుంచి వరుసగా నలంద విద్యానికేతన్ సిటీ టాపర్‌గా నిలుస్తోందన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను నలంద విద్యా సంస్థల చైర్మన్ అట్లూరి విజయబాబు అభినందించారు.



టి.రిషబ్

సీబీఎస్ఈ ఇంటర్ ఫలితాల్లో..

గవర్నర్‌పేట : సీబీఎస్ఈ సోమవారం ప్రకటించిన 12వ తరగతి ఫలితాల్లో నలంద విద్యానికేతన్ విద్యార్థులు సిటీ టాపర్స్‌గా నిలిచారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు అద్భుతమైన ప్రతిభను కనబర్చారు. ఎంఈసీ గ్రూప్ నుంచి నలంద విద్యార్థి తనయ్ జైన్ 500 మార్కులకు గాను 480 మార్కులు, హార్ది జైన్ 471 మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచినట్టు విద్యానికేతన్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ తెలిపారు. ఎంఈసీ గ్రూప్ నుంచి ఖుషి సేథియా 464 మార్కులు, ఎంపీసీసీ గ్రూపు నుంచి హరి ప్రభాత్ కుమార్ 464 మార్కులు సాధించారన్నారు. 2019-20 నుంచి వరుసగా 5ఏళ్లు నలంద విద్యానికేతన్ విద్యార్థులు ఫలితాల్లో సిటీ టాపర్స్‌గా నిలిచారన్నారు. అధ్యాపకుల మార్గదర్శకం, సెల్ఫ్ లెర్నింగ్ మెథడాలజీ ద్వారా విద్యార్థులు నైపుణ్యాభివృద్ధి సాధించినట్టు వెల్లడించారు. విద్యార్థులను నలంద విద్యాసంస్థల చైర్మన్ అట్లూరి విజయబాబు అభినందించారు.



తనయ్ జైన్

మైలవరంలో వైసీపీ అనుచరులు హల్‌చల్

మైలవరం, మే 13: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి వైసీపీ క్యాప్‌లు పెట్టుకొని కొందరు ప్రచారం చేయగా రాజీనామా చేసిన వలంటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకొని మరీ ప్రచారం చేశారు. ఇంత జరుగుతున్న పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారు. పలు చోట్ల వైసీపీ నాయకులు టీడీపీ నాయకులపై కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు.

పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు

జగ్గయ్యపేట, మే 13: జగ్గయ్యపేటలో చెదురుమదురు ఘటనలు వినహా పోలింగ్ ప్రశాతంతగా జరిగింది. ఉదయం6-30 నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. పట్టణంలో బాలికల ఉన్నత పాఠశాలలో ఓపీఓ విధులు నిర్వహిస్తున్న ఒకరు ఫిట్స్ రావటంతో 40నిమిషాలు పోలింగ్ ఆలస్యమైంది. అదే స్టేషన్‌లో మరో పోలింగ్ బూత్ లో ఈవీఎం సీల్ చేయటంలో ఇబ్బంది వల్ల గంటన్నర సేపు నిలిచిపోయింది. తొర్రగుంటపాలెం హైస్కూల్ కేంద్రంలో విద్యుత్ సరఫరా లేకపోవటంతో మాక్ పోలింగ్, పోలింగ్ గంటన్నర ఆలస్యమైంది. మరో రెండు చోట్ల ఇవీఎంలు మొరాయించటంతో ఆలస్యమైంది. మండలంలో కూడా ఈవీఎంల మొరాయించటంతో గంటకు పైగా పోలింగ్ ఆలస్యమైంది. 12వ వార్డు సచివాలయంలో తెలుగుదేశం అభ్యర్థి శ్రీరాం తాతయ్య, మార్కెట్‌యార్డులో పోలింగ్ కేంద్రం వద్ద విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, మిట్టగూడెం పోలింగ్ బూత్‌లో వైకాపా అభ్యర్థి సామినేని ఉదయభాను, కాంగ్రెస్ అభ్యర్థి కర్నాటి అప్పారావు కన్నెవీడులో పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేటలో సాంకేతిక ఇబ్బందులు మినహా పోలింగ్‌లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు నమోదు కాలేదు. కొండపర్వ యూపీ పాఠశాలలో ఈవీఎం మొరాయించడంతో అర్ధగంట పోలింగ్ నిలిచిపోయింది. లక్ష్మీపురంలో ఎన్నారై వల్లభనేని గిరి తన ఓటు హక్కును వినియోగించుకున్నాడు. కలగరలో చికిత్స పొందుతున్న వృద్ధుడు ట్రై సైకిల్‌పై వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ సమయం దాటడంతో పోలింగ్ కేంద్రం గేట్లు మూసి ఉన్న వారితో ఓట్లు వేయిస్తున్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

జి.కొండూరు / గొల్లపూడి / ఇబ్రహీంపట్నం, మే 13: మైలవరం నియోజకవర్గంలో సోమవారం పలు వురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు గొల్లపూడిలో తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. మైలవరం ఎన్డీఏ కూటమి అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్, వసంత శిరీష స్వగ్రామైన ఐతవరంలో, ఇండియా కూటమి మైలవరం అభ్యర్థి బొర్రా కిరణ్ కుటుంబ సమేతంగా కొండపల్లిలో, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు జి.కొండూరులో జనసేన నేత అక్కల రామ్మోహన్‌రావు కొండపల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.





బాజీ సాయిబ్ ఉర్దూ పాఠశాల వద్ద ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పక్కన బారులు తీరిన ఓటర్లు, మాలెంపాటి భాస్కరరావు స్కూల్ వద్ద ఎండలో బారులు తీరిన మహిళా ఓటర్లు

శివార్లలోనూ పోటెత్తిన ఓటర్లు

- రాత్రి 9 గంటలు దాటినా క్యూలైన్లోనే ఓటర్లు • స్వల్ప ఘటనల మినహా ప్రశాంతంగా పోలింగ్
- ఓటింగ్ నిదానం కావడంతో మరింత ఇబ్బందులు • ప్రమాదకరంగా డ్రెయిన్లు, ట్రాన్స్‌ఫార్మర్లున్నా పట్టించుకోని వైనం • మౌలిక సదుపాయాల కల్పనలో విఫలం

అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం, మే 13: గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఎన్నికల్లో నగర శివారు ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరిగింది. పోలింగ్ స్టేషన్ల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఉదయం 6 గంటల నుంచి పెద్ద సంఖ్యలో పోటెత్తారు. సుమారు రాత్రి 9 గంటలు దాటినా ఓటింగ్ పూర్తి కాలేదు. మధ్యాహ్నం తాకిడి కాస్త తగ్గినా సాయత్రం 4 గంటల నుంచి వాతావరణం చల్లబడటంతో కిక్కిరిశాయి. ప్రధానంగా పాయకాపురం ఎల్‌బీఎస్‌నగర్ పుచ్చలపల్లి సుందరయ్య స్కూల్, కండ్రిక కాలనీ బీవీ. సుబ్బారెడ్డి స్కూల్, వాంబేకాలనీ జంధ్యాల దక్షిణామూర్తి స్కూల్, అజిత్‌సింగ్‌నగర్ ఎంకే బేగ్ స్కూల్, వివేకానంద హైస్కూల్ తదితర పోలింగ్ కేంద్రాలు రాత్రి వరకు కొనసాగాయి. ఓటర్ల తాకిడిన దృష్టిలో పెట్టుకున్న అధికారులు పోలింగ్‌ను కొనసాగించారు.



బీవీ. సుబ్బారెడ్డి పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ, వైసీపీ నేతల వాగ్వాదం

స్వల్ప ఘటనల మినహా ప్రశాంతంగా పోలింగ్

అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాల్లో స్వల్ప ఘటనల మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. అక్కడక్కడా వైసీపీ, టీడీపీ కార్యకర్తలు వాగ్వాదాలకు దిగినా పోలీసుల జోక్యంతో ఘర్షణలు చోటు చేసుకోకుండా సద్దుమణిగాయి. పాయకాపురం కండ్రిక కాలనీలోని బీవీ సుబ్బారెడ్డి స్కూల్‌లో వైసీపీ ఏజెంట్లు ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించగా టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్ అడ్డుకున్నారు. ఎమ్మెల్సీ రుహుల్లా అతడి సోదరుడు హఫీజుల్లా అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎంకే బేగ్ స్కూల్ పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి పావుగంటకు పైగా ఉండిపోవడం, ఓటర్లను ప్రభావితం చేస్తుండటంతో టీడీపీ నేత యలవర్తి శ్రీకాంత్ ప్రశ్నించారు. కంట్రోల్ రూం సీఐ రామారావు ఎమ్మెల్సీని బయటక పంపించకపోగా టీడీపీ నేతలను పోలింగ్ కేంద్రం నుంచి సుమారు 100 మీటర్ల వరకు నెట్టుకుంటూ బయటకు తీసుకు రావడంతో వివాదాస్పదమైంది. అనంతరం ఎమ్మెల్సీ బయటకు రావడంతో వివాదం సద్దుమణిగింది.

సీపీ పరిశీలన

అజిత్‌సింగ్‌నగర్‌లోని వివేకానంద హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని సీపీ పీహెచ్‌డీ రామకృష్ణ సోమవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో సదుపాయాల ఏర్పాట్లు, పోలింగ్ సరళిపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎటువంటి ఘర్షణలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఎండకు మాడిన ఓటర్లు

విద్యాధరపురం: పశ్చిమలోని పలు పోలింగ్ బూత్‌ల వద్ద మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు విఫలం చెందినట్టు స్పష్టమైంది. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ఓటర్లు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మాలెంపాటి భాస్కరరావు మునిసిపల్ స్కూల్ వద్ద పురుష, మహిళా ఓటర్లు ఎండలో నిలబడాల్సి వచ్చింది. ఓటింగ్ సరళి నిదానంగా సాగడంతో సుద్రుమనే ఎండలో వీరు ఎక్కువ సేపు నిలబడాల్సి వచ్చింది. ఇంకోపక్క పక్కనే డ్రెయిన్, ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నా వాటి నుంచి ఎలాంటి రక్షణ కల్పించకుండా ఓటర్లను అలాగే పోలింగ్‌బూత్‌ల వద్ద క్యూలైన్లలో నిలబెట్టారు.



ఓటర్లపై ఎస్ఐ దౌర్జన్యం

ఎస్ఐ రామకృష్ణ దురుసు ప్రవర్తన

భవానీపురం ఎస్ఐ రామకృష్ణ దురుసు ప్రవర్తనకు పాల్పడ్డారు. వృద్ధులు పోలింగ్ బూత్‌లోకి వెళుతుండగా వారిని అడ్డుకుని ఇష్టానుసారం దూషించారు. పోలింగ్ బూత్‌లోకి నేరుగా వెళ్లడానికి వీలులేదని హుకుం జారీ చేసి వారి నుంచి కార్డులను చించేసి కాలువలో పారేస్తానంటూ వృద్ధులపై కనీస గౌరవం లేకుండా ఇష్టం వచ్చినట్టు మాట్లాడారు. వృద్ధులకు, దివ్యాంగులకు, గర్భిణులకు సులువుగా ఓటు వేసేందుకు అవకాశం ఇస్తామని ఉన్నతాధికారులు చెప్పినా అమలు కాలేదు. వృద్ధులు కూర్చోవడానికి ఏర్పాట్లు లేవు. నీడ కోసం కనీసం షామియానా వేయించలేకపోయారు. ఏఎస్ఐ చెన్నకేశవరావు ఓటర్లపై అత్యుత్సహం ప్రదర్శించారు. వృద్ధులను అరేయ్, ఒరేయ్ అంటూ ఏకవచనంతో అవమానించడంతో అక్కడున్నవారంతా విమర్శలు గుప్పించడంతో వెనుక్కు తగ్గారు. బాధ్యతలను విస్మరించి ఎస్ఐ, ఏఎస్ఐ వీరంగం వేయడంపై పలువురు విస్తుపోతున్నారు. కనీసం మంచినీరు కూడా ఇవ్వలేకపోయారని వాపోయారు. కొంతమంది ఎండవేడిమిని తట్టుకోలేక గొడుగులు వేసుకున్నారు. తలలపై టవళ్లు, కర్చీఫ్‌లు కప్పుకుని రక్షణ పొందారు.



ఓటర్లతో గొడవపడుతున్న ఏఎస్ఐ

ఇదేం భోజనం.. మేం తినలేం..!

- ఎన్నికల ఉద్యోగులకు నాసిరకం భోజన ప్యాకెట్లు • తిప్పి పంపేసిన ఉద్యోగులు • కాంట్రాక్టర్లపై కమిషనర్ ఆగ్రహం



విద్యాధరపురం, మే 13: ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు పంపిణీ చేసిన ఆహారం నాసిరకంగా ఉండడంతో ఉద్యోగులు వాటిని తిప్పికొట్టారు. దీనిపై మునిసిపల్ కమిషనర్, సెంట్రల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి స్వప్నిల్ దినకర్ సదరు కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో పాల్గొన్న ఉద్యోగులకు ఆదివారం సాయంత్రం, సోమవారం టిఫిన్, భోజనం పంపిణీ చేయడానికి మునిసిపల్ కమిషనర్ ఇటీవల టెండర్లను పిలిచారు. ఈ టెండర్లలో సెంట్రల్, తూర్పు నియోజకవర్గాలకు కాంట్రాక్టర్ ప్రభాకర్ భోజనం, టిఫిన్ అందించడానికి టెండర్ దక్కించుకున్నాడు. పశ్చిమకు మరో కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకున్నాడు. ఈ మూడు నియోజకవర్గాల్లో భోజనం ప్యాకెట్, టిఫిన్ పంపిణీ చేయడానికి రూ.180 చొప్పున కాంట్రాక్టర్ పాడుకున్నారు. తూర్పు, సెంట్రల్‌లో కాంట్రాక్టర్ ప్రభాకర్ 40 వేల భోజనం, టిఫిన్లను పంపిణీ చేయాల్సి ఉంది. కాంట్రాక్టర్ భోజనాలు, టిఫిన్లు తయారు చేసేందుకు సీతన్నపేట పాతరైల్వే గేటు సమీపంలోని వీఎంసీ కల్యాణమండపాన్ని అద్దెకు తీసుకున్నాడు. అక్కడి నుంచే ఆహార పదార్థాలు, కూరలు, మజ్జిగ ప్యాకెట్లు, ప్యాకింగ్ చేసి తూర్పు, సెంట్రల్‌కు మినీ వాహనాల్లో పంపేశాడు. అయితే ఆహార పదార్థాలు మరీ నాసిరకంగా ఉండటంతో ఉద్యోగులు వాటిని తిప్పి కాంట్రాక్టర్‌కు పంపేశారు. విషయం తెలుసుకున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ ఆహార పదార్థాలను పరిశీలించి నాసిరకంగా ఉండి కొద్దిగా దుర్వాసన రావడంతో కాంట్రాక్టర్‌ను పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక రోజు ముందుగానే పదార్థాలు తయారు చేసి వేడివేడిగా ఉన్నప్పుడే ప్యాకింగ్ చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. వంట చేసేటప్పుడు ఎటువంటి నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని చెబుతున్నారు. వంటలు చేసేటప్పుడు అధికారుల పర్యవేక్షణ కరువైందన్న విమర్శలు వస్తున్నాయి. వీఎంసీ కల్యాణ మండపం వద్ద నడిరోడ్డుపైనే ఇష్టానుసారంగా వంటలు వండారు. తెచ్చిన పాలు విరిగిపోయినట్టు కనిపిస్తోంది. వేలాది రూపాయలు వ్యయం చేసి తయారు చేసిన ఆహార పదార్థాలు, పాలు ఇంకా ఇతర పదార్థాలు వృథా కావడం గమనార్హం. ఈ ఆహార పదార్థాలను వీఎంసీ కల్యాణమండప సమీపంలోని స్థానికులు పలువురు వచ్చి క్యారీబ్యాగులలో తీసుకుని వెళ్లారు. పశ్చిమలోనూ ఇదే తరహాలో జరిగినట్టు ఆరోపిస్తున్నారు.

దుర్గగుడిలో ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

వన్‌టౌన్, మే13: వైశాఖ శుద్ధ షష్టి తిథిని పురస్కరించుకుని సోమవారం దుర్గగుడిలో వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి లీలా కల్యాణోత్సవం జరిగింది. ఆర్జిత సేవల కింద నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు హాజరై స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ భక్తుల నామస్మరణ మధ్య కల్యాణోత్సవ క్రతువు అర్చకులు వేదోక్తంగా నిర్వహించారు. ఈవో కేఎస్ రామారావు కల్యాణానికి పట్టువస్త్రాలను సమర్పించారు. వివిధ ఉపచారాల అనంతరం కల్యాణోత్సవంలో భాగంగా జీలకర్ర బెల్లం సమర్పణ, మంగళసూత్రాల సమర్పణ, తలంబ్రాల సమర్పణ, మంగళ ఆశీస్సుల అనంతరం హారతులు సమర్పించారు.

ఈవో ఆకస్మిక తనిఖీలు

దుర్గగుడిలోని వివిధ విభాగాలను ఈవో రామారావు ఆకస్మిక తనిఖీ చేశారు. భక్తుల అభిప్రాయాలను ఈవో అడిగి తెలుసుకున్నారు. దర్శన క్యూలు, లగేజీ కౌంటర్లు, చెప్పుల స్టాండ్లు, మజ్జిగ పంపిణీ పాయింట్లలో పరిశీలించి సూచనలు చేశారు. భక్తులకు మరింత మెరుగైన సేవలందించాలని, సామాన్య భక్తులే మొదటి ప్రాధాన్యత అని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సేవలందించడంపై దృష్టి పెట్టాలని సూచించారు.



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణానికి పట్టువస్త్రాలను సమర్పిస్తున్న ఈవో



స్వాతిరోడ్డులో వైసీపీ, టీడీపీ నేతల మధ్య వాగ్వాదం, ఇరువర్గాలను వారిస్తున్న పోలీసులు

పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత

- మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు
- వెస్ట్ ఏసీపీ జోక్యంతో సద్దుమణిగిన వివాదం

విద్యాధరపురం, మే 13: భవానీపురం స్వాతిరోడ్డులోని సర్ ఆర్థర్ కాటన్ స్కూలులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద సోమవారం ఉద్రిక్తత నెలకొంది. మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వచ్చినప్పుడు ఆయనకు వ్యతిరేకంగా వైసీపీ వర్గీయులు నినాదాలు చేశారు. దీంతో వివాదం చోటు చేసుకుంది. పోలీసు అధికారులు, ప్రత్యేక బలగాలు అక్కడికి చేరుకుని వారిని చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. జలీల్‌ఖాన్,బీజేపీ అభ్యర్థి, సుజనాచౌదరి పోలింగ్ బూత్‌లో ఎంత సమయంపాటు ఉంటారని వైసీపీ నేతలు ప్రశ్నిస్తూ దాడికి ప్రయత్నించారు. అక్కడే ఉన్న టీడీపీ 40వ డివిజన్ అధ్యక్షుడు పొనుగుపాటి వెంకసుబ్బయ్య, మరికొందరు ప్రతిగా దాడికి ప్రయత్నించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వెస్ట్ ఏసీపీ మురళీధరరెడ్డి ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపేశారు.

మహ్మద్ అలీపురం వద్ద గొడవ

వన్‌టౌన్: స్థానిక మహ్మద్ అలీపురంలోని 54వ డివిజన్‌లో 208 పోలింగ్ బూత్ వద్ద పోలింగ్ ముగిశాక వీవీప్యాట్‌లకు సీల్ వేసేటప్పుడు టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్‌పై వైసీపీవర్గీయుడు దాడికి యత్నించాడు. ఈ బూత్‌లో రిగ్గింగ్ జరుగుతోందని వైసీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ ఆరోపిస్తూ సీసీ కెమెరాలు చూడాలని పట్టుబట్టారు. అప్పుడే అక్కడికి వచ్చిన ఎంఎస్ బేగ్‌పై దాడికి ప్రయత్నించారు. దాడికి నిరసనగా ఎంఎస్ బేగ్‌తో పాటు టీడీపీ-జనసేన-బీజేపీ కార్యకర్తలు, నేతలు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు భారీగా చేరుకున్నారు. తొలుత బూత్ వద్ద జరిగిన వివాదం ముదరడంతో ఉద్రిక్తం కావడంతో పోలీసులు లాఠీచార్జ్ చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు.



అలీపురంలో టీడీపీ-వైసీపీ నేతల వివాదం

అరాచకపాలనకు చరమగీతం

పశ్చిమ కూటమి అభ్యర్థి సుజనా చౌదరి

విద్యాధరపురం, మే 13: ఐదేళ్ల అరాచక పాలనకు సోమవారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో ఓటర్లు చరమగీతం పాడారని, కూటమి బలపరచిన పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. పోలింగ్ కేంద్రాల పరిశీలన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. ఐదేళ్లుగా సాగిన అరాచక పాలనకు స్వస్తి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధమయ్యారని ఈ ఎన్నికలలో ఎన్‌డీఏ కూటమి భారీ విజయం సాధిస్తుందని తాను భారీ మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. భవానీపురంలోని రవీంద్రభారతి, సర్ ఆర్థర్ కాటన్ స్కూల్, నేతాజీ హైస్కూల్, రైతు బజార్ తదితర పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు 2గంటలకు పైగా ఎండలో నిలుచున్నామని ఫిర్యాదు చేయగా వేసవి ఉన్నా అధికారులు టెంట్లు వేయకపోవడం బాధాకరమని, భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సుజనా చౌదరి సర్ ఆర్థర్ కాటన్ స్కూల్‌లో పోలింగ్‌ను పరిశీలిస్తుండగా స్వతంత్ర అభ్యర్థి, వైసీపీ మద్దతుదారుడు షేక్ గయాజుద్దీన్ ఐజా అక్కడకు వచ్చి ప్రశాంతంగా జరుగుతున్న పోలింగ్ సరళిని విచ్ఛినం చేయడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు రావడంతో వెనుదిరిగాడు.



ఆసీఫ్‌తో కరచాలనం చేస్తున్న సుజనా చౌదరి

ఆసిఫ్‌తో సుజనా కరచాలనం

భవానీపురం: పశ్చిమలోని పోలింగ్ కేంద్రాలను కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యలమంచిలి సుజనా చౌదరి సోమవారం పరిశీలించారు. లేబర్ కాలనీలోని ఉప్పలపాటి రామచంద్రరాజు వీఎంసీ హైస్కూల్ వద్ద అప్పుడే అటుగా వస్తున్న వైసీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసీఫ్‌తో సుజనా కరచాలనం చేశారు. ఇద్దరు సరదాగా కాసేపు మాట్లాడుకున్నారు. సుజనా సహా బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, వైసీపీ నేత షైలవరపు దుర్గారావు ఉన్నారు.

పోలీసుల అత్యుత్సాహం : ఫతావుల్లా

వన్‌టౌన్, మే 13: స్థానిక ఆర్‌సీఎం స్కూల్ ఎన్నికల పోలింగ్ కేంద్రంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫతావుల్లా అన్నారు. సోమవారం జరిగిన పోలింగ్‌లో 54వ డివిజన్ పోలింగ్ కేంద్రాన్ని ఆర్ఆర్ అప్పారావు వీధిలోని ఆర్‌సీఎం స్కూల్‌లో ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రక్రియను పశ్చిమ వైసీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ పరిశీలించేందుకు వెళ్లారు. సుమారు ముప్పావుగంట వరకు ఆయన బయటకు రాకపోవడంతో విషయం తెలుసుకున్న టీడీపీ నేత మహమ్మద్ ఫతావుల్లా ఎన్నికల కేంద్రంలోనికి వెళ్లి వైసీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ ముప్పావుగంట ఎందుకున్నారని పోలీసులను ప్రశ్నించారు. దీంతో పోలీసులు మీరు ఇక్కడ నుంచి వెళ్లండని ఫతావుల్లాను అనడంతో ముందు ఆసిఫ్‌ను బయటకు పంపితేనే తాను వెళతానని, కావాలంటే అరెస్ట్ చేసుకోండని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు వైసీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్‌ను ఎన్నికల కేంద్రం నుంచి బయటకు పంపేయడంతో ఫతావుల్లా బయటకు వచ్చేసి మీడియాతో మాట్లాడుతూ పోలీసుల తీరుపై దుయ్యబట్టారు.

టీడీపీ అధినేత చంద్రబాబుకు
జూలై 8 వరకు ఊరట

- మహారాష్ట్ర పోలీసులపై దాడి కేసు రద్దుకు ముంబై హైకోర్టు నో

ముంబై, మే 13: మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబుపై ఎఫ్ఐఆర్ కొట్టివేతకు ముంబై హైకోర్టు నిరాకరించింది. 2010 జూలైలో బాబ్లీ ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ప్రాజెక్టు వద్దకు ఆయన ఆధ్వర్యంలో టీడీపీ ఎమ్మెల్యేలు వెళ్లారు. ఈ సందర్భంగా నాందేడ్ జిల్లా ధర్మాబాద్ పోలీసులపై దాడి చేశారన్న ఆరోపణలతో ఆయనపైన, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబుపైన మహారాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిని కొట్టివేయాలని ఇద్దరూ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై నాగపూర్ బెంచ్‌కు చెందిన జస్టిస్ మంగేశ్ పాటిల్, జస్టిస్ శైలేష్ బ్రహ్మేలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. పోలీసులపై దాడికి వీరిద్దరూ సహకరించానడంలో ఏ మాత్రం సందేహం లేదని పేర్కొంది. వారి పిటిషన్లను కొట్టివేస్తూ ఈ నెల 10న తీర్పు వెలువరించింది. సహ నిందితులను చంద్రబాబు (ఏ-1) రెచ్చగొట్టారని, రెండు రాష్ట్రాల నడుమ యుద్ధం వస్తుందని కూడా హెచ్చరించారని ఎఫ్ఐఆర్‌లో పోలీసులు పేర్కొన్నారు. చంద్రబాబు, ఆనంద్‌బాబుల పాత్రను నిర్ధారిస్తూ సాక్షులు వాంగ్మూలాలిచ్చారని.. పలువురు పోలీసులకు గాయాలయ్యాయని మెడికల్ సర్టిఫికెట్లు ధ్రువీకరించాయని ధర్మాసనం ప్రస్తావించింది. దాడికి నిందితుల ప్రోద్బలం ఉందనేందుకు తగు ఆధారాలు ఉన్నాయని.. అందుచేత ఈ క్రిమినల్ కేసును కొట్టివేయడం సముచితం కాదని తెలిపింది. అయితే వారి తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా అభ్యర్థనతో వారిపై చర్యలు తీసుకోకుండా జూలై 8 వరకు తాత్కాలిక రక్షణ కల్పించింది.

మోదీపై చర్యలు తీసుకోవాలన్న
పిటిషన్ హైకోర్టు తిరస్కరణ

- ఎన్నికల కమిషన్ పనులన్నింటినీ పర్యవేక్షించలేమని వ్యాఖ్య

న్యూఢిల్లీ, మే 13: ఎన్నికల ప్రచారంలో విద్వేష ప్రసంగాలు చేసిన ప్రధాని నరేంద్ర మోదీపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాన్ని స్వీకరించడానికి సోమవారం ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. ఇలాంటి అంశాలను ఎన్నికల సంఘం చూసుకుంటుందని తెలిపింది. ఎన్నికల సంఘం నిర్వహించే పనులన్నింటినీ సూక్ష్మ స్థాయిలో పర్యవేక్షించలేమని వ్యాఖ్యానించింది. రాజస్థాన్‌లోని బాన్స్‌వారాలో గత నెల 21న మాట్లాడిన ప్రధాని మోదీ ముస్లింలను చొరబాటుదార్లు అని విమర్శించారని, ఇది విద్వేష ప్రసంగం కిందికే వస్తుందని పేర్కొంటూ న్యాయవాది నిజాం పాషా పిటిషన్ దాఖలు చేశారు. ఇతర నాయకులపై చేస్తున్న ఫిర్యాదులపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటున్నా, ప్రధాని విషయంలో మాత్రం స్పందించడం లేదని చెప్పారు. పరిశీలించిన న్యాయమూర్తి జస్టిస్ సచిన్ దత్తా.. "వివిధ సందర్భాల్లో ఎన్నికల కమిషన్ ఎలా వ్యవహరిస్తోందన్న దానిపై కోర్టు సూక్ష్మస్థాయి పర్యవేక్షణ జరపలేదు. ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ సంస్థ. అది ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని భావించడం తగదు. ఈ పిటిషన్‌లో ఎలాంటి మెరిట్ కనిపించడం లేదు" అని పేర్కొన్నారు. అందువల్ల దాన్ని తిరస్కరిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం తరఫున న్యాయవాది సురుచి సూరి వాదనలు వినిపిస్తూ ప్రధాని మీద అందిన ఫిర్యాదుపై సమాధానం చెప్పాలని బీజేపీకి నోటీసులు ఇచ్చామని తెలిపారు. ఇందుకు సమయం కావాలని కోరారని, ఈ నెల 15లోగా సమాధానం వచ్చే అవకాశం ఉందని చెప్పారు.

జైపూర్‌లో 56 బడులకు
బాంబు బెదిరింపులు

- కర్ణాటకలో ఆరు ఆసుపత్రులకు కూడా ఈ మెయిల్ ద్వారా హెచ్చరించిన దుండగులు
- తనిఖీల్లో ఏమీ బయటపడలేదన్న అధికారులు

జైపూర్, మే 13: బడులకు, ఆసుపత్రులకు బాంబు బెదిరింపు ఘటనలు ఇటీవలి కాలంలో పెరిగిపోతున్నాయి. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లోని 56 స్కూళ్లలో బాంబులు పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తుల సోమవారం ఉదయం ఈ మెయిల్ ద్వారా హెచ్చరించారు. ఆయా పాఠశాలలకు మెయిల్స్ పంపించారు. అయితే, బాంబు స్క్వాడ్ తనిఖీల్లో ఎక్కడా బాంబులు బయటపడలేదు. జైపూర్‌లో 16ఏళ్ల క్రితం మే 13నే బాంబు దాడి జరిగింది. ఈ దాడిలో 71మంది చనిపోయారు. తాజాగా, అదే తేదీన బాంబు బెదిరింపులు రావడంతో అంతా భయపడ్డారు. రెండు వారాల క్రితం ఢిల్లీలోని వందకు పైగా స్కూళ్లకు ఇదే తరహా బాంబు బెదిరింపులు వచ్చాయి. మరోవైపు, బెంగళూరులోని ఆరు ఆసుపత్రులకు సోమవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. ఆదివారం కూడా ఢిల్లీలోని ఇరవై ఆసుపత్రులతో పాటు ఇందిరాగాంధీ ఎయిర్‌పోర్టులో బాంబులు పెట్టినట్లు దుండగులు ఈ మెయిల్ ద్వారా హెచ్చరించారు. ఈ అన్ని ఘటనల్లో ఎక్కడా పేలుడు పదార్థాలు బయటపడలేదు.

ఎంఎస్ఎంఈలకు మోదీ సర్కారు వ్యతిరేకం

- పదేళ్లలో వేలాది పరిశ్రమల మూత..
- 'అగ్నిపథ్'తో యువతకు ద్రోహం: కాంగ్రెస్

న్యూఢిల్లీ, మే 13: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)కు నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర సర్కారు వ్యతిరేకమని.. పదేళ్లలో వేలాది చిన్న పరిశ్రమలు మూతపడ్డాయని కాంగ్రెస్ ఆరోపించింది. దేశ జీడీపీలో 30 శాతం, ఎగుమతుల్లో 40 శాతం, 12 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్నది కీలకమైన ఎంఎస్ఎంఈ రంగమేనని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. 'దేశంలో ఈ పదేళ్ల 'అన్యాయ కాలం'లో సర్కారు నిర్లక్ష్యం, అనుసరిస్తున్న వ్యతిరేక విధానాల కారణంగా చిన్న వ్యాపారాలు, పరిశ్రమలు చితికిపోయాయి. మోదీ తాను అనుకున్న కొద్దిమంది వ్యాపారవేత్తల కోసమే పని చేశారన్నది వాస్తవం.. దశాబ్ద కాలంలో ఎంఎస్ఎంఈ పరిశ్రమలే అత్యధిక పన్ను రేటును ఎదుర్కొన్నాయి. ఇటు ధరల పెరుగుదల, ఉద్యోగుల తొలగింపులతో వేలాది పరిశ్రమలు మూతపడ్డాయి. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ విధానాలు కూడా ప్రభావం చూపాయి' అని 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. అగ్నిపథ్ పథకం తెచ్చి దేశ యువతకు కేంద్రం ద్రోహం చేసిందని మండిపడ్డారు. యువత ఉద్యోగాలపై ప్రభావం పడుతున్నా ప్రధాని మోదీ ఆ పథకంపై ఎందుకంత ఆసక్తి చూపుతున్నారని నిలదీశారు. మోదీ బిహార్ పర్యటనపై స్పందిస్తూ.. 'ముజఫర్‌పూర్, పూర్ణియా, భాగల్‌పూర్‌లలో విమానాశ్రయాలు ఏర్పాటు చేస్తామని 2019లో ఇచ్చిన హామీ ఏమైంది. ఆ రాష్ట్రంలో చక్కెర మిల్లులు ఎందుకు మూతపడుతున్నాయి?' అంటూ మరో ట్వీట్‌లో ప్రశ్నలు సంధించారు.

రాహుల్‌తో చర్చకు
మా యువనేత చాలు

- బీజేవైఎం ఉపాధ్యక్షుడు అభినవ్ ప్రకాశ్‌ను పంపిస్తామని ప్రతిపాదన
- ఆయన ఎస్సీ అని వెల్లడి.. ఎంపీ తేజస్వీ సూర్య లేఖ

న్యూఢిల్లీ, మే 13: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీతో బహిరంగ చర్చ జరిపేందుకు తమ పార్టీ తరఫున యువ నాయకుడు అభినవ్ ప్రకాశ్‌ను పంపిస్తామని బీజేపీ ప్రకటించింది. అభినవ్ ప్రకాశ్ ప్రస్తుతం బీజేపీ యువమోర్చా జాతీయ ఉపాధ్యక్షునిగా పనిచేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీలు బహిరంగంగా చర్చ జరపాలని ఇటీవల విశ్రాంత న్యాయమూర్తులు కొందరు సూచించారు. ఇందుకు రాహుల్ గాంధీ సానుకూలంగా స్పందించారు. బీజేపీ మాత్రం రాహుల్‌తో చర్చించేందుకు ప్రధాని మోదీ అవసరం లేదని, తమ యువనాయకుడు చాలంటూ అభినవ్ ప్రకాశ్ పేరును ప్రతిపాదించింది. ఈ మేరకు కర్ణాటకకు చెందిన యువ ఎంపీ తేజస్వీ సూర్య..రాహుల్ గాంధీకి లేఖ రాశారు. రాహుల్‌కు కాంగ్రెస్‌లోనే ఎలాంటి ప్రాధాన్యం లేదని, అందువల్ల ప్రధాని మోదీ ఆయనతో బహిరంగ చర్చ జరపడంలో అర్థం లేదని అన్నారు. రాహుల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాని అభ్యర్థి కూడా కాదని వ్యాఖ్యానించారు. అదే అభినవ్ ప్రకాశ్‌ను పంపిస్తే ఒక రాజకీయ వారసుడు, సాధారణ యువకుని మధ్య అర్థవంతమైన చర్చ జరిగినట్టవుతుందని తెలిపారు. అభినవ్ ప్రకాశ్ విద్యావంతుడని, పాసీ (ఎస్సీ) సామాజిక వర్గానికి చెందిన వారని పేర్కొన్నారు. ప్రకాశ్ కూడా ట్వీట్ చేస్తూ తాను రాహుల్‌తో చర్చలు జరపడానికి ఆసక్తికరంగా ఎదురు చూస్తున్నానని చెప్పారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, పరిపాలన, ఉద్యోగాలు తదితర అన్ని అంశాలపై చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

ముంబైలో గాలి వాన బీభత్సం

- భారీ హోర్డింగ్ కుప్పకూలి 9 మంది మృత్యువాత

ముంబై, మే 13: దేశ ఆర్థిక రాజధాని ముంబైలోని పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం గాలి దుమారం, అకాల వర్షాలు బీభత్సం సృష్టించాయి. బలమైన గాలులు, వర్షం మూలంగా ఘట్కోపర్ ప్రాంతంలో 100 అడుగుల ఎత్తైన అక్రమ హోర్డింగ్ పక్కనే ఉన్న పెట్రోల్ పంపుపై కుప్పకూలింది. ఈ ఘటనలో 8 మంది ప్రాణాలు కోల్పోగా 64 మంది గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను వివిధ ఆస్పత్రులకు తరలించినట్టు తెలిపారు. హోర్డింగ్ కింద మరో 20-30 మంది చిక్కుకున్నట్టు అధికారులు భావిస్తున్నారు. హోర్డింగ్ కూలిన సమాచారం అందుకున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను ప్రారంభించింది. హోర్డింగ్‌ను ఎత్తడానికి క్రేన్లను, గ్యాస్ కట్టర్లను తీసుకువచ్చినట్టు అధికారులు చెప్పారు. ఈ ఉదంతం నేపథ్యంలో ఘటన జరిగిన ప్రదేశానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే సందర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారాన్ని ప్రకటించారు. ముంబై పోలీసులు, బృహణ్ ముంబై కార్పొరేషన్, విపత్తు నిర్వహణ విభాగాలు సమన్వయంతో హోర్డింగ్ కింద చిక్కుకున్న వారిని కాపాడేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టినట్టు ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. ప్రతికూల వాతావరణం, గాలిదుమారం నేపథ్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో విమాన సర్వీసులను దాదాపు 66 నిమిషాల పాటు నిలిపివేసినట్టు విమానాశ్రయ నిర్వహణ సంస్థ తెలిపింది. 15 విమానాలను వేర్వేరు విమానాశ్రయాలకు తరలించామని, రన్‌వే కార్యకలాపాలు సాయంత్రం 5.03 గంటలకు పునరుద్ధరించినట్టు పేర్కొంది. గాలి దుమారం, వర్షాల కారణంగా లోకల్ రైలు సర్వీసులకు అంతరాయం ఏర్పడినట్టు ఒక అధికారి తెలిపారు. కాగా బలమైన గాలులు, వర్షంతో వడాలా ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న మెటల్ పార్కింగ్ టవర్ రోడ్డుపై కుప్పకూలింది. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలు కాగా పలు వాహనాలు దెబ్బతిన్నాయి. కాగా కుప్పకూలిన హోర్డింగ్ ఏర్పాటుకు బృహణ్ ముంబై మునిసిపల్ కార్పొరేషన్ ఎలాంటి అనుమతి ఇవ్వలేదని ముంబై మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ భూషన్ గగ్రాని తెలిపారు. అది అక్రమ హోర్డింగ్ అని, ఘటన జరిగిన ప్రాంతంలో నాలుగు హోర్డింగ్‌లు ఏర్పాటు చేయగా.. వాటిలో ఒకటి కుప్పకూలిందన్నారు.



తెలంగాణలో 64.74%

- రాష్ట్రవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల పోలింగ్ శాతం
- ఓటింగ్ మరో 2 శాతం వరకు పెరిగే అవకాశం!!
- స్వల్ప ఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతం
- 75.21 శాతంతో ప్రథమ స్థానంలో ఖమ్మం
- రాజధాని హైదరాబాద్ (39.02)లో అత్యల్పం
- నేటి మధ్యాహ్నానికి తుది వివరాలు ఖరారు
- ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్



హైదరాబాద్ శివారు పీర్జాదిగూడలోని ఓ పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన మహిళా ఓటర్లు

హైదరాబాద్, మే 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. అక్కడక్కడా స్వల్ప ఘటనలు మినహా అంతా ప్రశాంతంగా సాగిపోయింది. పౌరులు ఇచ్చిన తీర్పు ఓటింగ్ యంత్రాల్లో నిక్షిప్తమైంది. సోమవారం రాత్రి 11 గంటల సమయానికి రాష్ట్రవ్యాప్తంగా 64.74 శాతం పోలింగ్ నమోదైంది. ఆలస్యంగా వచ్చి క్యూ లైన్లలో ఉన్నవారినీ పరిగణనలోకి తీసుకుని, కొన్నిచోట్ల నుంచి పూర్తి సమాచారం అందని కారణంగా పోలింగ్ శాతానికి సంబంధించిన పూర్తి వివరాలు మంగళవారం వెల్లడవుతాయని, మరో రెండు శాతం పోలింగ్ పెరిగే అవకాశం ఉందని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. కాగా, 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో 62.07 శాతం పోలింగ్ జరిగింది. ప్రాథమిక వివరాల మేరకే ప్రస్తుతం ఈ శాతం కంటే ఎక్కువ పోలింగ్ జరిగింది. మరోవైపు 17 లోక్‌సభ నియోజకవర్గాల్లోని 35,809 పోలింగ్ స్టేషన్ల పరిధిలో సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. 6 గంటల లోపు క్యూలో నిల్చున్న ఓటర్లకు నిర్ణీత సమయం ముగిసిన తర్వాత కూడా కూడా ఓటు వేసే అవకాశం కల్పించారు. ఇక తొలి రెండు గంటలు ఓటర్లు ఓటింగ్ మందకొడిగా సాగింది. కేవలం 9.48 శాతం నమోదైంది. 11 గంటల సమయం వరకు 24.25 శాతానికి చేరింది. ఒంటి గంటకు 40.38 శాతం వరకు, తర్వాత రెండు గంటల్లో మరో 52.34 శాతం, సాయంత్రం 5కు 61.16 శాతం పోలింగ్ జరిగింది. మావోయిస్టు ప్రభావిత ఐదు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని 13 అసెంబ్లీ స్థానాలు.. సిర్పూర్, ఆసిఫాబాద్, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, మంథని, భూపాలపల్లి, ములుగు, పినపాక, ఇల్లందు, భద్రాచలం, కొత్తగూడెం, అశ్వరావుపేటలో సాయంత్రం 4గంటలకే పోలింగ్ ముగిసింది.

వాతావరణం అనుకూలించింది..

పోలింగ్ శాతం అత్యధికంగా నమోదయ్యేలా ఎన్నికల సంఘం చేపట్టిన కార్యాచరణ విజయవంతమైందని ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ తెలిపారు. తాము ఊహించిన ప్రకారం ఓటింగ్ జరిగిందని చెప్పారు. సోమవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ వాతావరణం సైతం అనుకూలించిందని.. చిన్నపాటి ఆటంకాలు తప్ప, పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందన్నారు. మంగళవారం మధ్యాహ్నం వరకు నిర్దిష్ట పోలింగ్ శాతం వెల్లడవుతుందని పేర్కొన్నారు. పోలింగ్ నేపథ్యంలో ఎన్నికల సంఘానికి 400 ఫిర్యాదుల రాగా, 38 ఫిర్యాదులకు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు చెప్పారు. ఈవీఎంలను భద్రపరిచేందుకు 44 స్ట్రాంగ్‌రూమ్‌లను సిద్ధం చేసినట్లు తెలిపారు. పోలింగ్‌పై మంగళవారం స్క్రూటినీ ఉంటుందని, ఎక్కడైనా రీ పోలింగ్ అవసరమా? అనేది ఆ తర్వాతే వెల్లడిస్తామని సీఈఓ వికాస్‌రాజ్ పేర్కొన్నారు.


చేర్యాల, జనగామలో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

పోలింగ్ సందర్భంగా జనగామ జిల్లా చేర్యాలలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు బాహాబాహీకి దిగారు. దీంతో ఉద్రికత్త నెలకొంది. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేర్యాలలోని పెద్దమ్మగడ్డ జడ్పీఎస్ఎస్ కేంద్రానికి రాగా, కాంగ్రెస్ నాయకులు జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు. బీఆర్ఎస్ నాయకులు ప్రతి నినాదాలు చేయడంతో గొడవ మొదలైంది. బాలికల జడ్పీఎస్ఎస్‌కు ఎమ్మెల్యే రాగా అప్పటికే కొందరు కాంగ్రెస్ నాయకులు కూర్చొని ఉన్నారు. బీఆర్ఎస్ నేతలు వారిని బయటకు రావాలని కోరడంతో ఇరు పార్టీల నాయకులు ఆరుబయటకు వచ్చారు. అనంతరం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుమారుడు రాకేశ్‌రెడ్డి పోలింగ్ కేంద్రం లోపలికి వెళ్లబోతుండగా, పరస్పరం నినాదాలు చేసుకుంటూ ఘర్షణకు దిగారు. ఇరు వర్గాల వారికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ క్రమంలో ఎమ్మెల్యే పల్లా గో బ్యాక్ అంటూ కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేశారు. ప్రతిగా బీఆర్ఎస్ నాయకులు కొమ్మూరి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. చేర్యాల సీఐ శ్రీను ముందే ఇరువర్గాలు మరోసారి వాగ్వాదానికి దిగాయి. ఎమ్మెల్యే పల్లా పోలింగ్ కేంద్రం నుంచి వెళ్లిపోవడంతో వివాదం సద్దు మణిగింది.

బీజేపీకి 200 సీట్లు మించవు!

మోదీ అంచనా తప్పుతుంది.. కమల నాథులపై ప్రజల్లో ఆగ్రహం పెల్లుబుకుతోంది

- అధికార దుర్వినియోగంతో విపక్ష నేతలను జైళ్లకు పంపారు
- వారికి నిధులు కట్టడి చేశారు
- ప్రజాస్వామ్యానికి బీజేపీ ముప్పు
- అని ప్రజలు భావిస్తున్నారు
- ఉద్యమకారుడు, న్యాయవాది
- ప్రశాంత్ భూషణ్ వ్యాఖ్యలు



కోల్‌కతా, మే 13: ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ అంచనా తప్పుతుందని, బీజేపీకి 200 సీట్లకు మించి రావని ప్రముఖ న్యాయవాది, ఉద్యమకారుడు ప్రశాంత్ భూషణ్ అంచనా వేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి దేశవ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేకంగా బలమైన సెంటిమెంటు రాజుకుందన్నారు. బీజేపీని ప్రజలు 'ప్రజాస్వామ్యానికి ముప్పు'గా పరిగణిస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా.. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతాబెనర్జీని పక్కన పెట్టి, ఎన్డీయేని గద్దె దింపగలిగితే.. పార్లమెంటులో ఇండియా కూటమికి కాంగ్రెస్ నేతృత్వం వహించాలని అన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ చేసిన 'మటన్, మంగళసూత్రాలు, గేదెలు' వంటి వ్యాఖ్యలపై ప్రశాంత్ భూషణ్ మండిపడ్డారు. ఎన్నికల్లో తన పట్టు జారిపోతోందని గ్రహించడం వల్లే మోదీ ఇలాంటి అసహన పూరిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. "పలు కారణాలతో బీజేపీపై బలమైన వ్యతిరేక సెంటిమెంటు రాజుకుందని భావిస్తున్నా. వారు(బీజేపీ) ప్రజాస్వామ్యానికి ముప్పుగా ప్రజలు భావిస్తున్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడి ప్రతిపక్ష నేతలను జైళ్లకు పంపించారని ప్రజలు విశ్వసిస్తున్నారు. వారికి(ప్రతిపక్షాలు) కీలక ఎన్నికల సమయంలో నిధులు సరఫరా కాకుండా అడ్డంకులు సృష్టించారని నమ్ముతున్నారు. ఇవన్నీ వారి(బీజేపీ)పై ప్రజల్లో ఆగ్రహాన్ని పెంచాయి" అని భూషణ్ పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. "బీజేపీకి ప్రజాదరణ క్షీణించడం వెనుక 'మత ప్రచారం' కూడా ఒక కారణం. దీనిని ప్రజలు హర్షించరు. దేశాన్ని మతపరమైన మార్గాల్లో విభజించే అంశంగానే పరిగణిస్తారు. ఇది దేశాన్ని బలహీనపరుస్తుందని మెజారిటీ ప్రజలు విశ్వసిస్తున్నారు" అని తెలిపారు. ఈ పరిణామాలను అంచనా వేస్తే బీజేపీ తిరిగి అధికారంలోకి రాదన్న భావన కలుగుతోందన్నారు. "నా ఉద్దేశం ప్రకారం 200 సీట్లు తెచ్చుకోవడం కూడా కష్టమే" అని వ్యాఖ్యానించారు.

అది మద్దతుదారుల మాట

"తదుపరి ప్రధాని అయ్యే సామర్థ్యం కేవలం మోదీకి తప్ప ఈ దేశంలో మరెవరికీ లేదు" అన్న మాజీ ప్రధాని దేవెగౌడ వ్యాఖ్యలపై ప్రశాంత్ భూషణ్ మండిపడ్డారు. మోదీ హార్డ్‌కోర్ మద్దతు దారులకు మాత్రమే ఇలా అనిపిస్తుందని, ఆయనొక్కరే వారికి 'ఏకైక ఆప్షన్'గా కనిపిస్తారని అన్నారు. "మెజారిటీ ప్రజలు అలా(మోదీ ఒక్కరే తదుపరి ప్రధాని) చెబుతున్నట్టుగా నేను భావించడం లేదు. ఒక్క బీజేపీ హార్డ్ కోర్ మద్దతు దారులు మాత్రమే అలా చెబుతున్నారు. కేంద్రంలో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడితే అది కాంగ్రెస్ వల్లేనని చెప్పారు. అయితే, దీనిలో తృణమూల్ కాంగ్రెస్ ఖచ్చితంగా భాగస్వామ్యం అవుతుందని భావిస్తున్నట్టు తెలిపారు. కానీ, కూటమిని ముందుకు నడిపించడంలో మమత విఫలమవుతున్నారని, ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటులో కాంగ్రెస్సే ప్రముఖ పాత్ర అవుతుందన్నారు. ఆ పార్టీకే ఎక్కువ సీట్లు వచ్చే అవకాశం ఉందని ప్రశాంత్ భూషణ్ అంచనా వేశారు.

అదానీ, అంబానీలను అరెస్ట్ చేయరేం?

- మోదీ 'టెంపోలో నగదు' ఆరోపణలపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రశ్న
- ఈసారి మోదీ అధికారంలోకి రావడం అసాధ్యం
- ప్రమాదంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం
- ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని గెలిస్తే భవిష్యత్తులో ఎన్నికలుండవన్న ఖర్గే



హజారీబాగ్, లాతెహర్, మే 13: అదానీ, అంబానీలను కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ దూషించకుండా ఉండేందుకు ఆ ఇద్దరు పారిశ్రామికవేత్తల నుంచి ఆ పార్టీ టెంపోలో నగదు పొందినట్టుగా ప్రధాని మోదీ చేసిన ఆరోపణల పట్ల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సోమవారం మరోసారి భగ్గుమన్నారు. "మీరు హేమంత్ సోరెన్ (ఝార్ఖండ్ మాజీ సీఎం)ను అరెస్టు చేశారు. మరి అదానీ, అంబానీలను ఎందుకు అరెస్ట్ చేయడం లేదు? అంటూ ఆయన ధ్వజమెత్తారు. ఝార్ఖండ్‌లోని హజారీబాగ్, లాతెహర్‌లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీల్లో ఖర్గే ప్రసంగించారు. ఇండియా కూటమి నుంచి విడిపోనందుకు హేమంత్ సోరెన్‌ను కటకటాల వెనక్కి నెట్టారని ఖర్గే ఆరోపించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అరెస్ట్ చేసిన ఇండియా కూటమి నేతలందరినీ విపక్ష కూటమి అధికారంలోకి వస్తే విడుదల చేస్తుందన్నారు. ఈసారి మోదీ అధికారంలోకి రావడం అసాధ్యమని ఖర్గే స్పష్టం చేశారు. ఎన్నికల బాండ్ల ద్వారా బీజేపీకి విరాళాలు ముట్టజెప్పిన వారు ప్రధాన కాంట్రాక్టులను సొంతం చేసుకున్నారని ఆయన ఆరోపించారు. మరోవైపు 'రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది. ప్రజలూ ప్రమాదంలో ఉన్నారు. మీకు ప్రాథమిక హక్కులు లేకుంటే మీరు బానిసలవుతారు. ఈసారి ప్రధాని మోదీ లోక్‌సభ ఎన్నికల్లో గెలిస్తే భవిష్యత్తులో ఎన్నికలు ఉండవు' అని ఖర్గే అన్నారు. మరోవైపు ప్రధాని నియంతృత్వాన్ని నమ్ముతున్నారని, ఈ ఎన్నికల్లో ఆయనకు విపక్షం గుణపాఠాన్ని నేర్పుతుందని ఆయన చెప్పారు. ప్రధాని మోదీ ఆర్ఎస్ఎస్ ఆయుధమని, ఆయన ప్రచారం చేసిన ఆర్ఎస్ఎస్ భావజాలానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామన్నారు. అయోధ్యలోని రామమందిరం ప్రాణప్రతిష్ఠ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించడం మరచిపోయారు కానీ నటులు, పారిశ్రామికవేత్తలను ఆహ్వానించడం మాత్రం మరచిపోలేదని విమర్శించారు.

పాక్ బాంబు అంటే 'ఇండియా'కు బెదురు

- దాయాదికి కూటమి నేతలు క్లీన్‌చిట్ ఇస్తారు
- భారత్ సర్జికల్ స్ట్రయిక్స్‌ను మాత్రం సందేహిస్తారు
- యూపీఏ హయాంలో ఈడీ రూ.35లక్షలు జప్తు
- అందుకే ఈడీపై 'ఇండియా' దాడి : మోదీ

పట్నా, మే 13 : పాకిస్థాన్ చేతిలోని ఆటంబాంబు అంటే ఇండియా కూటమి నేతలు భీతిల్లిపోతున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎద్దేవా చేశారు. పిరికిపందలు అంటూ కూటమి నేతలను విమర్శించారు. పాక్ వద్ద ఆటంబాంబు ఉన్నదనే విషయం గుర్తుపెట్టుకోవాలంటూ 'ఇండియా' కూటమిలోని కాంగ్రెస్ పార్టీ నేత మణిశంకర్ అయ్యర్, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా ఇటీవల వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఐదో విడత ఎన్నికలు జరిగే బిహార్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం జరిగిన ప్రచార సభల్లో దీనిపైనే మోదీ వ్యాఖ్యలు చేశారు. "పాకిస్థాన్ అంటేనే బెదిరిపోయే నేతలను ఇండియా కూటమి కలిగి ఉన్నట్టు కనిపిస్తోంది. పాక్ ఆటంబాంబు గురించి వారంతా పీడకలలు కంటున్నారు. ఈ నేతలు పాకిస్థాన్‌కు ఒకచేత్తో క్లీన్‌చిట్ ఇస్తారు. మరో చేత్తో, ఆ దేశంపై భారత్ జరిపిన సర్జికల్ స్ట్రయిక్స్‌పై అనుమానాలు వ్యక్తం చేస్తారు. ఆ కూటమిలోని లెఫ్ట్ మిత్రులు భారత్ వద్ద ఉన్న ఆటంబాంబులు నిర్వీర్యం కావాలని కోరుకుంటారు" అని దుయ్యబట్టారు. ఎన్నికల వేళ పట్టుబడుతున్న ధనమంతా ఈ దేశ పేదలకు చెందినదేనన్నారు. యూపీఏ పదేళ్ల పాలనలో ఈడీ స్కూలు బ్యాగులో దాచిన రూ. 35 లక్షలను పట్టుకుంటే, ఎన్డీయే అధికారంలోకి వచ్చిన ఇన్నాళ్లలో ఏకంగా రూ. 2200 కోట్లను ఈడీ స్వాధీనం చేసుకున్నదని, దానివల్లే ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలపై ప్రతిపక్షాలు విరుచుకుపడుతున్నాయన్నారు. తనకు వారసులు లేరని, సామాన్యుడే తన వారసుడు అని వ్యాఖ్యానించారు.

వారణాసీలో మోదీ భారీ రోడ్‌షో

వారణాసీ లోక్‌సభ అభ్యర్థిగా మరోసారి పోటీచేస్తున్న నరేంద్ర మోదీ సోమవారం ఆరు కిలోమీటర్ల మేర ఆ పట్టణంలో భారీ రోడ్‌షో నిర్వహించారు. విద్యారంగ సంస్కర్త మదన్‌మోహన్ మాలవీయా విగ్రహానికి పూలమాల సమర్పించి తన యాత్రను ఆయన ప్రారంభించారు. రోడ్‌షోలో ఆయన వెంట యూపీ సీఎం యోగీ ఆదిత్యానాథ్ ఉన్నారు. ప్రధానమంత్రికి ఆహ్వానం పలుకుతూ, కనీసం వంద చోట్ల స్వాగత తోరణాలు ఏర్పాటుచేశారు. కాషాయ దుస్తులు ధరించిన మహిళలు రోడ్డుకు అటు ఇటు పెద్దఎత్తున గుమిగూడి రోడ్‌షోకు స్వాగతం పలికారు. నరేంద్రమోదీపై పూల వర్షం కురిపించారు. కాగా, మంగళవారం ఆయన తన నామినేషన్ పత్రాలను వారణాసీలో రిటర్నింగ్ అధికారికి సమర్పిస్తారు. ఎన్డీయే భాగస్వామ్య పార్టీ టీడీపీ అధినేత చంద్రబాబు సహా దాదాపుగా ఆ కూటమి నేతలంతా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

చాబహార్ పోర్టుపై ఇరాన్‌తో ఒప్పందం

- పదేళ్ల పాటు నిర్వహణ భారత్‌దే..

న్యూఢిల్లీ, మే 13: సుదీర్ఘ చర్చల తర్వాత చాబహార్ పోర్టు అభివృద్ధి, నిర్వహణకు సంబంధించి భారత్-ఇరాన్ మధ్య ఒప్పందం కుదిరింది. దీంతో దేశ వాణిజ్య సంబంధాలు మెరగవడంతో పాటు మరిన్ని పెట్టుబడులు కూడా రానున్నాయి. ఆగ్నేయ ఇరాన్‌లోని ఈ వ్యూహాత్మక ఓడరేవును పూర్తిగా వినియోగించుకునే విషయమై ఆ దేశంతో ఒప్పందం చేసుకునేందుకు కేంద్ర నౌకాయాన శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం అక్కడికి వెళ్లింది. ఈ సందర్భంగా ఇండియా పోర్ట్స్ గ్లోబల్ లిమిటెడ్ (ఐపీజీఎల్), ఇరాన్‌కు చెందిన పోర్ట్, మారిటైమ్ ఆపరేషన్ (పీఎంఓ)తో దీర్ఘకాలిక ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు పదేళ్ల పాటు చాబహార్ పోర్టులోని షాహిద్ బెహెష్టీ టెర్మినల్‌ను భారత్ నిర్వహించడానికి వీలు కల్పిస్తుంది. విదేశాల్లో ఓ పోర్టు నిర్వహణను చేపట్టడం భారత్‌కిదే తొలిసారి.. ఈ ఒప్పందం ద్వారా దాయాది దేశమైన పాకిస్థాన్‌పై ఆధారపడకుండా భారత్ నుంచి మధ్య ఆసియా దేశాలకు ఎగుమతులు, సరుకు రవాణా కూడా సులభతరం కానుంది.


ఉత్తర కొరియాలో
ఎరుపు రంగు లిప్‌స్టిక్‌పై నిషేధం

న్యూఢిల్లీ, మే 13: సంచలన నిర్ణయాలు తీసుకోవడంలో ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ శైలే వేరు. తాజాగా ఎరుపు రంగు లిప్‌స్టిక్‌పై నిషేధం విధిస్తూ అక్కడి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎరుపు రంగు పెట్టుబడీదారీ విధానానికి సంకేతమని, దాన్ని ఇకపై మహిళలు వాడకూడదని అక్కడి అధికారులు హుకుం జారీ చేశారు. అంతేకాకుండా ఎరుపు రంగు లిప్‌స్టిక్ వేసుకున్న మహిళలు ఎక్కువ ఆకర్షణీయంగా కనిపిస్తారని, మహిళలు సాదాసీదాగా ఉండాలనే ప్రభుత్వ నిర్ణయానికి అది వ్యతిరేకమని వారు పేర్కొన్నారు. ఉత్తర కొరియాలో ప్రజలు ధరించే దుస్తుల నుంచి వారి కేశాలంకరణ వరకు కొన్ని ప్రత్యేక నిబంధనలు ఉంటాయి. అక్కడి ప్రజలు వాటిని తప్పనిసరిగా పాటించాల్సిందే.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● మంగళవారం 14 మే 2024
diksuchi@andhrajyothy.com

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

అంతర్జాతీయ సముద్రాల్లో జీవవైవిధ్య పరిరక్షణ



ఏటా ప్రపంచవ్యాప్తంగా పది బిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలు వాతావరణంలోకి విడుదలవుతున్నాయని అంచనా. దానిలో 30 శాతం అంటే మూడు బిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలనే మహాసముద్రాలు శోషించుకుంటాయి. అందువల్ల సముద్ర పర్యావరణాన్ని అతిపెద్ద కార్బన్ సింక్‌గా చెప్పుకుంటాం. భూ వాతావరణాన్ని రక్షిస్తున్న సముద్ర పర్యావరణానికి చేపలవేట, సముద్రాంతర్గత ఖనిజోద్ధహణం వంటి మానవ కార్యకలాపాలు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయి.

హైసీస్ ప్రాంతం అంటే సముద్ర తీర దేశాల ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్ పరిధి(తీరం నుంచి 200 నాటికల్ మైళ్లు)ని దాటి విస్తరించిన 'జాతీయ పరిధుల వెలుపలి సముద్ర ప్రాంతం'. దీని సంరక్షణకు సరైన అంతర్జాతీయ చట్టాలు అమలులో లేవు. భూగోళంలో దాదాపు సగం విస్తీర్ణంలో ఉన్న హైసీస్(జాతీయ పరిధుల వెలుపలి సముద్రం ప్రాంతం)లో కేవలం 1.44% మాత్రమే పరిరక్షిస్తున్నారని యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ద లా ఆఫ్ సీస్(యూఎన్‌సీఎల్‌ఓఎస్) నివేదిక తెలుపుతోంది. అంటే 99 శాతం హైసీస్ ప్రాంతం ఎటువంటి పరిరక్షణకు నోచుకోవడం లేదు.

వాతావరణ మార్పులను సమర్థవంతంగా ఎదుర్కొని సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలంటే భూగోళంలో సగభాగంగా ఉన్న హైసీస్ ప్రాంతాన్ని, అక్కడి సముద్రాంతర్గత పర్యావరణాన్ని రక్షించాల్సిన ఆవశ్యకత ఉంది. అదీకాక సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో 14వది అయిన 'లైఫ్ బిలో వాటర్' అనే ప్రత్యేక లక్ష్యం, సముద్రాంతర్గత పర్యావరణ రక్షణకు సంబంధించి ప్రత్యేకంగా తీర్మానించింది. కాబట్టి సముద్రాంతర్గత పర్యావరణ పరిరక్షణకు ఒక అంతర్జాతీయ ఒడంబడిక అవసరం ఏర్పడింది. ఈ దిశగా చర్యలు చేపట్టడానికి 2022 డిసెంబరులో కెనడాలోని మాంట్రియెల్ నగరంలో కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్(సీఓపీ)-15లో 'కున్‌మింగ్ - మాంట్రియెల్ గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేమ్ వర్క్'ను ఆమోదించారు. 2030 నాటికల్లా భూమి, సముద్ర పర్యావరణ ప్రాంతంలో 30 శాతాన్ని పరిరక్షించాలని ఈ ఫ్రేమ్‌వర్క్ నిర్దేశిస్తుంది. దీనినే '30x30 వ్యూహం'అని కూడా అంటారు. ఈ వ్యూహం అమలు కోసం అన్ని సముద్రతీర దేశాల మద్దతు కూడగట్టడానికి 'యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ద లా ఆఫ్ ద సీ' ప్రాధికారితన 'ట్రీటీ ఆఫ్ హైసీస్/బయోలాజికల్ డైవర్సిటీ ఇన్ ఏరియాస్ బియాండ్ నేషనల్ జ్యూరిసడిక్షన్(బీబీఎన్‌జే) ట్రీటీ'ని 2023 మార్చిలో ప్రవేశపెట్టారు. ఈ ఒప్పందంపై అంగీకార సంతకాలు చేయడానికి తీర దేశాలన్నింటికీ 2023 సెప్టెంబరు 20 నుంచి 2025 సెప్టెంబరు 20 వరకు గడువు నిర్దేశించారు. కనీసం 60 దేశాలు ఈ ఒప్పందంపై సంతకం చేసి, దానిని ర్యాటిఫై చేసినప్పుడే ఇది అమలులోకి వస్తుంది. అంటే సంతకాలు చేసిన దేశాలు, తమ దేశంలోని సంవిధానాలకు అనుగుణంగా ఆ ఒప్పందానికి చట్టపరమైన ధృవీకరణను ప్రకటించాల్సి ఉంటుంది.(ఉదాహరణకు పార్లమెంటు ఆమోదం). ఈవిధంగా 88 దేశాలు ఇంతవరకూ బీబీఎన్‌జే ఒప్పందంపై సంతకాలు చేశాయి. రెండు దేశాలు(చిలీ, పలావూ) మాత్రమే ర్యాటిఫై(చట్టపర ధృవీకరణ) చేశాయి. భారత్ సహా మిగతా 86 దేశాలు ర్యాటిఫై చేయాల్సి ఉంది. గడువు కాలం సమీపిస్తుండటంతో సంతకాలు చేసిన దేశాలను ర్యాటిఫై చేసే దిశగా ప్రోత్సహించడానికి 2024 మార్చి 7న బెల్జియంలో 'ద బ్లూ లీడర్స్ హై-లెవల్ ఈవెంట్ ఆన్ బయోడైవర్సిటీ బియాండ్ నేషనల్ జూరిస్‌డిక్షన్' సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీబీఎన్‌జే ఒప్పందాన్ని 2025లో జరగనున్న 'ద యునైటెడ్ నేషన్స్ ఓషన్ కాన్ఫరెన్స్' వేదికగా అమలులోకి తేవడానికి కృషిచేయాలని పిలుపునిచ్చింది.

బీబీఎన్‌జే ఒప్పందం-లక్ష్యాలు

1. మొత్తం సముద్ర భాగంలో మూడింట రెండువంతులుగా ఉన్న హైసీస్ ప్రాంతాన్ని, ప్రస్తుతం ఉన్న అత్యల్ప రక్షితస్థాయి(1.44 శాతం) నుంచి మరింత ఎక్కువ రక్షిత స్థాయికి పెంచడం. తద్వారా సముద్ర ఆవరణ వ్యవస్థను పరిరక్షించడం.
2. హైసీస్ ప్రాంతంలో ఉన్న మెరైన్ జెనెటిక్ రిసోర్సెస్(సముద్రాంతర్గత జీవ వనరులు - సముద్రపు జీవులు, నాచు, మొక్కలు మొదలైన వాటిని) అన్ని దేశాల మధ్య న్యాయబద్ధంగా, సమంగా పంపిణీ చేసి అన్ని దేశాలకు సమానంగా ఆర్థిక లబ్ధి చేకూర్చడం.
3. సముద్రాంతర్గత ఖనిజోద్ధహణం(డీప్ సీ మైనింగ్) వంటి సముద్ర ఆవరణ వ్యవస్థలకు హాని కలిగించే మానవ చర్యలకు అనుమతించే ముందు వివిధ దేశాలు పర్యావరణ ప్రభావాలను సమర్థవంతంగా అంచనా వేసే మార్గదర్శకాలను రూపొందించడం.

బీబీఎన్‌జే ద్వారా ఆశిస్తున్న రంగాల వారీ ప్రయోజనాలు

1. ఆర్థిక ప్రయోజనాలు: దేశ తీరప్రాంతాల్లో మత్స్య సంపద వృద్ధి, సముద్ర ఆధారిత ఉద్యోగ, ఆదాయ కల్పన పెంపు, నిజమైన సుస్థిర నీలి ఆర్థికవ్యవస్థ సాధన.
2. సామాజిక ప్రయోజనాలు: భావితరాల సంక్షేమాన్ని పెంపొందించడం, అంతర్జాతీయ సముద్ర సమానత్వ సూత్రాలను ఆచరణలోకి తేవడం, సముద్ర వనరుల నుంచి అత్యధిక ప్రయోజనాలు పొందేవిధంగా అధ్యయన, నిర్వహణపరమైన కౌశలాల పెంపు.
3. దౌత్యపర ప్రయోజనాలు: దేశాల మధ్య బహుపాక్షిక సహకారం, పరిపాలనాపరమైన సహాయ సహకారాలను బలపర్చడం, అంతర్జాతీయ నిర్ణయాధికారాల పెంపొందింపు, సముద్ర వాతావరణ పునరుద్ధరణ.

బీబీఎన్‌జే ఒప్పందానికి ఎదురవుతున్న సమస్యలు

1. 30 శాతం ప్రపంచ సముద్ర ప్రాంతాన్ని 2030 వరకు పరిరక్షించాలన్న ధ్యేయం ప్రాతిపదికగా ఏర్పడిన ఈ ఒప్పందం అమలుకు నోచుకోవాలంటే కనీసం 60 దేశాలు ర్యాటిఫై చేయాల్సి ఉంది. కానీ ఇంతవరకూ రెండు దేశాలే ర్యాటిఫై చేశాయి. వచ్చే ఏడాది సెప్టెంబరు 20 నాటికల్లా మిగతా 58 దేశాలు ర్యాటిఫై చేయడం సందేహాస్పదమే. ఒకవేళ ర్యాటిఫై చేసినప్పటికీ మరో అయిదేళ్లలో 30 శాతం సముద్ర ప్రాంతాన్ని పరిరక్షించడానికి యుద్ధప్రాతిపదిక చర్యలు అవసరం. ఇంకా నిధుల వితరణ, వ్యవస్థల నిర్మాణం, చట్టం అమలు వ్యవస్థల పరంగా ఒక కొలిక్కిరాని నిర్ణయాలు ఏమేరకు లక్ష్యసాధనకు దారిచూపగలవన్నది సందేహాస్పదం.
2. పర్యావరణ ప్రభావ అంచనాలు హైసీస్ ప్రాంతాల్లో చేయడం సాంకేతికంగా చాలా క్లిష్టమైన అంశం. పలు టెక్నిక్స్ పరంగా కూడా ఇంకా శాస్త్రీయ, సాంకేతిక అధ్యయనాలు జరగాల్సి ఉంది. ఈ అధ్యయనాలకు భారీస్థాయిలో నిధుల కేటాయింపు కూడా అవసరం.
3. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సముద్ర జీవవనరుల పంపిణీని ఏవిధంగా చేయాలనే అంశం అత్యంత క్లిష్టమైనది, చాకచక్యంగా నిర్వహించాల్సిన అంశం.

ఇన్ని సవాళ్లు ఉన్న నేపథ్యంలో, మరో ఏడాదిన్నర కాలంలో బీబీఎన్‌జే ఒప్పందం పట్టాలెక్కడం కష్టసాధ్యమైనప్పటికీ, సుసాధ్యం ... సుతారమూ సాధించి తీరాల్సిన ఆవశ్యకత ప్రపంచ తీర దేశాలకు ఉంది. ఎందుకంటే, వాతావరణ మార్పుల వల్ల తలెత్తే విపత్తులను ఎక్కువగా ఎదుర్కొనేవి ఆ దేశాలే కాబట్టి. తమ తీర ప్రాంతాలు మునిగిపోకూడదన్నా, తుపానులు రాకుండా ఉండాలన్నా, మత్స్యసంపద తరిగిపోకూడదన్నా భూమిపై అత్యధిక విస్తీర్ణంలో కార్బన్ సింక్ రూపంలో ఆవరించి ఉన్న సముద్ర పర్యావరణాన్ని పరిరక్షించుకోకతప్పదు. దీనికి బీబీఎన్‌జే ఒప్పందం ఒక చక్కని చుక్కానిగా ఉపయోగపడుతుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ

మహిళలు రాజకీయ భాగస్వామ్యం



భారత రాజ్యాంగం మహిళలందరికీ రాజకీయ భాగస్వామ్యంలో సమానత్వానికి హామీ ఇచ్చింది. మహిళల సమానత్వం, అభివృద్ధిని ప్రోత్సహించడానికి భారతదేశం కొన్ని ప్రత్యేకమైన ప్రక్రియలను చేపట్టింది. మహిళల ప్రయోజనాలు పరిరక్షించడానికి, దేశాభివృద్ధిలో నారీ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి రాజ్యాంగంలో ప్రత్యేక నిబంధనలను పొందుపర్చడంతోపాటు భారత పార్లమెంట్ అనేక చట్టాలను రూపొందించింది.

సామాజిక, ఆర్థిక, రాజకీయ, న్యాయ, ఆలోచన, భావ ప్రకటన, నమ్మకం, స్వేచ్ఛను మన రాజ్యాంగ పీఠిక హామీ ఇచ్చింది. విశ్వాసం, ఆరాధన, హోదా, అవకాశాలలోను సమానత్వాన్ని వాగ్దానం చేస్తుంది. మహిళల రాజకీయ సమానత్వం కోసం తలెత్తిన ఉద్యమంలో ఓటు హక్కు కోసం జరిగిన పోరాటాన్ని మొదటిదిగా చెప్పవచ్చు. దీని ఫలితంగా భారత రాజ్యాంగం కల్పించిన వయోజన ఓటు హక్కును నిర్విఘ్నంగా ఉపయోగించుకుంటున్నారు.

భారత రాజ్యాంగం భారతీయ మహిళలందరికీ సమానత్వాన్ని(ఆర్టికల్ 14) కల్పించింది. రాజ్యం వివక్షతను ప్రదర్శించరాదని(ఆర్టికల్ 15(1)); అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని(ఆర్టికల్ 16); సమాన పనికి సమాన వేతనాన్ని కల్పించాలని(ఆర్టికల్ 39డి); మహిళలు, పిల్లల సంక్షేమం కోసం ప్రత్యేక నిబంధనలు రూపొందించవచ్చని(ఆర్టికల్ 15(3)) నిర్దేశించింది. సంఘాలను ఏర్పరచుకునే ప్రాథమిక స్వేచ్ఛలో భాగంగా రాజకీయ పార్టీలను ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని స్త్రీ, పురుషులకు సమానంగా(ఆర్టికల్ 19(1) (సి)) రాజ్యాంగం కల్పించింది. అదేవిధంగా మహిళల గౌరవ ప్రతిపత్తికి భంగం కలిగించే చర్యలను విడనాడటం(ఆర్టికల్ 51 ఎ(సి); పని చేసే చోట మానవీయ పరిస్థితులను, ప్రసూతి సౌకర్యాలను కల్పించడం(ఆర్టికల్ 42); కుల, మత, లింగ, జన్మస్థలం ఆధారంగా కాకుండా కేవలం వయసు ప్రాతిపదికగా ఓటు హక్కును కల్పించింది. తద్వారా రాజకీయాలలో భాగస్వామ్యాన్ని కలిగించే ఆర్టికల్ 326, అదేవిధంగా 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను 243డి, 243టి ఆర్టికల్స్ ద్వారా కల్పించారు. ఇందులో భాగంగా సమస్యల పరిష్కారం కోసం చట్టబద్ధ సంస్థగా మహిళా కమిషన్‌ను ఏర్పాటు చేశారు. మహిళా సాధికారత సంవత్సరమైన 2001ని దృష్టిలో ఉంచుకుని మహిళా సాధికారత కోసం 'జాతీయ పాలసీ 2001'ని రూపొందించారు. ఇటీవల లోక్‌సభ, రాష్ట్ర శాసన సభల్లో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్లు కల్పించే 106వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించింది.

పైన పేర్కొన్నట్లుగా భారత రాజ్యాంగం అన్ని రంగాలలో మహిళల సమానత్వం, సాధికారతను పెంపొందించడానికి బలమైన నిబంధనలు రూపొందించింది.

అయితే రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు గడిచినప్పటికీ మహిళలకు ఎన్నికల్లో సరైన ప్రాతినిధ్యం లభించడం లేదు. రాజ్యాంగ నిబంధనల కంటే సామాజిక నిబంధనలు, సమాజంలో లోతుగా పాతుకు పోయిన పితృస్వామ్య భావజాల ఆధిపత్య ధోరణులు మహిళలకు సమాన రాజకీయ భాగస్వామ్య స్థాయిని అందించే రాజకీయ వాతావరణాన్ని ఏర్పరచలేకపోయాయి. ఫలితంగా పాలనలో, రాజకీయ నిర్ణయాకరణలో మహిళల భాగస్వామ్యం అతి తక్కువగా కన్పిస్తుంది.

స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించి 30 సంవత్సరాలు గడిచి, సుమారు 13 లక్షల మంది రాజకీయ పదవులు పొందినప్పటికీ... వారు రాష్ట్ర, జాతీయ స్థాయిలో చొరవను ప్రదర్శించలేక పోతున్నారు.

సాధారణ ఎన్నికలు - జెండర్ పరంగా పోటీదారులు - విజేతలు

17వ లోక్‌సభ(2019)లో అత్యధికంగా 78 మంది మహిళా సభ్యులున్నారు. 16వ లోక్‌సభ(2014)లో 62 మంది, ఆరో లోక్‌సభ(1977)లో అత్యల్పంగా మహిళా సభ్యులున్నారు. మొదటి లోక్‌సభ(1952)లో 22 మంది మహిళా సభ్యులున్నారు. అయితే 17వ లోక్‌సభ(2019) ఎన్నికల్లో మొత్తం పోటీదారులు 8054 కాగా, వీరిలో 726 మంది మహిళలు, 7334 మంది పురుషులు ఉన్నారు. 17వ సాధారణ ఎన్నికల్లో మహిళల గెలుపు శాతం 14.4 శాతం కాగా, పురుషులది 6.34 శాతం.

- 2019 ఎన్నికల్లో ఆరుగురు ట్రాన్స్‌జెండర్లు పోటీ చేశారు.
- 2019 వరకు మహిళల ఓటింగ్ శాతం పురుషుల ఓటింగ్ శాతం కంటే తక్కువగా ఉండేది. అయితే మొదటి సారిగా 2019 ఎన్నికల్లో మహిళల ఓటింగ్ శాతం 0.17 శాతం తేడాతో పురుషుల ఓటింగ్ శాతాన్ని అధిగమించింది.
- 1957 నుంచి రాజ్యసభలో మహిళల బలం దుర్బరంగా ఉంది. మహిళా రాజ్యసభ సభ్యుల సగటు సంఖ్య 9.5 శాతం కాగా, అత్యధికంగా 2014లో 12.7 శాతం నమోదైంది.

చట్ట సభలు - మహిళలు - ఒక విశ్లేషణ

- 1970 వరకు లోక్‌సభలో మహిళా సభ్యుల సంఖ్య 5 శాతం కంటే తక్కువ. 2009లోనే మొదటి సారి మహిళల ప్రాతినిధ్యం 10 శాతాన్ని దాటింది. 2023 వరకు పరిశీలిస్తే 17వ లోక్‌సభలోనే ఎక్కువ మంది మహిళా సభ్యులు ఉన్నారు.
- ప్రస్తుత 17వ లోక్‌సభ(2019-2024)లోని మొత్తం సభ్యులలో దాదాపు 15 శాతం మంది మహిళలు కాగా, రాష్ట్ర శాసనసభలో సగటున మొత్తం సభ్యుల్లో 9.1 శాతం ఉన్నారు.
- 2023 వరకు రాజ్యసభలో మహిళల ప్రాతినిధ్యం 13 శాతం కంటే మించలేదు.
- 2014 సార్వత్రిక ఎన్నికల్లో 670 మంది మహిళా అభ్యర్థులు పోటీపడ్డారు. 2009 కంటే 20 శాతం పెరుగుదల.
- అదేవిధంగా 1984లో ప్రతి 100 మంది పురుష అభ్యర్థులకు ముగ్గురు మహిళా అభ్యర్థులు బరిలో ఉన్నారు. 2014 నాటికి ఈ సంఖ్య 9కి పెరిగింది. ఇది గణనీయమైన పెరుగుదల.
- మహిళా అభ్యర్థుల పెరుగుదలకు అనుగుణంగా వాస్తవ మహిళా ప్రాతినిధ్యం నమోదు కాలేదు. 2014లో లోక్‌సభలో మహిళా సభ్యుల సంఖ్య 63. ఇది ఒక రికార్డు. అయితే మహిళా అభ్యర్థుల విజయావకాశాలు 9.4 శాతం మాత్రమే.
- స్వాతంత్ర్యం వచ్చిన ఏడు దశాబ్దాల తరవాత అంటే 17వ సాధారణ ఎన్నికల తరవాత 2019లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో నిలుచున్న పురుషుల సంఖ్యతో పోల్చితే మహిళల భాగస్వామ్యం 67.18% . దీనితో మొట్టమొదటిసారిగా పురుషుల భాగస్వామ్యాన్ని మహిళలు అధిగమించినట్లయింది.



డాక్టర్ సుంకర రమాదేవీ,
అసిస్టెంట్ ప్రొఫెసర్.

ఐఐఎఫ్‌టీ
ఆన్‌లైన్‌లో ఎంబీఏ(ఐబీ)

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ) - ఎంబీఏ(ఇంటర్నేషనల్ బిజినెస్) ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి ఆన్‌లైన్ విధానంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: ఈ ప్రోగ్రామ్‌ను వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించారు. దీని వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి ఏడాది మేనేజ్‌మెంట్ స్ట్రాటజీ, ట్రేడ్ అండ్ ఫైనాన్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్సెస్ కోర్సులు చదవాల్సి ఉంటుంది. రెండో ఏడాది ఫైనాన్స్, ట్రేడ్, మార్కెటింగ్, స్ట్రాటజీ, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎకనామిక్స్ స్పెషలైజేషన్‌లలో ఒకదాన్ని ఎంచుకోవాలి. ప్రోగ్రామ్‌లో భాగంగా వర్చువల్ సెషన్స్ ఉంటాయి. పారిశ్రామిక నిపుణులు గెస్ట్ లెక్చర్స్ ఇస్తారు. కేస్ స్టడీస్, ప్రాబ్లం సాల్వింగ్ విధానాలపై బృంద చర్చలు ఉంటాయి. వారాంతాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఆన్‌లైన్ సెషన్స్ నిర్వహిస్తారు.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు. కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.3,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** జూలై 15 నుంచి
- **వెబ్‌సైట్:** www.iift.ac.in



లిటిల్స్



మీకు తెలుసా?

- ఎర్రటి శరీరం, నల్లని ముక్కు ఉండే కొంగలాంటి పక్షి పేరు 'స్కార్లెట్ ఐబిస్'.
- వీటి వింగ్ స్పాన్ 53.3 సెం.మీ. ఇవి ఆరెంజి, ఎరుపు, నలుపు, గోధుమ రంగు రంగుల్లో కూడా ఉంటాయి.
- దక్షిణ అమెరికా, కరేబియన్ దీవులు, బ్రెజిల్ దేశాల్లో ఎక్కువగా కనపడతాయి.
- ఇవి కరెంటు స్థంబాల మీద, చెట్ల పైభాగంలో గూళ్లు కనడతాయి. మూడు నుంచి ఐదు గుడ్లు పెడతాయి. వీటి పొదిగే కాలం 19 రోజుల నుంచి 23 రోజులు. పుట్టిన పిల్లలు నల్లగా ఉంటాయి. ఆ తర్వాత క్రమంగా ఎర్రగా మారతాయి.
- పురుగులు, మెత్తటి మట్టిలో ఉండే కీటకాలు, నీళ్లలోని చిన్న జీవులను తింటాయి. ఇవి నీళ్ల దగ్గర ఉండే ప్రాంతంలో ముఖ్యంగా గడ్డిపొదల్లో నివసిస్తాయి.
- వీటి గుడ్లను దొంగలించటం, వేటాడటం వల్ల రోజు రోజుకీ ఈ జాతి పక్షులు తగ్గిపోతున్నాయి. ఇవి 20 ఏళ్లు జీవిస్తాయి. వీటి ఆనవాళ్లు అరవై మిలియన్ల సంవత్సరాల కాలంనాటిదని శాస్త్రవేత్తల అధ్యయనంలో తేలింది.
- ఒకటిన్నర కేజీ ఉంటాయి దాదాపు. ఆడ పక్షులు చిన్నగా కనపడతాయి. ఇకపోతే ఇవి గాల్లో వేగంగా వెళ్తాయి. ఇవి ఒక చోట నుంచి మరోచోటకు వెళ్లటానికి ఇబ్బంది పడవు. ఆకాశంలో వెళ్తోంటే.. 'వి' ఆకారంలో ప్రయాణిస్తాయి. ఆ సమయంలో చూడటానికి ఎంతో అందంగా ఉంటాయివి.



సరైన నీడ ఏది?






10 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 306

					9		2	3
			2				6	
			5	6		4	7	
		2		9		7	8	
9	7						4	6
	1	4		7		5		
	2	6		1	5			
	3				8			
4	8		9					

సుడోకు - 305 సమాధానం

8	9	7	4	5	2	6	3	1
5	4	6	3	1	7	8	9	2
1	2	3	9	6	8	5	4	7
3	6	9	2	4	5	7	1	8
4	1	8	7	3	6	9	2	5
2	7	5	8	9	1	3	6	4
9	8	1	5	2	3	4	7	6
6	5	4	1	7	9	2	8	3
7	3	2	6	8	4	1	5	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.